భారతి

సాహిత్య మాసపత్రిక

మార్చి 1980

నాదం పుట్టింది

నారాయణరెడ్డి

జాన్ స్టూవర్ట్ మిల్

కృష్ణారావు

సందేశము

శరభయ్య

అర్థపరిణామము

సేతురామేశ్వర దత్త

మకర తోరణం

సోమసుందర్

అమర గాయకుడు

కవి

ఇంకా తిరునగరి, ఖమ్రొద్దీన్, రంగారావు, లక్ష్మీకామేశ్వరి, శంకర్, తిలక్,
చంద్రశేఖర్, కవితాప్రియ, సుధాకరరావు, కిశోరుబాబు - అశోకుబాబు,
వేంకటేశ్వర్లు, రమణారెడ్డి, శ్రీరాములు, గంగప్ప, వీరభద్రయ్య,
జింబో, బ్రహ్మానంద ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

మార్చి 1980

సంపుటము : 57 సంచిక : 3

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

మార్చి 1980

నాదం పుట్టింది

డా॥ సి. నారాయణరెడ్డి

నాదం పుట్టింది శిరస్సులో
  శిరస్సు గుహలో
తపస్సును పలకరిస్తున్న మనస్సులో.
అది నడిచిన నాడులన్నిటినీ
ఆవిరిలో అభ్యంజనం చేయిస్తూ
ఊపింది గుండెను పట్టుకుని;
కలలూ కన్నీళ్ళూ కలిసి
ఉబికి వచ్చేటట్టు.

హిమాలయాల్లో గడ్డకట్టుకున్న మౌనం
హిందూమహాసముద్రం కడుపులో
ఆహుతైన అగ్నిగానం
నరాలను కలుపుకుని
గుప్త స్వరాలను పరుచుకుని
పొంగుతున్నాయి ఈ నాదంలో
నింగిపలకలు పంచదార చిలకల్లా
విరిగిపడుతూవుంటే.

ఏమి మాధురి!
ఎదను వెయ్యి చేదలుగా చేదేసి
లక్షచేతులతో లాగేసి
కోటి చూపులతో తాగేసినట్టు.
ఎక్కడుంది శరీరం ?
ఇంటికప్పును దూదికుప్పలా ఊదేసి
గాలిపొరల్ని తోలుతిత్తుల్లా ఒత్తేసి
ఎగిసిపోతూవుంది —
ఇక్కడే ఈ అరుగుమీద వుంటూనే;
ఈ మట్టి తావుల్ని మనసారా పీల్చుకుంటూనే.

నాదం — వేదం
శిరస్సు — తపస్సు
మారుపేర్లు జ్వలనానికి
మనిషి పురోగమనానికి
చీకటినుంచి వెలుక్కి
మృత్యువునుంచి బ్రతుక్కి.



సందేశము

శ్రీ మల్లంపల్లి శరభయ్య

ఆ చెలిమేనఁ జిన్కుతెరలో వలితెమ్మరలార్చి మొగ్గలన్
మోచుచు సోలు మాలతుల మోసులతోఁ దనుపాఱఁదేర్చి; జా
లాఽచితుఁడవైన నిన్ను స్తిమితాక్షి కనుంగొనుచో, మెఱుంగులన్
డాచిన ధీరవృత్తిఁ బ్రకటస్తనితోక్తుల నిట్లు పల్కుమీ!

పతికిం గూర్చెదు నేస్తనం చెఱుఁగు జీవద్భర్తృకా! నేఁదటిత్
పతి, లోగుండియడాచి తెచ్చితిని తత్సందేశముల్ మార్గఖి
న్నతఁ దూఁగాడెడు ప్రోషితౌఘముల మంద్రస్నిగ్ధ గర్జావచో
వ్రతినై యాంధ్రవియోగ పుంజడలు విప్పన్ దందడింబెట్టుదున్॥

నీ విటులాడినంత - అవనీసుత మోమరయెత్తి మచ్చికన్
పావనిఁ జూచినట్లె — కని భామిని ఆవులుదేఱుగుండియన్
నీ వినిపించు వాక్యసరణిన్ విను; తా, సుహృదాగతంబు కాం
తావళికెన్నఁ గాంతుని యుదంతమె యెందు సమాగమాఽభమౌ॥

ఆయుష్మంతుఁడ! యిట్లు నేననుటగా నాత్మోపకారార్థమై
ఆయోషామణితోడ 'నీ సహచరుండారామగిర్యాశ్రమ
శ్రేయస్సంస్థితినుండి నీ కుశలమున్ జింతించునమ్మీ!' పురాఽ
ఖ్యేయంబౌ సులభాఽపదంబయిన దేహిశ్రేణి కిమ్మాటయే॥

వసివాడి కౌఁకల నసురుసురై తూలి
బడలిన నెమ్మేని, బడుగుమేన
ఉడుగని కన్నీటి, జడిగొను కన్నీట
వలవంత, నంతంత నలఁచువంత
వెడవెచ్చనూరుపుఁ, గడు వెచ్చనూర్పున
దూరస్థితవు నిన్ను, దూరవర్తి!
అతినిర్దయుండైన యాకృతాంతుని చెయ్ది
కడువడి నిఖిల మార్గములు సన్ని
రుద్ధములు విద్ధములు నిట్లు బద్ధములయి
యెవ్విధినిఁ జేరఁగాలేక; నెవ్వగలను
భావితములైన సంకల్ప పథము లొకఁడె
త్రోవయె యిందుఁజొచ్చు నిందీవరాక్షి!

తొలినాళ్ళన్ బయిసుద్దికే చెలులముందున్; బల్కు — నీ వీనిలో
పలఁదా నువ్విళులూరు వాఁడఁటె! ముఖస్పర్శైకలోభంబునన్

పలుకున్ మేరలకందఁ, దక్షిపథమున్ బ్రాపింపఁ, డీ నేటి కా
వలపున్ వంతల మేలిపల్కులనెదున్ వామాక్షి ! నానోటితో –

శ్యామాలతలలోన నీమేని యొయ్యార
మళుకు లేడులలోన బెళుకుఁజూపు
ఆ సుధాంశునియందు నాననైకచ్ఛాయ
శిఖిబర్హములఁ గచశ్రీభరములు
ప్రతను నదీవీచితతి భ్రూవిలాసముల్
పోల్చికొంటయెకాక ప్రొద్దువోక –
ఒకచోటఁ గాల్నిలువకయె యేప్రొద్దును
అడవులఁబడి తిరుగాడియాడి,

ఓసి కోపన ! వినవె ! నీవొక్కమాట –
ఉన్నదియె పల్కుచుంటి, నిందొకటియందు
నొకటనైనను నీపోల్కియున్నె చెపుమ ?
భ్రమయుటలెకాని నే వలవంతవగల॥

పాలయల్కన్ గొనియున్నయట్లు – నిను నే పూఁబోఁడి ! కాంతోపల
స్థలిపైఁ దీరిచి ధాతురక్తి; ననుఁద్వత్పాదానతున్‌జేయఁగన్
దలఁపెత్తన్ జడియొత్తి బాష్పములు, కానంజాలదీచూడ్కి; య
న్నల ! యందున్ మనకూడుటోర్వదు కృతాంతక్రౌర్య మెబ్బంగులన్॥

కలలన్ నీ వెటులేని నాకొదవినన్ గాటంపుఁగౌఁగింట ని
న్నలమన్ గేల్గవసాచి రిత్తబయలైనన్ గుందునన్‌గాంచి; యీ
స్థలులందున్ వనదేవతాశ్రువితతుల్ తారాభముల్ రాలునో !
తలిరుం జొంపములందు నెన్నితరులన్; దన్వంగి ! నేనెన్నమిన్॥

ఒరపై యేతెరగాలు లాసరళ సద్యోనిర్దళత్పల్లవ
చ్ఛురిత క్షీర కషాయ గంధిలము లౌచున్ దక్షిణాశాగతిన్
దరలున్, దామవియెల్లనో గుణవతీ ! త్వద్గాత్రసంస్పర్శమే
దురముల్ గానగునంచు నేఁగవుఁగలింతున్ సంస్పృహోన్మాదినై॥

క్షణమట్లుల్ కుదియింపనెట్లగునొ ! నాకై దీర్ఘయామన్ త్రియా
మను ? నెట్లోఁబవలేని సర్వదశలన్ మందాయమానాతపం
బును ? హా ! రేఁబవలిట్లు ముంపఁగఁదలంపుల్, దుర్లభప్రార్థనం
బున వేసారి కుసుళ్లగూలె వెతలన్ ముగ్ధాక్షి ! నా డెందమే॥

అలవిన్ మీఱిన యిట్టివంత ననునేనై యూఁది కొంచుందు; ని
మ్ములఁగల్యాణిరొ ! నీవునైన ననయంబున్ గుండియంజాఱకే !

ఇలనెవ్వానికి రాదునెప్డు; సుఖమేని, దుఃఖమేగాని, చిం
తిలనేలా! దశ క్రిందుమీఁదగుఁ గదే! నేమిక్రమప్రాప్తమై॥

నలి శాపాంతము నాకు శార్ఙ్గి పవనాంధశ్శయ్య మేల్కొన్న; ఈ
నెలలన్ నాల్గిటి వెళ్లఁద్రోయుము మెటులేని! కన్నులన్ మూసి; య
న్వల నాయల్లక చింతితమ్ములగు నా స్వాత్మాభిలాషంబులె
వ్వలనన్ బండునకాదె! పండిన శరత్పూర్వక్షపాజ్యోత్స్నలన్॥

అలయొకగుర్తు — నాగళగత్తైక భుజాలతవై శయించి; య
ర్మిలినొకనాటిరేఁ బలవరించుచు నేడ్చుచులేవ, హేతువే
నలయక యెన్నొమార్లడుగ, న టివి లోనగవ్వూనియిట్టు, 'అ
న్నల! నినుగంటిఁగైతవము నన్ గలయన్, గలలోన నొక్కతెన్!'॥

ఈ యొకగుర్తుచే నెఱుఁగుమీ! కుశలాత్మనిగాఁగనన్ను, నీ
వో యసితాక్షి! **నా**యెడల నూడ్చకు నమ్మికలా జనోక్తులన్
మాయురె! స్నేహముల్ మమతమాయు వియోగములందఁటందురే —
నీయెడఁ దా, మభోగమున నిండును రాగిలి ప్రేమరాసులై॥

తొలి విరహమ్మునన్ బొగులు తొయ్యలి నీ విటులూఱడించి, యి
మ్మల వృషరాజు క్రుమ్మికల మూర్వగు నమ్మలవీడివచ్చి, యు
గ్మలి కుశలంపుఁబల్కులను గందువతో నిటఁదెచ్చి, వేగసం
జల తటి మొల్లయై తొడిమ జాఱిన నా యసువింత నిల్పుమీ!

ఎదఁ గైకొంటివె! బంధుకృత్యమిది యూహాడేర్పంగ? సౌమ్యుండ, వీ
వదిరా! మిన్నక యున్కికిన్ గతము నీ స్వాంతంబు, తా, ధీరతా
స్పదమౌటే, జడిసోననించెదవు నిశ్శబ్దంబుగా, ప్రార్థనా2
స్పదులందున్ దదభీష్టనిర్వహణమే ప్రత్యుక్తి, మీబోంట్లకున్!

ఈ పంపున్ నెరవేర్చి నీ కనుచితంబేయైన, మత్ప్రార్థనన్
నాపైఁగూరిమిఁ 'దా' వియుక్తుఁడనియైనన్, జాలిచేనైన, నీ
వాపై నీనెనరైన చోట్లరుగు మీ! ప్రావృట్తటిద్యుక్తివై
నీ ప్రేయాలి వియోగ మిట్టు లెపుడేనీ! నీకు లేకుండుతన్॥

శ్రీ గూడ శ్రీరాములు

మహేంద్రగిరి - పరిసరాలు

భారతావనికి తూర్పుసముద్రమయిన వంగోత్ఖాతపు ఉత్తుంగ తరంగ లయల శ్రావ్య సంగీత ఝరుల్ని ఆలకిస్తూ—కడలి ఒడ్డు వెంబడి నానావిధ ఫలవృక్షతతితో శోభాయమానమయిన ఉద్యాన వనాన్ని (ఉద్దానం) ముద్దాడుతూ—బాహుదా, మహేంద్ర తనయా నదులతోనూ, విశాలమయిన తటాకాలతోనూ, సేచితాలయిన పంటభూముల్ని తిలకిస్తూ—రాజులు, రాజ్యాలు, మతాలు, సంస్కృతుల మార్పులకు, సుదూర ప్రాచీదేశాలనుంచి సరకులు మోసుకొని వెళ్లివచ్చే నౌకాసమూహాల వివరాలకు యుగయుగాలనించి మూగసాక్షిగా దూరంగాసాగిపోయిన తూరుపు కనుమల్లో ఆకాశాన్ని ముద్దాడుతూ ఉంది మహేంద్ర శిఖరం. హౌరా - మద్రాసు రైలుమార్గాన మందసారోడ్ స్టేషనుకు పడమరగా అలతి దూరాన ఎత్తుగా, నీలంగా కనులపండువుగ కనిపిస్తూ వుంటుంది.

''మహేంద్రో మలయః సహ్యః శుక్తిమాన్ ఋక్షపర్వతః
వింధ్యాశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతః''

అని మార్కండేయ పురాణం పేర్కొంటున్నది. మహేంద్రం సప్త కుల పర్వతాలలో ఒకటి.

''మహేంద్రస్య కులపర్వత విశేషస్య—సప్తకుల పర్వతాః—మహేన్ద్రో మలయః......కులపర్వతాః ఇతి విష్ణుపురాణ వచనాత్''

అని మల్లినాథుని వ్యాఖ్య.

దశరథ మహారాజు ఉత్తర కోసలాధిపతి. కౌసల్యాదేవి దక్షిణ కోసల రాజపుత్రి. దక్షిణ కోసలకు ఆని వుంది దండకారణ్యం. శ్రీరాముడు తన వనవాసంలో అధిక భాగాన్ని దండకారణ్య, చిత్రకూటాల్లో[1] గడిపాడు. ఇవి నేటి బస్తర్, జయపూర్ ప్రాంతాలలోనివి. మహేంద్ర పర్వతానికి నికటస్థ ప్రాంతాలు. శ్రీరామచంద్రుడు లోకోపయోగి కార్యాలకై దండకారణ్యంలోని కొందరిని బ్రాహ్మణులుగా మార్చాడు. వారు రఘునాథియా బ్రాహ్మణులుగ ప్రఖ్యాతులయి మధ్యప్రాంతం, ఒరిస్సా ప్రాంతాలలో వున్నారు.[2] రఘునాథ నామధేయులు, రఘునాథపురం మొదలయిన గ్రామ నామాలు గంజాం, శ్రీకాకుళం జిల్లా ప్రాంతాలలో పరిచితాలు.

లంకకు వెళ్లేముందు సముద్రాన్ని దాటబోయి ఇసుక తిన్నెలకంటె మహేంద్రగిరి అనుకూలమంటూ ఆంజనేయుడు ఇలా అంటాడు:

''నేయం మను మహీవేగం లంఘనే ధారయిష్యతి
ఏతా నీహ నగస్యాన్య శిలాకంటక శాలినః
శిఖరాణి మహేంద్రస్య స్థిరాణి చ మహాంతి చ
ఏషు వేగం కరిష్యామి మహేంద్రశిఖరేష్య మాం.''

సముద్రోల్లంఘనానికి ముందు ఆంజనేయుడు

''స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే
భూతేభ్యశ్చాంజలిం కృత్వాచ కారగమనే మతిం''

అని ప్రార్థించేడు. రామాయణంలోని మహేంద్రగిరి సముద్రతీరంలోనిది. భౌగోళిక పరిణామాలవల్ల సముద్రం వెనుకకుపోగ ఇప్పుడున్న తీరభూమి ఏర్పడి వుంటుందని భావించబడుతున్నది. ఇచ్ఛాపురం, నౌపడాలవద్ద సముద్రపు నీటితో ఉప్పుపండించే విశాలమయిన పల్లపు భూభాగాలు దీనికి కొంత బలాన్ని చేకూరుస్తున్నాయి.

ఆంజనేయుడు మహేంద్రగిరి శిఖరంనించి లంకకు వెళ్లటం నిశ్చయం. కాని లంక ఎక్కడిది అన్నది వివాదాస్పదం. కన్యాకుమారికి దక్షిణాన కొంతదూరంలో హిందూమహాసముద్రాన మునిగిపోయిన ఒక ద్వీపమని, మలయా ద్వీపకల్పానికి చేరువలోనిదని, మహానది (ఒరిస్సా) ముఖద్వారంలోనిదని, గోదావరి ముఖద్వారంలోనిదని, మధ్యప్రదేశ్‌లోనిదని[3] ఇలా వివిధాభిప్రాయాలున్నాయి. సోన్‌పూర్ (ఒరిస్సా – బరంపురానికి వాయువ్యాన కొంత దూరంలోనిది)లో దొరికిన క్రీ. శ. 1000నాటి ఒక తామ్ర శాసనం[4] బట్టి అక్కడి రాజు కోసల వంశీయుడయినట్లు, 'పశ్చిమలంకాధిపతి' బిరుదాంకితుడయినట్లు తెలుస్తూవుంది. పశ్చిమలంక ఉన్నప్పుడు కనీసం ఒక తూర్పులంక వుండాలి. (దక్షిణ, ఉత్తర లంకలు లేకపోయినా). పై పశ్చిమలంక తూర్పున సముద్ర తీరంనించి పశ్చిమాన బస్తరువరకు, ఉత్తరాన మహానది సరిహద్దుగా దక్షిణాన మహేంద్రగిరి వరకు ఎక్కడో వుండాలి. కనుక తూర్పు లంక మహానది ముఖద్వారంనించి మహేంద్రగిరి వరకూ గల బంగాళా ఖాతంలో ఎక్కడోవుండి మునిగిపోయి వుంటుందన్న అభిప్రాయానికి బలమిస్తున్నది. అంతేకాక దండకారణ్యం బస్తర్ (జిల్లా) దేశానికి సమీపం లోనిదన్న అభిప్రాయం[5] రామాయణంలోని అసంబద్ధ భౌగోళిక విస్మృతిని తగ్గిస్తుంది. పై అంశాల్నిబట్టి మహేంద్రగిరి అటు దండకారణ్యం, చిత్రకూటాలకు, ఇటు లంకకు మధ్యదని చెప్పవచ్చు.

బ్రహ్మ, హరిహరుల గురించి మహేంద్రగిరిపై తపస్సుచేసి భీమేశ్వరాలయాన్ని నిర్మించాడని అంటారు. పరశురాముడు సమస్త క్షత్రియుల్ని వధించాక మహేంద్రగిరిపయి తపస్సులో నిమగ్నుడయినాడు. బలరాముడు మహేంద్రగిరిపయి ప్రతిష్ఠించిన మూడు లింగా

లలో గోకర్ణేశ్వరలింగం ఒకటి. పురాణ కథలు, కట్టుకథలు అయినా, పరశురామ సంబంధం పశ్చిమ కనుమలకున్నా, నేటికి కూడా ఉత్తర శ్రీకాకుళం, గంజాం ప్రాంతాల ఊళ్లలోకి పరశురామ వేషధారి గొడ్డలి పట్టుకొని ఉగ్రరూపంతో వచ్చి యింటింటికెళ్లి యాచించకపోయినా వీధిలో అటు ఇటు తిరుగుతే ప్రజలు బియ్యాలెత్తడం ఉంది. బలరామ సంబంధం శ్రీకాకుళం జిల్లాకు ఎక్కువగా కనిపిస్తున్నది. బలరామక్షేత్రమయిన శ్రీకాకుళం జిల్లా ప్రాంతంలో కోలువర్తని, వరాహవర్తని, రూపవర్తని (టెక్కలి), జలమ్వార (జలుమూరు), మహేంద్రభోగం అన్నవి భాగాలు.

పాండవులు తమ అజ్ఞాతవాసాన మహేంద్రగిరిపయి ఉండగా అర్జునుడు సముద్రతీరానికి వెళ్లాడు. అక్కడ తెలియక ఒక గోవుని బాణంతో చంపాడు. గోవని తెలిశాక భీతిల్లి దానిని మహేంద్రగిరి పయివున్న తమ్ముల దగ్గరికి తీసుక వెళ్తుండగా దాని కోటిరక్తపు చుక్కలు బారువలోపడి అక్కడ కోటిలింగేశ్వరుడు వెలిశాడని, పాప పరిహారార్థం పాండవులు మహేంద్రగిరిపయి లింగాన్ని ప్రతిష్ఠించారని జనశ్రుతి. చరిత్ర కాకపోవచ్చు కాని గోస్వేదం ఉత్పత్తిస్థానంగా చెప్పుకున్న శబరులున్నారు. అశోకుని కాలాన మహేంద్రగిరి భాగం ఆటవికుల సరిహద్దు. అశోకుడు, రక్తబాహుడు, విజయవర్మ మొదలగు మహావీరుల విజయస్తంభాలు మహేంద్రగిరిపయి ఉన్నాయి [6]

“......కళింగ మాహిష మహేంద్ర భౌమాన్ గుహ భోక్ష్యయంతి” అనే విష్ణుపురాణ[7] కథనంబట్టి ఆ రాజ్యాలను గుహుడనే వాడు ఏలినట్టు తెలుస్తున్నది. క్రీ. శ. 4వ శతాబ్దారంభాన కళింగాన్ని ఏలుతూ, సింహళ రాజయిన మహాసేనుని (క్రీ. శ. 277 – 304[8] లేక 334–361[9]) సమకాలికుడూ, బౌద్ధమతావలంబి అయిన గుహ శివు డొక డున్నాడు. ఈ గుహశివుడే గుహుడని చరిత్రకారుల అభిప్రాయం.[10] గుప్తులు ప్రయాగ, సాకేత, మగధలతో గంగాతీరాన రాజ్యమేలు కాలంలో ఈ గుహుడు దంతపురాన్ని రాజధానిగా పాలించేవాడు ఇతడు సముద్రగుప్తుని కంటె మునుపటి వాడు. గుహునికి ముందు దాదాపు 800 సంవత్సరముల క్రితం మహాపరి నిర్వాణకాలాన (క్రీ. పూ. 483 లేక 486–87) మల్ల రాజధాని కసియ (కుశి) నగరం నించి అప్పటి కళింగ రాజయిన బ్రహ్మదత్తుని[11] చే తేబడిన బుద్ధుని నాల్గవ[12] ఎడమకోరపన్ను[13] (కళింగం వంతుకి వచ్చిన బుద్ధుని అవశేషం) దంతపురంలో స్థాపితం చేయబడి వుండేది. ఆ దంతం శుభదాయకమని తెలుసుకొని, బౌద్ధమతంలోకి మారి, దానిని మరింత భద్రంగా కాపాడుతుండేవాడు. దయాళువు, దాత అయి యుద్ధాలవల్ల కలిగే రక్తపాతాన్ని విడనాడి ప్రజానురంజకంగా పాలించేవాడు. ఇతడు మొదట పాండురాజుల సామంతుడు. గుప్తులు మగధలో బలవంతులైనాక పాండులు క్షీణిస్తుండగా గుహుడు స్వతంత్రించాడు. కాని బుద్ధుని దంతాన్ని స్వంతం చేసుకోడానికి ఇతనిపైకి దండెత్తిన క్షీరధరుడను వానిచేత చంపబడ్డాడు. ఈ క్షీరధరుడనే రాజు ఎవడో చరిత్రలో నిర్ధరింపబడలేదు. బ్రాహ్మణమతంవీడి బౌద్ధమతంలో గుహశివుడు చేరినందుకు కొందరు బ్రాహ్మణులు సార్వభౌములైన పాటలీపుత్ర పాండురాజులకు మొరపెట్టుకున్నారు. అపుడు పాండురాజు గుహశివునిపై కోపంతో దంతపురంలోని దంతాన్ని పాటలీపుత్రానికి చేర్చమని ఆదేశించాడు.[14] ఆ ఆదేశానుసారం క్షీరధరుడు దండెత్తి వుండును. కనుక క్షీరధరుడు పాండురాజుల సామంతుడవాలి.

చనిపోడానికి కొన్ని క్షణాలముందు గుహుడు తన కూతురైన హేమమాలని పిలిచి దంతాన్ని భద్రంగా సింహళంలోని తన మిత్రుడయిన మహాసేనునివద్దకు చేర్చమని ఆదేశించాడు. తండ్రిఆజ్ఞపై హేమమాల తన భర్త, ఉజ్జయినీ రాజపుత్రుడూ అయిన దంతకుమారునితో కలిసి రహస్యంగా ఆ దంతాన్ని తీసుకొని క్రీ. శ. 313లో తామ్రలిప్తి గుండా సింహళానికి వెడలిపోయింది. ఆమె సింహళాన్ని చేరేసరికి మహాసేనుని పుత్రుడయిన సిరిమేఘవన్న (క్రీ.శ 304–332) పాలిస్తున్నాడు. అతడు అత్యంతాదరంతో, భక్తితో ఆ దంతాన్ని గ్రహించి కాండీలో స్థాపితం చేశాడు. సింహళ ద్వీపవాసులు దానిని అత్యంత భక్తితో కొలిచారు. తరువాతి కాలాన ఆ దంతాన్నే తిరిగితెచ్చి ప్రస్తుతం పూరీజగన్నాథం గుడి ఉన్నచోట స్థాపితం చేశారని బౌద్ధులవిశ్వాసం. ప్రస్తుతం పూరీ దేవాలయాలు చాలా ఎత్తులో వుండి చుట్టుపట్టులు చాలా లోతుగా వున్నాయి. కనుక ప్రస్తుత దేవాలయాలు ఒకనాటి బౌద్ధస్థూపాలు, ఆరామాల శిధిలాల దిబ్బపై కప్పబడ్డాయని అంచనా.

గుహుని (గుహ శివుని) అనంతరం దేశం చిన్న చిన్న భాగాలుగా చీలి శక్తికోల్పోయి నీరసించగా ఆ అదను చూసి సముద్రగుప్తుడు క్రీ. శ. 343లో దండెత్తి వచ్చాడు.

కళింగ, మాహిష, మహేంద్ర భౌమ దేశాలకు రాజధాని అవుతూ, బుద్ధుని దంతం స్థాపితం కాబడిన ‘దంతపురం’ ఏది అన్న విషయంలో పరస్పర విరుద్ధాభిప్రాయాలున్నాయి. శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ (ఆముదాలవలస) సమీపానవున్న ములగాలవలస పక్కనున్న దంతవక్త్రుని కోట అనే దిబ్బ అని,[15] ఆముదాలవలస – హిరమండలం రోడ్డుపైని పురుషోత్తపురమని,[16] నేటి గంజాం జిల్లా ఛత్రపురం దగ్గరగా ప్రవహించి చిలక సరస్సుకు కొంచెం దక్షిణంగా సముద్రాన కలిసే ఋషికుల్యానది ముఖ ద్వారంలోని పాలూరు (పన్ను+ఊరు) అనీ,[17] మొదట పితృభక్తుల రాజధానిగా వుండి తరువాత మాతృభక్తుల (మాఠరుల) అధీనమైన కళింగపట్నం దగ్గరి సింగుపురం (సింహపురం) అనీ,[18] ప్రాలూరంటే ధాన్యపు కొఠారని, అది గోదావరి ముఖద్వారాన వుండి సముద్రంలో మునిగిపోయివుంటుందని[19] అంటారు. సింగుపురమే దంతపురమని, దానినే పాలూరు అని కూడా భావించబడుతున్నదని, అయితే ఈ నిర్ధారణ సందేహాస్పదమని అంటారు.[20] టాలమీ రాతలబట్టి పాలూరు నించి మలయా ద్వీప కల్పానికి వర్తక వ్యాపారాలు నౌకల ద్వారాసాగేవని, ఈ పాలూరు గంజాం, శ్రీకాకుళం జిల్లాలకు దగ్గర లోనిదని నిర్ధరించక విడిచిపెట్టేరు.[21] దంతపురం భువనేశ్వరంగాని, పూరీగాని అయివుంటుందని కొందరంటారు.[2] ఈ పాలూరునించే హేమమాల బుద్ధుని దంతాన్ని తామ్రలిప్తి గుండా సింహళానికి

చేర్చింది. మహాయాన నాగార్జునుడు శాతవాహన కాలంవాడు. నాగార్జునకొండ శాసనాలబట్టి మహాయాన బౌద్ధగురువులు కాశ్మీరు గాంధార, చైనా, చిలట, తోసలి, అపరాంత, వంగ, వనవాసి, యవన, దమిల, పాలూరులలోని బౌద్ధులను మహాయానంలోకి మార్చినట్టు తెలుస్తున్నది.[23] సాలిహుండాం (శాలిపేటక)కి శాలివాహనులకి (శాతవాహనులకి) సంబంధమున్నట్టు ముద్రలు లభించాయి. శాలిహుండాంలోని బౌద్ధారామం ప్రసిద్ధమయినది. కళింగపట్నం, సాలిహుండాం, సింగుపురాలకి దగ్గరలోనే పాలూరు (దంతపురం) ఉండి వుంటుందని భావించబడుతూంది.

బౌద్ధమత వికాసానికి పూర్వంనాడే వెలసిన ఏడు రాజ్యాలలో దంతపురం రాజధానిగా గల కళింగం ఒకటి.[24] రేణు అను రాజు కాలాన అప్పటి భారతదేశపు ఏడు రాజ్యాలలో కళింగ రత్త ఉంది. దానిని దంతపురం రాజధానిగా సత్తభు అనే రాజు పాలించేవాడు.[25] ఇతడు శతపథ బ్రాహ్మణంలో పేర్కొనబడిన ధృతరాష్ట్రుడు (ధతరథ) అను ప్రఖ్యాత రాజు సమకాలికుడు. కనుక దంతపురం (తరువాతి) వైదిక కాలానికి చెందుతుంది.[26] అంగుత్తర నికాయలో పేర్కొనబడిన పదహారు జనపదాలలో కళింగ లేకపోయినా మహావరి నిర్వాణ కాలం (క్రీ. పూ. 483 అని ఫ్లీటు, 486–48 అని విన్సెంట్ స్మిత్) నాటికి దంతపురం రాజధానిగా కళింగ ఉంది. మహావరి నిర్వాణ సంవత్సరానే (క్రీ. పూ. 483) ఒకానొక కళింగ రాజు కుమార్తె అయిన సుశిమ అనునామె మనుమడయిన విజయుడు (క్రీ. పూ. 483–445అని కొందరు) అనే రాకుమారుడు 700 మంది బౌద్ధభికుకులతో బుద్ధుని అస్థికలు తీసుకొని కళింగతీరపు ఓడరేవునించి సింహళానికి వలసపోయాడు.[27]

సముద్రగుప్తుని ప్రయాగ (అలహాబాదు) స్తంభశాసనంలో ''. పైష్టపురక మహేంద్రగిరి కొత్తూరక స్వామిదత్త...'' అని వుంది. పిఠాపురానికి రాజయిన మహేంద్రగిరి, కొత్తూరుకి ప్రభువైన స్వామిదత్తుడు అని[28]; పిఠాపురపురాజు మహేంద్రుడు, గిరికొత్తూరుకి రాజైన స్వామిదత్తుడు అని[29] విడదీయటం జరిగింది. పిఠాపురానికి, మహేంద్రగిరి సమీపంలోని కొత్తూరుకి స్వామిదత్తుడనే వాడు ఒక్కడే రాజని కొందరన్నారు కాని అలహాబాదు శాసనంలో ఒకేరాజుకి రెండు రాజ్యాలున్నట్టు లేదని డా ఆర్.ఎస్. త్రిపాఠి గారి అభిప్రాయం. గిరి నామధేయులు ఉన్నారు కనుక మహేంద్రగిరి అన్నది వ్యక్తి నామమేనని డా. భండార్కర్‌గారు అభిప్రాయపడ్డారు.[30] సముద్రగుప్తుని దండయాత్రకు (క్రీ. శ. 343) రమారమి 40 సంవత్సరాల మునుపటి వాడయిన గుహశివుడు మహేంద్రభౌమరాజు గుహశివుని వెంటనే వచ్చిన, అలహాబాదు శాసనంలో పేర్కొనబడిన ఇద్దరు మహేంద్రులు ఏ వంశంవారో చరిత్రలో తేలలేదు. క్రీ. శ 4వ శతాబ్ది ద్వితీయార్థంలోని దక్షిణకోసల శరభపుర రాజులలో మొదటివాడు మహాశూరుడను రాజు. అతనికి మునుపు దక్షిణకోసల చరిత్ర అంధకారం. ఆ అంధయుగంలోనివాడు అలహాబాదు శాసనంలోని కోసల మహేంద్రుడు. ఇక దాదాపు క్రీ. శ 350 ప్రాంతాన పిష్టపురాన్ని రాజధానిగా మాఠరులు పాలించారు. వీరిలో మహేంద్రుడనువాడు ఉన్నట్టు లేదు. సముద్రగుప్తుని ఆస్థాన కవి, అలహాబాదు శాసనకర్త అయిన హరిషేణుని రాజస్తుతియొక్క ప్రామాణికత్వం పలువురు చరిత్రకారుల విమర్శకు గురి అయింది.[31] ప్రసిద్ధమయిన మహేంద్రగిరిని మనసులో వుంచుకొని పరిసర రాజ్యాల రాజుల్ని కూడా మహేంద్రులుగా హరిషేణుడు మార్చాడు.

కవికుల గురువు కాళిదాసుని కాలనిర్ణయంలో వివిధ నిర్ధారణలున్నాయి. క్రీ. పూ 2వ శతాబ్దినించి క్రీ. శ. 5వ శతాబ్దం వరకూ ఆ నిర్ధారణలున్నాయి. 2వ చంద్రగుప్తుని (క్రీ. శ. 375/376–414) కుమార్తె ప్రభావతిగుప్తకు, వాకాటక 2వ రుద్రసేనునికి కలిగిన సంతానం దామోదరసేనుడు (2వ ప్రవరసేనుడు). ఇతడు సేతుబంధ కావ్యకర్త. కాళిదాసు ఈ దామోదరసేనుని చిన్ననాటి విద్యాగురువని, కాళిదాసు సేతుబంధ కావ్యానికి మెరుగులు దిద్దాడని, తరువాత దామోదరసేనుని ఆస్థానాన వుంటూనే కాళిదాసు తన మేఘదూతం రాశాడని అంటారు. వాకాటకులకు రామగిరి (రాంటెక్) స్వామి ఆరాధ్యదేవుడు. ప్రభావతి గుప్త తన కుమారులతో తరచు రామగిరికి పోయి విడిది వుండేది. వారితోపాటు కాళిదాసుకూడ వెళ్లేవాడని, అందుచేతనే కాళిదాసు యక్షుని విడిదిగా రామగిరిని ఎన్నుకున్నాడని అంటారు.[32] ప్రస్తుతమలభ్యం, బహుశా నాటకం అయిన ''కుంతలేశ్వర దౌత్యం' కూడా కాళిదాస కర్తృతమంటారు.[33] గుప్తులకు, దక్కను వాకాటకులకు, కుంతల (వనవాసి) కదంబులకు వైవాహిక సంబంధాలున్నాయి. గుప్తుల ప్రభావం దక్షిణ కోసల, గంజాం, శ్రీకాకుళం జిల్లాలవరకు వ్యాపించి వుండేది. ముఖలింగ మందిర సముదాయం తరువాత కాలంలోనివే అయినా వాటిలో గుప్త సంప్రదాయం కనిపిస్తుంది. తరువాతనే అయినా గుప్తశకం వాడబడిన శాసనాలు దక్షిణకోసల, దక్షిణ ఒరిస్సా భాగాలయిన ఆరంగ, గంజాం, సొరో, పతియకెలా, కనక, సుమండలాది చోట్ల లభించాయి. గుప్తుల రాయబారిగా కాళిదాసు అనేక ప్రాంతాలు, రాజ్యాలు తిరిగి వుంటాడు కాళిదాసుని వర్ణనలు ఆతని భౌగోళిక పరిజ్ఞానానికి నిదర్శనాలు. కాళిదాసు కళింగాన్ని బహుధా వర్ణించివున్నాడు.

ఒరిస్సానించి మధురై జిల్లావరకు సాగిన తూర్పు కనుమల్ని మహేంద్ర పర్వతాలని అనటం వుంది. ఈ తూర్పు కనుమలు ఒరిస్సా వరకేకాక గోండ్వానావరకూ వ్యాపించి వున్నాయి. మయూర్‌భంజ్, కెంఝార్ కొండలు రుక్షవాన్ పర్వతాలుగా గుర్తించబడ్డాయి.[34] గంజాం, శ్రీకాకుళం జిల్లాలలోని తూర్పు కనుమల్ని యిప్పటికీ మహేంద్రమాలి అంటారు. కాళిదాసు వీటినే మహేంద్రమని స్పష్టంగా పేర్కొన్నాడు. వీటి స్థితి కళింగంలో అని కూడా చెప్పాడు. అంతేకాక కళింగరాజుని మహేంద్ర ప్రభువన్నాడు.

రఘుమహారాజు వంగ, సుహ్మలను గెలిచాక, ఉత్కళులు దారి చూపగా కళింగానికి బైలుదేరాడు. కపిశానది దాటేసరికి రఘుమహారాజుకి (కాళిదాసుకి) కళింగదేశపు ఏనుగులు జ్ఞప్తికొచ్చాయి. ఈ కపిశ లేక కపిలానది నేడు పశ్చిమ బెంగాలులోని మిద్నాపూరు

జిల్లాగుండా ప్రవహించే కసలుయా నది. కాళిదాసుని కాలాన ఇది ఉత్కల, కళింగల సరిహద్దు. తమలూక్ (ప్రాచీన తామ్రలిప్తి) ఈ నది ఒడ్డున వుంది.

మావటీడు గంభీరవేదిని అనే ఏనుగు శిరమందు వాడైన అంకుశాన్ని వుంచిన విధంగా రఘుమహారాజు ఉత్కలైర్దర్శిత పథంలో కళింగాభిముఖుడయి వచ్చి మహేంద్ర పర్వత శిఖరాన తన పరాక్రమాన్ని వుంచాడు. (స ప్రతాపం మహేంద్రస్యమూర్ధ్ని తీక్ష్ణం న్యవేశయత్, అంకుశం ద్విరదస్యేన యంతా గంభీర వేదినః)[35]

రఘుమహారాజు మహేంద్రగిరిపై పరాక్రమంతో దండెత్తి రాగా ఏనుగులే సేనాంగాలుగా గల కళింగరాజు ఆయుధాలతో ఆ రఘుమహారాజును రెక్కలు నరకుటందు వుద్యుక్తుడైన ఇంద్రుని రాలను కురిసెడు కొండవలె ఎదిరించాడు (పతిజ గ్రాహ కాళింగస్త మస్ త్రైర్గజ సాధనః, పక్షచ్ఛేదోద్యతం శక్రం శిలా వర్షీవపర్వతః)

ఆ మహేంద్ర పర్వతాన కళింగ రాజుయొక్క బాణతతుల వర్షాన్ని రఘుమహారాజు ఓర్వవలసి వచ్చింది. (ద్విషాం విహాయ కాకుత్థ్సస్తత్ర నారాచదుర్దినం, సన్మంగళస్నాత ఇవ ప్రతిపేదే జయశ్రియం)[36]

హేమాంగదుడను కళింగరాజు మహేంద్ర పర్వతంవంటి దార్ఢ్యం కలవాడు. అతడు మహేంద్రానికి, మహాసముద్రానికి అధిపతి. ఈతని జైత్రయాత్రలలో ముందు నడిచే సేనాగజాల ఔన్నత్యం చూస్తే మహేంద్రపర్వతమే నడుస్తున్నదా అనేలా వుండేది.

అసౌ మహేంద్రాది సమాన సారః
పతిర్మహేంద్రస్య మహోదధేశ్చ
యస్య క్షరత్సైన్య గజచ్ఛలేన
యాత్రాసు యాతీవ పురో మహేంద్రః[37]

కళింగాన్ని పాలించిన తూర్పుగాంగులు మహేంద్ర గిరిపయి వెలసియున్న గోకర్ణేశ్వరుని వరంతో రాజ్యాన్ని స్థాపించారు. వీరు మహేంద్రగిరిపై దేవునికొక మందిరాన్ని నిర్మించారు. చోడగంగు వరకు తూర్పుగాంగులు గోకర్ణేశ్వర భక్తులు శాసనాల్లో గోకర్ణేశ్వరుని తమ కులదైవంగా చెప్పుకున్నారు. ఈ గోకర్ణునే కళింగ కదంబులు జయంతీశ్వరునిగాను, మలిగాంగులు మధుకేశ్వరునిగాను చేసుకున్నారు.

తెనుగు, తెలుగు పదాల వుత్పత్తి విషయమయి విస్తృత చర్చలు జరిగాయి.

''శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతా
ప్రాకారం తు మహత్ కృత్వా త్రీణి ద్వారా నవాకరోత్
త్రిలోచనో మహేశస్య త్రిశూలంచ కరే వహన్
త్రిలింగ రూపీ న్యవస త్రిద్వారేషు గణైర్వృతః''

అన్న దాన్నిబట్టి శ్రీశైలం,[38] కాళేశ్వరం, మహేంద్రగిరులు ఆంధ్ర మహావిష్ణువు సామ్రాజ్యపు ఎల్లలని తెలుస్తున్నది. త్రినగాల మధ్య భూమి కనుక తెనుగని ఒక వాదం.

'' .. ... ఖ్యాతిం త్రిలింగాఖ్యయా
యేషాం కాకతి రాజకీర్తి విభవైః కైలాస శైలాకృతాః
తే దేవాః ప్రసరత్ప్రసాద మధునా శ్రీశైల కాళేశ్వర
ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం త్వచ్ఛ్రేయసే జాగ్రతు''

అంటూ కాకతీయ కాలపు విద్యానాథుడు మహేంద్రగిరిని విడిచిపెట్టాడు. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామాల్లోని లింగాలు త్రిలింగాలని, ఆ త్రిలింగాలవల్ల త్రిలింగదేశం, తెలుగు దేశం అయిందని ఇంకో వాదం. త్రినగాలయితే మహేంద్రగిరి, త్రిలింగాలయితే ద్రాక్షారామం ఆంధ్రదేశానికి ఉత్తరపు ఎల్లలవుతాయి. త్రిలింగాలు, త్రినగాలవల్ల తెలుగు, తెనుగు కాకపోయినా మహేంద్రగిరి అప్పటికీ, ఇప్పటికీ కూడా, ఇంచుమించుగా ఆంధ్రదేశానికి ఉత్తరపు హద్దుగా వుంది. రాజరాజ చోడగంగుని టేకి శాసనం[39] లో మహేంద్రగిరి వేంగిదేశానికి ఉత్తరపు ఎల్లగా పేర్కొనబడింది. ''పూర్వాంభోనిధి కాళహస్తిశిఖరి శ్రీమన్మహేంద్రాచల శ్రీశైలాలు'' వెలనాటి వీరరాజేంద్రుని (1163-1180) హద్దులు. వెలనాటి రాజేంద్రుని ఇష్టసచివుడు, తంత్రముఖ్యుడు, అనుగుమంత్రి అయి, పాకనాటిని పాలించినవాడు కొమ్మన ఈ కొమ్మన రాజేంద్రుని ఆజ్ఞాపనంతో కొత్తచెర్లవద్ద గాంగుల్ని ఎదుర్కొన్నాడు.[40] చోడగంగు చక్రవర్తి (క్రీ. శ. 1078 1 42), 3వ అనియంక భీము (క్రీ. శ. 1211 – 1238)ల మధ్య వచ్చిన కళింగ గాంగులు నిర్బలులు. 3వ కామార్ణవుని (క్రీ. శ. 1147 – 56) నాటికే కళింగదేశపు దక్షిణభాగం వెలనాటిచోడుల అధీనమయింది. 3 వ అనియంక భీముడు పరాక్రమవంతుడు. పైతృకరాజ్యాన్ని వెలనాటి చోడుల నుండి గెల్చుకున్నాడు. వెలనాటిచోడుల పై తాత్కాలిక కళింగ విజయానికి కారకుడయిన కొమ్మన మంత్రి శౌర్యసాహసాలు గుండనమంత్రి నాటికి మధుర స్మృతుల కథలుకాగ వాటిని విన్న మంచెన కవి (క్రీ. శ. 1300) రాజశేఖరుని విద్ధ సాలభంజికలోని దాహలదేశ త్రిపురీ నగరాన్ని కళింగానికి తెచ్చాడు.

''తాపసాధ్యాసిత కందరోదర మహేంద్రగిరి శిఖర శేఖరస్య'' అని, ''పరమర్షిగణ సుఖాస్పదములై తగు మహేంద్రాది పర్వత గుహాభ్యంతరములు'' అని కీర్తిగాంచిన మహేంద్ర పర్వతం పయి ఋషులు, సిద్ధులు తపస్సు చేశారు. తరువాత జైనులు, బౌద్ధులు నివాసాలేర్పరచుకున్నారు. పర్లాకిమిడి, గుణుపూర్‌లకు సమీపాన రామగిరి ఒకటుంది. ఉగ్రాదిత్యాచార్యుడనువాడు కల్యాణకారకమను వైద్య గ్రంథాన్ని రామగిరిలో విరచించినట్లు చెప్పుకున్నాడు.

''వేంగీశ త్రికలింగదేశ జనన ప్రస్తుత్య సానూత్కటః
ప్రోద్యద్వృక్షలతావితాన నిరతైః సిద్ధైశ్చ విద్యాధరైః
సర్వే మందిర కందరోపమ గుహా చైత్యాలయాంకృతే
రమ్యే రామగిరావదం విరచితం శాస్త్రం హితం ప్రాణినామ్ ''

ఈ రామగిరి రాంటెక్ కాదని మిరాశీగారన్నారు.[41] పై ఉగ్రాదిత్యాచార్యుడు బహుశా 4వ విష్ణువర్ధనుని (క్రీ.శ. 762–99)కాలంవాడయి వుండునని, రామగిరి విశాఖజిల్లా రామతీర్థం కొండ అవవచ్చునని ఊహించబడింది.[42]

అనవేమారెడ్డి (క్రీ.శ. 1364–86) తన పూర్వదిగ్విజయ యాత్రానంతరం సింహాచలాన కీర్తిస్తంభాన్నెత్తించాడు. సింహాచలం వింధ్యపాదం లోనిదిగా పేర్కొనబడింది. శ్రీనాథుని పీఠికాపురం "త్రిలింగోత్కల తలంబు సంధి, వింధ్యాచల పాదం"లోది. "అథ వింధ్యాచలోపాంతే త్రిలింగోత్కల దేశయో స్సంధే సమీపే" అని (శ్రీనాథునిదే అంటారు) సంస్కృత భీమేశ్వరపురాణం. సింహాచలం, పిఠాపురం, రామతీర్థం తూర్పు కనుమలకి (మహేంద్ర పర్వతాలు) చేరువలోనివైనా వాటిని మహేంద్ర పాదంలోవి అనక వింధ్య పాదంలోనివి అన్నారు. తూర్పు కనుమలు ఉభయ గోదావరులలో పాపికొండలు; కర్నూలు, నెల్లూరు సరిహద్దుల్లో ఎర్రమల కొండలుగా నేడు పిలువబడుతున్నాయి. కనుక మొత్తం తూర్పు కనుమల్ని మహేంద్రం అన్నా నేటి మహేంద్రగిరి పరిసరాలు, పాతపట్నం తాలూకాలోని కొండలు మాత్రమే మహేంద్రంగా పిలువబడుతున్నాయి.

అలనాటి గౌతమీ, వరాహ, బలరామ క్షేత్రాలతో కూడిన కళింగరాజ్యపు అవశేషాలే నేటి నృసింహ, పురుషోత్తమ క్షేత్రాంతరిత భూమి. ఆ చివర జగన్నాథుడు, ఈ చివర నరసింహుడు (సింహాచలం) ఒకనాటి గౌరవేతిహాసమయ కళింగాన్ని కాపాడుతున్నారు. ఈ వీరరసోచిత పుణ్యభూమిలో ప్రతి గ్రామం, ప్రతి తావు ఏదో ఒక విశేషతా సంపన్నం.

కళింగరాజ్యం అనాది నించి పట్టు పరిశ్రమకు ప్రసిద్ధం. పట్టువస్త్ర పరిశ్రమకి బరంపురం నేటికీ ప్రసిద్ధి. తపుస్స, వల్లిక అను ఇద్దరు పట్టువస్త్ర వ్యాపారులు ఉరువేలా[43] (బుద్ధగయ) లోని తపోమగ్న బుద్ధభగవానుని దర్శించి ముగ్ధులయి కొన్నాళ్లక్కడే వేచి వుండిపోయారు. బుద్ధుడు తపస్సుచాలించి మొదట చూసింది వీరినే. వారు భక్తితో తమ వద్దవున్న తండుల నిర్మిత పిష్టకాల్ని బుద్ధునికిచ్చారు. వారి భక్తి శ్రద్ధలకు బుద్ధుడు మెచ్చి తన కేశగుచ్ఛంలోని కొన్ని కేశాల్నివ్వగా వారు కళింగదేశానికి వాటిని తెచ్చి ఒక చైత్యంలో భద్రపరిచారు. ఇది క్రీ. పూ. 532 నాటి సంఘటన. ఈ తపుస్స, వల్లికుల పిష్టకాలు నేటి పిష్టపురాన్ని (పిఠాపురం) జ్ఞప్తికి తెస్తున్నాయి. ఒరియా భాషలో పిండి వంటల్ని పిఠా లంటారు.

చండాశోకుడు తన తాత, తండ్రిచే గెలువ శక్యంకాలేని కళింగంపైకి క్రీ. పూ. 262 సం॥లో దండెత్తి వచ్చాడు. కళింగ యుద్ధం భారతేతిహాసాన్నే ఒక మలుపు తిప్పిన కథ విఖ్యాతం. బీభత్సాన్ని కరుణ విషాద గాథగా మార్చిన కళింగవీరుల రుధిరధారలకు చెదిరాడో, కళింగ స్త్రీల కన్నీటి కాల్వలకు కరిగాడో లేక రాజనీతి చాతురి చూపాడోగాని చండాశోకుడు ధర్మాశోకుడయినాడు. మిగిలిపోయిన కళింగప్రజల కన్నీటిని తుడుస్తూ రెండు ప్రత్యేక శాసనాల్ని చెక్కించాడు. "దియాఢమాతే పాన శత సహసే యే తఫా అపవుఢే శత సహస మాతే తత హతే బహుంతా వంతకే వా మవే" (150 వందల మంది పట్టుకొని తీసుకెళ్లబడ్డారు, 100 వందల మంది చంపబడ్డారు, 100 వందల పైని మరణించారు) అని చెక్కించిన శాసనాన్ని (ఆర్.ఇ. XIII) కళింగంలో నిలపలేకపోయాడు. చెక్కిన రెండు శాసనాలలో ఒకటి జౌగడ, ధౌలి (బరంపురానికి కొంత దూరం)లో ఇప్పటికీ ఉన్నాయి. 'సమాపా' ప్రాంతంలోని తన మహామాత్యుల నుద్దేశించి చెక్కబడ్డ శాసనాలవి. సరిహద్దు ప్రజలకు మహామాత్యులు చేయవలసిన విధులను పేర్కొంటూ, ఆ ప్రజలకిచ్చిన ఆశ్వాసన ప్రసంగాలు. పై సమాపా నేటి సోంపేట అని కొందరు చరిత్రకారుల ఊహ.[44] బరంపురానికి కొంత దూరంలో ఋషికుల్యానదీ తీరంలోని అస్కా నగరాన్ని అశోకుడు స్థాపించాడంటారు.[45]

బరంపురం, సోంపేటల మధ్యవున్న ఇచ్ఛాపురం నేటి ఆంధ్ర ప్రదేశ్ ఉత్తరకొసలోని మొదటి జంట పట్టణం. ఇచ్ఛాపురం పక్కగా బాహుదానది ప్రవహిస్తూ వుంది.

స్మృతికారుల్లో శంఖుడు, లిఖితుడు అను అన్నదమ్ములున్నారు. శంఖ, లిఖితస్మృతులు ద్వాపరయుగాన పాటించబడినట్లు పరాశర స్మృతి తెలుపుతున్నది :

"కృతేతు మానవోధర్మా స్త్రేతాయాం గౌతమోస్మృతః
ద్వాపరే శాంఖ లిఖితా కలౌ పరాశరస్మృతః"

ఈ శంఖ లిఖితులు "బాహుదాతీర నివాసులు, ధర్మతత్పర మనోవృత్తులు." అనుమతి లేక అనుపస్థితిలో ఫలాలు కోసినందుకు లిఖితుడు శంఖుని కోపానికి గురయ్యాడు. అప్పటిరాజు సుద్యుమ్నుని తీర్పు ప్రకారం లిఖితుని చేతులు నరకబడ్డాయి. "బాహుదానది యందవగాహనంబుసేయ ప్రభవించె నాతని (లిఖితుని) చేతు లపుడు .." అని శాంతిపర్వం.[46] బాహువులిచ్చింది కనుక బాహుద అయింది. ఇదే కథ కడపజిల్లా చెయ్యేరు (బాహుదా)కికూడా వుంది. ఇచ్ఛాపురం బాహుదకు అలతిదూరాన "భూరి పుష్ప ఫలాభివృద్ధి గొప్పారెడు వివిధ భూరుహంబుల కనువైనదై"న ఉద్యానం వుంది. ఈ ఉద్యానం శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట తాలూకాల్లోని సముద్ర తీరం వెంబడి కొన్నివేల ఎకరాలలో విస్తరించి వుంది. కొబ్బరి, పనస, మామిడి, జీడిమామిడి, అరటి తోటల్తో ప్రకృతి రామణీయకంగా విలసిల్లుతూ వుంది. ఆంధ్రదేశాన కోనసీమ తరువాత ఉద్యానం కొబ్బరి పంటకు చెప్పుకోతగ్గది. కంచిలి కొబ్బరి వ్యాపారం విననివారుండరు.

తాంత్రిక బౌద్ధానికి పుట్టినిల్లు ఉడ్డియాన (ఒడియాన) పీఠం.[47] 84మంది తాంత్రిక మహాసిద్ధుల్లో కళింగదేశానికి చెందిన 'సరహ' ఒకడు. ఇతడు క్రీ. శ. 7వ శతాబ్దంవాడని నిర్ధారణ.[47a] ఈ ఉడ్డియాన, ఉడియాన, ఒడియాన, ఉదియానలకు ఉడియా (ఒరియా), ఉద్యానంలో సంబంధమేమో పరిశీలించాల్సి వుంది.

ఉదియాన యింటిపేరు గాగలవారు సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాల్లో వున్నారు మనుస్మృతిలో ఉద్రులు, ద్రావిడులు పేర్కొనబడ్డారు (పౌండ్రకాశ్చోడ్ర ద్రవిడా)[48] ఉదీచ్యదేశం కనుక ఒడిస్సా అయిందంటారు.[49] ఆపస్తంబుడు ఉదీచ్యుల ఒక విలక్షణమయిన శ్రాద్ధ పరంపర పయి చర్చించివున్నాడు. (2–7–17–17). కనుక ఆపస్తంబుని నివాసస్థలం ఉదీచ్య అయి వుంటుందేమోనని కాణేగారంటారు[50] హరిదత్తుని ప్రకారం ఉదీచ్య శరావతికి ఉత్తరానగల భాగం.[51] ఆపస్తంబులు నర్మదకు దక్షిణ పూర్వభాగంలో ఉన్నారని మహార్ణవు డుల్లేఖించి వున్నాడు.[52] ఈ దక్షిణ - పూర్వ భాగం మహానది–గోదావరుల మధ్యభాగంగా వూహించవచ్చు.

ప్రాప తాలీవన శ్యామ ముపకంఠం మహోదధేః,[53] అంబురాశేస్తీరేషు తాళీవన మర్మరేషు ద్వీపాంతరానీత లవంగపుష్పైః రపాకృత స్వేదల వామరుద్భిః,[54] నారికేళాసవం యోధాః[55] – అని కాళిదాసు తూర్పు తీరాన్ని, కళింగదేశాన్ని, కళింగ దేశపు కొబ్బరిని, తాటిని పొగిడివున్నాడు. మహేంద్ర పర్వతం చేరువలో రఘురాజు సైనికులచేత తమలపాకుల దొన్నెలలో టెంకాయ కల్లుని తాగించాడు మహాకవి. ఆ 'తాంబూలీదళ భూరి వాటిక'ల స్మృతిచిహ్నాలే నేడు సోంపేట దగ్గరి బారగాంవద్ద, బరంపురం సమీపంలోని గొలంత్రవద్ద కనిపించే తమలపాకుల తోటలు.

తాటిచెట్లు అటు బరంపురం ఆదిగా ఆంధ్రకోస్తా అంతటి సమృద్ధం. కథక, మహాసుత సామ, కామ, ఛుల్లకాలంగ, రురు మొదలయిన జాతకాలలోని పణ్ణ (ఆకులు) బహుశ తాళపత్రాలు[56] ఒకటవ బౌద్ధ పరిషత్తు పిమ్మట త్రిపిటక రచన తాళపత్రాలపయి సాగింది.[56a] మెగస్తనీస్, ప్లినీలు 'తాల' పత్రాన్ని పేర్కొని వున్నారు.[57] తాల, తాళి, తాడ పర్యాయపదాలు. "న్యస్తాక్షరా ధాతురసేన యత్ర భూర్జత్వచః కుంజర విందుశోణాః వ్రజన్తి విద్యాధర సుందరీణా మనంగలేఖ క్రియయోపయోగం"– హిమాలయ పర్వతాలలోని భూర్జర పత్రాలలో విద్యాధర సుందరులు ప్రేమలేఖల్ని ధాతురసాల్లో ముంచి రాసేవారు అన్న కవికుల గురువు - భూర్జర పత్రాలు వాడాడో లేదో గాని తాటాకులు తప్పక వాడాడు. గుప్తసువర్ణయుగంలో పురాతనగ్రంథ పునఃలేఖనానికి, అసంఖ్యమయిన నవీన గ్రంథరచనలకు కావలసిన తాటాకుల అవసరం ఎంతోవుంది. ఈ తాటాకులు సులువుగా లభ్యం అవటంలోగల అంతరాయాన్ని తొలగించటానికి సముద్రగుప్తుని తూర్పుతీర 'ధర్మ' దిగ్విజయం ఒక కారణమయి వుంటుంది. సముద్రగుప్తుని దిగ్విజయ యాత్ర సరిగ్గా మొదలయింది తాళీవన భూములపైనే. గెలిచిన రాజ్యాల్ని సామ్రాజ్యాంతర్భుక్తం చేయక, ఆయా రాజులకే తిరిగి యిచ్చి చాల తొందరగా తిరుగుముఖం పట్టాడు.

ఉద్దానం రెండు భాగాలు· ఈదుపురం (ఇచ్ఛాపురం సమీపం) నించి మాణిక్యపురం (సోంపేట దరిదాపు) వరకుగల భాగాన్ని కవిటి ఉద్దానమంటారు. బారువా[58] కు దక్షిణ భాగాన్ని మెట్ట ఉద్దానమంటారు. కవిటి ఉద్దానంలో కాళింగులు (బారగపు శాఖ); ఎలమంచి, తలమంచి, కొలమంచి, వెల్లాల మొదలయిన ప్రసిద్ధ గృహ, గోత్రనాములయిన యాదవులు అధిక సంఖ్యలో వున్నారు. ఇతర జాతులతోపాటు సామంతులు, కేవటులు, ఒడ్డెదళవాయిలు, రవుళలు, సొండీలు అను కొన్ని ఒరియా మాతృభాషగల జాతులవారున్నారు.

సమతు - శబర–గొమాంగ్–గాంగుల క్రమపరిణామం చర్చించబడి వుంది.[59] ఆంధ్రులు, కళింగులు–పుళింద శబరాదులతో కూడినవారు. శబరులలో రాజులు, మహారాజులు ఉన్నారు. శబర సంబంధం లేని ఒరిస్సా చరిత్ర అత్యల్పం.

అనాదిలో శబరులు దక్షిణ భారత భాగాలపైకి రాకుండా ఆర్యవిస్తరణని అరికట్టినవారు. ఆర్యులచేత గెలువబడినవారు బ్రహ్మపాదాన్ని ఉత్పత్తిస్థానంగా చెప్పుకున్నారు. అలానే ఆర్యులచేత పరాజితులయిన ఈ శబరులు తమ ఉత్పత్తిని గోస్వేదంగా చెప్పుకొని ఆర్య సాంస్కృతిక జీవనంలో కలిసిపోయారు. అశోకుని ప్రత్యేక శాసనాల్లోని సమాపా 'ఆటవిక రాజ్యపు సరిహద్దులోనిది. ఈ శాసనాలు కళింగ, ఆటవిక ప్రజల్ని ఉద్దేశించినట్టివి. ఉత్కలదేశాన్ని క్రీ. శ. 7వ శతాబ్దిలో సందర్శించిన యువాన్ చవాంగ్‌కు శబరుల బారి పడకుండా ఓడమీద సింహళం చేరమని సలహా యిచ్చినా ఆతడు నేల మార్గంగుండానే కొన్యోధ, వేంగీదేశాలను చేరాడు.[60] పూరీ జగన్నాథుని పూజావిధానం ఆర్య, శబర ఆచారాల కలయిక. 'పండ' అను పదం పాండు (శబర) సంబంధం. పుళిందసేనుని సంతతివారయిన కొంగోడ శైలోద్భవులు,[61] దశాశ్వమేధాలు జరిపి భువనేశ్వర లింగరాజ మందిరాన్ని నిర్మించిన భౌమకర మహారాజులతో వియ్యాలందిన ఉత్కలపాండులు (కేసరులు, సోమవంశీయులు), దక్షిణ కోసల శరభపురీయులు, చంద్రాన్వయ–శశధరాన్వయులయిన దక్షిణకోసల పాండులు, కొదాలక మండల (బ్రాహ్మణీ నదిలోయ) శులికులు, జగమర్త మండల (అనుగుళ్ ప్రాంతం) తుంగులు, బొణ్డైమండల వరాహులు–వీరంతా శబరులు. సవర (శబర), కొంధొ (గోండు) తెగలలో ఇప్పటికీ తాము పురాతన రాజవంశీయులమన్న అభిజాత్య గర్వం తొంగిచూస్తుంటుంది.

మానవ తెగల వర్గీకరణబట్టి ఉద్దాన ప్రాంతంలోని సామంతులు (సమతులు) శబర సంబంధీయులుగా తోస్తుంది. అధిక సంఖ్యాకులు నిరుపేదలు. వీరి మాతృభాష ఒరియా. వలలువేసి అడవి మృగాల్ని వేటాడే అలవాటు వీరికుంది. వీరి వల్రత్రాళ్ల చుట్టలు, బరిసెలు, బల్లాలు మొదలయిన ఆయుధాలు వీరొకప్పుడు సైనికులనిపిస్తుంది.

క్రీ. శ. 7వ శతాబ్ది ద్వితీయార్థంలో ఖింజలి మండలం, ఖిజ్జింగికొట్టలలో భంజులు పాలించసాగారు. దక్షిణఖింజలి నేటి ఒరిస్సాలోని బౌధ్‌మండలం. దీని రాజధాని ఖిజరిపడ. క్రీ. శ 742 నాటిదయిన టెక్కలి (శ్రీకాకుళం జిల్లా) శాసనం భంజవంశపు శత్రుభంజదేవు (మంగళరాజు)చే వేయబడింది.[62] కనుక వీరి రాజ్యం టెక్కలివరకు వ్యాపించి వుండేదని భావించబడుచున్నది. ఈ శత్రుభంజుని పుత్రుడయిన రణభంజుని ఉత్కళసోమ (కేసరి)వంశ మహా

ఛవగుప్త జనమేజయుడు (స్వభావతుంగుడు) వధించి ఖింజలి మండలాన్ని వశపరచుకున్నాడు. జనమేజయుని పుత్రుడయిన మహాశివగుప్త 1వ యజతి యజతినగరాన్ని నిర్మించాడు. ఇది బౌధ్‌కు పశ్చిమాన పది కిలోమీటర్ల దూరానవున్న నేటి జగతి.

పై ఖిజరిపడ, జగతిలను తలపించే కొజ్జిరి, జగతి అను గ్రామాలునేడు ఉద్దానంలో వున్నాయి. చీకటి, జలంత్ర కేసరపడ అను గ్రామాలు కొజ్జిరికి చేరువలోనివి. కొజ్జిరి ప్రాంతాన సామంతులు (సమతులు) వున్నారు. కేసరి వంశరాజుల కాలానో, భంజ రాజుల కాలానో వీరీ ప్రాంతాలలో స్థిరపడి వుంటారు.

కైవర్తులనబడువారు మనుధర్మశాస్త్రం (20/34), శంకరాచార్యుల వేదాంతసూత్రం (2–3–43) మొదలగు వాటిలో పేర్కొనబడ్డారు. జాతక కథలలోని కేవత్త, కేవటలు వీరే. కైవర్తులు ప్రాచీన తామ్రలిప్తిని పాలించారు. కైవర్తభోగాన్ని పాలించిన కైవర్తులు బెంగాలు పాలురాజులయిన 2వ మహిపాలుడు, 2వ నరపాలుడు, రామపాలుడు మొదలగువారి సమకాలికులు, పక్కలో బల్లెం వంటివారు. పాలుల సింహాసనాన్ని ఊడబెరికినవారు. కైవర్తులు చేపలుపట్టు జాతివారు,[63] నౌకా వృత్తి గలవారు [64] అత్రి (199)చే చెప్పబడిన ఏడుగురు అంత్యజులలో ఒకరు.[65] ఒకనాడు వీరు నౌకాయాన నిపుణులు, నేగు మత్స్య పరిశ్రమ ప్రధాన జీవికగా గల కేవటులు. కళింగదేశపు విస్తృత సముద్రయాన కలాపాలలో వీరు పాల్గొని, ఉత్తరాదినించి దక్షిణ ప్రాంత సముద్ర తీరాలకు చేరి నివాసా లేర్పరచుకొని వుంటారు. ఈ కైవర్త లేక కేవటులను నేడు ఉద్దానానికి మకుటాయమానమయిన కవిటిగ్రామం[66] తలపిస్తున్నది. కవిటిలో వెలసిన దేవి చింతామణి.

ఒడ్డె దళవాయిల ముఖ్యవృత్తి కొబ్బరితాడు పరిశ్రమ. నౌకాయానంలో, నౌకాయుద్ధాలలో తాడుకి ఎంతయినా ప్రాముఖ్యముంది. కళింగ సైన్యాల్లో వీరు సైనికులు, దళవాయిలు. అస్సాం ప్రాంతాన నేడు దళాయిలున్నారు.

రవుళలనువారు గంజాం, ఉత్తర శ్రీకాకుళం జిల్లాలో అక్కడక్కడున్నారు. వీరు శివార్చకులు. కేవటులు, దళవాయిల్లా వీరు కూడా ఒరియా భాషని వ్యవహరిస్తారు. మలిగాంగులు రామానుజుని వల్ల ప్రభావితులయి వైష్ణవంలోకి మారినా శైవాన్ని అనాదరణ చేయలేదు. కళింగ గాంగులు మొదట పరమమాహేశ్వరులు, ముఖలింగేశ్వర భక్తులు పై రవుళలు గోళికీవంశ లక్ష్మాధ్యాయి సంతానమయిన రావళర్ అయివుంటారు. ఒరిస్సాలోని అప్పటి పటనా జమీందారీలోని రాణీపూర్–ఝరియాల్ గ్రామాన దొరికిన ఒక శిలాశాసనం ప్రకారం అక్కడ ఉత్తర తేరంబ గృహానికి చెందిన గగనశివ నాముడయిన ఆచార్యుడు ఒక దేవాలయాన్ని నిర్మించాడు.[67] ఈ తేరంబి రణోద్ దగ్గరి తేరహి. రణోద్ ప్రాచీన అరణిపద్ర.

భారతదేశపు ప్రాక్తట పర్వత శ్రేణులలోని ప్రఖ్యాతం, మహోన్నతం అయిన మహేంద్రగిరి శిఖరం, దానిచే నిత్యాశీస్సులందుకొనే పర్లాఖిమిడి (పల్లకి లేక పల్లకి రాష్ట్రం), టెక్కలి, రూప్యావతి లేక రూపవర్త విషయం), తరల, మందస (మంజూష), జలంత్ర (జలయంత్ర),[68] జరడ, చీకటి, సురంగి ప్రాంతాలు; వాటిలోని జయంతిపురం, గోకర్ణపురం మొదలయిన గ్రామాలు; బౌద్ధగిరి (బుద్ధగిరి)లాంటి కొండలు నేడు మూగపోయి వున్నాయి. ప్రాంతం బాగా వెనుకబడి వుంది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాజధానులకు దూరంగా వుండటం కారణమేమో! ఒకనాడు మహోన్నతమయిన సంస్కృతి చరమదశను చేరుకున్న కళింగప్రజల దైనందిన జీవిత విధానం అంతసులువుగా మారదని ప్రస్తుతానికి సరిపుచ్చుకోవలసి వస్తున్నది.

అధోజ్ఞాపికలు

1 చిత్రకూటం నాసిక్ (మహారాష్ట్ర) అని ఒకవాదం. జయపూర్ సమీపాన చిత్రకొండ ఉంది. నేటి దండకారణ్య ప్రాజెక్ట్ పరిసరంలోనిది.

2 ''ఖండహరోంకా వైభవ్–మధ్యప్రదేశ్ జైనపురాతత్త్వ'' అను హిందీ గ్రంథం. పే. 339.

3 భారతి, మార్చి 78

4 అదే

5 అదే

6 శ్రీకాకుళం జిల్లా చరిత్ర, 1 – 2 భాగాలు, పేజీ 54 (ఆదిభట్ల వెంకటరమణ)

7 విష్ణు పురాణం 4–24–65

8 A History of Orissa

9 The Age of Imperial Unity, p. 708.

10 A History of Orissa, p. 347.

11 బ్రహ్మదత్తుని కాలాన ఖేమబుషిచేత తేబడిందని శ్రీకాకుళం జిల్లా చరిత్ర – పే. 20లో ఉదాహృతం.

12 History of Indian and Eastern Architecture – Fergusan Vol. I (1967) p. 84

13 Elements of Indian Palaeography (1959) – A.C. Burnell, p. 28

14 Hist. of Ind. & Eastern Arch. – p. 64

15 ఆంధ్రదర్శిని – విశాలాంధ్ర ప్రచురణ

16 శ్రీకాకుళం జిల్లా – పే. 171.

17 The Forgotten City of Jangada అను వ్యాసం – డా. కృష్ణచంద్ర జెనా, బరంపురం విశ్వవిద్యాలయం

18 An Ancient Buddhist Pilgrim Centre అను శ్రీ G. R. వర్మగారి వ్యాసం (Sunday Standard)

19 ఆంధ్రదర్శిని

20 The Age of Imperial Unity (Hist. & Culture of the Indian People) – Vol. 2, Fn. 2, p. 216.

21 Advanced History of India, Part I, p. 206

22 Indian Architecture (1959)–Percy Brown p. 28

23 Adv. Hist. of India, Part I, p. 133

24 Cf. మహావంశ III, 208, 299 – Oxford Indian History.

25 Cf. మహా గోవింద సుత్తాంత–దిఘనికాయ (P. T. S.) II, 235 f; Dialogue of Buddha II, 270– A History of Orissa p. 321

26 Ibid p. 322 (Cf. శతపథ బ్రాహ్మణ – XIII, 5-4-22)

27 Ibid p. 322 (Cf. మహావంశ VI, I; దీపవంశ IX, 2 f) కాని సోపార (బొంబాయి సమీపం) నించి అని అంటారు.

28 Adv. Hist. Ind. Part I, p. 140.

29 Anc. Ind. History (Dr. R. S. Tripathi) – p. 242 – 43

30 The Vakataka & Gupta Age – Altekar p. 153 నించి

31 అదే పే. 373

32 అదే పే. 373

33 అదే

34 కాళిదాస్ కా భారత్ (హిందీ) పే. 23, 30

35 రఘువంశం – వెదంవారి వివరణ (4–39)

36 అదే (4–41)

37 అదే (6–54)

38 ఇప్పటి శ్రీశైలం క్రీ.శ. 500లకు పూర్వంలేదని, ఆంధ్ర విష్ణువు కాలంనాటి శ్రీశైలం గాంధార, బాహులు సీమకు మధ్యలోనిదని; మహా (భీమ) కాళేశ్వరం ఉజ్జయిని అని, ఉజ్జయిని నించి తూర్పుగా వింధ్య పర్వతశ్రేణి వెంబడి సాగి వస్తే సువర్ణానదీ తీరప్రాంతాన మహేంద్రగిరి పర్వతపు ఉత్తరకొన తగులుతుందని శ్రీ తేకుమళ్ల రామచంద్రరావు గారి వ్యాసం – ఆంధ్రప్రభ (ఆది) విజ్ఞాన వేదిక – 16–2–1969

39 ఎపి. ఇండి. VI, 335

40 కేయూరబాహు చరిత్ర, ఆశ్వా. 1, ప. 28.

41 ఖండహరోంకా వైభవ్– మధ్యప్రదేశ్ పురాతత్త్వ (హిందీ) పే. 195

42 భారతి, ఫిబ్రవరి 78, పే. 44.

43 శ్రీకాకుళం జిల్లాలోని నేటి ఉర్లాం ప్రాచీన నామాల ఉరామల్ల, ఉరుమెళ్ల

44 The Forgotten City of Jangada –అనువ్యాసం– డా. కృష్ణచంద్ర జెనా – బరంపురం విశ్వవిద్యాలయం. టాలమీ మేప్‌లలోగాని, ప్లినీ తెలిపిన అనేక పేర్లలోగాని సమాపా లేదు. అశోకుని R. E. I యొక్క ధౌళి, జౌగడ Version లలో 'ఖపింగలసి పవత' ప్రాంతంలోనిది తోసల, సమాపా సమాపా చిలక సరస్సు సమీపంలోనిదని Cunningham అభిప్రాయం (Corps. Inscr. Indi – Vol. I. p. 19.)

45 అదే వ్యాసం

46 ఆంధ్ర మహాభారతం ఆశ్వా 1, ప. 70

47 The Indian Buddhist Iconography- Benoyjosh Bhattacharya.

47 a అదే

48 10/43–45 అని ధర్మశాస్త్రకా ఇతిహాస్– పి. వి. కాణే, Vol. I, పే. 116

49 వేదం వేంకటరాయశాస్త్రివారి "తెలుగు వారెవ్వరు?" అను వ్యాసం

50 ధర్మశాస్త్ర కా ఇతిహాస్ – కాణే Vol. I, పే. 20

51 అదే

52 అదే

53 రఘువంశం 4–34

54 అదే 6–57

55 అదే 4–42

56 Indian Palaeography Part I (1952) p. 68 – Raj Bali Pandey.

56 a అదే

57 Elements of Indian Palaeography – A. C. Burnell, p. 10

58 రంగూన్ రాకపోకల కాలాన బారువా ఒక రేవు. దిఘనికాయ, జాతక కథలు మొదలయిన వాటిలో పేర్కొనబడిన సౌవీర

(సూరత్) దేశానికి రాజధాని అయిన 'రోరువ' పశ్చిమ తీర ఓడ రేవు. కళింగతీరం నించి బవేరు (బాబిలోనియా) కు వర్తక వ్యాపారాలు సాగేవని సాలిహుండాం మొదలయినచోట్ల దొరికిన విదేశీ నాణాలు సాక్ష్యమిస్తున్నాయి. బవేరు, రోరువల్ని ఈ బారువ జ్ఞప్తికి తెస్తున్నది.

59 భారతి నవ. 68 – జి. ఆర్. వర్మ

60 A History of Orissa, p 52, Fn. 12

61 టెక్కలి శాసనం (JBORS IV, p. 165)బట్టి వీరి రాజ్యం టెక్కలి వరకు వ్యాపించివుండేది.

62 A Hist. of Orissa, p. 355, Fn. 184

63 Age of Nandas and the Mauryas P. 239; The Wonder that was India, (1954) p. 145

64 ధర్మశాస్త్ర కా ఇతిహాస్ కాణే–1వ భాగంపే. 129-130

65 అదే పే. 125

66 సంతకవిటి అని రాజాం తాలూకా (శ్రీకాకుళం జిల్లా) లో ఒకటుంది.

67 Hist. of Anc. India-Dr. R. S. Tripathi, p 80,82

68 జలంత్రకోట - కటక గజపతుల దళవాయిలను తంత్రోపాయంతో ఇక్కడే తిమ్మరుసు లోబరుచుకున్నాడు.

కాఫీగ్లాసు

శ్రీ రావి రంగారావు

1

మనసులో తియ్యని సౌజన్యం
తనువులో వెచ్చని ఉద్రేకం
వయస్సులో చిన్నతనం
అనుభవంలో పసితనం
మంటలను పంతుళ్ళుగా పూజిస్తోంది రోజు
కొత్త ఊపిరి పోసుకున్నది "కుర్ర కాఫీ గ్లాసు"

2

నదులలోని సారం
వనాలలోని పచ్చదనం
కావలసిన రుచులలోకి మారుస్తూ
కడుపునిండా పదేపదే పట్టిస్తూ
ఎండిపోతున్నానంటున్నది
మాయలమారి "ముసలిపెదవి"

3

కర్ణుని కవచకుండలాల్ని
కాజేసిన ఇంద్రునిలాగా
చల్లని పిలుపులతో కాఫీగ్లాసుకు
స్వాగత గీతాన్ని పలుకుతోంది పెదవి;
పెదవి వెనుక దాగిన చీకటి గుహలో
వచ్చి జారిపడిపోతున్నది కాఫీ...
పెదవి తనను చల్లగా వంచిస్తుందని
కాఫీగ్లాసుకు ఎపుడు తెలుస్తుందని ?
తన కాఫీ యావత్తూ బలియైపోయి నప్పుడు
తనను తీసి దూరంగా మూలనుపెట్టే టప్పుడు
అవమానపు చావు పొంచివస్తుంటుంది
మలినంపొడి అట్టడుగున మిగిలుంటుంది

4

చేతులు కాలాక ఆకులను పడితే
చుట్టూగల గోతులు చూడకపోతే
కావచ్చుమీరు సచ్చరితులు
ఇంతేనండీ సంగతులు.

అమర గాయకుడు

ఈ మధ్యనే కీర్తిశేషుడైన అమరగాయకుని కంఠం మైక్‌లోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది దూరంగా.

రోడ్డుమీద నడుస్తున్న శంకరం, సుబ్బారావులు ఆగిపోయి వినసాగారు.

''అది కీర్తిశేషుడు 'శేషాచలం' ఆఖరుసారిగా పాడిన పాట కాదూ ? అతను చనిపోయాడంటే నమ్మబుద్ధి కావటం లేదు !'' శంకరం అన్నాడు.

''కొందరికి మరణం అనేది వుండదు. వారి కంఠస్వరం వినిపించినంతసేపూ వాళ్ళు బ్రతికివస్తారు!'' సుబ్బారావు దూరంగా వినిపిస్తున్న పాటలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ జవాబిచ్చాడు.

'''శేషాచలం' వేలకొద్దీ సినిమా పాటలు పాడాడు. వందల కొద్దీ ప్రైవేటు రికార్డు లిచ్చాడు. రోజూ యెప్పుడో వోసారి అతని కంఠం వినబడకుండా పోదు ! ఏ వ్యక్తికేనా, నిత్యం అతని కంఠ స్వరం వినబడుతూ వుండటమో, నిత్యం జనం అతని పేరును స్మరించడమో కంటే ఏం కావాలి ? ఎవరు కోరుకునేదేనా అదే ! ఆ రకంగా శేషాచలం ధన్యజీవి !'' సుబ్బారావు బస్సు స్టేజి వైపు నడుస్తూ అన్నాడు.

'''శేషాచలం' మరణించినా టేప్‌రికార్డర్ల ద్వారా, టీవీలో, రేడియోలో, మైకుల్లో నిత్యం అతనికంఠం వినగలగడం అతనిభార్య అదృష్టం ! ఆ పాటల్ని, ఆ గొంతుని విన్నప్పుడల్లా అతని రూపం ఆమె కళ్ళముందు కదలాడదూ ? ఆమెపరంగా అతనికి మరణ మన్నదే లేదు ! అతను అమరుడు ! అంతులేని అతని జ్ఞాపకాల పరంపరలో ఆమె తన శేషజీవితాన్ని సంతోషంగా గడపవచ్చు !'' సిటీబస్సుకోసం ఎదురుచూస్తూ శంకరం అన్నాడు.

అంతట్లో సిటీబస్సు వచ్చింది. శంకరం సుబ్బారావులు సిటీ బస్సెక్కి సికింద్రాబాదు చేరుకున్నారు. తమ యిళ్ళకు వెళ్ళారు.

మర్నాడు ఆఫీసులకు వెళ్ళటానికి సిటీబస్సు ఎక్కడానికి వచ్చినప్పుడు శంకరం, సుబ్బారావుతో ''ఒయ్ సుబ్బారావూ ! శేషాచలంగారి భార్య మద్రాసునుంచి మొన్న మనవూరు వచ్చేసిందట ! మా చెల్లాయి సరళావాళ్ళింటి ప్రక్కమేడ అద్దెకు తీసుకున్నారట. సాయంత్రం వోసారి వాళ్ళింటికి వెళ్ళివద్దామా ?'' అన్నాడు.

''అలాగా ! తప్పకుండా వెళ్ళి ఆవిడకి మన సానుభూతి తెలిపివద్దాం !'' సుబ్బారావు అన్నాడు.

మిత్రులిద్దరూ కలిసి సాయంకాలం విద్యానగర్‌లోవున్న కీ శే. 'శేషాచలం'గారి భార్య యింటికి బయలుదేరారు.

విద్యానగర్‌లో సిటీబస్సుదిగి శంకరం చెప్పిన గుర్తుల ప్రకారం నడవసాగారు.

''అప్పుడే మనవాళ్ళు 'శేషాచలాన్ని' మరచి పోతున్నారు. ఇన్ని రోజులు తమని ఆనంద రసాంబుధిలో వోలలాడించిన అద్భుత ప్రజ్ఞాశాలి జ్ఞాపకార్థం వో చక్కటి 'స్మృతి చిహ్నాన్ని' నెలకొల్పుదామన్న ఆలోచనేనా లేదు ఎవరికీ ! మళ్ళీ అతను బ్రతికున్నప్పుడు సన్మానాలు చెయ్యడానికి, సువర్ణఘంటా కంకణాలు బహూకరించడానికి, బిరుదులు ప్రదానం చెయ్యడానికి, అతన్ని చూడటానికి, అతని కంఠం వినడానికి, కొట్టుకు చచ్చేవారు !'' సుబ్బారావు బాధగా అన్నాడు.

''ఆఖరికి మన రాజధానీ నగరంలో ఒక రోడ్డుకైనా అతని పేరు పెట్టలేదు ! ప్రఖ్యాత హిందీ గాయని తండ్రి పేరు మాత్రం అర్జంటుగా వో రోడ్డుకు పెట్టిస్తానని అభయమిచ్చాడు వో మంత్రిగారు. పరాయి వాళ్ళంటే ఆంధ్రులకి ఎనలేని ప్రేమ !'' కోపంగా అన్నాడు శంకరం.

''మన సంగతిని చక్కగా కనిపెట్టాడు కనుకనే గురజాడ గిరీశం చేత 'మనవాళ్ళుట్టి వెధవాయలోయ్!' అని యెనభయ్యేళ్ళ క్రితమే అనిపించాడు !'' కసిగా అన్నాడు సుబ్బారావు

ఇంతట్లో కీ. శే. శేషాచలంగారి భార్య వుంటున్న మేడ వచ్చేసింది. గుమ్మం దగ్గరకు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు.

''ఎవరు కావాలి మీకు ?'' తలుపు తెరిచిన పని కుర్రాడు అడిగాడు.

''కీ. శే. శేషాచలంగారి భార్య వుంటున్నది యిక్కడే కదా?'' శంకరం అడిగాడు.

''ఏ శేషాచలం గారండీ ?'' పనికుర్రాడు మళ్ళీప్రశ్నించాడు.

''గాయకుడు శేషాచలంగారు !'' శంకరం జవాబిచ్చాడు.

''లోపల కనుక్కొనొస్తానండి !'' కుర్రాడు లోపలికెళ్ళాడు.

''నువ్వు సరిగ్గా కనుక్కున్నావా శంకరం ?'' సుబ్బారావు శంకరాన్ని ప్రశ్నించాడు అనుమానంగా.

''కనుక్కున్నానోయ్! ముందర చాలాసేపు ఆవిడ ఫలానా అని చెప్పలేదుట ! కాని చివరకి చెప్పిందట ! ఆ విషయం ఎవరి

తోటీ అనవద్దని కూడా చెప్పిందట! కాని నేను శేషాచలం వెర్రి అభిమానినని తెలిసిన మా చెల్లెలు నాకు చెప్పింది!'' శంకరం అన్నాడు.

''తను శేషాచలంగారి భార్యనని ఎవరితోటీ చెప్పవద్దందా? ఎందుకని?'' ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

''నాకూ అదే అర్థం కాలేదు!'' శంకరం జవాబిచ్చాడు.

''వారితో ఏం పనో కనుక్కోమన్నారండి!'' లోపలి నుంచి వచ్చిన పని కుర్రాగు అన్నాడు.

''వారిని చూసి మాట్లాడి వెళ్లటానికి వచ్చామని చెప్పు!'' శంకరం అసహనంగా జవాబిచ్చాడు.

పని కుర్రాడు లోపలికి వెళ్లి వెంటనే తిరిగి వచ్చి ''లోపలికి రండి! అమ్మగారు మిమ్మల్ని కాస్సేపు కూర్చోమన్నారు'' అంటూ వాళ్ళని డ్రాయింగు రూమ్‌లోకి తీసుకువెళ్ళి సోఫాల్లో కూర్చో బెట్టాడు. తను లోపలికి వెళ్ళాడు.

''ఆవిడకి మనని చూడటం యిష్టం లేనట్టుందే!'' సుబ్బారావు చిన్న గొంతుతో శంకరంతో అన్నాడు.

''ఎందుకో, ఏమిటో, నాకేం అర్థం కావటం లేదు!'' చిన్నగా జవాబిచ్చాడు శంకరం.

మిత్రులిద్దరూ డ్రాయింగు రూము తీరిగ్గా పరిశీలించ సాగారు. డ్రాయింగ్ రూమ్ నిండా కే. శే. శేషాచలంగారి ఫోటోలు రకరకాలవి వుండి వుంటాయన్న వాళ్ళ వూహ తప్పింది! ఎక్కడా వొక్క ఫోటో లేదు! దిక్కులు చూడసాగారు వాళ్ళు!

ఒక అరగంట గడిచాక కే. శే. శేషాచలంగారి భార్య లోపల నుండి వాళ్ళని చూడటానికి వచ్చింది.

ఆమె వయస్సు యాభై లోపే వుండచ్చు కాని అకాల వార్థక్యం మీద పడినట్టుగా, ఆమె యాభై యేళ్ళకే డెబ్బైయేళ్ళ స్త్రీలా వుంది! అంతవరకూ ఏడ్చి ఏడ్చి వున్నట్లు ఆమె కళ్ళు ఉబ్బివున్నాయి. తప్పక వారిని చూడటానికి వచ్చినట్టుందామె వాలకం.

''నమస్కారం! నాతో యేదో మాట్లాడాలని వచ్చారట'' ఆమె తలపైకెత్తి యెత్తనట్టుగా వాళ్ళని చూస్తూ ప్రశ్నించింది.

''నమస్కారమండీ! నేనూ, యియా శంకరం కే. శే. శేషాచలంగారి అభిమానులం! ఆయన మా అభిమాన గాయకులు! మీరు యీ వూరు వచ్చారని తెలిసి మిమ్మల్ని చూసి పోదామని వచ్చాం!'' సుబ్బారావు జవాబిచ్చాడు.

''నేను యిక్కడికి వచ్చానని మీకెవరు చెప్పారు?'' మళ్ళీ అడిగిందావిడ.

''మీ ప్రక్కింటిలో వుంటున్న సరళ మా చెల్లాయండి. శేషాచలంగారంటే నాకు వెర్రి అభిమానమని, మీరు చెప్పొద్దన్నా మీ విషయం నాకు చెప్పింది!'' శంకరం గబగబా చెప్పాడు

''ఎవరు సరళా!'' ఒక్క నిముషం ఆలోచించింది ఆవిడ.

''ఆ విషయం కూడా చెప్పిందా?'' తనలో తనే మెల్లిగా గొణుక్కున్నా అది మిత్రుల కిద్దరికీ వినిపించి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

''గోపీ!'' లోపలికి చూసి పిలిచిందావిడ.

''ఏమమ్మా'' గోపీ అనిపిలవబడ్డ యిందాకటి పనికుర్రాడు ఆవిడ దగ్గర కొచ్చి వినయంగా నిలబడి అడిగాడు.

''గోపీ! నా గదిలో టేబుల్ మీద పెద్ద అల్బము, టేపు రికార్డరు వుంటుంది పట్టా!'' అని చెప్పింది ఆవిడ.

''అలాగే నమ్మా'' అంటూ లోపలికి వెళ్ళిన గోపీ రెండు నిముషాల్లో పెద్ద ఆల్బము నొకదాన్నీ, టేప్ రికార్డరునూ తీసుకు వచ్చాడు.

''ఇందులో వారి ఫోటోలున్నాయి చూడండి!'' అని అల్బమును వారి చేతికిచ్చింది.

శంకరం, సుబ్బారావులు ఆతృతగా అల్బమును తిరగవెయ్య సాగారు. అందులో 'శేషాచలం' సినిమా రంగంలోని వివిధ వ్యక్తులతో పాటల రికార్డింగప్పుడు, శతదినోత్సవాలప్పుడు, సన్మానాల ప్పుడు తీయించుకున్న ఎన్నో ఫోటోలున్నాయి. వాటిని ఆనందంగా చూస్తూ వాటిల్లోని వ్యక్తుల్ని గుర్తు పట్టడానికి ప్రయత్నిస్తున్నారు, మిత్రులిద్దరూ.

కొంత సేపయ్యాక ''వారి పాటలు కొన్ని, రికార్డులుగా రానివి, వారు యింట్లో పాడి రికార్డు చేసినవి, ఈ టేప్‌రికార్డులో వున్నాయి. వింటారా?'' అడిగిందావిడ.

''తప్పకుండాను!'' మిత్రులిద్దరూ ఒకేసారి ఆనందంగా జవాబిచ్చారు. ఇంతవరకూ ఎవరూ వినని 'శేషాచలం'గారి పాటలు వినబోతున్నామంటే సంతోషంగా వుండదూ ఎవరికైనా?

టేప్‌రికార్డరు 'ఆన్' చేసిందావిడ.

అమరగాయకుడు 'శేషాచలం' కంఠం మృదువుగా, శ్రావ్యంగా గంగాఝురీ సదృశంగా పాటల్ని ఆలాపిస్తోంది. ఏ వాయిద్యాల సహకారం లేకుండానే ఎంతో మనోహరంగా వున్న ఆ గానామృతాన్ని ఆస్వాదిస్తున్న మిత్రులకు ఆమె ఎప్పుడు లోపలికి వెళ్ళిందో కూడా తెలియదు.

దాదాపు, గంటన్నర సాగిన ఆ గానం పూర్తికాగానే టేప్ రికార్డరు 'ఆటోమాటిక్'గా ఆగిపోయింది. మరో పదినిముషాలకు ఆ గానపు మత్తు నుండి బయటపడ్డారు మిత్రులిద్దరూ. అటూ యిటూ చూస్తే ఆవిడ కనబడలేదు!

మరి కొద్దిసేపటికి లోపలినుండి వచ్చిందావిడ !

"మీ ఆదరాభిమానాలకు ఎంతో కృతజ్ఞులమమ్మా ! మీ దయవల్ల కి. శే. శేషాచలం గారి అపూర్వ అమరగానాన్ని మరోసారి తనివితీరా వినగలిగాం ! నిత్యం వారి గానాన్ని వినగలిగే మీరెంతో అదృష్టవంతులు" శంకరం పొగిడాడు ఆవిణ్ణి.

"నాదా ? అదృష్టమా ?" విషాదంగా అందావిడ !

"అవునమ్మా ! నిత్యం వారి గానాన్ని ఏదో వైపునుండి వినగలిగే మీరు నిశ్చయంగా అదృష్టవంతులే ! అది అందరికీ లభించని వరం !" మెరిసే కళ్ళతో అన్నాడు సుబ్బారావు.

అంతవరకు బలవంతాన అదిమిపెట్టుకున్న ఆవిడ దుఃఖం కట్టలు తెంచుకుని బయటకురికింది. కనురెప్పల చాటున దాగున్న కన్నీరు ధారగా కారసాగింది చెంపలమీంచి !

"నేను అదృష్టవంతురాల్ని కాదు బాబూ ! శాపగ్రస్తను!" భోరున ఏడుస్తూ అందావిడ !

శంకరం సుబ్బారావులు నిశ్చేష్టులయ్యారు !

కొంతసేపు ఏడ్చాక, దుఃఖతీవ్రత తగ్గాక, కన్నీళ్ళు వొత్తుకుంటూ "ఈవిడ యిలా అంటుందేమిటా ?" అనుకుంటున్నారు కదూ ? మీరంతా 'వరం' అనుకునేదే నాపాలిట 'శాపం' అయింది. ముప్ఫై సంవత్సరాలపాటు ఆయనే నేనుగా, నేనే ఆయనగా కలిసి బ్రతికాం. వారి హఠాన్మరణంవల్ల నా గుండెకయిన లోతు గాయం వారి కంఠస్వరం విన్నప్పుడల్లా సెలవేసి బాధిస్తూ వుంటుంది. వారితో గడపిన మధురక్షణాలను గుర్తుకుతెచ్చి, 'ఆయనింక లేరు, నేనింక యేకాకిని', అన్న కటిక నిజాన్ని నాకు మళ్ళీ మళ్ళీ గుర్తుచేస్తూ వుంటుంది. ఆయన జ్ఞాపకాలనుండి తప్పుకోవడానికే మద్రాసునుంచి మకాం మార్చి యిక్కడ అజ్ఞాతంగా బ్రతుకుతున్నాను ! అయినా మీలాంటి, వారి అభిమానులు, ఎలాగో తెలుసుకుని యిక్కడకు వస్తూనే వున్నారు. వారిని నిరాశపరచడంయిష్టంలేక వారిపాటల్ని వినిపిస్తూ వుంటాను. ఆ పాటలు విన్నప్పుడల్లా నా గుండె గాయంనుండి రక్తం మళ్ళీ స్రవిస్తుంది ! మనిషి బాధలకు మందైన మరుపన్నదే నాకు కరువయింది బాబూ! వారి అమర గానం నన్ను నిత్యం యేదో ఒక మూలనుంచి అలుముకుని నా గుండెల్ని పిండి నన్ను చిత్రవధ చేస్తోంది ! వారు అమరులే కాని నేను శాపగ్రస్తను బాబూ ! శాపగ్రస్తను !"

ఆవేశంతో అనేసి ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది !

మిత్రులిద్దరూ మెల్లిగా బయటకు నడిచారు !

గ్రీష్మోద్ధతి

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

ఉత్సాహము

నవవధూ లలాట భాగన్యైగనిగ్యకుంకుమ
చ్ఛవుల మెఱపి విమల రక్తచందన ప్రభాసము
ద్భవ కషాయ కాంతిజిమ్మి – తరణి – యుభయ సంధ్యలన్
సువిహితా తపముల నొప్పఁజూపె నాత్మతేజముల్ !!

గ్రీష్మతప్తమైన యెన్ని గిరులదరుల నొఱసెనో ?
యూష్మతాగుణ ప్రధానమొందినట్టి గాడ్పు, త
గ్రీష్మ విభుని యానతిం ధరించి జీవలోకమున్
భీష్మ విషమ గతులఁబఱువు పెట్టికొట్టె నిర్దయన్ !!

త్రిపుర హరల వాటికాక్షి తీవ్రమై – భయమ్మునై –
కుపిత పరశురామమూర్తి కోపమై – విపాకమై –
విపుల గాధిసూను రోషవీధియై – ప్రమాదమై –
ఎపుడు వచ్చెనో ? నిదాఘమిటులఁజూపె క్రౌర్యమున్ !!

భూమి కాగి కాగి సెగలు పొగలు వెలువరించెనో
యేమొ ? యన దిగంతములన హీనమై మరీచికా
స్తోమముల్ సెలంగె — కనులఁజూడరా నసహ్యమై
భీమమయ్యె గ్రీష్మపథము భీషణాతపమ్ములన్ !!

విధృత సకల సౌఖ్యరాశి — విస్తృత ప్రతాప సూ
ర్య ధృత కఠిన శౌర్యరేఖ — నైక బాధ్యమానసం
మధిత పక్షిలోక — మతి విమర్దనాతప ప్రభా
వధి — విధూత పాంథసౌఖ్య పదము — గ్రీష్మమెన్నగన్ !!

శ్రీ ముదిగొండ వీరభద్రయ్య

అభ్యుదయ కావ్యం - 'గొర్రిల్లా'

ఆధునిక తెలుగు కవిత్వం అనుభూతి వాద కవిత్వం గానూ, అభ్యుదయ కవిత్వంగానూ రూపు కట్టుకొన్నది. అభ్యుదయ కవిత్వం శ్రీశ్రీతో ప్రారంభం అయింది. కుందుర్తి, సోమసుందర్, ఆరుద్ర, బాలగంగాధరతిలక్, వరవరరావు, శివారెడ్డి, దిగంబరులు — ప్రస్తుతం గుంటూరు శేషేంద్ర శర్మలు అభ్యుదయ కవిత్వానికి బలాన్నిస్తున్నారు. భావకవిత్వం పేరుతో కృష్ణ శాస్త్ర్యాదులు ఊపిరి పోసిన కవితాశాఖ అనుభూతి వాద కవిత్వంగా నేడు శ్రీకాంతశర్మ, సుప్రసన్న, లేగుంట, ఇస్మాయిల్ మొదలైన వాళ్ళ ద్వారా రూపాంతరం పొందినట్లుగా కనిపిస్తుంది. దాశరథి— నారాయణరెడ్డులు ఉభయ విధాలైన కవిత్వాలనీ రాస్తున్నారు. పోతే శ్రీశ్రీతో మొదలైన అభ్యుదయ కవిత్వం ఒక స్పష్టమైన, గుణాత్మక పరిణామాన్ని పొందినట్లుగా శేషేంద్ర 'గొర్రిల్లా' కావ్యం చదివేక అర్థం అవుతుంది.

తెలుగు కవులు రాసే కవిత్వాలకూ, వారి జీవన విధానాలకు సైద్ధాంతిక సమన్వయం కనిపించక పోవడంతో కొందరు విమర్శకులు కవుల్ని - వారి గ్రంథాల విషయం మరిచి — వైయక్తికంగా తిట్టి పోయడం జరుగులోంది. విప్లవ కవులై పెట్టుబడిదారీ పారిశ్రామిక వేత్తల పారితోషికాల్ని తీసికొన్నా, ప్రజా ప్రభువుల ఆస్థానాల్లో కోటి సత్కారాల్ని అసంస్కారంతో నిందించినా వారి కవిత్వ స్థాయికి తగ్గిపోయేదేమీ లేదు. వాళ్ల కవిత్వాల్ని విమర్శించే టప్పుడు వారి జీవితంలోని పనికిరాని అసంస్కార ఘట్టాలను పూర్వరంగంగా ఉంచుకోవడం విమర్శకుల పరిధిలోని విషయం కాదు — (ఆ ఘట్టాలు వాళ్ళ కావ్యంలో ప్రవేశిస్తే తప్ప!) శేషేంద్ర కవిత్వంపై నిష్పాక్షిక విమర్శలు సరియైన పరిమాణంలో రాలేదు. ఆయన కవిత్వంలో గుణమూ వున్నది — దుర్గుణమూ వున్నది. గుణాంశం చాలాఎక్కువగా ఉన్న ఆయనకావ్యం గొర్రిల్లా — ఆ అంశ అంత ఎక్కువగా లేని కావ్యం 'నా దేశం - నా ప్రజలు' కాని ఈ రెండూ తెలుగు అభ్యుదయ కవిత్వానికి వన్నె తెచ్చిన కావ్యాలు. ప్రతీకలు (Symbols) మరీ ఎక్కువయి 'నా దేశం — నా ప్రజలు' కావ్యం శేషేంద్రను 'ఆధునిక పండిత కవిగా' మాత్రమే నిల్పుతాయి. కాని గొర్రిల్లా మాత్రం ఏ విషయమైనా సముపాళంలో వుంచబడ్డ మహా కావ్యం (ఒక్క కవిత్వమే దాన్లో సముపాళంలో లేనిది !)

అందుకని 'గొర్రిల్లా' కావ్యాన్ని ఇక్కడ పరామర్శించడం జరుగులోంది. 'ప్రభాతం పసిదిగా ఉన్నప్పటి' సనాతనుడు గొర్రిల్లా. ఆంత్రోపాయిడ్ ఏప్ నుంచే కదా మానవ పరిణామం జరిగిందని సిద్ధాంతం. ఈ పరిణామ క్రమం తిరోగమించకూడదు. అన్యాయం అధర్మం ఈ గొర్రిల్లా వంశంలోకి వచ్చినప్పుడు తిరిగి అతడు తన పూర్వ పూర్వ దశలకు తిరోగమిస్తాడు. గొర్రిల్లాలో ఆవిర్భవించిన మహా శక్తి మనదాకా ఇట్లా రూపొందింది. దీని తిరోగమనాన్ని అడ్డుకొని ఈ పరిణామాన్ని గుణాత్మకం ముందుకు సాగింపజేయడమే అభ్యుదయ కవిత్వ ప్రధాన ప్రయోజనం. ఇవి దృష్టిలో పెట్టుకొనే శేషేంద్ర తన కావ్యానికి మానవ జాతి ఆదిమ దశను సూచించే 'గొర్రిల్లా' అని పేరు పెట్టినట్లనిపిస్తుంది. గొర్రిల్లాను 'వన మహాపూర్వుడి'గా మాత్రమే సూచించాడు తప్ప మనం 'ఇనుప కండరాల శకంలోకి' వెళ్ళ వద్దనే కవి ఆకాంక్ష. అంటే ఈ పేరుతో కవి సాధించిన ప్రయోజనాలు రెండు. ఒకటి — మనం మొదలైన దశను (మనం అక్కడి నుంచి ప్రగతి పథంలో పయనించామనడానికి) జ్ఞప్తి చేయడం. రెండు — మనం మళ్ళీ అక్కడికి తిరోగమించకూడదని హెచ్చరించడం. గొర్రిల్లా నుంచి ప్రభవించిన మానవుడు నిశ్చింతమ్యేడై నిద్ర పోతే ఈ రెండోదే జరుగుతుంది. అభ్యుదయ కవిత్వం ఈ నేరం చేయకూడదంటూ శేషేంద్ర

> "ఈ యుగంలో నీ జాగృతి కోసం రాయని పాట ఒక ఘోర ఘోరం. నీ సుషుప్తి కోసం రాసే జోల పాట ఒక మహానేరం. ఓ క్రియాశక్తీ నీ వంటేనే నాకు భక్తి."
> (గొర్రిల్లా. పుట. 94)

రాస్తాడు. మనదేశంలో అధిక సంఖ్యాకులు వ్యవసాయాన్ని నమ్ముకొని బ్రతుకుతున్నారు. దాన్తో వ్యవసాయ కూలీల సంఖ్య కూడ ఎక్కువయింది. శ్రీశ్రీ కవిత్వంలో కార్మికులూ, లింపన్ ప్రోలెటేరియన్‌లు — కార్మికులుగా మారడానికి విఫల ప్రయత్నం చేసిన కర్షకులూ కనిపిస్తారు. శేషేంద్ర గొర్రిల్లాలో వ్యవసాయ కూలీల పైననే ప్రధానంగా కవిత్వం రాశాడు. ఇవేళ మానవ సంఘం మన దేశంలో చేరిన చారిత్రక దశ చాలా దుర్భరమైందని దిగంబరుల వలెనే ఈయనా గుర్తించాడు. 'చావు నెదుర్కోవడం కంటే బ్రతుకు నెదుర్కోవడం పెద్ద సమస్య అయింది ... నా దేశంలో శవం చెపుతుంది "బ్రతికున్న వాడికంటే ఇంకా బాగా, బ్రతుకంటే ఏమిటో " (అ. 14) అని ఈనాటి దుర్భర పరిస్థితిని చెప్తాడు. అందుకే ఆయన "వ్యవసాయ కూలీల ఆకాశం వర్షాలే కురుస్తుంది గానీ వసంతాలు కురవదు." (పు. 4) అని అంటాడు. శ్రామికులకవసరమయిన వేవో అని ఇవ్వాలి తప్ప వాళ్ళని కేవలం ఊహాస్వర్గాల్లో, అందని ఆశల్లో ఉంచుతూ భ్రమ గొల్పడం

న్యాయం కాదని కవి సూచిస్తున్నాడిట్లా, అందువల్ల చైతన్య వంతులు — మేధావులు కూలీలు దోపిడీ చేయబడడాన్ని సహించ గూడదు. దాన్ని వాళ్ల నిర్ద్వంద్వంగా ఖండిస్తూ శ్రామికుల్లో ఆశాకిరణాల్నీ, ప్రోత్సాహాన్నీ ఉదయింప జేయాలి. వాళ్ళని ఉద్య మింప జేసే చైతన్యాన్ని సాంస్కృతిక రంగంలోని వాళ్లు కలిగించాలి. శ్రామిక జన పక్షపాతి అయిన కవి దోపిడీని కొనసాగనీయ వద్దు. అందుకే శేషేంద్ర

> "నీ గొంతు ఉరిమితే వాడి గుండెల్లో గ్లాసులూ తలుపులూ గలగల కొట్టుకోవాలి; ...
> కాళ్ళనిండా గొలుసులు నిండినా గగనంనిండా జెండాలు నిండాయి." (పు. 16)

అని అంటాడు. సంఘంయొక్క మూలమైన ఆర్థిక వ్యవస్థ మారనప్పుడు పీడక సమాజపు ఉపరి నిర్మాణాలు రవు. శేషేంద్ర ఇవేళ్టి ఆర్థికవ్యవస్థ మారి కొత్త సమాజం వచ్చి తీరుతుందనీ, ఇవాళ్టి వ్యవస్థ గతించిపోయే ఆరోజు వస్తుందనీ ఆశిస్తూ

> "బాబూ, నదిలో ఇవేళ మనమంతా మునిగిపోతే పోవచ్చు కానీ రేపు నదే సముద్రంలో మునిగిపోయే రోజు కూడా రాక పోదు."–(పు. 26)

రాస్తాడు. పీడనలేని సద్వ్యవస్థను నిర్మించుకోవాల్సింది ఎవడు పీడింపబడ్డాడో వాడే. కాని ఇవేళ్టి దుస్థితి పీడితుడు అలాంటి సద్వ్యవస్థను నిర్మించుకోగల్గే ఉత్సాహశక్తిని పొందేటట్లుగా లేదు. కొంచెమైనా చైతన్యం వున్నట్టి ప్రజాపాతకులలో కొంచెమైనా ఈ వ్యవస్థపై వ్యామోహం వదలిపోయి—వాళ్లిది కుళ్ళిన వ్యవస్థ అని గ్రహించేటట్లు చేస్తుంది గొర్రిల్లా కావ్యం. ప్రజలలోని నీరస స్థితి పోవడానికి సాంస్కృతిక రంగంలోని కార్యకర్త తన కళాశక్తి ద్వారా ప్రజల్ని ప్రబోధిస్తాడు. ఈ కవి కూడా

> "తమ్ముడా ని గాయాల దైన్యాన్ని చూడలేకున్నాను. కాని నీ ఆత్మ తిరగబడదేం అదే నా బాధ. లోకం గొర్రిల్లా దశలోకి దొర్లిపోతోంది మన మహాపూర్వుడి ఇనప కండరాల శకంలోకి—ఇంకా పాత పేజీల్లోనే పచార్లు చేస్తూ ఉండి పోకు." (పు. 30)

అని రాస్తాడు. ఇవాళ్టి దళితుడూ, పీడితుడూ ఉన్నట్టి నిరుత్సాహ స్థితి చూస్తే ఈ అణుయుగంనుంచి మానవుడు తిరోగమించేటట్లే అగుపిస్తోంది. అలా కాకుండా ఉండాలంటే అతడు దీని తర్వాతి దశను తెలిసికొని దానికోసం ఉద్యమించక తప్పదు ఈ అణుయుగమైనా అందరికీ అందుబాటులోకి తెచ్చాకోవడానికి అతడు ఉద్యమించక తప్పదు. గాయం రగిలేకకూడా, ఆ గాయం చేసినవాడిమీద కోపం రాకపోవడం సహనశక్తికి — సాత్త్వక శక్తికి లక్షణంకాదు. అది చైతన్య వికాసం, ఆగిపోయి 'జడ' గుణానికి తిరోగమించడమే అవుతుంది. ఐతే ప్రజలు అలసిపోయి ఈ స్థితికి వచ్చారేమో. దీన్ని సూచిస్తూ

> "నీకు దాహం వేస్తోందా చెప్పు ఒక సముద్రమే నీ ముందు పెడతా. కాని నీకు దాహం లేదే నీకు తృష్ణ లేదే దేని కోసమూ ! అదే నా నిరాశ అదే నా సర్వస్వప్నాల సమాధి." (పు. 30)

అని ప్రజల నిరుత్సాహ దశను కవి చిత్రిస్తాడు. కాని చైతన్యవంతుడైన కవి ప్రజలకు సాంస్కృతిక రంగంనుంచి నాయకత్వం వహిస్తాడు. దాన్ని తెలుసుకొన్నవాడు కాబట్టి ఈ కవి

> "నా దేశపు గతి చూస్తే నా బలిష్ఠ హస్తం అందిమ్మని అడుగుతున్న దిక్కులేని పక్షుల మిలియన్లు ప్రత్యక్ష మౌతాయి." (పు. 30)

అని అంటాడు.

ఇట్లా శేషేంద్ర ప్రజలకు ఉద్యమ చైతన్యాన్ని, సాంస్కృతికంగా నాయకత్వాన్ని తన కవిత్వంద్వారా ఇస్తాడు. దుఃఖాలబారి నుండి తప్పించుకోవడానికి (మానసికంగా మాత్రమే) మనదేశంలోని తత్వశాస్త్రం తర్ఫీదునిచ్చింది ! సహనం, శాంతి, అహింసలను ఇందుకు సాధనాలుగా వాడడం జరిగింది. మంది కష్టంమీద బ్రతికే దోపిడీకారుడు తన సుఖాలనుంచి అంత తేలికగా తొలగడు· వాటిని త్యాగం చేయడు. పోనీ ఇటు పీడితుడైనా తన నిరాశా నిస్పృహల నుంచి తమోగుణంనుంచి బైటకువచ్చి ఉద్యమించగల్గుతున్నాడా ? అదీ జరగడంలేదు వాళ్లట్లా ఉద్యమించక ఒక పగటికల కనినంత మాత్రాన ఈ దుస్థితేమో తొలగిపోయేది కాదు. అందుకే

> "ఇంత భయంకర గ్రీష్మాన్ని ఒక చిన్న విసనకర్రతో విసిరి పారేద్దామనుకొన్నావేమే ... ఎన్ని మైళ్లు అని కాదు ఎన్ని శవాలు ముందుకుపోయిందో మన ఉద్యమం కొలుచుకో." (పు. 32)

అని అంటాడు కవి ఉద్యమించడానికెంత త్యాగదీక్ష అవసరమో కవి ఈ మాటలద్వారా తెలుపుతున్నాడు· నెత్తురు మండే, శక్తులు నిండే ప్రజల్ని కవి ఇట్లా సిద్ధం చేస్తున్నాడు. పెట్టుబడిదారీ సమాజం ఒక భయంకర గ్రీష్మంలాంటిది. దానిబాధ కేవలం ఒక చిన్న విసనకర్రతో తొలగించలేము. దాన్ని తీరికగా, నెమ్మదిగా తొలగించడమూ సాధ్యంకాదు. పరిణామక్రమంలో సమన్వయాలు ప్రజలకు లాభాన్నే కల్గిస్తాయో, నష్టాన్నే కలిగిస్తాయో చెప్పలేము. అందుకని ఒక గుణాత్మక (leap) పరిణామాన్ని మానవుడు తన ఇచ్ఛాశక్తితో కార్యాచరణతో సాధించుకోవాలి. క్రమపరిణామం కాలయాపన చేస్తుంది. అందుకే కవి — నెమ్మది నెమ్మదిగా సాధించుకొందాం; ఇప్పటికే గొర్రిల్లానాటి ఆదిమ మానవ సమాజంనుంచి ఎంతో ప్రగతిని సాధించుకొన్నాం — అనే బద్ధక మనస్తత్వంవల్ల లాభంలేదని దాన్ని నిరుత్సాహ పర్చడానికి ఎన్ని మైళ్లు ముందుకు వెళ్లామోచూసుకోవద్దంటాడు కవి. ఇప్పుడున్న దుష్ట ఆర్థిక వ్యవస్థను, హఠాత్తుగా విప్లవించి బలవంతంగా మార్చేయాలి. దాని కోసం త్యాగం అవసరం అంటాడు శేషేంద్ర. ఈ విప్లవ జ్వాలల్ని నిద్రిస్తున్న గుండెల్లో కల్గించడంకోసం శేషేంద్ర కవిత్వకృషి చేశాడు. ఈ ఉద్దేశ్యంతోనే ఆయన

> ''వస్తున్నాను నీ గొమ్మంతొక్కి నీ ప్రాణం చందా అడగ డానికి. మన దేశపు వీధుల్లో రాబోయే రక్తప్రవాహాల మహోత్సవాలకోసం—ఈ దేశం బిరుసుగా ఒరుసుకుంటున్న నీ బాహువుగ్నించి తప్పించుకోలేదు '' (పు 36)

అని అంటాడు అయితే కేవలం బైటి వ్యక్తిగా సమాజానికి బోధిం చడం మాత్రమే కాక తానూ వారిలో ఒకడయి తన చైతన్య స్థాయికి వాళ్లను ఎదిగించాలనే వుద్దేశ్యంతో

> ''ఇటురా నావైపుకు నీ గుండెలో రక్తం నా గుండెలోరక్తం కలబోసుకుందాం· ఇద్దరమూ ఒకే తుఫాను పంచుకొందాం. జీవన మైదానాల్లో ఏకాకి అశ్రువునై నీ అడుగుల కోసం అన్వేషిస్తున్నాను.'' (పు. 38)

లని అంటాడు. శ్రీశ్రీ నుంచి శేషేంద్ర వరకు ప్రజలలో ఈ ఉద్యమ చైతన్యం కల్గడం కోసం అభ్యుదయ కవులు నిరంతరం కవితా కృషి చేశారు — చేస్తున్నారు. 1933లో ''నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను'' అని శ్రీశ్రీ అంటే 1977లో శేషేంద్ర ''ఆశయాలకు ఆహుతి కావడంలోనే జీవన రుచి ఆస్వాదిస్తాను.''అని అంటాడు. చైతన్యం లుప్తం కాకుండా ఉండడంకోసం శేషేంద్ర ప్రజలు—శ్రామికులు పీడకుల ఔదార్యాన్ని కోరవద్దని ప్రబోధిస్తాడు ప్రజలు తను శ్రమదోపిడీ చేయబడ కుండా తమని కాపాడుకోవాలి తప్ప పీడకవర్గ దయాదాక్షిణ్యాలమీద బ్రతకడం సమంజసం కాదనే విషయాన్ని సుస్పష్టం చేస్తూ శేషేంద్ర

> ''ఒక దుర్మార్గ వర్గపు శిరస్సుమీద ఒక ఔదార్య దయా త్యాగాలతో అల్లిన కాంతి మండలాన్ని కిరీటంగా నా చేతు లతో అలంకరించలేను. వాళ్ల దాన ధర్మాలు భుజించే నికృష్టజీవిగా రూపెత్తలేను. నా హక్కుకున్న కండ బలంతో నా స్థానం గడించుకొంటాను చరిత్రలో లేదా నా రక్తధారల్ని ఈ భూమండలం మీద అంతరాత్మల్ని బాధిస్తూ ప్రవహించమని చెప్పి వెళ్ళిపోతా'' (పు 40)

అని రాస్తాడు. ''ఇంకానా ఇకపై సాగవు''అని పీడక వర్గ దోపిడీని అరికట్టగల్గే ఏ చైతన్యాన్ని శ్రీశ్రీ కార్మిక వర్గానికిచ్చాడో అదే చైతన్యాన్ని ఇక్కడ—గొ్రిల్లాలో — శేషేంద్ర కర్షకులకిస్తు న్నాడు· బ్రిటిష్ వాడి కాలంలో కార్మిక వర్గం నుంచి కార్మికేతర వర్గానికి రక్షణ కల్గించడంకోసం కార్మిక చట్టాలు చేయబడ్డాయి కాని తక్కిన సమాజంనుంచి కార్మికులకు రక్షణ కల్గించడంకోసం కాదు. కాని కవులు ప్రభుత్వాలు చేసే ఈ పనిని తల్లకిందులు చేయగల్గినప్పుడు వారి కవిత్వం నిజమైన ప్రయోజనాన్ని సాధించ గల్గుతుంది. ఈ దృష్టితోనే శేషేంద్ర

> ''నా కవిత్వం కేవలం మనిషికి డిఫెన్స్''

అని అంటాడు. శ్రామికుల కోసం కేవలం కన్నీరు కారుస్తే లాభంలేదు. వారికి పూర్ణసుఖాన్ని కల్గించే ఆర్థిక, రాజకీయ వ్యవస్థా నిర్మాణానికి కళారంగంలోని వాళ్లు ముందుండాలి, శేషేంద్ర కవిత్వం ఆ పనినే చేసింది ''సమానత్వం'' ఇ తవరకు రాజకీయవాదుల మాటల్లో మాత్రమే [illegible] ఉండడం — ఆచరణలో అది భ్రష్టు పట్టించబడడం చూసి శేషేంద్ర

> ''నా తలుపు కొడుతోంది నా దేశపు భవిష్యత్తు...సమాన త్వం ఒక పౌరాణిక స్వప్నంగా మార్చి వేశారు. కవులకూ శబ్దాలకూ చెద పట్టింది ఈ దేశంలో''

అని అంటాడు. ప్రజల కళ్లల్లో కారం కొట్టబడింది. ఈ వాస్త వాన్ని కవి ప్రజలకు తెల్పడం తన బాధ్యతగా భావిస్తున్నాడు. తన చైతన్యం వాళ్లని జోకొట్టేది కాదు. శేషేంద్ర దృష్టిలో కూడా కవిత్వం ''కదిలేదీ — కదిలించేదీ — పెనునిద్దుర వదిలించేదే.'' అందుకే ఆయన

> ''నా మాటలు ఈ దేశపు మట్టిలో చల్లుతున్నా అన్ని చోట్లా కత్తులు మొలవాలని; నేను జ్వాలల్ని కొరడాలుగా ఝుళిపిస్తున్న అగ్నిని.'' (పు. 48).

అని రాశాడు. వాస్తవ జగత్తులో నిండిపోయిన అధర్మం, అన్యా యాల ఫలితంగా వ్యాపించిన దారిద్ర్యాన్నీ దౌర్భాగ్యాన్నీ చూసి సహించలేక రాసిన మాటలివి. ఈ ధనిక స్వామ్య పీడక వ్యవస్థలో ఎలాంటి విషయాల్ని శేషేంద్ర దర్శించాడో తెలపడానికి ఈ కింది వాక్యాల్ని గమనించండి

> ''...ఆకలితో నిద్రిస్తున్న ఆ పనివాడి గొంతులో నగరాల గర్వోన్నత భవనాలు నికటాట్టహాసం చేస్తున్నాయి. వాడి ఏడ్పుతో ఒక నాగరకత సిగ్గుతో తలవంచింది. పిడికిళ్లతో స్వర్గాలు పట్టుకొచ్చిన ఆ నిష్కపట శిశువు అశ్రువై నిద్ర పోతున్నాడు.'' (పు. 50)

ఇలాంటి హృదయ విదారక దృశ్యాల ఫలితమే శేషేంద్ర 'గొ్రిల్లా' ఈ నాగరకతకు ఇంకా సిగ్గున్నదంటున్నాడు కాబట్టే దాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాడు కవి ఆకలిని, దారిద్ర్యాన్ని, శ్రమ దోపిడిని అరికట్టి తీరాలని కవి సమాజానికి బోధిస్తున్నాడు ఐతే దీనికి జాతీయతను నిరసిస్తూ ఈ దేశ చరిత్రలో ఏముంది ? అని అన కుండా శేషేంద్ర

> ''ఒకనాడు కాలమేఘంలా గర్జించిన ఈ దేశం ఈనాడు మ్యావ్ మంటోంది ఇదేమిటి ? దుర్మార్గుల గొంతుల్ని పిడికిళ్లల్లో ఇరికించుకొన్న ఈ దేశం తన కాళ్లను గొలుసుల్లో ఇరికించుకొంటోంది.'' [పు 54]

అని అంటాడు· శేషేంద్ర జాతీయతను తిరస్కరించని అంత ర్జాతీయ సాంఘిక దృక్పథాన్ని తన కవిత్వంలో ప్రబోధించిన కవి. మన జాతి ప్రధానంగా వ్యావసాయిక జీవనం కలది కాబట్టి రైతు కూలీలు ఆయన రాసిన ఈ కావ్యంలో ఎక్కువగా నిండివున్నారు. తన కాలం నాటి రాజకీయ కలుష వాతావరణంలో రైతు ఇమిడి పోయి తనకి తాను నష్టం కలిగించుకుంటాడేమో — అమాయ కంగా—అనే బాధతో శేషేంద్ర

"రైతుల్లారా ! రాజకీయవర్షం పడుతోంది. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి." [పు. 56]

అని అంటాడు. పాలకవర్గపు పొట్టకూటి దోపిడీ రాజకీయాల్లో కాక ఈ సమాజ స్వరూపాన్ని మొత్తమూ మార్చివేసే విప్లవంలో పాల్గొనాలని శేషేంద్ర ఉద్దేశ్యం. ప్రపంచం మొత్తంలో అట్లాంటి విప్లవం 'తిరుగుతూ' వున్నది. అది మనదేశానికీ వస్తున్నది—అనే భావాన్ని తెల్పుతూ

"ప్రపంచ భూములు తొక్కుతూ తిరుగాడే దేశద్రిమ్మరి విప్లవం మన వీధిక్కూడా వస్తుంది. పసిపిల్లలు నిద్రలో కూడా బాంబుల కోసం కలలు కంటున్నారు. వేదాంతం వైపు పిలుస్తుంటే విప్లవం వైపు పరుగెత్తుతున్నారు ... మామిడి కొమ్మల మీద కూర్చునే కోకిలలు మరతుపాకుల మీద కూర్చుని పాడుతున్నాయి." [పు. 56]

అని అంటాడు కవి. అంతర్జాతీయమైన శ్రామికవర్గ పోరాటాన్నీ, విప్లవాన్నీ కవి ఇలా ఆహ్వానిస్తున్నాడు. కవి విప్లవం ద్వారా మూలమట్టంగా ఈ సమాజాన్ని మార్చివేయడానికి సిద్ధపడుతున్నాడు. జాతీయతా, సంస్కృతి—అనే రెండు భూమికలపై తన కాళ్లను స్థిరంగా నిల్పినవాడే అయినప్పటికీ శేషేంద్ర భాషా ప్రాంతీయ జాతీయ సంకుచితత్వాలకు పరిమితమయి పోయినవాడు కాదు. అందుకే ఆయన ఈ విప్లవం ప్రపంచం మొత్తాన్ని మారుస్తుందని, కొత్త ప్రపంచం ఆవిర్భవిస్తుందనీ తెలుపుతూ

"మనం మవునంగా పిడికిళ్లు బిగించి నిరీక్షించే ప్రభాత దేవత అందరి గుండెల్లోనూ అగ్ని ప్రపంచాలు మేల్కొల్పుతోంది. ఖండ ఖండాతరాల్లో పల్లెల్లో పట్నాల్లో దాని వెలుగు నిగ్గు పరుచుకుంటోంది. దానిమీద భాషలు విసిరేసి ఆర్పలేరు. దేశాలు కప్పి చల్లార్చలేరు. కులాలు జాతులు ప్రయోగించి కూల్చలేరు." [పు. 56]

ఏ రకపు సంకుచిత దృష్టినీ ప్రేరేపించి రానున్న విప్లవాన్ని రాకుండా చేయలేరని, ప్రపంచ వ్యాప్తంగా 'అగ్ని ప్రపంచాలు' ఆవిర్భవించనున్నాయనీ శేషేంద్ర చెప్తున్నాడు. ఇట్లా ఈ కావ్యం విప్లవ కవిత్వంతో నిండిపోయి వున్నది.

ఇవేళ్టి మన భారతదేశంలో కల్గిన కల్గుతూన్న దారిద్ర్యాలూ కరువులూ కృత్రిమంగా పీడకవర్గం చేత - దోపిడీకారుల చేత కల్పించబడినవి. దీన్ని తెల్పుతూ

"ఏళ్లు కుందేళ్లలా రాళ్లలో ప్రవహించే చోట ఎడ్లుతెడ్లు లేని కెరటాల్లో ఉరకలు వేసేచోట కరువేమిటి వీళ్లు కల్పించే బరువే గానీ !" [పు. 78]

అని రాస్తాడు కవి. అందుకే శేషేంద్ర సంపూర్ణ విప్లవానికై ప్రజలను ఆయత్తం చేస్తాడు.

"నా దేశమా ! ఈ సముద్రం ఒక నిద్రించే సింహం. అది మేల్కొంటే అరఘడియలో అంతా సఫా" [పు. 78]

అని ప్రజలే విప్లవిస్తే వాళ్ల శక్తి ఎంత గొప్పదో తెలుపుతాడు కవి. నిస్పృహ, నిరాశలలో చైతన్యం కోల్పోయిన ప్రజలకు వాళ్ల శక్తిని వాళ్లకు ఇట్లా తెలియబరుస్తున్నాడన్నమాట-కవి. కాని ఇవేళ్టి మన దేశంలోని శ్రామికవర్గం తమ శక్తిని తాము తెలిసికొనలేరు. అందుకే ఇంకా వివరంగా కవి

"ఆకలికి అడ్డొచ్చిన వాళ్లని ఆహుతి చెయ్. వంకాయల్లా నీ కాళ్లు కదలాలే గానీ సంకెళ్లు తెగడానికి సిద్ధంగా ఉన్నాయ్. నీవు నిలబడాలే గానీ నీ జైలు గోడలు కూలిపోవడానికి రెడీగా ఉన్నాయ్. స్వాతంత్ర్యం నీ కోసం స్వాగతం చెబుతోంది విస్తారిత బాహువుల్తో" [పు. 82]

అని రాస్తాడు. అయితే ప్రజలలోని విప్లవ చైతన్యాన్ని పైకి లేవనీయకుండా— మన సంస్కృతి, మన నాగరకత, ధర్మం, దేవుడు, అహింస, ప్రేమ అనే మాటల్నీ, తత్వాల్నీ వాటి అసలర్థాల్నీ కప్పిపుచ్చి చెప్పేటందుకు పీడక వర్గం వెనుదీయదు. ఉద్యమించే శక్తిలేని శ్రామికవర్గం దానికి అమాయకంగా మోసపోవడమూ జరుగక పోదు. దేశ స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్యం నీ కోసం సిద్ధంగా వున్నదని శేషేంద్ర చెప్పడం ఇప్పుడున్న స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదని చెప్పడానికే. ఈ స్వాతంత్ర్యాన్ని కూడా పీడకులు దోచుకున్నారు. తక్కిన శ్రామిక వర్గం అంతా సంఘంలో పీడకులు సృష్టించిన ఆర్థిక పరిస్థితులకు బందీలయ్యారు. ఇప్పుడు పునఃపీడితులు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలి. ఒక్కొక్క జాతిలో వుండే ఒక్కొక్క ఆలోచనా విధానం భౌతిక పరిస్థితులకు అతీతంగా కొంత కాలం ప్రజల మనస్సుల్నీ, ఆలోచనా ధోరణుల్నీ కబళించి వేస్తుంది. అయితే అవసరాలకు పనికిరాని ఈ ఆలోచనా విధానాన్ని సంస్కృతి పేరు మీద, నాగరికత పేరుమీద పీడక వర్గం వాడుకొని, తమ పీడనకు పనికివచ్చే నినాదంగా చేసికోవడాన్ని అరికట్టాలి. ఈ కవి సృష్టించిన గొరిల్లా ఈ పనినే చేసింది.

"మనిషి చేత్తో సృష్టించిన నాగరకతకు గుళ్లో దేవుడు కర్తా ? నాగరకత అనే ఈ మానవ ద్రోహానికి బాధ్యత ఎవరిది ? అధర్మానికి కాళిదాసు పౌరోహిత్యం చేయడు. అధర్మాన్ని వాల్మీకి ఆదరించడు." "మనుష్యుల్ని మృగాలా వాడుతూ ఉంటే మౌనంగా ఊరుకోడం సభ్యతా ?" "స్వచ్ఛమైన నాగరకత రక్తనాళాల్లో స్వచ్ఛమైన హింస ప్రవహిస్తూంటుంది. నాగరకత రక్తంలోకి అన్యాయం ప్రవేశించలేదు. పిరికితనం నపుంసకత్వం నాగరకతా దేహంలో అవయవాలు అవలేవు. దాన్ని లోక వంచనగా మార్చకుండా—ఇంకా దాన్ని నాగరకత అనే వాడెవడయినా ఉంటే ఉమ్మేస్తారు బుద్ధిమంతులు వాడి మొహాన" [పు. 86]

అని ఈ నాగరకత బండారం బైటపెడ్తాడు కవి. ఇప్పుడున్నది నిజమైన నాగరకతే అవుతే దాన్లోకి అన్యాయం వచ్చి ఎట్లా చేరింది ? జాతి జీవనంలోకి పిరికితనం, నపుంసకత వచ్చి చేరాయూ

అంటే అది నాగరకత అనిపించుకోవడానికి వీలులేదు. అందుకని ఇప్పుడున్న కుహనా నాగరకతను ప్రశంసించే మోసకార్యాన్ని బాల గంగాధర తిలక్ లాగానే శేషేంద్ర కూడా చేయలేదు. అలా చేస్తే పీడకుల పీడనా శిల్పంలో భాగం పంచుకొన్నట్లే అవుతుంది. ప్రాచీన సంస్కృతిలోని కవి, ఋషులైన కాళిదాసు, వాల్మీకులు బాధ్యత నెరిగినవాళ్లే. అధర్మాన్ని ఖండించిన వాళ్లే. అని చెప్తూ కవి జాతీయతా, సంస్కృతీ భూమికల్ని మొత్తంగా కాలదన్నలేదు. వానితో పాటు జాతీయత పేరుతో కవి ఫాసిజంను పెంపొందింప జేయదల్చ లేదు. తెలుగు సంఘం—భారత సంఘంగా—విశ్వమానవ సంఘంగా పురోగమించడానికే శేషేంద్ర ఈ కావ్యంలో ప్రయత్నించాడు తప్ప పీడకవర్గ యుద్ధ నాగరకతను గానీ, జాతీయ దురహంకార వాదాన్ని బలపర్చడానికిగానీ ప్రయత్నించలేదు. అందుకే ఆయన

> "ఇదుగో చెపుతున్నా దేశం పేరుతో జాతి పేరుతో దేశ దేశాన మన పిల్లల్ని భయంకరమైన యుద్ధాగ్నులకూ అంతకంటే భయంకరమైన జీవన దావాగ్నులకూ బలి చేస్తున్న మానవ ద్రోహులకు మరణశిక్ష ఆసన్నమయింది."
> [పు. 90]

అని అంటాడు. వ్యాపార నాగరకతలో చెలరేగేది సైనిక సమరాలు మాత్రమే కావు--అందులో జీవన దావాగ్నులు కూడా చెలరేగుతాయి. జాతి దురహంకారాన్ని వ్యాపింపజేస్తే అది ఆకలిమంటల్ని చల్లార్ప లేదు గదా. మానవ జాతి గొర్రిల్లా దశ నుంచి ఇక్కడి దాకా వచ్చిందది. నిరంతర చైతన్యం లేకపోతే ఇది ఇంకా పురోగమించదు. అందుకే మానవ జాతికీ--దాని పురోగమనానికీ--జంతువు నుంచి విడివడి స్వయం వ్యక్తిత్వార్జనకు సిద్ధపడిన మహా మానవుడికి సంకేతంగా 'గొర్రిల్లా'ను తీసికొంటూ శేషేంద్ర ఈ కావ్యాన్ని రాశారు. ఆయన మహా మానవుడుగా మనం పరిణమించాలంటే మహా చైతన్యం వుండాలని సూచిస్తూ

> "...ఎక్కడ తుఫానులే గానీ మంద మారుతాల్లేవో, ఎక్కడ సముద్రాలే గాని సరస్సుల్లేవో ఆ మహాలోకానికి తీసుకుపో"
> [పు. 100]

అని అంటాడు. అభ్యుదయ కవిత్వపు ఆదికవి అయిన శ్రీశ్రీలో ఏ మరో ప్రపంచాన్ని పాఠకులు దర్శించారో శేషేంద్ర గొర్రిల్లా కావ్యంలో కూడా అదే మరో ప్రపంచాన్ని మహాలోకం, అగ్ని ప్రపంచంగా చూస్తారు. రైతు కూలీల కోసం ఈ మరో ప్రపంచ దృక్పథాన్ని శేషేంద్ర ఏర్పర్చుకొన్నాడు. శ్రీశ్రీ లాగానే ఈయన కూడా ఇప్పటి వ్యవస్థ కూలి తీరాలనీ, కూలి తీరుతుందనీ భావిస్తాడు. ఫ్యూడల్ వ్యవస్థ గతించి వచ్చిన—వస్తున్న ఈ నూత్న పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఉనికి శాశ్వతం కాదనే దృక్పథాన్ని ప్రచారం చేయడం గొర్రిల్లా మహా కావ్యంలోని ముఖ్య విషయాల్లో ఒక్కటి.

నిజమైన మానవతను కాపాడుకోవడానికి ఏ పని చేసినా అది అమానుషం కాదు. అమానుషతను నాశనం చేయడం మానవత యొక్క ప్రధాన కర్తవ్యం. మానవత్వాన్నీ, శ్రమైక జీవన సౌందర్యాన్నీ, నులిమి వేసే శక్తులు మానవుల్లోనే కొన్ని చారిత్రక దశల్లో ఏర్పడి బల పడ్డాయి. ఆ అసుర శక్తుల్ని ఖండించి నశింప జేయడం కాఠిన్యంగానీ, అమానుషంగానీ కాదు. మానవతాద్రోహం నాగరకతా ద్రోహాన్ని సహించక అసలు సిసలైన మానవ సంఘాన్ని ఏర్పర్చడం కోసమే శేషేంద్రగారి గొర్రిల్లా కావ్యం సంకల్పించింది. అందుకే ఆయన

> "గొర్రిల్లాలో రాక్షసుడు కరుణామయ రాక్షసుడు; అకలుషిత రాక్షసుడు; తనకు మానవతా నిర్మాణ శిల్పమే ధ్యేయం. తన మార్గానికి ద్రోహులు అడ్డు వచ్చినప్పుడే చూపిస్తాడు తన రెండో ముఖం అమలిన హింస! పవిత్ర హింస! తమ్ముడా ఇవాళ రాక్షసుడు నన్ను ఆవహించాడు. నీవు పడిపోయిన నపుంసకత్వపు లోతుల్లోనుంచి నిన్ను ఉద్ధరించడానికి" (పు. 38)

అని అంటాడు. ఈ సంఘం నిజమైన మానవ సంఘంగా మనడానికి కరుణామయ రాక్షసత్వాన్నీ, అమలిన హింసనూ, పవిత్ర హింసనూ ప్రబోధిస్తున్నాడు. 'గొర్రిల్లా' వర్గ రహిత సమాజ స్థాపనను సూచించింది. శ్రీశ్రీ లాగానే శ్రమైక జీవన సౌందర్యాన్ని శేషేంద్ర ఈ కావ్యం ద్వారా పాఠకులకు అందిస్తాడు. శ్రమను నిరసించకుండా దాన్ని ఏ పవిత్ర దృష్టితో చూడాలో శేషేంద్రచెప్తూ

> "నాకు తెలుసు నీ మెదడులో మరో ప్రపంచం ఊపిరి పీలుస్తోంది ... పని చేస్తుంటే నీ చేతులు ఎంత అందంగా ఉంటాయి. నీ కన్నుల్లో ఎన్ని ఆశయాల సౌందర్య బలం సాక్షాత్కరిస్తుంది!" (పు. 26)

అని అంటాడు.

ఇట్లా శ్రీశ్రీ ఆదిగా శేషేంద్ర వరకు ఏదో విధంగా అభ్యుదయ కవులందరూ 'మరో ప్రపంచం' కోసం పాఠకులలో చైతన్యాన్ని కల్గించినప్పటికీ, శ్రీశ్రీ అంత శక్తిమంతగా ఒక్కోసారి అంతకన్నా ఎక్కువ కళాశక్తితో శేషేంద్ర మరో ప్రపంచ దృష్టితో **ఈ కావ్యాన్ని రాశాడు.**

ఇంత మహా కావ్యంలోనూ కొన్ని 'అసహ్య' విషయాలు లేక పోలేదు. "నీ చేతిలో పద్యం ఒక భజన వాద్యం, నా చేతిలో పద్యం ఒక గొర్రిల్లా గర్జ! నాది తపస్సు నీది వృత్తి" (పు. 70) లాంటి అల్పోహలకు నిజంగా ఈ మహా కావ్యంలో స్థానంలేదు. అవి కవి గారి వ్యక్తిగత డైరీలో ఉంచుకోవచ్చు. కవి మామూలు వ్యక్తిగా దిగజారిపోయి తన వైయక్తికమైన అసూయల్నీ, అహంకారాల్నీ చూపడానికి, అలా చూపి తోటి సాహితీ మిత్రులలో, విమర్శకులలో అశాంతినీ, అసంస్కారాన్నీ రెచ్చ గొట్టడానికి వీలులేదు. ఈ ఒక్క జాగ్రత్త వహిస్తే గొర్రిల్లా ఇంకా మంచి కావ్యంగా నిలుస్తుంది. మహాకవి శేషేంద్రశర్మగారిని ఇంత మంచి కావ్యాన్ని రాసినందుకు తెలుగు పాఠక లోకం తప్పక అభినందిస్తుందని ఆశిస్తాను..

డాక్టర్ ఎస్. గంగప్ప

జానపద సాహిత్యం - కామన్న కథ

అజ్ఞాత కవుల మేధోపజ్ఞకమ్మై వెలువడ్డ జానపద సాహిత్యంలో ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది. స్వీకరించిన ఇతివృత్తాలు రక రకాలుగా ఉంటాయి. జానపదుల సుఖదుఃఖాది అనుభూతికి అనుగుణంగా ఇతివృత్తమూ, దానికి తగిన రీతిలో కరుణాది రసాలతో గీత రచనావుంటాయి. ఇక్కడ రచన అనగానే కేవలం పాట అల్లుకోవడమనే అర్థం. భారత రామాయణాలే గాక, ఇతర పురాణాంతర్గతమైన ఎన్నో విషయాలు పాటల్లో వచ్చాయి; చరిత్రాత్మక గేయాలున్నాయి; వీరగాథ లున్నాయి; ఆయా సందర్భోచితమైన అంటే సమకాలిక జన జీవన విధానాన్ని స్పష్టం చేయగల గీతాలున్నాయి. కేవలం కల్పిత గాథలూ వున్నాయి. అలాంటి కల్పిత వీరగాథ కామన్న కథ దీన్ని కామన్న వధ అంటే బాగుంటుంది. భీమన్న కామన్నను వధిస్తాడు ఈ గీతంలో. కామన్న వధ అనగానే వెంటనే మనకు గుర్తొచ్చేది కీచక వధ. నా సేకరణలోని ఆ చక్కటి వీరగాథను గూర్చి పరిశీలిద్దాం.

ఈ కామన్న కథలోని సారాంశం ఇది. కామన్న తన ఇంటి వద్ద పని పాటలు చూసుకొని, తల్లి అనుమతితో అక్క ఉన్న ఊరికి వెళతాడు. తాను తీసుకెళ్లిన కానుకలు అక్క ఇంటిలోని సభ్యులకు ఇస్తాడు కామన్న. పడక సర్దుతూన్న అక్క కూతురిని బలాత్కరించగా తప్పించుకొని ఏడుస్తూ పోతుంది. తన భంగపాటును తల్లికీ, తండ్రికీ చివరికి అన్న భీమన్నకీ చెబుతుంది. వెంటనే అన్న భీమన్న చెల్లి ధరించే చీరా రవిక ధరించి కామన్నఉన్న గదిలోకిపోగా, నిజంగానే మేనగోడలు వచ్చిందని సంతోషించిన కామన్న తదుచితంగా సంభాషిస్తాడు కోపోద్రిక్తుడైన భీమన్న కామన్నను వధిస్తాడు. ఇది ఇందులోని కథా విషయం. ఈ కామన్న వధా సంబంధి గేయం కలుపు తీతల సమయంలో పాడేపాట. అది ఇలా ప్రారంభమవుతుంది.

"చందమామా చందమామా నెల చందమామా గొబ్బిళ్లో
చందమామ కూతురులు నీలారకన్నెలు గొబ్బిళ్లో
నీలారకన్నెలకు ఒక చేదబాయో గొబ్బిళ్లో
ఒక చేదబాయికి ఒక చేద[1] బిళ్లో గొబ్బిళ్లో
ఒక చేద బిళ్లకీ ఒక చేద తాడో గొబ్బిళ్లో
ఒక చేద తాడకీ ఒక చేద దుత్తో గొబ్బిళ్లో
ఒక చేద దుత్తకీ ఒక పూల తోటా గొబ్బిళ్లో
నిచ్చమల్లి తోటకీ నీరెత్తి పోయా గొబ్బిళ్లో
నీరెత్తి కామన్న [2]నెగరికీ వొచ్చా గొబ్బిళ్లో

అమ్మరా ఓయమ్మా ముముగన్న తల్లో గొబ్బిళ్లో
అక్కగా రూరికీ పొయ్యి వొస్తానమ్మా గొబ్బిళ్లో

[3]ఆట్నుంచి కామన్న అంగడింటెకి పాయా గొబ్బిళ్లో
పిల్లలకీ పప్పులూ కొన్నాడు కామన్న గొబ్బిళ్లో
అక్కకూ చీరలూ కొన్నాడు కామన్న గొబ్బిళ్లో
మామకూ పచ్చరాలు కొన్నాడు కామన్న గొబ్బిళ్లో
భీమన్నకు బిల్లల మలతాడు కొన్నాడు కామన్న గొబ్బిళ్లో
అవన్నీ కొన్నాడు పెడమూటలు కట్టినాడా గొబ్బిళ్లో
ఆట్నుంచి కామన్న నెగరికీ వొచ్చా గొబ్బిళ్లో

అమ్మా రావమ్మా ముముగన్నతల్లో గొబ్బిళ్లో
అక్కగారూరికి పొయ్యి వొస్తాను గొబ్బిళ్లో
ఇల్వాకిలి ఎళగానే ఇల్లాలు తుమ్మా గొబ్బిళ్లో
[4]సగినాలు కావురా సక్కన్ని కొడుకో గొబ్బిళ్లో
మనకేమి సగినాలు మాన్యాదరులాకీ గొబ్బిళ్లో
ఊర్వాకి లెల్లుతానె ఊరి పిల్లడ్డమాయా గొబ్బిళ్లో
సగినాలు కావురా సక్కన్ని కొడుకో గొబ్బిళ్లో
మనకేమి సగినాలు మాన్యాదరులాకీ గొబ్బిళ్లో

[5]పొండిండే సేనిలో పాముడ్డమాయా గొబ్బిళ్లో
సగినాలు కావురా సక్కన్ని కొడుకో గొబ్బిళ్లో
మనకేమి సగినాలు మాన్యాదరులాకీ గొబ్బిళ్లో
దున్నిండే దుక్కిల్లోన దుప్పడ్డమాయా గొబ్బిళ్లో
సగినాలు కావురా సక్కన్ని కొడుకో గొబ్బిళ్లో
మనకేమి సగినాలు మాన్యాదరులాకీ గొబ్బిళ్లో

ఆట్నుంచి కామన్నా ఊరికీ పాయా గొబ్బిళ్లో
యపుడొస్తివి కామన్నా యపుడొస్తి వప్పా గొబ్బిళ్లో
ఇపుడొస్తి సక్కమ్మా ఇదిగో కాలిధూళీ గొబ్బిళ్లో
పండెండు కంబాలు పడసాలిలోనా గొబ్బిళ్లో

[6]పాసుపులు మూరేటి పణతులెవరమ్మా గొబ్బిళ్లో
నా ముద్దు కూతురప్పా నీ మేనగోడలూ గొబ్బిళ్లో
నీ ముద్దు కూతురుతో నీళ్లందమావో గొబ్బిళ్లో
పిల్లలకీ పప్పులు పెట్టినాడూ కామన్నా గొబ్బిళ్లో
మామాకూ పచ్చరాలు ఇచ్చినాడూ కామన్నా గొబ్బిళ్లో
అక్కకూ చీరాలూ ఇచ్చినాడూ కామన్నా గొబ్బిళ్లో
బీమన్నకు బిల్లల మలతాడు ఇచ్చినాడూ కామన్నా గొబ్బిళ్లో

నీ ముద్దు కూతురుతో అన్నము పెట్టించూ గొబ్బిళ్లో
నీ ముద్దు కూతురుతో [7]పొరుపు పొరిపించూ గొబ్బిళ్లో

తన ముద్దు కూతురుతో అన్నము పెట్టించా గొబ్బిళ్లో
తన ముద్దు కూతురుతో పొరుపు పొరిపించా గొబ్బిళ్లో
పొరుపు పొరిసొచ్చేతపుడు పైట చెరుగు పొట్టా గొబ్బిళ్లో
మాయమ్మ మాయప్పలతోడు వస్తాను యిడి మామా
గొబ్బిళ్లో

మీ యమ్మ మీ యప్పల [8]ఆనాయ వనితా గొబ్బిళ్లో
మాయక్కా చెల్లెలితోడు వస్తాను యిడి మామా గొబ్బిళ్లో
మీయక్కా చెల్లెలిమీద ఆనాయ వనితా గొబ్బిళ్లో
మాయన్న భీమన్నతోడూ వస్తాను యిడిమామా గొబ్బిళ్లో
మీయన్న భీమన్న మీద ఆనాయ వనితా గొబ్బిళ్లో
గోడు గోడాడుకొంటా[9] తలంచుకొచ్చా గొబ్బిళ్లో
ఎవరూ కొట్టిరీ అక్కమ్మా ఎవరు తిట్టిరో గొబ్బిళ్లో
ఎవరు కొట్టాలేదు ఎవరూ తిట్టలేదూ గొబ్బిళ్లో

నీ ముద్దు తమ్ముడంటా నా మేనమామా గొబ్బిళ్లో
పొరుపు పొరి సొచ్చేతపుడు పైట చెరుగూ పొట్టా గొబ్బిళ్లో
ఐతే మేలాయగానీ అన్నయ్యతో అనవొద్దూ గొబ్బిళ్లో
గోడుగోడాడుకొంటా[10] ఎండంచుకొచ్చా గొబ్బిళ్లో
ఎవరు కొట్టిరి అక్కమ్మా ఎవరు తిట్టిరో గొబ్బిళ్లో
ఎవరూ కొట్టాలేదు ఎవరూ తిట్టలేదూ గొబ్బిళ్లో
మా అమ్మ తమ్ముడంటా నా మేనమామా గొబ్బిళ్లో
పొరుపు పొరి సొచ్చేతపుడు పైటచెరుగూ పొట్టా గొబ్బిళ్లో

ఐతే మేలాయగాని అన్నయ్యతో అనవొద్దూ గొబ్బిళ్లో
గోడుగోడాడు కుంటా అక్కా చెల్లెలి దగ్గరకొచ్చా గొబ్బిళ్లో
ఎవరు కొట్టిరి అక్కమ్మా ఎవరు తిట్టిరో గొబ్బిళ్లో
ఎవరూ కొట్టాలేదూ ఎవరూ తిట్టలేదూ గొబ్బిళ్లో
మనమ్మ తమ్ముడంటా మన మేనమామా గొబ్బిళ్లో
పొరుపు పొరి సొచ్చేతపుడు పైటచెరుగూ పొట్టా గొబ్బిళ్లో
ఐతే మేలాయగానీ అన్నతో అనవొద్దూ గొబ్బిళ్లో

గోడు గోడాడుకుంటా [11]అన్నంచ కొచ్చా గొబ్బిళ్లో
ఎవరు కొట్టిరి అక్కమ్మా ఎవరు తిట్టిరో గొబ్బిళ్లో
ఎవరూ కొట్టలేదు ఎవరూ తిట్టలేదూ గొబ్బిళ్లో
మనమ్మ తమ్ముడంటా మన మేనమామా గొబ్బిళ్లో
పొరుపు పొరి సొచ్చేతపుడు పైటచెరుగూ పొట్టా గొబ్బిళ్లో
అక్కమ్మ చీరలూ భీమన్న కట్టుకోనా గొబ్బిళ్లో
అక్కమ్మ రైకలూ భీమన్న తొడుగుకోనా గొబ్బిళ్లో

అక్కమ్మ [12]సొమ్ములూ భీమన్న పెట్టుకోనా గొబ్బిళ్లో
అక్కమ్మ పడకటింటికీ భీమన్నపాయా గొబ్బిళ్లో
రెండు నిలవాలు పొట్టుకోనీ తొంగిచూశా గొబ్బిళ్లో
ఇదియేమి ఓ మామా యిల్లంతా [13]మొబ్బూ గొబ్బిళ్లో
నువ్వే యిల్లాలివైతే యిల్లంతా వెలుగూ గొబ్బిళ్లో
ఇదియేమి ఓ మామా మట్టిగోడాలూ గొబ్బిళ్లో

నువ్వే యిల్లాలివైతే బంగారి గోడాలూ గొబ్బిళ్లో
తాలమ్మ లాడుకుంటూ తొడమింద కూర్చోనా గొబ్బిళ్లో
ఉత్తమ్మ లాడుకుంటా మెడ దత్తారించా గొబ్బిళ్లో
అమ్మా రావమ్మో మముగన్న తల్లో గొబ్బిళ్లో
నీ ముద్దు తమ్మునకూ పాడేగట్టమ్మో గొబ్బిళ్లో
అందరిండ్ల ముందర బాలా లాడనీ గొబ్బిళ్లో
భీమన్న యింటి ముందర కాకి లాడనీ గొబ్బిళ్లో

అందరిండ్ల ముందర [14]సాము లెండనీ గొబ్బిళ్లో
భీమన్న యింటి ముందర చీమ లెండనీ గొబ్బిళ్లో
అందరిండ్ల ముందర పాల కాలవలే గొబ్బిళ్లో
భీమన్న యింటి ముందర నెత్తురు కాలవలే గొబ్బిళ్లో.''

—ఇలా సాగుస్తుందీ గేయం; చక్కటి ఆరంభంలో చిక్కటి ముగింపు కలిగిఉంది; భావ నిర్భరమై, రసోదంచితమై ఉంది ఇందలి కథ కల్పితం. అయినా భారతంలోని కీచకవధా ఘట్టాన్ని స్ఫురింపజేస్తూంది. ఆ విషయం దృష్టిలో పెట్టుకొనే జానపదకవి దీన్ని కల్పించిఉంటాడు. చక్కటి కథాకథన శిల్పంతో పాటు, అవసరమైనచోట తగినరీతి సంభాషణలతో కూడి నాటకీయ శిల్పంతో ఒప్పుతూంది. వాస్తవానికి భారతంలో కీచకవధా ఘట్టాన్ని తిక్కన నాటకీయ శిల్పంతో రచించి ఉండడం విద్వల్లోకానికి తెలిసిందే ఈ గేయం చదువుతూంటే ఆ శిల్పం గుర్తుకొస్తుంది; సహృదయ హృదయరంజకం చేస్తుంది; అజ్ఞాతకవి కల్పనాశిల్పం గూడా స్పష్టమవుతూంది. ఇందులోని భాషగూడా చాలా సులభమై విషయ వివరణకు ఉపకరిస్తూంది. పాత్రల గుణసత్త్వాలు సైతం ఇందులో సహజ రీతిని వర్ణితం. ప్రౌఢసాహిత్యంతో పోల్చినప్పుడు దీని విశిష్టత గణనకు రాకపోవచ్చు అది వేరే సంగతి. కానీ పామర ప్రజల అమాయకమైన భావన కలిగిన అనుభూతికి అనుగుణంగా సహజమైన, సరళమైన భాషలో గేయం అల్లబడి ఉండడం ఎవరూ కాదనలేని నిసర్గ మనోజ్ఞమైన గుణాలు. కథాకథనం, మధ్యలో సంభాషణ, ఆ వెనుక కథాకథనం ఇలా కొనసాగుతుంది గేయం. ఇదే దీనిలోని రచనా శిల్పం.

''చందమామా చందమామా నెల చందమామా గొబ్బిళ్లో
చందమామ కూతురులు నీలార కన్నెలు గొబ్బిళ్లో

....

నిచ్చమల్లి తోటకీ నీరెత్తిపోయా గొబ్బిళ్లో
నీరెత్తి కామన్న నెగరికి వొచ్చా గొబ్బిళ్లో''— ఇది కథాకథనం. వెంటనే :

''అమ్మరా ఓయమ్మా మముగన్న తల్లో గొబ్బిళ్లో
అక్కగారూరికీ పొయ్యివొస్తానమ్మా గొబ్బిళ్లో''— అని తల్లితోచెబుతాడు కామన్న. ఆ వెంటనే :

''ఆట్నుంచి కామన్న అంగడింటికి పోయా''— అని కథ మళ్లీ కొనసాగుతుంది ఇలాగా సందర్భోచితంగా కథాకథనం, సంభాషణలు ఉన్నాయి. అందుచేతనే దీనిలో రచనా శిల్పం, కల్పన, నాటకీయత ముప్పిరిగొని ఉన్నాయని చెప్పడం.

ఇతివృత్తం ఆరంభంలో కాకపోయినా, చివర కీచకవధా ఘట్టం గుర్తుకొస్తుంది. ఇంతేగాదు; కీచక వధలో పరస్త్రీని, వివాహితని కీచకుడు బలాత్కరిస్తాడు. ఇక్కడ కథలో మేనమామ మేనగోడలిని పరువు పరిచేప్పుడు బలాత్కరిస్తాడు. కీచక వధలో కీచకుని వద్దకు కల్లు తేరబోగ కీచకుడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఒంటరిదాన్ని బలాత్కరిస్తాడు. ఈ కథలో కామన్న మేనగోడలిచేత పరువు పరిపించుమని అక్కతో చెబుతాడు. అందుకోసం వచ్చిన మేనగోడలిని కామన్న బలాత్కరిస్తాడు. పైగా కీచక వధలో లాగే కామన్న వధలోను ఇందుకు ఉపకరించేది అక్క. అయితే కీచక వధలో కీచకుని మనఃప్రవృత్తి సుదేష్ణకు తెలుసు కానీ ఇందులో తమ్ముడు కాముకుడన్న సంగతి అక్కకు తెలియదు. బలాత్కృత అయిన ఆ అమాయకురాలు దుఃఖిస్తూ వస్తుంది. ఈ విషయం తల్లికీ, తండ్రికీ, చివరికి అన్న భీమన్నకు తెలుస్తుంది. అన్న భీమన్న కోపోద్రిక్తుడవుతాడు. కీచక వధలోలాగే ఇక్కడ గూడా ''ఏకత్రైవానురాగం.'' అందువల్లే ఇబ్బంది. మేనగోడలే అయినా వినాహేతుపూర్వమే బలాత్కరించడమనేది సహించరాని నేరం. దానితో కోపోద్రిక్తుడైన భీమన్న భీముడిలాగే స్త్రీ వేషంతో మేనమామ కామన్న ఉన్న ఇంటిలోకి :

''అక్కమ్మ చీరలూ బీమన్న కట్టుకోనా గొబ్బిళ్లో
అక్కమ్మ రైకలూ బీమన్న తొడుగుకోనా గొబ్బిళ్లో
అక్కమ్మ సొమ్ములూ బీమన్న పెట్టుకోనా గొబ్బిళ్లో''

--ఇలా తయారై వెడతాడు. వాళ్ల మధ్య జరిగిన సంభాషణ యిది:—

''ఇది యేమి ఓ మామా యిల్లంతా మొబ్బా
నువ్వే యిల్లాలివైతే యిల్లంతా వెలుగూ
ఇది యేమి ఓ మామా మట్టి గోడాలూ
నువ్వే యిల్లాలివైతే బంగారి గోడలూ''—ఈ సంభాషణ

తరవాత—

''తాలమ్మ లాడుకుంటూ తొడమింద కూర్చోనా
ఉత్తమ్మ లాడుకుంటా మెడ ఉత్తరించా''— కీచకుని వధ లాగే కామన్న వధ జరిగింది. ఇందులో చక్కటి నాటకీయత స్పష్టంగా గోచరిస్తుంది. నిజంగానే మేనగోడలు వచ్చిందను కొంటాడు కామన్న; మేనగోడలి వేషంలోని మేనల్లుడని ఎరుగడు. తన్మూలంగా మనకు ఈ నాటకీయత స్పష్టమవుతుంది. దీనిలో జానపదకవి కల్పనా శిల్పం కూడా వ్యక్తమవుతుంది. కీచక వధా ఘట్టం మనసులో ఉండగా, ఈ కామన్న కథని జానపదకవి చాలా చక్కగా కల్పనచేసి, తన సృజనాత్మకశక్తిని వ్యక్తీకరించినట్లు మనకు తెలుస్తుంది.

ఈ కథాగేయంలో జానపద కవి ఆ యా పాత్రల మనస్తత్వాల్ని గూడా స్పష్టీకరించడానికి ప్రయత్నించి కృతకృత్యుడైనట్లు అవగతమవుతుంది. కామన్న, భీమన్న అనే పేర్లు సైతం ఆయా పాత్రలకు సహజరీతిగానే నామకరణం చేయడం జరిగింది. తన కోరికను తీర్చుకోడానికి చక్కటి ఉపాయం ఆలోచించాడు కామన్న. కనుకనే మేనగోడలిచేత పరువులు పరిపించుమని చెప్పాడు అక్కతో. తెలియని అమాయకురాలైన అక్క అదేరీతిగా కూతురితో చేయిస్తుంది. ఆ కూతురు గూడా అమాయకురాలిలాగే కనిపిస్తుంది. మేనమామ బలాత్కరిస్తే తల్లిదండ్రుల్ని, అన్నను ప్రస్తావించి, చివరికి దుఃఖిస్తూ వస్తుంది. తల్లి దండ్రులు ఈ విషయం తెలుసుకొని, అన్న భీమన్నతో చెప్పకుమంటారు. అంటే భీమన్నకు తెలిస్తే సహించలేడని, ఆతని స్వభావాన్ని స్పష్టం చేశాడు జానపద కవి. తెలిసిన భీమన్న కోపోద్రిక్తుడై మేనమామ కామన్నను వధిస్తాడు. ఇలాగా ఆయా పాత్రల మనః ప్రవృత్తుల్ని సైతం స్పష్టం చేశాడు జానపద కవి.

అతి సామాన్యంగా కథ నడచినా, కవిత్వపు మెరుపులు తళుక్కుమంటూనే ఉన్నాయి గేయంలో. చెల్లి వేషంలో వచ్చిన భీమన్న కామన్నల సంభాషణలో కవిత స్పష్టం. కీచక వధలో కీచకుని కరచరణాద్యవయవాల్ని శరీరంలోకి జొనిపి మాంసపు ముద్ద చేశాడట భీముడు. కానీ ఇక్కడ భీమన్న:

''తాలమ్మ లాడుకుంటూ తొడమింద కూర్చోనా
ఉత్తమ్మలాడుకుంటూ మెడ ఉత్తరించా'' అని మాత్రం చెప్పబడింది. వధించాక భీమన్న తల్లితో :

''అమ్మా రావమ్మో మముగన్న తల్లో
నీ ముద్దు తమ్మునకూ పాడేగట్టమ్మో''—అంటాడు.

చివరికి :

''అందరిండ్ల ముందర బాలాలాడనీ
బీమన్న యింటముందర కాకులాడనీ
అందరిండ్ల ముందర సాము లెండనీ
బీమన్న యింటిముందర చేమలెండనీ

అందరిండ్ల ముందర పాల కాలవలే
బీమన్న యింటి ముందర నెత్తురు కాలవలే''—అని వర్ణించి పరస్త్రీని బలాత్కరించినందుకు ఫలితం—కీచక వధలోలాగే యిందు లోను—వధ తప్పదని నిరూపించాడు మరోసారి ఈ జానపద కవి !

అధోజ్ఞాపికలు

1 గిలక
2 నగరికి
3 అక్కడనుంచి
4 శకునాలు
5 పండిన
6 పసుపులు
7 పరుపులు పరిపించు
8 ఆన+ఆయ = ఆనతి అయింది
9 తల్లి+అంచకు = తల్లివద్దకు
10 తండ్రి+అంచకు = తండ్రివద్దకు
11 అన్న+అంచకు = అన్నవద్దకు
12 నగలు
13 మబ్బు
14 సాములనే ధాన్యం—ఆరికలులాంటి ధాన్యం; ఇది మెట్టపంట. రాయలసీమలో పండిస్తారు.

జీవన క్రమణం

శ్రీ నాళేశ్వరం శంకర్

ఆకలి గుండె క్రింద
బాధ మందుతుంది —

కనురెప్పల చూరుక్రింద
ఖననం జరుగుతుంది —

అనుభవాల క్రింద
మౌనాల ఆత్మహత్యలు —

ఈ బాధకి, ఈ మౌనానికి తెలియదు
'జీవితం
ఎన్నో అలలతో కూడుకొని వుంటుంది
ప్రతి అల అనుభవాల సంకలనం
ప్రతి జీవితం చరిత్రకొక నిదర్శన' మని.

+ * +

మూగ వేణువు

శ్రీ మేకా సుధాకరరావు

అనారోగ్యపు దుష్టకరాలు
దయారహితంగా విసిరేసిన
ఈ వేణువు మూలపడింది —
మధుర సుస్వరా లొలికిన దాని కన్నులు
తెరిచిఉండే మూతపడ్డాయి !
కమ్మనిగానం కుమ్మరించిన
ఆ కంఠం మూగవోయింది.

అయినా —
ఏ మరుత్ రసవీచికా స్పర్శకయినా
స్పందించే దాని హృదయంలో
కవితాస్వరాల జీవన రాగాలు
వెల్లి విరుస్తాయి —
అనుభూతి విగిసిన హృదయం
కురిసే కన్నీటిజల్లులా !

+ * +

డాక్టర్ కాశీభట్ట సేతురామేశ్వర దత్త

సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో అర్థవిపరిణామము

భాష యను నది జీవన స్రవంతివలె పరిణామముచెందుచుండును.

ఒకరి యభిప్రాయములు ఒకరికి తెలియుటకై మనుష్యులు కల్పించుకొనిన సువ్యక్తములైన ధ్వనులే భాష యనబడును. ''భాష్యతే ఇతిభాషా'' అనగా నిత్యవ్యవహారమున మాట్లాడబడునది భాష యనబడును. భాషయందు శబ్దార్థములు రెండును ముఖ్యములు. ఇవి పరస్పరాశ్రయము కలవి కావుననే కవికుల గురువు కాళిదాసు[1]

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే,
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ॥

అని నుడువుచు శబ్దములేని యర్థము, అర్థములేని శబ్దము ఉండదని వ్రాకుచ్చెను.

కాలక్రమము ననుసరించు కూర్పులు చేర్పులు పొంది భాష మారుచుండును. భాషా వ్యాప్తికి ''ఒకాబ్యులరీ'' (శబ్దజాలము), ''సెమోంటిక్స్'' (అర్థవిపరిణామము), ''సింటాక్స్'' (వాక్య నిర్మాణము), ''ఫోనోలజీ'' (శబ్దోచ్చారణ విధానము) యనునవి కారణములని[2] భాషాతత్త్వవేత్తలు చెప్పుదురు. శబ్దార్థముల గూర్చిన చర్చలు (భారతీయ) సంస్కృత వాఙ్మయమున మెండుగ నున్నవి. వేదమందలి బ్రాహ్మణములలో వీటి యారంభము కనుపించును. ''రౌతీతిరుద్రః'' (మిక్కిలి ఏడ్చినవాడు) అని రుద్ర శబ్దమునకు యాస్కుని వ్యుత్పత్తి.[3] యాస్కుని ''నిరుక్తము'' (నిఘంటువు) ఈ విషయమున నెంతో కొనియాడదగినది అందలి శబ్దములన్నియు అర్థము ననుసరించి కొన్ని వర్గములగ విభజింపబడినవి. గౌః, సముద్రః, హిరణ్యం, అత్రః, అశ్వః ఇత్యాది పదములకు అనేక విధములుగ వ్యుత్పత్తులు చెప్పబడినవి. యాస్కుడు ''దేవరః'' (మగని తోబుట్టువు) అను శబ్దమునకు ''ద్వితీయ వరః'' యని చెప్పిన వ్యుత్పత్తి[4] ప్రాచీన సాంఘిక పరిస్థితుల దృష్ట్యా ఎంతయో కొనియాడదగినది.

హెరాక్లిటిస్ అను గ్రీసుదేశపు తత్త్వశాస్త్రజ్ఞుడు శబ్దార్థములకు గల సంబంధము నైసర్గికమని చెప్పెను. ఇది మన మీమాంసకుల ''ఔత్పత్తికస్తు శబ్దస్య అర్థే సంబంధః'' అను సూత్రముతో[5] ఏకీభవించును. అనగా శబ్దార్థముల సంబంధము నిత్యము, నైసర్గికము అని యర్థము నైయాయికుల మతమున[6] ఈ పదమునకు ఈ యర్థమని తెలుపు ఈశ్వర సంకేతమే శక్తి (అస్మాత్పదార్థాత్ అయమర్థో బోద్ధవ్యః ఇతీశ్వర సంకేతః శక్తిః). భారతీయులును గ్రీకులవలె అంతశ్చైతన్యము బయటికి ప్రసరించుటయే భాష యనిరి. ఈ విషయమును ''వాక్యపదీయ'' వ్యాఖ్యాత పుణ్యరాజు[7] ''ప్రత్యక్ చైతన్యస్య అంతస్సన్నివిష్టస్య పరబోధనాయ శక్తిః అభిస్యందతే'' (అంతర్గతమయిన చైతన్యము పరబోధ కల్గించుటకు బయటికి భాషరూపమున వెడలును) అని నుడివెను. అంతేకాక వేదమునందు ''వాఙ్మే మనసి ప్రతిష్ఠితా'' అని చెప్పబడినది.[8] వాక్యపదీయకారుడైన భర్తృహరి ''ఏకస్యైవ ఆత్మనో భేదౌ శబ్దార్థౌ అపృథక్ స్థితౌ'' (ఒకే ఒక ఆత్మయొక్క భేదములే వేర్వేరుగ నుండని శబ్దార్థములు) అని చెప్పుచు[9] ఈ వ్యావహారిక ప్రపంచమంతయు శబ్దబ్రహ్మముయొక్క ప్రత్యక్షీకరణమే యని నుడివెను.

భాషలోని శబ్దముల నుచ్చరించుటయందు మార్పులు కలిగినట్లు అర్థమందు కూడ సంభవించును. కాలక్రమమున కొన్ని పదములు వాడుకలో లేక జీర్ణించిపోవును. వాటి స్థానమున కొత్త పదములు బయలుదేరును లేక పాతపదముల స్థానమున కొత్త పదము లుద్భవించును. ''వికృతిర్హి జీవితముచ్యతే'' అను నానుడివి ఈ భౌతిక ప్రపంచమునకు వలె భాషకు కూడ అన్వయించును. అర్థపరిణామమునకు కారణము లూహించి పరిణామములు ఇన్ని విధములుగ నుండునని వాటిని సూత్రీకరించుట నలవికాదు. శబ్దోచ్చారణయందలి మార్పులు భౌతికములు, కాయికములు, వాచికములగుటచే వాటిని కొన్ని తెగలుగ విభజించి కొన్ని పరిస్థితులలో కొన్ని సన్నివేశములలో వాటికి కొన్ని నియమములున్నట్లు చూపవచ్చును. కానీ కేవల మానసిక ప్రవృత్తిపై యాధారపడు అర్థపరిణామము నూహించుట యంత సులభముకాదు. ఆంగ్లమందలి **Man** అను పదము నేటికిని (మగవాడు అను) తన పురాతనార్థమునే ఏల కల్గియున్నది? **Wife** అను పదము 'స్త్రీ' యను పురాతనార్థమును విడిచి ప్రస్తుతము 'భార్య' యను నర్థముతో నేల ఉపయోగింపబడుచున్నది? అని విడమరచి తర్కించుట కష్టము. వ్యావహారికాంగ్లమందు **House wife** అను పదములో **'wife'** అను శబ్దమునకు అర్థము 'స్త్రీ'. ఇట్లు అర్థ పరి

ణామమునకు కారణము పరిసర ప్రదేశములు మరియు సాంఘిక పరిస్థితులు.

శబ్దము యొక్క అర్థము భౌతిక పరిస్థితులు, ప్రదేశము, కాలము, వక్త ఉద్దేశ్యము ననుసరించి మార్చుచుండును. కావుననే మన ప్రాచీనులు

శక్తిగ్రహం వ్యాకరణోపమాన
కోశాప్త వాక్యాత్ వ్యవహార తశ్చ
వాక్యస్య శేషా ద్వివృతేర్వ దన్తి
సాన్నిధ్యతః సిద్ధప దస్య వృద్ధాః॥

అను వాటిని అర్థానిర్ణాయకములుగ గ్రహించిరి. ఒక శబ్దముయొక్క వాస్తవిక వ్యుత్పత్తి మరగుపడిన యెడల దానికి అర్థ సంకోచము యేర్పడును. ఒక శబ్దమునకు ఒకే అర్థమును పరిమితము చేయుట వైయాకరణులకు, యాలంకారికులకు చాల ఇష్టము. ఉదాహరణమునకు ''సమయః, యోగః, ధాతుః, సంధిః, ప్రకృతిః, గుణః'' అను శబ్దముల పరిశీలింతము. ఇచ్చట 'గుణము' అనుదానికి ఆలంకారికులు ఒక రీతిగను నైయాయికులు వేరొక విధముగను, తత్త్వశాస్త్రజ్ఞులు మరొక విధముగను అర్థము చెప్పుదురు ఒకరు చెప్పిన యర్థమును మరొకరు స్వీకరింపరు.

అర్థపరిణామమునకు కారణము లింతవరకును కనుగొనబడలేదు. శబ్ద పరిణామమునందు మనస్సు ప్రధాన కారణము కాదు. కాని అర్థపరిణామమందు మనస్సు ప్రధాన కారణమగుచున్నది. అర్థ పరిణామమును భాషాశాస్త్రజ్ఞులు సాధారణముగ మూడు విధములుగ విభజింతురు.

I అర్థ వ్యాకోచము

ఇది అన్ని భాషల వాఙ్మయములందును అర్థసంకోచముకన్న చాలా తక్కువగ కన్పించును. ఇందు విశేష వాచియైన శబ్దమునకు కొన్ని కారణములవలన సామాన్య పరత్వము కల్గును. ఉదాహరణము (1) తైలమ్: నువ్వుల నుండి తీసిన నూనెకు తైలము అని పేరు కాని కాలక్రమముగ ఈ అర్థము మరగుపడి 'తైలం'అనగా నూనె అను సాధారణార్థములో వాడబడుచున్నది. కావుననే ''తిలతైలం'', ''ఏరండ తైలం'' మొదలగు ప్రయోగములు. ఇట్లే తెలుగులో తిల తైలము అను నర్థము కల్గియుండు 'నూనె' శబ్దము కూడ ఇప్పునూనె, కాగునూనె మొదలయిన పదములలో సామాన్య వాచిగా వాడబడుచున్నది.[10]

(2) Pecu (Greek) అనగా పశువులు. దీనికి సంస్కృతములో 'పశుః' అనునది సమాన పదము పూర్వము వెండి, బంగారు నాణెములు లేనప్పుడు పశువులనే (గోవులనే) సంపదగా పరిగణించుచుండిరి. కాలక్రమమున 'పశు ధనము' అను నర్థము మఱుగునపడి 'ధనము' అను అర్థము మాత్రమే మిగిలినది. pecu నుండి వచ్చినదే ఆంగ్లమందలి pecuniary (ధన సంబంధమైన) యను శబ్దము.

(3) Villain పూర్వము విదేశములలో వెట్టి చాకిరీ చేయుటకు కొందరు బానిసలుండెడివారు. వీరు సాధారణముగా అల్లర్లకు, దౌర్జన్యములకు పాల్పడెడివారు. క్రమంగా 'బానిస' అను అర్థముపోయి దుష్టుడు అను ప్రస్తుతార్థమునకు దిగినది.

(4) Gossip (God+sibb) పాశ్చాత్యులలో శిశువు జన్మింపగనే చర్చి నుండి God mother అను స్త్రీ చర్చి నుండి వచ్చి నామకరణము చేసి శిశువునకు, దేవునికి కల సన్నిహితత్వమును గూర్చి చెప్పుచుండెడిది. కాని కొంతమంది కుచ్చితురాండ్రు శిశువు యొక్క యోగక్షేమములు విచారించుటకు బదులు వారిండ్లలో అభాండములు వేయుట, తగాదాలు పెట్టుట, చాడీలు చెప్పుట మొదలగునవి చేయుచు వ్యధా కాలహరణము చేయుచుండిరి. అప్పటి నుండి gossip అనగా వృధా కాలక్షేపము అను అర్థము వచ్చినది.

(5) ప్రవీణః (ప్రకృష్టః వీణాయాం): వీణ మీటుట యందు నేర్పరి అని అర్థము. చక్కని తెలివితేటలు కలవారే వీణను వాయించగల్గి యుండెడివారు. వీణను వాయించువారి నందరిని నేర్పరులని పిలువసాగిరి. కాని ఏ విద్యలో కాని, కళలో కాని నేర్పరియైన వారినందరిని 'ప్రవీణులు' అనుచున్నాము. అనగా అర్థవ్యాకోచము వలన 'నేర్పరి' అను సామాన్యర్థము కల్గినది.

(6) కుశలః (కుశాన్ లాతీతి కుశలః) : పూర్వము ఆశ్రమములలో గురుకుల వాసము చేయుచు విద్య నభ్యసించు శిష్యులు గురువుయొక్క నిత్యకర్మానుష్ఠానము కొరకు అడవికి వెళ్లి దర్భలను తెచ్చెడివారు. చాల పదునుగయుండు దర్భలను కోయుటకు జాగ్రత, నేర్పుఅవసరము. లేనిచో దర్భలను కోయువాని వ్రేళ్లకు దర్భగాట్లు పడి రక్తము వచ్చును. చాల నేర్పరులు, ఏమరపాటు లేనివారు, జాగ్రత కలవారు మాత్రమే దర్భలను త్రుంచ గలిగెడివారు. వారు నేర్పరులు. కాని ఈ విశేషార్థము మఱుగునపడి 'కుశలః' అనగా 'నేర్పరి' యను సామాన్యార్థము కల్గినది. ఇట్లు అర్థ వ్యాకోచము మన భాషలలో చాలా పదములకు అర్థమును పూర్తిగా మార్చి వేసినది.

II అర్థ సంకోచము

కొన్ని కారణముల వలన అర్థ బాహుళ్యముకల శబ్దము సంకోచార్థమును పొందును. అనగా సామాన్య వాచి విశేష వాచి యగును.

ఉదా : (1) లగ్నము : మేషాదిరాశుల యొక్క ఉదయమునకు లగ్నమని పేరు. వివాహములలో లగ్నముల నిర్ణయించి అందు మాంగళ్యధారణము జరుపుదురు. కాని వివాహమునకు అనగా మాంగళ్యధారణమునకు నిర్ణయింపబడిన కాలమును 'లగ్నము' అని అనుచున్నాము. దీనికి పర్యాయ పదముగా 'ముహూర్తమును' వాడు

చున్నాము. కన్నడభాష సంపర్కముకల బళ్ళారి జిల్లా ప్రాంతములో 'లగ్నము' అనగా వివాహము అని కూడ అర్థము.

(2) ప్రసాదము : సాధారణముగ భగవదను గ్రహమును ప్రసాదము అందురు కాని భగవంతునికి నివేదించిన ఫల,భక్ష్యాదులను ప్రసాదమనుచున్నాము. భగవదను గ్రహమును ఫల, భక్ష్యాదులతు పరిమితము చేయుచుంటిమి కాన ఇచ్చట అర్థసంకోచము.

(3) చీర : ఇది వస్త్ర సామాన్యమును తెలుపు శబ్దము. కాని ఇప్పుడు స్త్రీల వస్త్ర విశేషముగ వాడబడుచున్నది [11]

(4) Tide దీని ప్రాచీనార్థము 'కాలము' కాని క్రమముగా 'సముద్రపు అలలపోటు' అను నర్థమునకు వచ్చినది. అలలపోటు అనునది కాలములోని ఒక పరిమిత అంశము మాత్రమే.

(5) మృగః (మృగ్యతే ఇతి మృగః) : 'మృగ' శబ్దము జంతువు అను సామాన్య అర్థమును సూచించు చుండెడిది. 'మృగరాజః' (సింహము) అను ప్రయోగములు ఈ అర్థము మనకు బాగా విదితమగుచున్నది. కాని ఇప్పుడు ''లేడి లేక జింక'' అను సంక్షోభ అర్థములో ఒక ప్రత్యేకమయిన జంతువుగ వాడబడు చున్నది.

(6) తర్పణము : ''సంతోషింప చేయుట'' అని సామాన్యార్థము. కాని మనము సాధారణంగా పితృదేవతల కిచ్చు నివాపాంజలికే ఈ పదము నుపయోగించుచున్నాము.

(7) దర్శనము (చూచుట, చూపెడిది): దీనికి చూచుట, చూపించుట, చూపించెడిది అని యర్థము. కాని న్యాయా వైశేషిక మీమాంసాది శాస్త్రములవలన ఆ పరబ్రహ్మను, పరతత్త్వమును (లేక మోక్షమును) చూచెదము కావున ఈ శాస్త్రములకు దర్శనములని పేరు కల్గినది. ఇప్పుడు దర్శనములనగా మీమాంసాది శాస్త్రములు అని అర్థము.

III అర్థ పరివృత్తి

ఒక శబ్దమునకు కల అనేకార్థములకూడిక కొన్ని సమయములలో లాక్షణికార్థము (గౌణార్థము)నకు దారితీయును. ఆ శబ్దము యొక్క ముఖ్యార్థము మరుగునపడి గౌణార్థము మాత్రము మిగులును.

ఉదా : (1) లావణ్యము (అందము) : వంటకములలో ఉప్పు చాల ముఖ్యము. అది లేకుండుట లేక హెచ్చు తగ్గులుండుట వలన వంట రుచింపదు. అది తగిన పాళ్ళలో ఉండవలెను. అప్పుడే వంట రుచిగా నుండును. ఉప్పు వంటలో ఒకే ప్రక్క యుండక అంతయు వ్యాపించి రుచిని కల్గించును. వంటలో రుచి యనునది ఇక్కడ ఉన్నది, అక్కడ ఉన్నది, ఇక్కడ లేదు, అక్కడ లేదు అని చెప్పజాలము. అట్లే స్త్రీ యొక్క సౌందర్యము ఆమె కన్నులు, ముక్కు, చెవి, పలువరుస మొదలగువాటి తీరునందు సామూహికముగ నుండును కాని ఏ ఒక్క అంగములో మాత్రమే సౌందర్యము కలదని చెప్పజాలము.[12] కేవలము కండ్లు కాని, పలువరుస కాని, కేశములు కాని బాగుండినంత మాత్రమున ''ఆ స్త్రీ అందకత్తె'' అని చెప్పజాలము. కావున అంగములన్నియు సౌష్ఠవముగా యుండి దేహమున వినూత్నత, ఆహ్లాదము గోచరించినచోనది లావణ్యమనబడును ఇచ్చట 'లావణ్య' శబ్దమునకు 'అందము' అను అర్థము గౌణముగ ప్రాప్తించినది.

(2) కృపణః : అనగా బీదవాడు, దరిద్రుడు అని మొదటి అర్థము. దరిద్రుడు సాధారణముగ లేమిచేత డబ్బు వ్యయముచేయడు. అదేవిధముగ లోభియైనవాడుకూడ ధనము వెచ్చింపడు. ''కృపణః'' అను శబ్దమునకు ఇప్పుడు లోభియను నర్థము కల్గినది.

(3) గ్రామీణః (గ్రామములో నుండు వాడు) : సాధారణముగ పల్లెవాసులకు కపటోపాయములు, వంచన, దాంభికములు మొదలగునవి తెలియవు వారు అమాయకులు. కాని పై చెప్పిన దుర్గుణములు లేనివారగుటచే గ్రామీణ శబ్దమునకు లౌక్యము తెలియని వాడనియు, వెర్రిబాగులవాడనియు కొత్త అర్థము కల్గినది

(4) Spinster మొదట దీని కర్థము ''నూలువడకు స్త్రీ''. విదేశములలో సాధారణముగ ఎక్కువగా పెండ్లి కాని కన్యలు, స్త్రీలు నూలు వడకుచుండెడివారు కొలదిమంది వివాహిత స్త్రీలు కూడ ఈ పని చేయుచుండిరి. నూలు వడకుటలో అవివాహిత స్త్రీల సంఖ్య ఎక్కువగా నుండుటచే ఈ పదమునకు ''బ్రహ్మచారిణి'' అను అర్థము మిగిలినది.

(5) సమాధి : అనగ ''మనోలయము, నియమము, ఏకాగ్రత, ఏకాగ్రచిత్తత'' అని సంస్కృతమున దీనికి యర్థము. కాని తెలుగులో కొన్ని ప్రాంతములలో ''చనిపోయిన వారిని ఖననము చేసి'' ఆ తావులో ''చనిపోయిన వ్యక్తికి స్మృతి చిహ్నముగ కట్టిన కట్టడమును'' సమాధి యందురు.

(6) వ్యవసాయము : 'కష్టించి పనిచేయుట' అని దీనికి సంస్కృతములో యర్థము. కాని నేటి తెలుగు భాషలో కృషికర్మ (Cultivation) అను అర్థములో వాడబడుచున్నది. భూమిని దున్నుట, విత్తుట మొదలగు కృషికర్మ కష్టముతో చేయదగిన పని కాన వ్యవసాయమను పదము కృషికర్మ యను నర్థమును పొందినది.

(7) ప్రగల్భము : (సంస్కృతములో)ధైర్యముగ, సమయస్ఫూర్తితో మాట్లాడుట యని అర్థము. మనము మాట్లాడుకొను తెనుగు భాషలో 'డంబములు' అను అర్థమును సంతరించుకొన్నది.

అర్థపరిణామమునకు కారణములు : పైన ఉదహరించిన శబ్దములలో అర్థమునకు మార్పేల వచ్చినది అను ప్రశ్నకు నిష్కర్షగ సమాధానము చెప్పుట కష్టము. ఈ అర్థ పరిణామమునకు వ్యక్తి మనస్సు ప్రధాన కారణము. ఈ క్రిందివాటిని అర్థపరిణామమునకు కొన్ని కారణములుగా పేర్కొందురు.

1. ఆలంకారిక ప్రయోగము : మన భాషలలో అర్థ వివరణము కొరకు ముఖ్యముగ ఉపమ, రూపకాలంకారముల నెక్కువగా

నుపయోగింతుము. దీనివలన మనము చెప్పవలసిన భావము, అర్థము సుస్పష్టమగును.

ఉదా : (a) సింహోమాణవకః : 'ఈ బాలుడు సింహము' అని అర్థము. ఇచ్చట సింహము అనగా 'సింహసదృశ తేజః పరాక్రమములు కలవాడు' అని అర్థము

(b) Teething of a company : అనగా సహవాస ప్రారంభము అని అర్థము. Teething అనగా శిశువునకు కలుగు ప్రథమ దంతోద్భవము. ఇది ఇచ్చట 'ప్రారంభము' అను అర్థములో వాడబడినది.

. పరిసరములలో మార్పు: భౌగోళికము: కొన్ని సమయములలో భౌగోళికముగ శబ్దమునకు అర్థము మారును.

ఉదా : ఉష్ట్రము : దీని పూర్వార్థము 'కారెనుము, దున్న' అని. కాని ప్రజలు ఈ దున్నలుండు ప్రాంతమును విడిచి ఒంటెలుండు ప్రదేశములకు వెళ్లి యచ్చటనుండు ఒంటెలనే ఉష్ట్రము లని వ్యవహరింపసాగిరి. కాన ఇప్పుడు ఉష్ట్రములనగా ఒంటెలు అని అర్థము ఇట్లు ఈ అర్థములోని మార్పు ప్రజలు భౌగోళికముగ ఒక ప్రాంతమునుండి మరొక ప్రాంతమునకు తరలి వెడలుట వలన జరిగినదని ఊహింపవచ్చును.

3. సాంఘిక పరిస్థితులు : వీటివలన కూడ కొన్ని తావులలో అర్థము మారును.

ఉదా : (1) Pope : క్రైస్తవుల మతగురువును 'పోప్' అందురు. Pope శబ్దము Papa (అనగా తండ్రి) అను పదము నుండి పుట్టినది. అనగా మత గురువు తండ్రివంటివాడు అని అర్థము కాని ఇప్పుడు Pope అను శబ్దమునకు మతగురువు అని మాత్రము అర్థము.

(2) వరః (వరుడు): అనగా పెండ్లికొడుకు. వ్రియతే ఇతి వరః అను వ్యుత్పత్తినిబట్టి కన్యచే వరింపబడినవాడు వరుడు. వరింపబడనివాడు వరుడుకాడు. కాని మనము పెండ్లి కావలసిన యువకుల నందరిని 'వరులు' అని చెప్పుచుందుము.

(3) శ్వశురః శ్వశ్రూః : ఈ పదములు మొదట భర్త తండ్రికి, తల్లికి మాత్రము అన్వయించెడివి. కాని సాంఘిక పరిస్థితులలో మార్పు వచ్చుటచే భార్య తండ్రికి, తల్లికి కూడ వాచకము లయినవి

4. మూలవస్తువు లేక పదార్థముయొక్క మార్పు: ఒకవస్తువు ఒక మూలపదార్థముతో మొదట చేయబడి తరువాత ఆ వస్తువు క్రమముగ వేర్వేరు మూలపదార్థములతో చేయబడుచున్నప్పటికి మొదటినుంచి ఉపయోగింపబడుచున్న మూలపదార్థము పేరు శాశ్వతముగా నిలుచును. ఉదా : pen ఆంగ్లభాషలో pen అను వస్తువు (ఊటకలము)ను మొదట పక్షి ఈకలతో చేయుచుండిరట. తరువాత బంగారుతో చేసిరి. మరి కొంతకాలము తరువాత ఇప్పటి ఊట

కలముగా (fountain pen) రూపొందినది. pen తయారు చేయుటకు మొట్టమొదట ఉపయోగించిన మూలపదార్థము (ఇచ్చట 'ఈక') మారినప్పటికి pen అను పేరు శాశ్వతముగ నిల్చినది (pen అనగా ఈక అని old Englishలో అర్థము).

(1) Paper : పూర్వము papyrus అను చెట్టు బెరడును వ్రాయుటకు ఉపయోగించెడివారు. క్రమముగ ఇప్పటి కాగితమును తయారుచేయు మూలవస్తువులు మారినను కాగితమునకు paper అను పేరు దృఢపడినది.[13]

(2) సౌమ్యోక్తి : ఒక శబ్దమునకుండు చెడ్డ అర్థమును అమంగళమును ఇతరులకు తెలియజేయుటకు వారి మనస్సు నొప్పింపక వేరొక విధముగ తెలియజేయు దానిని enphimism(సౌమ్యోక్తి) అనెదరు. దీనివలన కూడ అర్థము మారును.

ఉ : పంచత్వం గతః—ఉన్నదున్నట్లు ''మరణించెను'' అని చెప్పుట అమంగళముగ భావించి మన పెద్దలు మరొక విధముగ మరణమును గూర్చి చెప్పుటకు ''పంచత్వం గతః'', ''దివం గతః'' ఇత్యాది సౌమ్య శబ్దములు వాడుచున్నారు. ఈ భౌతిక దేహము పంచభూతముల కలయికచే నేర్పడినది చనిపోయిన తరువాత దేహము పంచభూతములుగా విడిపోవునట. కాని ఈ యంతరార్థము మనము తెలుసుకొనజాలక ''పంచత్వము పొందుట'' అనగా చనిపోవుట అని మనము అర్థము చెప్పుచున్నాము. అట్లే 'చనిపోయినాడు' అనుటకు 'దివంగతః' (స్వర్గమునకు వెళ్లెను) అని సౌమ్యముగా చెప్పుచున్నాము. ఇట్లు సౌమ్యోక్తివలన కూడ శబ్దముల అర్థము మారును.

(3) అర్థబాహుళ్యత : ఒక శబ్దమునకు గల అనేకార్థత్వమును polysemia అందురు. కాలక్రమమున ఒక శబ్దమునకు మరిన్ని అర్థములు పుట్టును. కాని కొత్త అర్థము పాత అర్థమును త్రోసివేయక పాత, కొత్త అర్థములు రెండు కూడ ఉపయోగింపబడుచుండును. సాధారణముగ ఈ పాత, కొత్త అర్థములు సన్నిహితముగ నుండును.

ఉదా : Root అను పదము వ్యవసాయరంగములోను, భాషాశాస్త్రములోను, గణిత శాస్త్రములోను, లాక్షణికముగను వివిధార్థములలో ఉపయోగింపబడుచున్నది. అర్థబాహుళ్యముకల తావులలో వక్తృవివక్షితమయిన యర్థమును సందర్భము ప్రకరణముల బట్టి తెలుసుకొనవచ్చును.

(4) నీచార్థాపాదన : దీనిని ఆంగ్లభాషలో pejorative tendency అనెదరు. శబ్దములకుండు మంచి యర్థమును కప్పిపుచ్చి వాటికి నీచార్థములను, హేయార్థములను ఆపాదించుట ఈ తెగలోకి చెందినది.

ఉదా: దేవదాసి :—దేవాలయములందు నిత్యముజరుపు పూజాంగములుగ కొందరు స్త్రీలు పాటలు పాడుచు, నృత్యములు చేయుచు తాము కూడా దేవుని నారాధించుచు దేవుని సేవకే తమ జీవితము నంకితము చేసియుండిరి. వారికి దేవదాసీలని పేరు. వీరు సాధారణముగా యౌవనమున నున్నవారు, అందకత్తెలు. కాని కొందరు కుబుద్ధులు ఈ స్త్రీలను నీచముగ చూచుచు వారకాంతలవలె వీరు కూడ భోగింపబడుటకు మాత్రమే అర్హులని వీరిని నిందింపసాగిరి. కావున ఇప్పుడు 'దేవదాసి' శబ్దమునకు వారకాంత యను నింద్యార్థము కల్గినది.

అట్లే కొంప, గతుకు, ఏగు మొదలగు శబ్దములు అచ్చ తెనుగులో నున్నప్పటికిని వాటికెలనో నింద్యార్థము ఆపాదింప బడుటచే మన నిత్యజీవితములో ఇల్లు, తిను, వెళ్లు అను నర్థములలో వాడుట లేదు.

పై చెప్పినవి అర్థపరిణామమునకు కొన్ని కారణములు మాత్రమే. ఇవి కూడ శాశ్వతములు కావు. వీటికి కొన్ని అపవాదములు కూడ ఉండవచ్చును. పరిణామ సహజమైన భాషకు ఏ సూత్రములు గాని, కారణములుగాని శాశ్వతముగా అన్వయింపవు. మారని భాష ఒక తావున నిలచియున్న మురికినీరు వంటిది. కావున భాషా ప్రగతికి అర్థపరిణామము దోహదకారి యగుచున్నది.

అధోజ్ఞాపికలు

1 రఘువంశము, I. 1

2 భారతి (1958 ఫిబ్రవరి), పుట 33.

3 నిరుక్తము (ఆంగ్లానువాదముతో లక్ష్మణ సరూప్ సంపాదకత్వము, మోతీలాల్ బనారసీదాస్ ప్రచురణము II, 1967, అధ్యాయము 10, పుట 174.

4 అధ్యాయము 3, పుట 67.

5 శాబర భాష్యము, II. 1.5

6 తర్కసంగ్రహము, శబ్దపరిచ్ఛేదము.

7 వాక్యపదీయ వ్యాఖ్యానము, ప్రథమ కాండము, శ్లో. 1

8 ఐతరేయోపనిషత్, శాంతిపాఠము.

9 వాక్యపదీయము, ద్వితీయ కాండము శ్లో : 31.

10 ఆంధ్రభాషా వికాసము, పుట 588. (త్రివేణీ పబ్లిషర్స్)

11 ఆంధ్రభాషా వికాసము, పుట 589

12 దీనిని గురించి అభినవగుప్తులు ధ్వన్యాలోక (I. 4) లోచన వ్యాఖ్యానమునందు చర్చించిరి.

13 Stephen Ullman The principles of Semantics (Glasgow University publications, II ed. 1957), p. 183.

వాడి వసంతం

కవితాప్రియ

వసంతాన్ని చూస్తే
 వాడికి చెప్పలేని భయం!

వట్టిపోయిన చెట్టు
కిసలయ సంతతిని
పల్లవిస్తుందని
ఇంకిపోయిన ధమనుల్లో

చైతన్యరుధిరం
ప్రవహింపజేస్తుందని
ఢమరుక ధ్వనులు
ప్రతిధ్వనింప జేస్తుందని

మూగవోయిన
కోయిల కంఠం
కిసలయాస్వాదస్పందనతో
జగతికి

స్వేచ్ఛామాధుర్యరుచులు
ప్రబోధిస్తుందని

అరుణారుణ కాంతులతో
యువ గులాబీ
ప్రజ్వరిల్లుతుందని
ప్రగతి పథానికి
నవ ఊపిరులూదుతుందని

కొమ్మలోపలి
ఆకు కొనలు
గుండె లోపలి
వ్యధలు రగలగల
బాకులుగా
పరిక్రమిస్తాయని

స్వార్థం గుండెల్లో
మేకులు దించుతాయని

వసంతాన్నిచూస్తే
వెన్నులో చలి వాడికి
కరాళ కీల లెగయు
సముద్దండ గ్రీష్మమే వాడ వాడికి

వాడి గ్రీష్మం వాడి
వాడి వసంతపు
చైతన్యోద్దీప్త
ప్రగతి ద్యుతిలో కరగాలి
స్పందితజన
జ్యోతిర్గీతిలో కలవాలి

అప్పుడే జనావళికి సంతసం
అదే అభ్యుదయానికి సంకేతం.

కవితా తరంగాలు

శ్రీ యస్. జి. డి. చంద్రశేఖర్

కవి మనసు కడలిలో
 తొలి ఉషస్సు వెలుగులో
తెరలిందొక కెరటం
విరిగిందొక కెరటం
చేప నడుము విరిగిందని
చేదునిజం తెలిసిందని
చెరువు చేతులెత్తి ఏడ్చింది

కవి మనస్సు కన్నులలో
తొలి ఆమని సన్నులలో
తొలిగిందొక పుష్పం
విరిగిందొక కుసుమం
తొలిరేకుని రాల్చిందని
తన సోకుని వీటిందని
కుమిలిపోయిందొక భ్రమరం

కవి మనో శిఖరంపై
మన జగత్ పీఠంపై
ఎగిరిందొక పతాకం
తిరిగిందొక కపోతం
మనిషి మేధ పెరిగిందని
మానవత్వం తరిగిందని
కుమిలిపోయిందొక సహృదయం!

శ్రీ ఏ. కృష్ణారావు

జాన్ స్టూవర్ట్ మిల్ ప్రజాస్వామ్యవాదము

రాజనీతి తత్త్వశాస్త్రంలో జాన్ స్టూవర్ట్ మిల్‌తో ఒక నూతన శకం ప్రారంభమవుతుంది.[1] ప్రజాస్వామికవాదాన్ని ముఖ్యంగా వ్యక్తి స్వేచ్ఛను సమర్థించటంలో ఉదారవాదాన్ని (లిబరలిజమ్) వివరించటంలో అగ్రస్థానం వహించాడు.

ప్రాతినిధ్య ప్రభుత్వము

రాజ్యము ప్రజల అంగీకారంతో వారి ప్రయోజనాలను సాధించటానికి ఏర్పడుతుంది. సార్వభౌమాధికారం ప్రజలలో ఉంటుంది.[2] ప్రభుత్వం ఎన్నికలద్వారా ప్రజలనుంచి ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధుల సభ (పార్లమెంటు) ప్రభుత్వ విధులను, చర్యలను జాగ్రత్తగా పరిశీలించటం. ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనను, అధికారాలను, విధుల నిర్వహణను విమర్శనాత్మకంగా పరిశీలించి తగినవిధంగా అజమాయిషీ చేయటం.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం (రిప్రెసెంటేటివ్ డెమాక్రసీ)లో ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నికలద్వారా ఏర్పాటు చేస్తారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వ సంస్థలు పనిచేయాలి. ప్రజాభిప్రాయం సక్రమంగా వ్యక్తం అవాలంటే ప్రజలు ప్రభుత్వ నిర్మాణంలో, కార్యకలాపాలలో ప్రోత్సాహంలో క్రియాత్మకంగా పాల్గొనాలి. ప్రజాస్వామ్యం రెండు విధాలుగా ఉంటుంది: 1) ఎన్నికలు 2) స్వేచ్ఛ.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను ప్రత్యక్ష ఎన్నికద్వారా ప్రజలు ఎన్నుకోవాలి. అప్పుడే అది ప్రాతినిధ్య ప్రభుత్వం అవుతుంది.[3] ప్రజాప్రతినిధులు ప్రజల సంపూర్ణాధిపత్యానికి లోబడి పనిచెయ్యాలి. వారి కనుసన్నలలో మెలుగుతూ, వారి ఇష్టానుసారం తమ కర్తవ్యాలను నిర్వహించాలి. తుది నిర్ణయాధికారం ప్రజలదే కాని ప్రతినిధులకు చెందదు.

ప్రజాప్రతినిధులను ఎన్నుకోటానికి సాధనము ఓటుహక్కు. ఇది ఎక్కువ ప్రజలకు ఉండాలి. ప్రతి స్త్రీ, పురుషునికి ఎటువంటి విచక్షణ లేకుండా ఓటువేసే అధికారాన్ని కల్పించాలి. అయితే మిల్ సార్వజనీన వయోజన ఓటు హక్కు (యూనివర్సల్ ఎడల్ట్ ఫ్రాంఛయిజ్)ను సమర్థించలేదు. వయోపరిమితితోబాటు ఓటర్‌కు విద్యార్హత కూడా ఉండాలి. సార్వజనీన వయోజన ఓటుతో సార్వజనీన వయోజన విద్య అవసరాన్ని గుర్తించిన రచయితలో మిల్ ప్రథముడు. అంతేకాక ఓటర్‌కు కొంత ఆస్తి కూడా ఉండాలని ఇతడు వాదించాడు. మిల్ అభిప్రాయంలో ఆస్తి బాధ్యతను సూచిస్తుంది. ఆస్తిలేని వ్యక్తి ఇతరుల ధనాన్ని ముఖ్యంగా పన్నులు కట్టేవారి ధనాన్ని (టాక్స్ పేయర్స్ మనీ) దుర్వినియోగం చేయవచ్చు. ఆస్తి, విద్యలతో నిమిత్తం లేకుండా వయోజన ఓటు హక్కును కల్పించిన ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలకు ఈ వాదం వింతగా కనిపించవచ్చు; కాని ఆర్థిక విద్యారంగాలలో వెనుకబడిన భారతదేశం వంటి రాజ్యాలలో ప్రజాస్వామిక సంస్థల తీరుతెన్నులు రాజకీయ నాయకులు వాటిని స్వలాభానికి ఉపయోగించుతున్న ధోరణులు మిల్ వాదాన్ని మనం పునశ్చరణ చేయవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణిస్తున్నాయి.

ప్రజాభిప్రాయం ప్రభుత్వ నిర్వహణలో సక్రమంగా ప్రతిబింబించాలంటే ప్రజలలో అన్ని వర్గాలకు, అభిప్రాయాలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి. ఇది నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం (ప్రపోర్షనల్ రిప్రెసెంటేషన్) ద్వారా సాధ్యమవుతుంది.[4] పార్లమెంట్‌లో ప్రతి వర్గానికి దాని సంఖ్యా బలాన్ని అనుసరించి ప్రాతినిధ్యం కల్పించాలి.

ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు అధిక సంఖ్యాకుల అభీష్టాన్ని అనుసరించి జరుగుతాయి. అయితే అల్ప సంఖ్యాక వర్గాల అభిప్రాయాలకు కూడా తగిన విలువనివ్వాలి. కేవలం సంఖ్యా బలానికి మాత్రమే గుర్తింపు ఉండరాదు ఎందుకనగా అధిక సంఖ్యాకుల నిర్ణయం అన్ని సందర్భాలలోనూ సమంజసంగా ఉంటుందని భావించరాదు. అన్ని నిరంకుశాల కంటే అధిక సంఖ్యాకుల నిరంకుశత్వం అతి క్రూరమైనది (టయిరనీ ఆఫ్ మెజారిటీ) అని మిల్ అభిప్రాయము. అంతేకాక కేవలం అధిక సంఖ్యాకుల సమ్మతిపై ఏర్పడిన ప్రాతినిధ్య సంస్థలు కొన్ని సందర్భాలలో అజ్ఞానులకు, అవివేకులకూ సాధనాలను కల్పిస్తాయి. తలలకే కాని అభిప్రాయానికి విలువ ఉండదు.[5] అటువంటి నిర్ణయాలను, ప్రభావాన్ని తటస్థీకరించటానికి ''ప్లూరల్ ఓటింగ్''[6] విధానాన్ని మిల్ సూచించినాడు. ప్రజల స్థాయిని బట్టి, ఒకొక్క వ్యక్తికి అతని అర్హతలను గుర్తించి అతనికి అదనపు ఓట్లను కల్పించాలి.

వ్యక్తిగత స్వేచ్ఛ

జె.ఎస్. మిల్ రచనలో ఎక్కువగా వ్యక్తి స్వేచ్ఛ వాదం (ఇండివిడ్యువలిజమ్) కనిపిస్తుంది. ఇతని "ఆన్ లిబర్టీ" వ్యక్తి స్వేచ్ఛను వివరించటంలో, సమర్థించటంలో ఈ నాటికీ ఒక ప్రామాణిక గ్రంథంగా పరిగణింపబడుతున్నది స్వేచ్ఛ ప్రతి వ్యక్తికీ అవసరమనీ, వ్యక్తి నుంచి అది విడదీయరానిదని, సామాజిక జీవనంలో భిన్నత్వాన్ని పెంపొందించటానికి, నైతిక, మానసిక, భౌతిక రంగాలలో స్వేచ్ఛ చాలా అవసరమని మిల్ దృఢ విశ్వాసము. వ్యక్తి స్వేచ్ఛను సమర్థించటంలో మిల్, వోల్టేర్, మిల్టన్, రూసో, థామస్ ప్రేన్, జఫర్‌సన్ మొదలైన సుప్రసిద్ధుల కోవకు చెందినవాడు.

మిల్ అభిప్రాయంలో సమాజంలో జీవించే వ్యక్తులు అనేక అభిప్రాయాలు, ఆసక్తులు కలిగి ఉంటారు. విభిన్నమైన ఆసక్తులు, వాటి గుర్తింపు సమాజ వికాసానికి అవసరము. అంతేకాక సామాన్యంగా ఒక వ్యక్తి చర్యను అతని ఆలోచన నిర్దేశిస్తుంది. ప్రతి వ్యక్తి తన అభిప్రాయాలను యథేచ్ఛగా వ్యక్తం చేయటానికి, అతని చర్యలలో ఇతరుల జోక్యం లేకుండా ఉండటానికి తగిన పరిస్థితులను రాజ్యం కల్పించాలి. వ్యక్తి స్వేచ్ఛను సమాజ జోక్యం నుంచే కాక ప్రభుత్వ నియంత్రణ నుంచి సంరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని మిల్ గ్రహించాడు.[7] ప్రభుత్వ జోక్యం ఎంత తక్కువగా ఉంటె వ్యక్తికి అంత ఎక్కువ స్వేచ్ఛ లభిస్తుందని మిల్ భావిస్తాడు.

వ్యక్తి స్వేచ్ఛను కేవలం రాజకీయాధికారంనుంచి పరిరక్షించటంతోనే మిల్ తృప్తి పడలేదు. సమాజ జోక్యం, సమాజ నియంత్రణ వ్యక్తి స్వేచ్ఛపై ఉండరాదని వాదిస్తాడు. సమాజ సంప్రదాయలు, కట్టుబాట్లను ఉల్లంఘించే వ్యక్తులపై సమాజం విధించే శిక్షలు, నియంత్రణలు[8]. వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోటానికి ప్రతిబంధకాలుగా తయారయి చివరికి (అవి) తన వ్యతిరేకాభిప్రాయం, అసమ్మతి భావాలను, వొదలుకొని కేవలం యంత్రంలో ఒక భాగంగా మిగిలిపోయే ప్రమాదం సంభవిస్తుంది.

మిల్ అభిప్రాయంలో 'స్వేచ్ఛ' సమగ్రమైనది. ప్రతి వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించు కోటానికి అభిప్రాయ ప్రకటనకు, ఆంతరంగిక వ్యవహారాలలో స్వేచ్ఛ అవసరము. స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని మరియు ఆవశ్యకతను ఈ విధంగా వివరిస్తాడు.[9] ప్రతి వ్యక్తి చర్యలను మిల్ రెండు రకాలుగా విభజిస్తాడు — వ్యక్తి యొక్క వ్యక్తిగతమైన చర్యలు అతనికి మాత్రమే సంబంధించినవి; ఇతరులకు సంబంధించిన చర్యలు. ఒక వ్యక్తి యొక్క చర్య లేదా కార్యకలాపాలు కేవలం అతనికి సంబంధించినవే అయితే - అంటే వాటి వల్ల ఇతరులకు ఏ విధమైన హాని కలుగ కుండా ఉంటే- ఆ వ్యక్తి యొక్క అటువంటి కార్యకలాపాలలో ఇతరుల జోక్యం పనికిరాదు అంతేకాక సమాజం అతని వ్యక్తిగత వ్యవహారాలలో ఏ విధంగానూ జోక్యం చేసుకోకూడదు. అతడు చేసే చర్య కంటే మరొక చర్య ద్వారా అతని ప్రయోజనం బాగా నెరవేరుతుందనే నెపంతో అతనిని సమాజం ఏ విధంగా నిర్బంధించ కూడదు.

రెండవ రకమైన చర్య సమాజ ప్రయోజనాలకు సంబంధించినది. ఒక వ్యక్తి చర్య వల్ల ఇతరులకు హాని కలుగుతుందని భావించినప్పుడు మాత్రమే సమాజం అతనిని నిరోధించవచ్చు. ఉదా : దొంగతనము, హత్య, మొదలైనవి. ప్రతి వ్యక్తి 'తన శరీరము, ఆలోచన, ఆత్మలపై సార్వభౌముడు.''

పై విధంగా వ్యక్తి చర్యలను వ్యక్తిగతమైనవి (సెల్ఫ్ - రిగార్డింగ్), సమాజ పరమైనవి (అదర్ రిగార్డింగ్) అని మిల్ వ్యక్తుల కార్యకలాపాలను వర్గీకరించినాడు. అయితే అనుభవపూర్వకంగా, తార్కికంగా సదరు వర్గీకరణ వాస్తవంలో సాధ్యం కాదు. ఒక వ్యక్తి కార్యకలాపాలను వ్యక్తి పరమైనవి, సమాజ పరమైనవి అని ఖచ్చితంగా అన్ని సందర్భాలలోనూ మనం విభజించలేము ఎందుకనగా ప్రతి వ్యక్తి వ్యక్తిగత మరియు సమాజ కార్యకలాపాలలో పాల్గొంటాడు. ఉదా : ఆరోగ్యము, విద్య ఇవి అతనికి సంబంధించినవే అయినప్పటికీ అనారోగ్య కారణాల వల్ల అతడు సమాజ వికాసానికి తోడ్పడతాడు. ఈ సందర్భంలో మిల్ విపరించిన తీరు అతడు ఏక కాలంలో వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛ కావాలని కోరాడు. అదే సమయంలో సమాజంలో ఒక బాధ్యతా యుతమైన సభ్యుడుగా వ్యక్తి వ్యవహరించాలనటం పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి.

ముగింపు

వ్యక్తి స్వేచ్ఛా వాదాన్ని వ్యాప్తి చేసిన ప్రముఖ రచయితలలో మిల్ ప్రథముడు. ప్రతి వ్యక్తి కార్యకలాపాలు, ఆలోచనలలో సమాజం, ప్రభుత్వం ఏ విధంగానూ జోక్యం చేసుకోరాదు. పౌరులకు వారి అభిప్రాయాలను యథేచ్ఛగా వ్యక్తం చేయటానికి అవకాశం ఉండాలి. అభిప్రాయ సంఘర్షణ, లేదా వాక్ స్వాతంత్ర్యము కేవలం ఒక అభిప్రాయాన్ని సమర్థించటానికి మాత్రమే పరిమితం కారాదు. తన అసమ్మతిని (డిసెంట్)తెలియజేయటానికి పౌరునికి అవకాశం ఉండాలి. దానికి సంఖ్యా బలంతో నిమిత్తంలేదు. ''ప్రజాస్వామ్యం అసమ్మతిపై జీవిస్తుంది; నియంతృత్వం మనుగడ సంపూర్ణ విధేయతపై ఆధారపడి ఉంటుంది'' అన్న సత్యాన్ని మనం మరువరాదు. అంటే ఏ ఒక్క వ్యక్తి అయినా సమాజాభిప్రాయానికి వ్యతిరేకంగా తన భావాలను ప్రకటించటానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు తమ అధిక సంఖ్యాక నిర్ణయం ద్వారా ఇతరులు అతని నోరు నొక్కటానికి ప్రయత్నించరాదు. ఈ సందర్భంలోనే ప్రభుత్వానికి వ్యతిరేకాభిప్రాయాన్ని అణిచివేసే అధికారం లేదని మిల్ వాదిస్తాడు. మెజారిటీ నిర్ణయం మైనారిటీ అభిప్రాయాన్ని నిరోధించరాదు. ఒకవ్యక్తి అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయం సమాజం కలిగి ఉన్నప్పటికీ దానిని నిరోధించే అధికారం సమాజానికి లేదు.[10]

ఈ సందర్భంలో ప్రస్తుత కాలంలోని ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను మనం దృష్టిలో ఉంచుకోవాలి. ఈనాటి ప్రభుత్వ కార్యకలాపాలు మెజారిటీ అభిప్రాయానుసారం నిర్వహిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, వాస్తవంలో వారి అభిప్రాయాలకు కొద్దిమందిని ప్రభావితం చేయటం లేదా శాసించటం జరుగుతున్నది. ముఖ్యంగా ఆర్థిక సాంఘిక రంగాలలో వెనుకబడి ఉన్న దేశాలలో ముఖ్యంగ భారతదేశంలో భావ ప్రకటన స్వేచ్ఛపై అనేక పరిమితులున్నాయి.

జె. ఎస్. మిల్ సాంప్రదాయిక వ్యక్తి స్వేచ్ఛావాది. అతని కాలంలో ఉన్న రాజకీయ, సాంఘిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మిల్ తన అభిప్రాయాలను వ్యక్తం చేసాడు. అపరిమితమైన స్వేచ్ఛ అవాంఛనీయమైనప్పటికీ స్వేచ్ఛ కంటే స్వేచ్ఛపై విధించవలసిన ఆంక్షలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినప్పుడు స్వేచ్ఛా భావం నశించిపోతుంది.

అధోజ్ఞాపికలు

1 జె. ఎస్. మిల్ మే 20, 1806 లో లండన్‌లో జన్మించాడు. అతి చిన్న వయస్సులోనే లాటిన్, గ్రీకు భాషలలో పాండిత్యాన్ని సంపాదించి, విశ్వవిఖ్యాతి చెందిన రాజనీతి రచయితగా స్థిరపడినాడు. ఇతని రచనలలో ప్రధానమైనవి :

1. System of Logic (1843); 2. Principles of Political Economy (1848); 3. On Liberty (1859); 4. Representative Government; 5. Utilitarianism (1861). 1873లో మరణించాడు.

2 Ideally the best form of Government is that in which "the sovereignty,as supreme controlling power in the last resort, or vested in the entire aggregate of the community."-Representative Government, chap. III.

3 "...That the whole people, or some numerous portion of them, exercise, through deputies periodically elected by themselves, the ultimate controlling power, which, in every constitution, must reside somewhere. This ultimate power they must possess in all its completeness. They must be masters, whenever they please, of all the operations of government." – Ibid, Chap. V.

4 నైష్పత్తిక ప్రాతినిధ్య మనగా ఒకొక్క నియోజకవర్గంలో రాజకీయ పార్టీలకు ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి వారి ప్రతినిధులు ఎన్నిక అవుతారు. ప్రస్తుతం మన దేశంలో ఈ పద్ధతిని రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవటంలో, రాష్ట్ర విధాన మండలి సభ్యుల ఎన్నికలలో విరివిగా ఉపయోగిస్తున్నారు.

5 An inevitable tendency of popular government towards "collective mediocrity" enhances the peril from this source, sothat power gravitates surely towards the lessintelligent classes of the people. – "Political Theories', Dunnings Vol.II, p. 241.

6 అల్ప సంఖ్యాక వర్గాలకు, విద్యాధికులకు ఒకటి కంటే ఎక్కువ ఓట్లను కల్పించే పద్ధతిని బహుఓటు పద్ధతి లేదా ప్లూరల్ ఓటింగ్ విధానము అంటారు.

7 "The people who exercise power in a self-governing state are not always the people with those over whom it is exercised; and the self-government spoken of is not the government of each by himself, but of each by all the rest...... The limitation, therefore, of the power of government over individuals loses some of its importance when the holders of power are regularly accountable to the community...... In political speculation 'the tyranny of majority' is now generally included among the evils against society requires to be on its guard" – J. S. Mill 'On Liberty - Chap I.

8 'The tendency of the society is usually to impose, by means other than civil penalties, its own ideas and practises as ruls of conduct on those who dissent from them; to better the development and if possible, prevent the formation of any individuality not in harmony with its ways, and compel all characters to fashion themselves upon the model of its own" – Ibid.

9 'The object of this essay is to assert one very simple principle, as entitled to govern absolutely the dealings of society with the individual in the way of compulsion and control, whether the means used be physical force in the form of legal penalties or the moral coercion of public opinion· That principle is that the pole end for which mankind are warranted individually or collectively in interfering with the liberty of action of any of their member is self - protection ... ... His own good, either physical or moral is not a sufficient warrant...... The only part of the

conduct of any one for which he is answerable to the society is that which concerns others in the part which nearly concerns himself, his independence is, of right, absolute over himself, over his own body and mind, the individual is sovereign." Ibid, Chap I.

10 "It is as noxious or more noxious when exerted in accordance with public opinion than when in opposition to it. If all mankind would be no more justified in silencing one person, if he had the power, would be justified in silencing mankind." – Ibid.

సంప్రదింపు గ్రంథములు

Davidson – Political thought in England.

Doyle – A History of Political Thought.

Dunning – From Roussean to spencer (A History of Political Theories Vol III.)

Maxey – Political philosophies.

Mill – On Liberty.

Mill – Representative government.

Sabine – A History of Political theories.

వి కృష్ణారావు – జె. ఎస్. మిల్–స్వేచ్ఛ, తెలుగు త్రిమాస పత్రిక, జనవరి–మార్చ్ 1978.

మా కొరకు చెమ్మగిల్ల నయనము లేదు*

శ్రీ కే. కిశోరుబాబు

శ్రీ కే. అశోకుబాబు

త్తరెండల కటిక చీకట్ల
జడివానల సుడిగాలుల
పక్షి సంహతిని, పాంధగణాన్ని
కన్నడ చేయక కన్నతల్లిలా
అక్కున చేర్చుకొని
నెయ్యం తియ్యం కురిపిస్తుంటుందని
కిమ్మిర కుసుమాల
పీయూష ఫలాల
అన్నపూర్ణలా ఆప్యాయంగా వడ్డిస్తూ
ఎల్లరికి ఆమె తలుపెట్టి
ఆమోదింప చేస్తుంటుందని
"పాదప మాహాత్మ్యాన్ని"
భళి భళియని ప్రశంసించు
భట్టుమూర్తులు తండోపతండం !
కాని
ఏండ్లును పూండ్లును
జఠరాంధకారపు ధరిత్రీ పొరలలోనే
జడదారుల్లా వసిస్తూ
వాడి వత్తలవుతుగూడా
అహరహం ఆహార సదుపాయతల నందిస్తూ
దృఢతా స్థిరతలను కూరుస్తూ
వృక్షాభివృద్ధికి దాని అభ్రంకషోన్నతికి అరవచాకిరి గావిస్తున్న
"మావేళ్ళ" ఘనతను
మేలు మేలని పొగడు వాడొక్కడు కనుపించడు ఆశ్చర్యకరం!
మహీరుహ పల్లకీని మోయు బోయీలని
మాపై నిరంతర న్యక్కారం !
నిరతం చకారపు గుడుల ప్రయోగం !
మాకొరకు చెమ్మగిల్లు నయనమ్మేలేదు.
కల్యాణ మంథరాదులకే కైమోడుపులు సలుపు ఈ కుత్సిత జగాన
వాటికి గోడ చేరుపులుగ నిలుచు అగస్త్యభ్రాతలకు
జయపెట్టు శుభదినం వచ్చేనా ? ? ?

* శ్రీ కృష్ణశాస్త్రిగారికి కృతజ్ఞతలతో.

కీ. శే. వేలూరి శివరామశాస్త్రిగారు

దహరోపాసన

ఈ ఉపాస్తి యందు సాధకుడు హృదయ గుహలో నుండును — 'హృది హ్యేష ఆత్మా.' అనగా దహరాకాశమున మనస్సును లగ్న మొనరించి 'నేను బ్రహ్మ' మను అని ధ్యానింపవలయును. హృదయము ధ్యానమునకు పవిత్రమగు క్షేత్రము. ఇచట ధ్యానము గంభీరమగుచో తత్త్వ ప్రకాశము కలుగును. దీనివలన సంకల్ప సిద్ధియగును. హృదయమును కేంద్రీకరించి ధ్యానము చేయుచో శీఘ్రముగా అఖండమగు నొకానొక తేజస్సు కనబడును. హృదయ మనిన మనసు హృదయాకాశ మనియే అర్థము చేసికొందుము.

యాకాశమున కెల్లలు లేవు ధ్యానము గంభీరమగు కొలదిని దీని నైజము మనకు ఉపలబ్ధమగును. ఇంతియు కాదు, ధ్యానము నిరూఢమైనపుడు హృదయ గుహ నుండి సహస్రారమునకు బోవు నాడీ రూపమగు నొకానొక దారి కనబడును. సాధకు డీదారిని బడి పోగలుగు నెడల తేజోమయునగు ఒకానొక సత్తను అధిగమించును. ఇచ్ఛ గలుగుచో ఆ దారిని నిష్క్రమించి యీ శరీరమును విడువగలుగును. ఈ మార్గ మతి సూక్ష్మము. దీని యెఱుక యొదవిన నాడు సాధకుని జ్ఞానము అపరిసీమమును, గతి అప్రతిహతమును అగును. ఎటులంటేని యీ దారికిని దివ్య జగతికిని మనో బుద్ధుల కందని సంబంధమున్నది. దహరాకాశమున ధ్యానమునకు ఫలముగా సాధకుడు అధ్యాత్మానుభవ సంపన్ను డగును. మఱియు అతని అలౌకిక జ్ఞానము సత్యోద్భాసితమును సతత ప్రకాశ శీలమును అగును. కర్మ మితని నంటదు. సాధారణ జ్ఞానము దీని నెఱుగ జాలదు. ఇది స్వతఃస్ఫూర్తము, దివ్యము. దీనివలన అహంకారమునకు నాశము కలుగును. స్వచ్ఛమును వ్యాపకమును నగు అస్మితాబోధ ఒదవును. అస్మిత 'నేను' మయమయిన జ్ఞానవృత్తి — 'తన'మయమయిన జ్ఞానవృత్తి. ఇది అత్యంత స్వచ్ఛమును సుఖమయమును. ఈ అస్మిత దృఢముగా నెలకొనినచో 'సర్వ' మయ బోధలో పర్యవసన్న మగును. యోగశాస్త్రమున ఈ తత్త్వము హిరణ్య గర్భుడు. ఈ బోధద్యోతన శీలము — ఈ బోధమును సర్వ బోధములకును సూత్రము జేసియే దివ్యసత్తా ప్రకాస్తి.

దహరమనిన అల్పమని అర్థము. సూక్ష్మమగుట జేసి అల్పము కాని దేశవ్యాప్తిచే అల్పమని కాదు. అది యీ ఆకాశము కంటె విశాలము. పైనెంత స్వచ్ఛమో క్రింద గూడ అంత స్వచ్ఛము. ఆధారముమీదను క్రిందను గూడ స్వచ్ఛమును శాంతము నగు జ్యోతి. అనుభవము గంభీరమగు కొలది చిత్త మందంతట నిది ప్రతిఫలించును. ఒకానొక జ్యోతిర్ధార సాధకుని ఉనికిని ప్లావిత మొనర్చును. సాధకుడు దానికి సాక్షిగా బ్రహ్మప్రతిష్ఠ కలవాడు కావలయును. ఈ జ్యోతిర్ధారచే అపార్థివమగు సిద్ధి ఆవిర్భవించును. కాని ఔదాసీన్యమునే స్థిరముగా చేకొనినచో తత్త్వోదయము కానారంభించును.

ఉపాసన సిద్ధించుచో విశ్వవ్యాప్తియగు జ్ఞానముతో పరిచయము కలుగును. దానికి అస్మితయే ద్వారము. అస్మితాబోధ మత్యంతము సూక్ష్మము. ఈ అస్మితా సూత్రముతో విరాడాత్మకు సంబంధము కలదు. ఈ వైరాజమునకు సాక్షి కాగలుగునెడల బ్రహ్మబోధము సుప్రతిష్ఠితమగును. కేంద్రీ భూతమగు నీయస్మిత అందు లయమగును. అస్మితానుసంధానము అపార్థివమగు జ్ఞాన మార్గమును చూపును. 'ఈ అస్మితను సాక్షిగా చూడగల నేర్పు బ్రహ్మప్రతిష్ఠను కలగించును. జ్ఞానమార్గ సాధకుడు ఈ రీతిగా ఉపాస్తినే అవలంబించియు స్థితిని బడయనేర్చును.'

అహం గ్రహోపాసన

కొన్ని ఉపాస్తులలో బాహ్య పదార్థములయెడ బ్రహ్మదృష్టి చెప్పబడినది. ఈ యుపాస్తి యందు సక్రియమగు తన సత్తయెడ బ్రహ్మదృష్టి చెప్పబడినది.

మానవుని అహం వృత్తి - 'నేను' అను వృత్తి—మనశ్శరీరేంద్రియములపై సంచారితమై వాని యందే బిగిసి యుండును. అనగా ప్రతివాడును తన శరీరమునే తాననుకొనును. తన ఇంద్రియములనే తానని అనుకొనును. తన మనస్సే తాననుకొనును. ఉపనిషత్తులు 'నేను' అను ఈ వృత్తిని వ్యాపకమును ఉదారమును చేయుమని ఉపదేశించును. ఇది పెద్దదగు కొలదిని దీని సంకోచము నశియించును.

ఈ ఉపాసన పద్ధతి యిటులు — నీవే పదార్థమును చూచినను మనస్సంయోగ మొనర్చి దానిలో 'నేను' అను బోధమును నెలకొలుపవలయును. అనగా ప్రతిదియు నేనే అని భావింపవలయును. క్రమక్రమముగా 'నేను' అను నీ భావన సూక్ష్మమై ఆయా యీ పదార్థ స్వరూపము వడయును. ఈ రీతిగా అన్ని పదార్థము లందును ఇటులు భావించుట వల్ల ఆ పదార్థ సత్త 'నేను' అను ఈ ఎఱుకలో లీనమగును. సూర్యునియం దాత్మ ప్రతిష్ఠ యొనరుచుచో 'నేను' అను ఈ ఎఱుకలో విశ్వస్ఫూర్తి కలుగును. వాయువునందిటులు చేయుచో శక్తి స్ఫూర్తియు కలుగును. ఇటులీ ఆత్మప్రతిష్ఠ లెస్సగ నెలకొన్నచో విశ్వమంతయు 'నేను'లో అంతర్గతమై ఉద్భాసితమగును. అపుడు అంతయు 'నా' యందే అంతర్గతము, 'నా' యందే వికసితము, 'నా' యందే

ఉన్నదియునై పోవును. ఉపనిషత్ సాధనలో ఇదియే విశేషము. సకల పదార్థములను ఆత్మరూపముగా చూచుకొనుచు పోవగా పోవగా నిజవిరాట్ స్ఫూర్తి కలుగును. అటు పిదప దేశ కాలములలో ఆత్మ బుద్ధి బంధింపబడి యుండదు.

ఈ అనుభూతికి చాల విలువ కలదు. 'జగత్తు మనకు వెలుపల నున్నది' అని మన అందఱకును సాధారణాభిప్రాయము. కాని యీ అహంగ్రహోపాసన ఆ యభిప్రాయమును మార్చివైచును. విషయితను విశాల మొనరించును. దీన పెక్కు రీతులగు యోగ విభూతులబ్బును. ఏ పదార్థము మీద నేననుకొనబడు సాధకుని చూపు పడునో ఆ పదార్థము నందు శక్తి విస్తృతమగును; దాని ఆవరణము తొలగును; దాని యెడ చిత్తమునకు సంకోచముండదు. ఇటులు సాధకుని చిత్తవృత్తి ఆ పదార్థము నభిభూత మొనరించును.

ఇటులు ప్రపంచమంతయు తానైనందున ప్రపంచము దుఃఖ స్వరూపమను మాట పోవును. దాని విరాడ్రూపమగు అహం వృత్తి యేర్పడును.

గాయత్రి

గాయత్రి ఒక ఛందస్సు. బ్రహ్మోపాసనమున కిది ప్రధానా వలంబనము. ఛందస్సు లెన్నియో కలవుగాని గాయత్రీ ఛందస్సే బ్రహ్మజ్ఞానమునకు మోసాలయని శంకరులు చెప్పిరి.

యత్రి వాగ్రూప – 'వాగ్వై గాయత్రీ' అని బృహ. ఈ మంత్రమును గానము చేయుచో ముక్తి కలుగును అని—'గాయంతం త్రాయతి'—ఉపనిషత్తనును.

గాయత్రీ మంత్రమున విరాట్ స్వరూపద్యోతన మున్నది. ఇది విరాడుపాసన. ఇది విరాడ్రూపమును ప్రకాశింపజేయును ఈ ఛంద మంతస్సత్తను విశాలను చేసి సంపూర్ణత నిచ్చును. ప్రాణ మనస్సులకు శాంతి గూర్చి వాని విరాట్ సత్తాస్పందనమును జాగరిల్లఁ జేయును. ఈ స్పందనముతో విరాడ్ జ్ఞానము కలుగును.

ప్రతి మంత్రమునకును ఇట్టి స్పందములను సృజింపగల శక్తి ఉన్నది ఈ స్పందను లోపల నొక స్వాచ్ఛంద్య మున్నది. ఏలనగా మంత్రము ఛందోయుక్తము. ఒకొక్క మంత్రమున కొకొక్క ఛందస్సుండును. అన్ని మంత్రములును ఒకే తెఱగు ధృతిని జాగరిల్ల జేయజాలవు. శక్తి చ్ఛందమును జాగరిల్ల జేయ గల మంత్రములు ద్యోతన శీలములు. అవి జ్ఞానమునకు గొంపోవును కొన్ని మంత్రములు ఆనంద ధృతిని మేలుకొలుపును. దానజేసి మంత్రశాస్త్ర నిపుణులు మంత్ర విభాగము నతి కౌశలముతో చేయుదురు.

గాయత్రి కడు గంభీరమైనది. గాయత్రీచ్ఛందము వికాస శీలము. చిత్తమును అల్పమగు నభినివేశముల నుండి తొలగించి విరాడ్ బోధమున కాయత్త మొనరించును. గాయత్రీ చ్ఛందము అతి మానస — అనుభూతి సహజముగా కలుగునటు లొనరించును. విశ్వ చేతనను విశ్వాతీత చేతనను అది తెలుపును.

గాయత్రీ మంత్రమున మూడు విభాగములు : సూక్ష్మ, స్థూల, అంతర్లోకము లందలి చైతన్య ప్రకాశము నవలంబించి ఈ విభాగము చేయబడెను. గాయత్రీ మంత్రము ఈ అంతశ్చేతనా బహిశ్చేతనా సూక్ష్మ చేతనలను మూటిని సాధకుని చిత్తమునకు దెచ్చి అచట ప్రకాశింపజేయును. గాయత్రి సవిత ప్రతీకముగా గల విశ్వ చైతన్యమునకును జీవ చైతన్యమునకును భేదము పోగొట్టును. అంతరదీప్తికిని విశ్వదీప్తికిని సంబంధము కలిగినచో నపుడు విశ్వవిజ్ఞానముతో అంతరము పూర్ణ మగును. ఆ సాధకు డపుడు విశ్వచ్ఛందముతో యుక్తుడగును. సవితృమండలము నుండి ఏ కల్యాణమూర్తి ప్రకాశించునో ఆ కల్యాణమూర్తితో ఆ సాధకునకు పరిచయము కలుగును. అపుడు స్వచ్ఛతా స్వాచ్ఛంద్యములచే జీవనము పరిపూర్ణ మగును.

శబ్దము - బ్రహ్మము

ఉపనిషత్తులలో శబ్దము బ్రహ్మమని చెప్పబడినది. శబ్దము సకర్థముతో దృఢమగు సంబంధము కలదని అందఱకును తెలియును. శబ్ద మర్థమును తెలుపును. ఘట పటాదులు శబ్దములు. వీనికి విషయము ఘటమను వస్తువు- పటమను వస్తువు. కాని తొల్లిటి శబ్దశాస్త్రము శబ్దము యొక్క కారణావస్థను కార్యావస్థను స్వీక

రించును. సృజింపబడిన వస్తువునకు సంజ్ఞ కలదు. ఈ సంజ్ఞ శబ్దము లేక నామము. కాని ఈ శబ్దము సాధారణ శబ్దము. దీని కంటె 'పర-శబ్ద' మని ఒకటి ఉన్నది. అది అనాది. సృష్టి మొదలగుటతోడనే దానికి మొదలు అది చెవులకు వినబడదు. ఇది నిశ్శబ్ద శబ్దము, అనాహత శబ్దము (Voiceless voice). శబ్దశాస్త్రాచార్యులు దీనినే 'వస్తువు' అని అందురు. వాఙ్మయ విశ్వము విశ్వ—ప్రాథమికావస్థ. నామరూపక్రియలే వాస్తవ విశ్వము. సృష్టి ప్రథమ స్పందము లేక శబ్దము నాదము. నాదము నుండి బిందూత్పత్తి. సాధారణ దృష్టిలో రూపము వస్తువు కంటె వేఱైనటులు యోగ దృష్టిలో కాదు. పదార్థముల సూక్ష్మ రూపమును పరిశీలించినచో అంతయు శబ్దసమావేశమే కాని అర్థమని వేఱ యొకటి లేదని తెలియుదుము. శబ్ద తరంగము సూక్ష్మ రూపమును సంజ్ఞను బడయును. ఇటులు పడసి వస్తువుగా భాసించును. వస్తుతః శబ్ద తరంగమేకాని దానికి వేఱుగా ఉనికి లేదు. శబ్ద తరంగమే సృష్టికి మూలము. వాక్స్థూల వికాసము అర్థము. వాక్ అనగా శబ్దము—వాక్కు యొక్క సూక్ష్మ సంచారము రూపము. భావన యందును సంజ్ఞయందును రూపము ప్రకాశించును. ఈ వాక్కును లేక శబ్దమును అవష్టంభించి ప్రజ్ఞాలోకమునకు ప్రాకవలెను.

సృష్ట్యాది నుండియు వాగర్థములకు సంయోగ సంబంధ మున్నది. ఇది ఈశ్వరేచ్ఛాకృతమని తార్కికులు. ఇట్లనుట కంటె దీనిని నైసర్గిక సంబంధమనుట లెస్స. ఈశ్వర డిచ్ఛగించినను ఈ సంబంధము పోవునది కాదు.

శబ్ద ప్రపంచమున స్థూల వస్తువులేదు. ఉన్నవి నామ రూపములు. కావున వాఙ్మయ ప్రపంచమే ప్రపంచమునకు పూర్వ రూపము. 'వస్తువు' రూప ప్రపంచమునకు పూర్వమున్నను అది అపార్థివము. అది సృష్టికి ఉత్సము. ఈ శబ్ద ప్రపంచమున ప్రవేశింప గలిగిన యెడల సాధారణమగు వస్తువును అనగా పదార్థ జ్ఞాన సీమ నతిక్రమింప వచ్చును. శబ్ద వికాసమునకు ముందు ప్రాణమునకు సంచారము కలుగును. ప్రాణమే విశ్వప్రకాశ శక్తి. ప్రాణ స్పందముచే అవ్యక్తము వ్యక్తమగును. ప్రాణ కంపనము ఆకాశమున ఆఘాతము కలిగించి శబ్ద తరంగముల బుట్టించును. దాన జేసియే ఒకొక్క శబ్దమున కొకొక్క రూపము. ఈ ప్రాణ స్పందము, ఆకాశవ్యాప్తి, వీని తారతమ్యమును బట్టి రూప వికాసమున తారతమ్యముండును. ఒకానొక శబ్దమున ప్రాణ స్పందన మెక్కుడుగను, ఒకానొక శబ్దమున తక్కువగను ఉండును. ఆకాశములో ప్రాణము చేయు ఆఘాతముచే మంత్రోత్పత్తి. ప్రాణ కంపనము మందమగుచో ఆకాశమున తదభిఘాతమును శాంతముగనే ఉండును. ఈ అభిఘాతము యొక్క తీవ్రతా శాంతితలబట్టి మంత్రము యొక్క స్వరూపముండును. మంత్రముచే మహాప్రాణము నందును సూక్ష్మాకాశము నందును స్పంద సంచారమగును. ప్రతి మంత్రమును ఇట్టి శక్తికి ద్యోతకము. సాధకుని చేతనను క్రమముగా పైపైకి కొంపోయి బోధమునందు నెలకొలుపగల సామర్థ్యము మంత్రములలో గలదు. ఇదే మంత్రశక్తి. మానవులు ఎపుడును చేతో ముఖులు; విషయాభిలాషులు. అపరిచ్ఛిన్నమగు చైతన్య స్వాభావిక వృత్తి మానవు లెఱుగరు. ఈ అనుభవమును శబ్దము లేక మంత్రము కలిగించి తీరును. చేతనావకాశమున ప్రతిష్ఠ గొనుటకు శబ్దమొక కౌశల మాత్రము.

ఉపనిషత్తులిటు లగుట జేసియే శబ్ద బ్రహ్మ నాదమును స్వీకరించెను. బ్రహ్మము శబ్ద రూపముగా ప్రకాశము పొందును. శబ్ద మతనికి ప్రతీకము. ఈ శబ్దము ప్రణవము — ఓమ్. సాధకుని మహా — అవకాశ బోధమున ప్రతిష్ఠింపగల శక్తి దీనికి సహజము. మహాకాశమున విశ్వమంతయు లయ మగును. అవకాశము మాత్రముండును, నాదముండును, చేతన ఉండును. సాధకుడీ స్థూలాకాశము నుండి చేతనావకాశమున నెలకొనును.

ఈ అవకాశమునకు ఆత్మ సాక్షి. శబ్దమునకు కేంద్రాభిముఖమగు ఒక శక్తి కలదు. విక్షిప్తమగు చేతనను ఆ శక్తి మరల కేంద్రమునకు తీసికొని వచ్చును. చేతనను అంతఃకరణ బంధము నుండి తొలచి తన నిస్సీమత్వములోనికి నెట్టును. ఈదెస శబ్దబ్రహ్మ సాధన బ్రహ్మనిష్ఠకు బ్రహ్మస్థితికిని కారణము చేతన సామాన్యముగా దేశకాలములలో నుండి విశ్వమును ప్రకాశింపజేయును ఇది దేశ కాల వ్యవధానమునకు అతీతము. శబ్దము బ్రహ్మ-ప్రతిష్ఠ కలిగించును గాన దానికి శబ్దబ్రహ్మ మని పేరు. అన్ని శబ్దములకు నీ శక్తి లేదనుట నిక్కమే. దేనికి కలదో అది శబ్దబ్రహ్మము.

సత్యము - ఛందస్సు

సత్యబోధకును ఛందస్సునకును దగ్గఱ సంబంధమున్నది. ఛందోమయ జీవనము సత్యధారణము చేయగలదు. జీవనము సత్యమందు నెలకొనుచో జీవన మెల్లయు ఛందోబద్ధమగును. అరూపమగు సత్యము యొక్క మూర్తప్రకాశము ఛందము. సత్యను 'స్వే మహిమ్ని ప్రతిష్ఠితమ్' — అది అజ్ఞాన ఘనము, ఆనంద ఘనము.

సత్య చ్ఛందస్సుల కెట్టి సంబంధము? ఉపనిషత్సార, మొక శాంతి పాఠముతో ఆరంభమయి శాంతి పాఠముతో ముగింతుము. ఏల? మంత్రచ్ఛందమునకును చిత్తస్వాచ్ఛంద్యమునకును ముట్టుటిక ముండబట్టి!

ఛందము చిత్తములో ఏకాగ్రతను మేలుకొలిపి సత్యమును నిలుపుకొనగల పటిమనిచ్చును. కోమలమగు ఛంద — ఆఘాతముచే గభీరమగు అనుభూతి ఉన్మీలిత మగును. సత్యబోధము జీవన మంతటి నాచ్ఛాదించి దానిని దివ్య మొనరింపనంతవట్టు సత్యమునందు ప్రతిష్ఠ దొరకదు. సత్యబోధమే సత్యమునందు సాధకుని ప్రతిష్ఠించును. అదియు పరమ కామ్యము. దీనివల్ల జీవనము యొక్క పార్థివభావమును భాషయు సంపూర్ణముగా రూపాంతర మొందుము. సత్యచ్ఛందము జీవనమున నెలకొనుడు ఉనికి యను దిగుడు బావిలో చేపలన్నియు బయటంబడును. అపుడు సత్యము

యొక్క విరాడ్రూపము కనిపింపగలదు. ఆ విరాడ్రూపమే కల్యాణ మూర్తి! ఛందస్సునకు నానా రూపములు. సత్యమొక ఛందము, సుందరమొక ఛందము; జ్ఞానమొక ఛందము, ఆనందము నొక ఛందము. ఇటులయ్యు వీని అన్నిటియులో నుండిసత్యద్యోతన స్ఫుటిత మగును. ఛందము సత్యముయొక్క అనంత ప్రకాశ భంగి. జీవనానుభూతి యెటనెంతలోతో ఛందమట అంతవికాస శీలము! ఛందసనుభూతి రూపము. ఉపనిషత్తత్త్వ మెంతగభీరమో ఛందమును అంత గభీరము. ప్రతి మంత్రమునకును ప్రతి శ్రుతికిని ఛందో విన్యాస మనంత సంగతి సంపన్నము. కావున భావైశ్వర్యమునకును భాషైశ్వర్యమునకును ఉపనిషత్తు తఱగనిభాండారము.

ఛందోబద్ధమగు మంత్రోచ్చారణము స్వాధ్యాయము. దాని నుండియే ప్రతి శబ్దమునకు శక్తి ప్రకాశము. వేదమంత్రము కేవల శబ్ద సంఘటనమే కాదు. దానికి స్వరము కలదు. అది భావద్యోతకము. వాక్యనుర్థ ప్రకాశకము. స్వరమును ధ్వనియు అర్థమునకును భావమునకును స్ఫోరకము. వాక్యమునకు గల అర్థము కంటె స్వరమునకు గల అర్థము సూక్ష్మము.

అనుభూతి ఛందస్సు యొక్క సూక్ష్మతర రూపము తాల్చును. సూక్ష్మ - అంతరమువనే జీవనము చక్కగా వికసించును. ఈ సూక్ష్మ ధారణకే ఛందః ప్రయోగము. అపార్థివమగు జ్ఞానము యొక్క రూపము శబ్దము తనలో తాల్చును. ఆ రూపము మానస ప్రత్యక్షము కాదు — అది అతి మానస ప్రత్యక్షము. కావున ఛందస్సాక్షాత్కారరూప తో తత్త్వమునకు నిత్య సంబంధము. అది అతిమానస చేతనాస్తరమున అనుభవ మగును. చేతన నీ స్తరమున కెత్తగల కౌశలమే మంత్రము· నామ రూప క్రియా విముక్తమగు చేతనకు గొని పోవుటయే ఉపనిషత్తుల ఉద్యోగము. ముక్త చేతనమే ఉపనిషల్లక్ష్యము. కాని యీ చైతన్య స్థితి జ్ఞానమునకు పట్టుపడదు. మంత్రము ఆ స్థితికి గొంపోవగలదు.

ఉపనిషత్తులు శాస్త్రము కాదు, సత్య దృష్టి· కావున వానిని తెలిసికొనుటకు విశ్వ – కల్యాణరూపముతో పరిచితి ఉండట అవసరము. విచార మెంత దృఢ మైనను చిత్తము స్వాచ్ఛంద్య సంపన్నము కాదేని సత్యము దొరకదు. కాన జీవనములో కల్యాణ స్పృహయు కల్యాణ దృష్టియు కలుగవలెను. సత్యానుభూతి సామాన్యనుగా సుకఠినము ఏలనగా ఉనికి అరలన్నిటి నుండియు కల్యాణ స్పృహ మూర్తమై కనబడదు. ప్రాణ మన శ్చిత్తములలో కల్యాణ స్పృహ పూర్ణమాయెనేని దివ్య జీవనచ్ఛందముచే ఉనికి ఉబికిపోవును. అపుడు జడతగాని చంచలతగాని అలతి తనముగాని దాపులకు రాదు. అతిమానసానుభూతి కపుడంకురార్పణము. ఉపనిషత్తత్త్వ మెఱుగ గల యోగ్యత అపుడు. చిత్తాధికార మెచ్చట అస్తంగతమో అట్టి ధ్యాన ప్రశాంతిలో ఉపనిషత్తత్త్వము!

ప్రాణ కంపనము పోనిదే, మనస్సు సంకల్ప శూన్యము కానిదే సాధనకు ఫలము లేదు. ప్రాణ మనస్సులు ఛందోబద్ధము అయిన మఱుసనాడు విజ్ఞానానందముల సోపానముల నెక్కగలము.

శాంతి సందేశం

శ్రీ బి. బి. జి. తిలక్

అదిగో ఆ గులాబీమొగ్గ
చైతన్యప్రభను ప్రసవింపజూస్తోంది
వికసించక మునుపె చిదిమెయ్యండి!

అదిగో ఆ జీర్ణదేవాలయపు
శిథిల ప్రాకారంపై జీవంతో రావిమొక్క
వాస్తవికతను ప్రవచింపజూస్తోంది
మానవ్వక మునుపె తుంచెయ్యండి!

అదిగో ఆ నీటిచేప
అక్కడి అశాశ్వత సమస్యలకు
శాశ్వత పరిష్కార సందేశాన్ని మోసుక
అలజడిని ప్రకటింపజూస్తోంది
పరివర్తన సంవర్తలు ప్రక్షిప్తంగాక
మునుపె
గాలానికి గుచ్చెయ్యండి!

అదిగో అది ఓ ప్రశాంత శ్మశాన వాటిక
మృత్యుదేవత చిరునవ్వు కంటికాటుక
అక్కడ ఆ మరణించిన కట్టెను
కట్టెలు కాలుస్తున్నాయి
కాంతి ప్రభవింపజూస్తోంది
తమస్సును తరిమెయ్యకమునుపె
ఉషస్సును భగ్నం చెయ్యండి!

ఓ అశాంతి కాముకులారా!
ఓ ఏసు
ఓ గాంధీ
ఓ మార్టిన్ పుట్టని మీ సమాజాన్ని
సటిష్మం చేసుకోండి!
మీ శాంతిని మీరే స్థాపించుకోండి!

డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద

శిశుభాష - మాతృ పితృ వాచకాలు*

0.1. పరిభాషా వికల్ప సమస్య

ఈ వ్యాసం ప్రారంభించడానికి ముందు భాషాశాస్త్ర సంబంధి విషయం కాబట్టి పరిభాషా వికల్పాలవల్ల ఏర్పడే అనర్థాలను వాటివల్ల ఇలాంటి విమర్శల్ని విమర్శించేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని గుర్తుచెయ్యడం నా బాధ్యతగా కొంత రాయాల్సి వస్తోంది. నా వ్యాసానికి (అక్టోబరు 1978 భారతి) శ్రీ తిరుమలరావుగారు చేసిన సవరణలు, ఖండనలు ఈ పరిభాషా వికల్పానికి సంబంధించినవి. ఒకో శాస్త్రానికి మౌలికమైన కొన్ని ఆలోచనా విధానాలుంటాయి. వాటిని జీర్ణం చేసుకున్నపుడే ఆ శాస్త్రాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. అనుభూతి ప్రధానమైంది సాహిత్య విమర్శ. సత్యదర్శనానికి చేసేప్రయత్నం శాస్త్రవిమర్శ. నా ఈ వ్యాసాలు శాస్త్రదృష్టితో రాయబడుతున్నాయి. అంటే నా మొదటి వ్యాసానికి (అక్టోబరు 1978 భారతి), రెండవసారి రాసిన సమీక్షకు (ఫిబ్రవరి 1979 భారతి), ఇప్పుడు రాయబోతూన్న వ్యాసానికి—అంతర్గతంగా మూడుదృష్టులున్నాయి. వాటిని చెప్పడంతో పరిభాషా వికల్ప సమస్య అర్థమవుతుంది పాఠకులకు.

అప్రసక్తమైనా ఒక విషయం చెప్పక తప్పదు. నేను అమ్మ/అప్ప శబ్దాల్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టింది జనవరి 1976లో. 'స్వామి అయ్యప్ప' అన్న ఒక చలనచిత్రం చూసినపుడు 'అయ్య, అప్ప' రూపాల అర్థాలేమిటన్న ప్రశ్న మొదలయింది. ఆ కథలో హరిహరులిద్దరూ మాతృ పితృ రూపాలు ధరించి ఒక అబ్బాయిని సృష్టిస్తారు. ఆ అబ్బాయి పేరు 'అయ్యప్ప'. పరిచయంలో ఉన్న అయ్య, ఆయా రూపాల నాధారంగా ఆ స్వామి మాతృ పితృ సమన్వయ స్వరూపు డవడంవల్ల, హరిహరాత్మకుడని అతణ్ణి భక్తులంటారని చెప్పడంవల్ల—'అయ్య' ఆ సమస్తరూపంలో మాతృవాచకం కావచ్చునని సందేహం వచ్చింది. దీనితో అమ్మ/అప్ప శబ్దాలకున్న వ్యుత్పత్తుల్ని గురించి తవ్వడం మొదలుపెట్టాను.

1976-78ల మధ్య నాకు పరిశోధన కందినంతవరకు వాటిని ద్రావిడ పదాలుగా "డి. ఇ. డి." చూపిస్తున్నా వాటికి భాషా పరిధులు లేవన్న స్ఫురణ మొదలై నిఘంటువుల్ని ఆధారంగానూ, అరవిందుల వాదాన్ని ఆధారంగానూ వాటికి ఇండో ఆర్యక సామ్య రూపాలను ప్రదర్శించడం మొదటి వ్యాసలక్ష్యం.

రెండవది—సమీక్ష రాసే సమయానికి కాశ్మీర శివాద్వయ సంప్రదాయంతో సంబంధం కలగడం మూలాన—భాషోత్పత్తికి ప్రపంచోత్పత్తికి ఆ సంప్రదాయంలో అభేదాన్ని పాటించడాన్ని గమనించి అప్రయత్నంగా సిద్ధించిన ఆ సైద్ధాంతిక సమన్వయాన్ని నిరూపించడంకోసం ఫిబ్రవరి (1979) సమీక్ష రాశాను. దేవీవాదులు పేర్కొనే 'దేవి' లక్ష్మీపార్వతీ సరస్వతులు కాదన్న అంశం వారిదే. నాసొంతంకాదు. అక్కడ దేవి—శివుడు, ప్రకాశ విమర్శాంశలనే సాంకేతికార్థంలో వాడబడ్డారు. వాగుత్పత్తి ప్రకాశాంశ, భావంలో వాక్కు చెందే లయం విమర్శాంశ—అని అక్కడి తాత్త్వికార్థం. ఆ దృష్టితోనే 'అంబ' శబ్దాన్ని నేనూ ఆ సమీక్షలో వాడుకున్నాను. పోతనగారి 'పెద్దమ్మ' అన్నమాట ఆ తత్త్వాన్ని తగులోంది కాబట్టి రాయడం జరిగింది చారిత్రకంగా ముందువెనుకలతో తాత్త్వికసత్యానికి సంబంధంలేదు. ఛామ్స్కీ తాత్త్వికతా దృష్టి ఆయన ప్రతిపాదించిన 'innate hypothesis' ఏవీ కొత్తవి కాదని చెప్పడానికే ఆయన వాక్యాన్ని ఉదాహరించాను. ఛామ్స్కీ పాశ్చాత్యుడే అయినా-స్ఫురణ విశ్వజనీనమైంది కాబట్టి—ఆయన quote చేసే ఆ వాక్యంలో ఈ విశ్వసత్యం దర్శింపబడ్డదన్న విషయాన్ని స్పష్టం చెయ్యడానికే ప్రయత్న పూర్వకంగా వెదికి ఆయన వాక్యాన్నే ఇచ్చాను. అందువల్ల ఆ సమీక్షా వ్యాసంలో నేను వివక్షించింది—'అంబ' శబ్దంనుంచి 'అమ్మ' పరిణమించి ఉండవచ్చునడంలో తాత్త్విక దృష్టిని. భాషాశాస్త్ర పరంగా చేసిన వ్యాఖ్యానమూ నా సొంతంకాదు. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారిది.

1979లో వ్యాసం (ది ద్రవిడియన్ ఎవిడెన్స్) రాసేటప్పటికి మరికొంత గ్రంథపరిచయం — ఆలోచించడానికి విరామం దొరికి అమ్మ/అప్ప శబ్దాలు నిత్య వ్యవహారంలోని పదాలవంటివి కావన్న నిర్ధారణకు రాకతప్పలేదు—అవి శిశుభాషా (బేబీటాక్) రూపాలుగా రోమన్ యాకబ్సన్ చేసిన కొన్ని విశ్వజనీన ప్రతిపాదనలకు ద్రావిడ నిదర్శనాలుగా అమ్మ/అప్ప రూపాలను నిరూపించాను. ఈ మూడో ప్రయత్నమే ఉత్తమమైందని అప్పుడు తెలిసింది.

ఇంతా ఎందుకు రాశానంటే ప్రత్యామ్నాయమార్గాలు ఆలోచించడంద్వారానే శాస్త్రీయ పరిశోధనకు సమగ్రత, సాఫల్యత. కాని ఏది సరైన మార్గం—ఏది కాదు—అని నిర్ణయించే ప్రమాణాలు కొన్ని వున్నాయి—వాటినే మౌలికమైన ఆలోచనా విధానాలన్నాను. ఆ మూడు పద్ధతులూ ఇవి.

(1) హిస్టారికల్ కంపేరిటివ్ మెథడ్
(2) ఎటిమలాజికల్ మెథడ్
(3) క్లినికల్–ఎక్స్పెరిమెంటల్ మెథడ్

మొదటి రెండూ ఇంతవరకే వాడబడ్డాయి. ఇప్పుడు నా పిల్లల్ని, పక్క ఇంటి పిల్లల్ని – భిన్న వయస్సుల వాళ్ళని, భిన్న సందర్భాల్లో ప్రయోగ దృష్టి**తో** పరిశీలించడంవల్ల వాళ్ళ ఉచ్చారణ పద్ధతుల్ని – ఆలోచనా విధానాన్ని – ఆధారంగా అమ్మ / అప్ప శబ్దాలు విలక్షణ ప్రవృత్తి కల్గినవనీ – వాటిని శిశుభాషా **రూపాలు**గానే వ్యాఖ్యానించాల్సిన అవసరం వుందనీ గుర్తించాను శాస్త్రీయత అంటే ఇది. ఈ మూడు పద్ధతులూ ఒకదాన్ని మరొకటి ఖండిస్తే సమగ్రత లేదు. **మూడూ** ఒకే తాత్త్వికసత్యాన్ని చాటకపోతే సాఫల్యత లేదు. కానీ ఈ విషయంలో **మూటిమధ్య** సమన్వయం కుదిరింది – ఏమిటంటే భాషా పరిధుల్ని దాటి ప్రవర్తించడానికీ, ధాతు నిరూపణం కుదరకపోవడానికి, శిశుభాషా స్వరూపం భిన్నమన్న ఈ ప్రతిపాదనకూ ఒక 'అగ్రిమెంటు' వుంది. ఇలాంటి చోట్ల రెండు మూడు పద్ధతుల మధ్యన శాస్త్రకారుడు ఏది మంచి – ఏది కాదు – అన్న 'ఎవాల్యుయేషన్' చెయ్యగల్గుతాడు. ఏది అసలు సంబంధించింది కాదో – కూడా చెప్పగలుగుతాడు. 'మా' నుంచి 'అమ్మ' ఏర్పడిందనడం కానీ, 'రమా' నుంచి ఏర్పడిందనడంకానీ– అశాస్త్రీయమైన ఊహాపోహలు తప్ప తర్కసహం కావు – అన్న నా అభిప్రాయం అలాంటిది

కాబట్టి 'పరిభాష' సమస్య—ఈ తాత్త్వికదృష్టి ఏమిటో అర్థం చేసుకోకపోవడంవల్ల వస్తుంది. శాస్త్రదృష్టి వున్నవాడు – వీలయినంత వరకు ఈ దృష్టిని అర్థం చేసుకోకుండా విమర్శ చెయ్యడం మంచిదికాదు. అర్థంకావడం– కాకపోవడం వేరేవిషయం. అసలు సమస్య మరుగునపడి పోతుంది. అది అవాంఛనీయం.

ఇంతవరకు వాడబడ్డ సగోత్ర, అంబ, **మొదలైన** శబ్దాలు కాని, ఈ వ్యాసంలో వాడబోయేటువంటి శిశుభాష, భావం, వ్యావహారిక, వైయక్తిక, స్ఫురణ, ఆలోచన వంటి పదాలు నైఘంటికార్థాల్ని కల్గినవి కావు. అన్నిటికీ శాస్త్రీయార్థాలున్నాయి.

1.0. పరిశోధనా ప్రణాళిక

అమ్మ / అప్ప శబ్దాల్ని ఎందుకు పరిశీలించాలి ? నేను ఏ ప్రయోజనం కోసం పరిశీలించానో మొదట స్పష్టం చేస్తున్నాను. వాచ్యార్థాలు (ధాతు ప్రత్యయ వి**భాగ** నిర్దేశం) లేని ఈ **రూపాలు** 'వ్యంజకాలు' (సజెస్టివ్) అని నిరూపించడానికి.[2] దీనికి ప్రారంభంగానే ఈ రూపాలు సాంఘికమైన భాషా సరిహద్దుల్ని దాటుతున్నాయనీ, ధాతు ప్రత్యయ విభాగం సాధ్యం కాదనీ వ్యతిరేఖ ముఖంగా నిరూపించాను. ఇప్పుడు శిశుభాషా వ్యవహారం లోనివని చెప్పడం ద్వారా సమన్వయ ముఖంగా వాటిని వ్యంజకాలుగా నిరూపిస్తున్నాను. ఇలా డొంక తిరుగుడు పద్ధతిలో పరిశీలనలో ప్రత్యామ్నాయ మార్గాలు యాదృచ్ఛికంగా సిద్ధించాయి. విజ్ఞాన పరిశోధనల్లో ఇలాంటివి తటస్థపడుతుంటాయి.

శబ్దార్థాల యాదృచ్ఛిక నిత్య సంబంధ వాదాలున్నాయి – (వివరాలకు చూ. కుంజున్నిరాజా 'ఇండియన్ థీరీస్ ఆఫ్ మీనింగ్' అన్న గ్రంథం). పాశ్చాత్య దేశాల్లో సోక్రటీసు **మొదలు** నిన్న మొన్నటి బార్త్ దాకా **ఈ** విషయంగా తగాదాలు పడుతూనే వున్నారు (చూ. హాక్స్ 'స్ట్రక్చరలిస్మ్ ఎండ్ సెమియాటిక్స్' అన్న గ్రంథం). ఇకపోతే అమెరికా భాషాశాస్త్రజ్ఞులు, తదనుయాయులూ నిర్మాణ ప్రక్రియా స్వరూప సాధన**తో** శాస్త్రీయత సిద్ధిస్తోందని తృప్తిపడి శబ్దార్థాలను తమకు సంబంధించని విషయంగా వదలివేశారు. విజ్ఞానుల్లో డార్విన్, ఫ్రాయిడ్ మొదలైనవాళ్ళు పెద్దలకు, పిల్లలకు ఆలోచన పద్ధతుల్లో ఉన్న భేదాల్ని గురించి ఆలోచించడంలో శబ్దార్థాల సంబంధాలకు కొత్త వ్యాఖ్యానాలుపుట్టాయి. పియాజెట్ **తో** శిశుభాషా స్వరూపానికీ, ఆలోచన పద్ధతికీ సంబంధించిన చాలా కొత్త అంశాలు వెలుగులోనికి వచ్చాయి. యూంగ్ ప్రతిపాదనలతో ఉద్దీప్తులైన విగోట్స్కీ వంటి మానసిక శాస్త్రవేత్తలు 'స్ఫురణ' (ఇన్ట్యూషన్)అన్న మానసిక వ్యాపారాన్ని గుర్తించడం**తో** శబ్దార్థాల నడుమ నిత్యసంబంధం అంటే ఏమిటో గుర్తించడం జరిగింది. దాన్నిస్థూలంగా సోదాహరణంగా ఇలా చెప్పొచ్చు...

'అమ్మ' అనే శబ్దానికి 'తల్లి'అనే మరో శబ్దంద్వారా అర్థం చెబుతున్నాం. మాతృ భావం (కాన్సెప్ట్) ఈ రెండు శబ్దాలద్వారా బహిర్గతమౌతోందని అర్థం. ఈ భావానికీ **ఈ** శబ్దాలకు పరస్పరం అవినాభావ (ఒకటిలేక మరొకటి లేకపోవడం) సంబంధం ఉందనీ– అదీ నిత్యత–అంటే అనీ ఈనాడు అంగీకరిస్తున్న సత్యం. అంతే కానీ ఒక వస్తువును ఒకే శబ్దం అన్ని భాషల్లోనూ బోధించడమన్న అర్థం కాదు.

భాషకు రెండు దశలున్నాయి. వైయక్తికదశ, సాంఘిక దశలని. సాంఘిక దశలో శబ్దం అర్థానికి యాదృచ్ఛిక (ఆర్బిట్రరీ) సంకేతం అవుతోంది ఒక్కో వ్యక్తి (భాషా సమూహం) ఒకో వస్తువుని భిన్న శబ్ద సంకేతాల ద్వారా పిలుచుకోవచ్చు. కుక్క / డాగ్ / శునకం/**నాయి** – ఇలాగా.

వైయక్తిక దశను అర్థం చేసుకోవడం చాలా కష్టం. సాంఘికమైన శబ్దాలు వైయక్తికానుభవంలో అంతర్లీనమయ్యే దశ ఇది. ఇక్కడ శబ్దార్థాలు భిన్నంగా ఉండవు – రెండూ కలిసి భావ ప్రవాహంగా అనుభూతమవుతాయి. ఇక్కడ 'పొయెట్రీ'పుడుతుంది. పైన చూపిన నాల్గు పదాలూ శునక భావం (డాగ్నెస్) గా రూపొందడం ఇలాంటిది. (దీన్నే వ్యక్తి – జాతి దశలని భారతీయ న్యాయవైయాకరణ **తాత్త్విక** గ్రంథాలు విచారించాయి) దీన్నిబట్టి గుర్తించాల్సిన విషయం – శబ్దార్థాలు తమంతట తామాగిపోవని. వాగ్వ్యవహారానికి ఫలితం–అవి భావంగా మారడం. ఈ దృష్టితో నవ్వడం, కొట్టడం, చేతులు తిప్పడం మొదలైన అంగ విక్షేపాల్లాంటివే **ఈ** శబ్దార్థాలు. ఇవి ప్రత్యక్షంగా భావాలుగా మారు

తాయి — 'శబ్దం' ఈ రెంటి మధ్యన 'ఇంటర్వీన్' కాదు. సరిగమపదని — ఇవి బోధించే భిన్నభావాలు — స్థాయులు — ఇలాగే సాధ్యం.[3]

దీనివల్ల మనం రెండు కొత్త అంశాలు గుర్తించవచ్చు— (1) భాషలో శబ్దజాలం రెండు రకాలుగా ఉంటుందని— (ఎ) వాచ్యార్థం (సోషల్ మినింగ్) ఉన్నవి (బి) లేనివి. వాచ్యార్థం ఉన్నచోటనే శబ్దానికి సాంఘిక (వ్యావహారిక) స్థితి వస్తోంది. లేని చోట శబ్దం వ్యావహారికం కాదు. ఇలాంటిచోట్ల వర్ణ పద వాక్య విభాగాది విశ్లేషణ కుదరదు రూపానికి ప్రకృతి ప్రత్యయ విభాగం, అర్థానికి ధాతుముఖ నిరూపణం అసాధ్యం. భావంతో ప్రత్యక్ష సంబంధమున్న చోట్లిలాంటివి. ఇలాంటి వాటిని వ్యంజకాలని అంగీకరించక తప్పదు ఇదొక అంశం.

(2) భాషను వ్యవహర్తను బట్టికూడా భిన్నమైన ప్రమాణాలద్వారా పరిశీలింపక తప్పదు మనకు తెలిసినంతవరకు పాశ్చాత్య మనస్తత్వ పరిశోధకుల్లో జీన్ పియాజెట్ (1966 ప్రతి) చూపిన ఈ ప్రమాణం భాషా పరిశీలకులకు చాలా అమూల్యమైంది. శిశు భాషను వృద్ధభాషా ప్రమాణాలతో పరిశీలించడమే సంప్రదాయంగా ఉన్న రోజుల్లో శిశువుల ఆలోచనా పద్ధతి వృద్ధులకంటె భిన్నమైందని, వారి భాషా వ్యవహార ప్రయోజనంవేరని — ఆయన ప్రతిపాదించాడు [4]

శిశువుల ఆలోచనను 'ఔటిస్టిక్ థింకింగ్' అని ఆయన పిలిచాడు. పెద్దల ఆలోచన 'లాజికల్ థింకింగ్'—అని ఆయన వింగడించు. శిశువులు తార్కికంగా ఆలోచించరని దీని అర్థం. అంటే వారి భాషలో హేతుబద్ధత ఉండదని తాత్పర్యం.

పెద్దల భాష శ్రోతను అపేక్షిస్తుంది. అందుకే భాషా శాస్త్రజ్ఞులు భాషను సాంఘికమైన అస్తిత్వం కల్గినదానిగా నిర్వచిస్తారు కాని శిశు వ్యవహారం శ్రోతృనిరపేక్షితంగా ఉంటుంది. అంటె ఇతరులు వింటున్నారా లేదా అన్న ప్రశ్న శిశువుకు ఉండదు అందువల్ల 'భాష అభిప్రాయ నివేదన సాధనం' అన్న సాంఘిక నియమం శిశువ్యవహారానికి పట్టదు—ఇది రెండో అంశం.

ఇంతవరకు చర్చించిన రెండు అంశాల్ని దృష్టిలో వుంచుకొని అమ్మ/అప్ప రూపాలను శిశు భాషా వ్యవహారంలో భాగంగా చర్చించడం దానిద్వారా వాటిని కేవల భావరూపాలుగా నిరూపించడం ఈ పరిశోధనకు ప్రణాళిక.

2. 0. యాకబ్సన్ ప్రతిపాదనలు

ఇంతవరకు మనం చర్చించిన పియాజెట్ చెప్పిన అంశాలు 1922-30 ప్రాంతంలో ప్రతిపాదింపబడ్డాయి. ఆ సంవత్సరాల్లోనే జేనెట్ స్పీల్ రెయిన్ మొదలైనవాళ్ళు శిశు వ్యవహారంలోని ఈ ప్రత్యేకతను గుర్తించారు.

'శిశువుల ఉచ్చారణలు—శబ్దజాలం—క్రియతో ముడిపడినవని— అవి క్రమంగా వృద్ధుల భాషలో క్రియావస్తు సంకేతాలవుతున్నాయని — జానెట్ (పియాజెట్ పుట 5) అభిప్రాయం. స్పీల్‌రెయిన్ ప్రకారం 'the baby syllables mama, uttered in so many tongues to call the mother, are formed by labial sounds which indicate nothing more than a prolongation of the act of sucking'. (ibid)

అలాగే మ్యూమాన్, స్టేర్న్ మొదలైన వాళ్ళూ - శిశు భాషను శిశుభాషా ప్రమాణాలతో మాత్రమే చర్చించాలని తేల్చారు. ఇదే సమయంలోనే ఒట్టో జెస్పర్సన్ (1922) కూడా ప్రపంచ భాషలనుంచీ మామా పాపా లకు సంబంధించిన ఉచ్చారణ భేదాన్ని ప్రదర్శించాడు. అతని పరిశోధనలో రెండు ప్రధానాంశాలున్నాయి.

A. (1) శిశుభాషా వ్యవహారం మూడు దశల్లో ఉంటోంది అవి వరుసగా స్క్వ్యేలింగ్, కూయింగ్, ఛైల్డ్ లాంగ్వేజ్ అని చెప్పవచ్చు. పాలో, మందో తాగేటప్పుడు, ఏడ్చేటప్పుడు బయటపడే ధ్వనులు రోదనా కాంక్షా వ్యంజకరూపాలు — మొదటి దశ వ్మ్ జ్ మొదలైన ధ్వనులు.

(2) (కోకిల, చిలుక మొదలైన జంతువులు విన్న శబ్దాల్ని పునరుక్తి చెయ్యడం లాగే) శిశువుల్లో కనిపించే ధ్వని పునరుక్తి దశ రెండవ దశ.

మమ, పప, అమమ, అపప, అతత దద, బబ మొ.

(3) మూడో దశలో వస్తువుల్ని గుర్తిస్తూ వాటిని ఆయా ధ్వనుల్తో పిలవడానికి శిశువుచేసే ప్రయత్నం ఉంటుంది.

B. జెస్పర్సన్ ప్రకారం మమ/పప అనే రూపాలు ఈ మూడో దశలో బయటపడుతాయి ఇక్కడ శిశు ప్రయత్నం ఈ రూపాల్ని ఉచ్చరించడం వరకే తప్ప అర్థాన్ని ఆపాదించి ఆనందించే వాళ్ళు పెద్దలే — అని కూడా ఆయన వివరించారు.[5]

'The determination of a particular form to a particular meaning is always due to the adults, who however, can subsequently teach it to the child' (P. 157)

శిశుభాషను ప్రత్యేక ప్రమాణాలలో పరిశోధించాలన్న ఈ అంశం తరువాతి సంవత్సరాల్లో మరుగున పడిపోవడానికి భాషాశాస్త్రాధ్యయనంలో చారిత్రకంగా వచ్చిన 'బ్లూంఫీల్డు' ఉద్యమం కారణం అంతవరకు భాషాశాస్త్రంలోఉన్న మానసికతత్త్వ (మెంటలిజమ్) దృష్టిని వాట్సన్ ప్రతిపాదించిన ప్రవృత్తి (బిహేవియరిజమ్) వాదం అధఃకరించింది. ఫలితంగా అమెరికనుల భాషావిజ్ఞాన సంప్రదాయంలో అర్థానికి పరిశోధనలో చోటు లేకపోవడం — కేవల రూపప్రక్రియాదృష్టి ప్రబలడం సంభవించాయి.

బరో, ఎమెనో పండితులు (1961) డి. ఇ డి. ఆరో పాల్లో అమ్మ/అప్ప రూపాల్ని ఇవ్వడానికి ప్రయత్నించారంటే కేవలం అది రూపాశ్రితదృష్టి. అంబ/ఆర్య శబ్దాల్ని 'కరెస్పాండెంసెస్'గా చూపినా అది కేవలం నిర్మాణ సాజాత్యాన్ని స్మరింపచెయ్యడానికి తప్ప వ్యుత్పత్తితోను, అర్థవ్యాప్తులతోనూ వాళ్ళకి సంబంధంలేదు.

వీళ్ళ పరిశోధనా పద్ధతికి నాంది పలికిన బిషప్ కాల్డ్వెల్ (1856) ప్రాంతానికి ఈ మానసిక శాస్త్రాది భిన్నదృష్టులు లేవు. ఆయన అమ్మ/అప్ప రూపాలు ద్రావిడాలని నిరూపిస్తూ ఆరు ప్రమాణాలిచ్చాడు.[6] (కాని మనం గుర్తించదగిన అంశం–ఆ ఆరు అంశాలూ ఈ రూపాలకి అసలు పట్టవు. అది విషయాంతరం).

(అందువల్ల నాకు అవి ద్రావిడ రూపాలు కావన్న స్ఫురణ కల్గడానికి అమ్మ / అప్ప రూపాలకు ప్రపంచ భాషల్లో ఉన్న 'Sociolinguistic meaning' కారణం. అందువల్ల వీటిని గురించి పరిశీలించడం సంభవించింది.)

ఇతర శాస్త్రాలలో వచ్చిన పరిణామాల్ని గుర్తించడం మొదలు పెట్టాక ఈనాడు అన్ని దేశాల్లోనూ 'baby talk'ని గురించిన పరిశోధన అనేక ముఖాలుగా జరుగుతోంది. సగోత్ర సంబంధంలేని భాషల్లో కనిపించే ఈ రూపసామ్యాన్ని జార్జిపీటర్ మర్డాక్ (1957, 59) గుర్తించాడు. కొన్నివేల పదాల్ని ఆయన సేకరించాడు. దానిఫలితంగానే రోమన్ యాకబ్ సన్ (1959, 61) 'వై మామా ఎండ్ పాపా' అనే పరిశోధనా వ్యాసాన్ని ప్రచురించాడు.[7] అందులోని ప్రతిపాదనలే ఇప్పుడు పరిశీలిస్తాం. ఆ ప్రతిపాదనలు శిశుభాషా వ్యాకరణానికి, రూప నిర్మాణానికీ, భౌతిక ప్రక్రియకూ–సంబంధించినవి.

శిశుభాషా రూపాలలోనివే మమ్మ/పప్ప మొదలైనవి. కాని వృద్ధభాషలో కూడా కనిపిస్తుంటాయి. కాని భేదం ఏమిటంటే వృద్ధుల వ్యవహారంలోకి ప్రవేశించేటప్పటికి ఈ రూపాలు నిర్దిష్ట లింగబోధకతను పొందుతున్నాయి. ఆ విభేదంలేని దశలో ఇవి శిశువ్యవహారంలో ఉన్నట్లు.

మర్డాక్ ప్రపంచ భాషల్నించి సేకరించిన పదాల్లో హయ్యర్ లెవెల్‌కి సంబంధించిన మదర్ / ఫాదర్‌వంటి రూపాలు, లోయర్ లెవెల్‌కి సంబంధించిన మామా (మమ్మ, మమ్మి, మా, మామ్, మామీ); పాపా (పాప్, పప్పా, పా, పాప్, డాడా, డాడ్, డాడీ) వంటి రూపాలూ–రెండురకాలుగా విభజింపబడటానికి వీలుంది. రెండు బల్గేరియన్ పదాలద్వారా ఈ రెంటిమధ్యనున్న వ్యాకరణ సంబంధాన్ని/భేదాన్ని–ఇలా వివరించవచ్చు.

మమ (నా [వక్తయొక్క] తల్లి)

మజ్‌కా (తల్లి [ఒకరియొక్క–వక్తకుమాత్రం పరిమితం కాని]

బల్గేరియన్‌లో

Statement about Ownership and other particulars about newspaper

BHARATI

Form IV (See Rule 8)

1 Place of Publication Vijayawada
2. Periodicity of its Publication Monthly
3 Printers Name Sri S Radhakrishna
Whether citizen of India Yes
Address 8-2-322, Banjara Hills, Hyerabad-500 034
4 Publisher's Name Sri S Radhakrishna
Whether citizen of India Yes
Address 8-2-322, Banjara Hills, Hyderabad-500 034
5 Editor's Name Sri S Radhakrishna
Whether citizen of India Yes
Adress 8-2-322, Banjara Hills, Hyderabad-500 034.
6 Name - and address of individuals who own the newspaper and partners or share holders - holding more than one percent of the total capital
1. Name S. Kamakshamma
Address 16, Luz Avenue, Mylapore, Madras-600 004
2 Name S Radhakrishna
Address 8-2-322, Banjara Hills, Hyderabad-500 034
3 Name S Nageswara Rao,
Address. 16, Luz Avenue, Mylapore, Madras-600004
4. Name S Rajeswari,
Address 8-2-322, Banjara Hills, Hyderabad-500 034
5 Name S Seshamma,
Address 16,Luz Avenue, Mylapore Madras-600 004
6. Name S Sreeramamurty, Trustee, Kasinadunı Nageswarao, Sivalenka Sambu Prasad Dharma Nidhi
Address 14/15, Luz Church Road, Mylapore, Madras-600 004
7 Name. Dr P S N Murthi
Address PO Yellamanchili, VizagDt
8. Name S Ramayamma
Address 16, Luz Avenue, Mylapore, Madras-600 004
9 Name P Satyanaryana
Address 183,184,RashtrapathiRoad, Secunderabad
10. Name D. Subba Rao
Address 16, Luz Avenue, Mylapore, Madras-600 004

I, S Radhakrishna, hereby declare, that the particulars given above are true to the best of my knowledge and belief

1—3—80

S. Radhakrishna,
Signature of Publisher,

మజ్‌తా మజ్‌కా [ది మదర్ ఆఫ్ మయిన్] అన్న రూపం వుంది. కాని 'మజ్‌కామి' [మయి మదర్] అన్న వ్యవహారంలేదు. వ్యాకరణ విరుద్ధమన్నమాట. [చూ. యాకబ్‌సన్. 1971. పుటలు 22-23].

ఇక్కడ ఆగి—తెలుగులో ఉన్న ఇలాంటి సమాన వ్యవహారాన్ని పరిశీలిద్దాం. కింది రూపాలమధ్యన గ్రాంధిక వ్యావహారిక శైలీ భేదం, శిష్ట శిష్ట పరిగణనం- సాంఘికంగా కుదురుతుంది.

హయ్యర్	లోయర్
నా తల్లి / తండ్రి[8]	మా అమ్మ / నాన్న / అప్ప
గ్రాంధికం	వ్యావహారికం
శిష్టం	అశిష్టం
మార్‌క్‌డ్ (కృతకం)	అన్‌మార్‌క్‌డ్ (సహజం)

అశిష్ట వ్యావహారికాలుగా చెప్పబడుతున్న రూపాల—మౌలికాలు—సహజం అంటే అర్థం ఇది (ఇది కూడా ఇంకోచోట రోమన్ యాకబ్ సన్ ప్రతిపాదించిన విషయమే) ఈ మౌలికత—ప్రస్తుత పరిశీలనాంశం దృష్టితో శిశుభాషా వ్యవహారంగా ఉండటం. శిష్ట సాహిత్యంలో కూడా అమ్మ అప్ప శబ్దాలు వాడబడి వుండినా అక్కడ 'అమ్మ' శబ్దం లక్ష్యార్థాలలో కాని, సందర్భాశ్రితంగా వ్యావహారిక సంఘటనంలో కాని వాడబడి వుండటాన్ని గుర్తించవచ్చు.[9]

కాని అమ్మ నాన్న అప్పలకే లింగబోధకతా రాహిత్యం ఒక గుణంగా ఉంది. వృద్ధులే ఆడపిల్లల్ని 'ఏం నాన్నా!' అని, అబ్బాయిల్ని 'ఏమ్మా' అని, బాలికలు తమలో తాము 'ఏమోయ్' అని, 'ఏంటబ్బా' అని—సంబోధించే పద్ధతుల్లో ఈ అంశం వ్యక్తమవుతుంది.

వాక్యప్రయోగంలో కూడా అమ్మ / తల్లి ఆక్రమించే స్థానాలు భిన్నంగా వుంటున్నాయి.

(ఎ) 1 ఒకవూళ్ళో భార్యా భర్తా ఉన్నారు.

2. ఒకవూళ్ళో తల్లీ తండ్రీ ఉన్నారు.

3. ఒకవూళ్ళో అమ్మానాన్నా ఉన్నారు.

పై (ఎ) లోని వాక్యాల్లో (3) విడ్డూరంగా కనిపిస్తుంది. నిర్దేశ (రిఫరెన్షియల్) వాచకాలుగా అమ్మా నాన్న రూపాలు అసహజంగా వున్నాయి.

(బి) 1. మా తల్లి / తండ్రి

2. మా అమ్మ / నాన్న

బంధు వాచకాలే రెండూ అయినా (బి)లో (1) అసహజంగానూ (2) సహజంగానూ వున్నాయి (2) లోని 'ఎమోటివ్ ఎలిమెంట్' దీనికి కారణం. అందుకే (సి) (1) తెలుగువాళ్ళ వ్యవహారంలో కనిపించదు. (2) మాత్రం కనిపిస్తుంది.

(సి) (1) నా అమ్మ/నాన్న

(2) నా తల్లి / తండ్రి.

(సి) (2) కేవలం రచనల్లో మాత్రమే కనిపిస్తుంది. శిష్ట సాహిత్యంలోనే విస్తారం.

అందుకే సంప్రదాయ వ్యాకరణాలు తల్లిదండ్రులు అన్న రూపాన్ని విచారించాయి తప్ప అమ్మా నాన్నలు, అప్పా అమ్మావంటి సమస్త రూపాలజోలికి పోలేదు. సమస్త పదాల విషయంలో 'అమ్మ' రూపానికున్న వ్యతిరేక లింగబోధకతను గుర్తించి ప్రౌఢ వ్యాకరణం 'ఇట్టిచో అమ్మ ప్రేమసూచకంబని ఎరుంగునది' అని రాసింది (చూ. బ్రహ్మానంద, 1978. పుట. 28).

ప్రేమ ఒక భావం. అర్థంకాదు. నిర్వాచ్యమైంది. అంటే 'అమ్మ' రూపంచేత బోధింపబడుతున్నది మౌలికంగా ఒక భావమే తప్ప వస్తువుకాదు. ప్రపంచ భాషలన్నింటిలోనూ ఈ మాతృభావ వివక్షలో శిశువుల మధ్యన భేదం లేకపోవడంవల్లనే 'మ'కారయుక్త రూపాలు మాతృభావాన్ని 'ప'కారయుక్త రూపాలు పితృభావాన్ని బోధిస్తున్నాయి[10] ఎలా గా! అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడానికి భాషాశాస్త్రజ్ఞులు శిశువులు ధ్వన్ని ఏ వరసల్లో నేర్చుకొంటారో పరిశీలించాల్సి వచ్చింది. ఆ వరసల్లో ప్రపంచ భాషలన్నిటా దాదాపు సమానత్వమే అధికంగా కనిపిస్తోంది. కాబట్టి ఈ రూపాల్లో, బాహ్యనిర్మాణసామ్యం (ఎప్పారెంట్ ఫార్మల్ సిమిలారిటీ) కనిపిస్తోందని పరిశోధకులు శాస్త్రీయ వివరణ చెప్పుకొన్నారు

' యాకబ్‌సన్ ప్రతిపాదనల్లో మొదటిది ఇది.

2. 2. శిశూచ్చారణ పద్ధతులు రూపసామ్య లక్షణాలు

ఈ రూపాలలోని అచ్చులు హల్లులు నియతంగా ఉంటున్నాయి. మర్డాక్ సేకరించిన పదాల్లో (1072 పదాలలో) 1 1% కూడా సంయుక్త హల్లులతో కూడిన రూపాలులేవు. అచ్చు+హల్లు ఇది మామూలు వరుస—ఈ రూపాల్లో. కేవలం అచ్చులతో కూడిన రూపాలూ కానరావడంలేదు.

హల్లులు	ప	త		క		
	బ	ద	స	గ	జ	మ
అచ్చులు	అ	ఉ	ఇ			

వీటిలో ఓష్ఠ్యాలు దంత్యాలు దాదాపు 76% రూపాల్లో కనిపిస్తాయి. కంఠ్యతాలవ్యాలు 10% రూపాలలో మాత్రమే ఉన్నాయి. అచ్చుల్లో 'అ'కారం మిక్కిలి ప్రాచుర్యం కల్గింది. ముఖ వివర సంపూర్ణ సంవృతి (కంప్లీట్ ఓరల్ క్లోషర్) 'మ' 'ప' లతో కూడిన రూపాలకు కారణం. శిశువుకి సహజంగా ఈ ప్రక్రియ సులభంగా ఉంటుంది. మ అ లతో ఈ సంపూర్ణత ఉంది. అందు వల్లే వీటిని ఆప్టిమల్ కాన్సొనెంట్ అనీ, ఆప్టిమల్ వోవెల్ అని యాకబ్‌సన్ పిలిచాడు. కింది చిత్రంలో చూడండి.[11]



శిశువు మొదట హల్లుని ఉచ్చరింపగలుగుతాడా! అచ్చునా! అన్నదీ ఒక ప్రశ్నే.

'The most natural order of sound production is an opening of the mouth followed by its closure' (P. 27) అని యాకబ్ సన్ స్పష్టం చేశాడు. 'అ'లో సంపూర్ణ వివృతి. 'మ'లో సంపూర్ణ సంవృతి ఉంది. అమ్ /ఉజ్...వంటి రూపాలుఇలాగే ఏర్పడుతున్నాయి. శిశువుల ఉచ్చారణలో ఈ 'అ' స్వరూపం చాలా అస్పష్టంగాఉంటుంది. తెలుగుపిల్లలోకూడా అమ్మ, అప్పలలోని పదాది అకారం సంపూర్ణంగా వినిపించదు. (చూ. బ్రహ్మానంద. 1978. పుట. 28) కంఠ్యాలకు బదులుగా ఇటీవలి పరిశోధనల్లో కంఠమూలీయ స్పర్శను (?) (అస్పష్టంగా) శిశువులు ఉచ్చరించడాన్ని మనం గుర్తించగలుగుతున్నాం.[12] పశువుల అరుపుల్లో వినిపించే 'అమ్బ' లోని మ/బలు ఏకస్థాన జన్యాలు కాబట్టి సంయుక్త హల్లుల్ని ఉచ్చరించేటప్పటి స్థాన విపర్యయ సమస్య లేకపోవడంవల్ల శిశువులుకూడా — ంబు / — ంబ రూపాలను ప్రారంభ దశల్లో ఉచ్చరించగలుగుతారు. (ఏమైనా అజాదిగా రూపాలు ఉచ్చరింపబడటం మొదలౌతోందని అర్థం)

ఈ రూపాలకి సంబంధించిన మరో అంశం — అవి ఏకవర్ణ పద — వాక్యఘటితోచ్చారణ (ఉట్టరెన్స్) లు కావడం. అ[మ/ప లలో ఈ లక్షణం ఉంది. అక్షర పునరుక్తి కూడా ఈ దశలో కనిపించే మరో లక్షణం. మమ/అమ్మమ్మ, పప/అప్పప్ప, తత/అత్తత్త ... వంటి రూపభేదాలు ఇలాగే సాధ్యం. ఆంగ్లంలోని మమ్మీ అన్న రూపంకంటె మామా ప్రాథమికం. అంతకంటె శిశువు రోదనం లోని అమ్ — మౌలికం.

2.3 ఈ రూపాల వెనుక నున్న భౌతిక ప్రక్రియ- భావ వ్యంజకత

పైన చెప్పిన విషయాల నాధారంగా శిశుభాషా రూపాల్ని కేవలం చేష్టలకు వాగ్రూప వాచకాలుగ; అర్థంతో సంబంధం లేనివిగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంది.[13] అర్థం వ్యావహారిక (సోషల్) మన్న విషయాన్ని మళ్ళీ ఇక్కడ గుర్తుచేస్తూ ఈ రూపాలకున్న భావ వ్యంజకత్వాన్ని నిరూపించడం ఇక్కడి ప్రయత్నం.

శిశువులు పాలు తాగేటప్పుడు 'స్లయిట్ నాసల్ మర్మర్' ఒకటి వినవస్తూండటం ప్రతి తల్లి అనుభవంలోనూ ఉంటుంది. (పెద్దల్లోకూడా ఈ 'మర్మర్', లొట్టల రూపంలో బయటపడుతూ వుంటుందని యాకబ్‌సన్ అంటాడు. పుట 26)

అవి ఊం, ఆం లుగా వినబడుతాయి. పాలు తాగనపుడు ఈ మర్మర్ కంఠ్యంగానో ఓష్ఠ్యంగానో బయటపడే అవకాశం ఉంది. అచ్చుపూర్వకంగా కొన్ని 'నాసల్ ఇంటర్‌జెక్షన్స్' ఏర్పడుతాయి.

రష్యన్ : ఆమ్ ('పాలు' అని అర్థం)

మలయాళం : అమ్మిఞ్ఞ ('చన్ను' అని అర్థం)

తెలుగు : చిన్నమ్మణ్ణి (ఒక తిట్టు. మర్మావయవ భాగంగా సామాజికార్థం ఉంది.)

{ ఆము (బువ్వ)
బాయి (పాలు)
అప్ప (రొట్టె—అప్పాలు) }

తల్లి శిశువుకి సర్వసమాహార సంభారం. కాబట్టి మొదటి పిలుపూ ఆ వ్యక్తినే ఉద్దేశించి ఉండటంలో సహజత్వం ఉంది. (ఆ వ్యక్తి దాది/అత్త/అవ్వ/మరొకరుగావచ్చు. అది సాంఘిక నియమ విషయం. పాలిచ్చి లాలించే వ్యక్తి అని ఇక్కడ వివక్షిత సందర్భం) —ఇలా ఉద్బుద్ధమవుతున్న శబ్దసమాహారమే మాతృవాచకమౌతోంది. ఆయా భాషలకి సంబంధించిన వర్ణక్రమాల్ని పొంది అమ్మ/మమ్మి వంటి రూపాల్ని పొందుతోంది. అప్పటికి ఈ రూపం వృద్ధ భాషలోకి ప్రవేశించడం మొదలు పెట్టిందని అర్థం.

ఈ రూపాలకున్న మనఃస్థితి వ్యంజకతకు మరో ఉదాహరణం.

రష్యన్ : ʼap / ʼam [భావార్థక రూపాలు]

తెలుగుకి సంబంధించి — మా అమ్మాయి అమ్మమ్మ, అయ్యా / అబ్బబ్బ వంటి భావార్థక రూపాలు పాడటం రెండో సంవత్సరం ఆరంభంనుంచీ ఉంది. ఈ రూపాల్లో పదాది కంఠమూలీయహల్లు అస్పష్టంగా వినిపిస్తుంది. ఇది మాత్రార్థకం కానేకాదు. కేవలం భావరూపం.

ఇంతవరకు 'అమ్మ' రూపంమీదే ఎక్కువ పరిశీలించాం. 'అప్ప' రూపాన్ని గురించి కొన్ని అంశాలు చెప్పాల్సిఉంది. 'అమ్మ' ఆతర్వాతనే 'అప్ప' అన్నరూపం శిశువుల్లో వినిపిస్తుంది. అప్పటికే శిశువులో రూఢినియమాలు (కన్‌వెన్షనల్ కాన్‌స్ట్రెయింట్స్) ప్రవేశించాయనిఅర్థం లియోపాల్డ్ (1947) తన శిశువు నాధారంగా ఈ విషయకంగా ఒక విషయం చెప్పాడు. 'అమ్మ' రూపానికి దాదాపు 15 మాసాలదాకా వ్యావహారికార్థం శిశువుకి తెలియదట. కాని 'అప్ప' రూపానికి 12 మాసాలకే తెలుసని.[14] (యాకబ్‌సన్ 197 . పుట 27)

అందువల్ల శిశువునాధారంగా మాతృరూపాల వివేచన చెయ్యడంవల్ల కింది ప్రయోజనం ఉంది.

'The Parental term heralds just the transition rom affective expression to designative language'

(యాకబ్‌సన్ 1971 పుట 28)

కాబట్టి ఆడపిల్లల్ని మగపిల్లల్ని వేరువేరుగా పరిశీలిస్తే అమ్మ/అప్ప రూపాల్ని ఉచ్చరించే దశల్లో ఏమైనా తేడా వుంటే గమనించడానికి అవకాశంఉంది. అప్పుడు శిశువుకి మాతృ, పితృ, గృహ ఆహార విహారాదులమధ్య ఒకసంబంధం దర్శనం(ఇంట్యూటివ్ పర్సెప్షన్ ఆఫ్ రిలేషన్‌షిప్) ఉందని నిరూపించవచ్చు. దాన్ని శిశు సంబోధనచక్రం (సయికిల్ ఆఫ్ చెయిల్‌డ్ అట్టరెన్సెస్) అనవచ్చు.

అందుకే ఎస్పర్‌సన్ చూపిన ఉదాహరణలతో విరమిద్దాం.

సం.	తాత	'తండ్రి'
ఆంగ్లం :	tata	'టాటా' (బై బై లాగా)
[తెలుగు :	తాత	'నాన్న/అమ్మల నాన్న']

తెలుగు శిశువులు 'తాత' అంటుంటే మనం 'టాటా' చెపుతున్నాడని సంతోషపడతాం. అమ్మ/అప్పల విషయమూ అంతే.

అ ధో జ్ఞా పి క లు

* ఈ వ్యాసరచనకు నేపథ్యంలో క్రింది వ్యాసం, సమీక్షలు ఉన్నాయి. పాఠకుల సౌకర్యంకోసం వాటిని పొందుపరచడం జరిగింది. అన్నీ 'భారతి'లో వచ్చినవే.

బ్రహ్మానంద 'ద్రావిడ భాషల్లో మాతృ పితృవాచకాలు'– (అక్టోబరు 1978 పుటలు 27–29)

తిరుమలరావు 'అమ్మ, అప్ప' (జనవరి 1979 పుటలు 68–69)

బ్రహ్మానంద 'అమ్మ<మా ?' (ఫిబ్రవరి 1979 పుటలు 68–70)

తిరుమలరావు 'అమ్మా, మా' (మే 1979 పుటలు 69–70)

శేషశర్మ 'అమ్మ' (జూన్ 1979 పుటలు 65–66)

ప్రస్తుత వ్యాసానికి మూలరూపంగా ద్రావిడ భాషాశాస్త్ర వేత్తల నవమ సమావేశం (కాలికట్–మే 24, 25, 26 తేదీలు 1979)లో చదవబడ్డ ఆంగ్లవ్యాసం వుంది– (అముద్రితం) 'The Dravidian Evidence for Jakobson's hypothesis'.

1 తిరుపతి సమీపంలో ఒక గ్రామంలో ఒక వృద్ధస్త్రీని 'అయ్యా' అని సంబోధించడం గమనించాక, 'అయ్య' శబ్దానికి స్త్రీ వాచక ప్రవృత్తి ఉన్నదేమిటని సంశయం వచ్చింది. ఈ సన్నివేశం కూడా 1976 లోనే తటస్థించింది. ఆ గ్రామం కల్‌రోడ్డుపల్లె (తమిళంలో ఆయి తాయి; కన్నడంలో 'తాయి' అన్న రూపాలు ఈ అంశాన్ని స్థిరపరుస్తున్నాయి).

2 నా Ph.D. సిద్ధాంతవ్యాస ప్రయోజనంకూడా వ్యంజన వ్యాపార ప్రతిపాదనమే. చూ. 'వ్యంజన సూత్రము' (The principle of Suggestivity) (అముద్రితం)

3 ఆనందవర్ధనుడు (9. శ.) గీత చేష్టాదులకున్న సాక్షాచ్ఛబ్ద నివేదిత శక్తిని గుర్తించి శబ్దవ్యంజకతను స్థాపించాడు–'వాచ్యోఽర్థః సాక్షాత్ శబ్దస్య సంబంధీ తదితరస్తు అభిధేయ సామర్థ్యాక్షిప్తః సంబంధీ అవాచక స్యాపి గీత శబ్దాదే రసాది లక్షణార్థో అవగమ దర్శనాత్ అశబ్దస్యాపి చేష్టాదేః అర్థ విశేష ప్రకాశన ప్రసిద్ధేః'–

[ధ్వన్యాలోకము పుటలు 417, 446 47]

4 మానసిక రుగ్మత కలవారిలోనూ, ఆదిమ నివాసుల్లోనూ (జానపదుల్లో) విలక్షణంగా ఉండే ఈ ఆలోచనా పద్ధతిని గురించి ఇంకా పరిశోధించాల్సి ఉంది. ది లాంగ్వేజ్ ఎండ్ థాట్ ఆఫ్ ది ఛెయిల్‌డ్ (1966).

5 'Mamma and papa, some fundamental problems' Otto Jesperson (1922) repr. (1964) pp. 140–160.

6 Cf. 'A comparative Grammar of the Dravidian or South Indian family of languages'–Madras Univ. publication (1961) pp. 566-67.

7 Cf. Studies on child language and aphasia (1971) pp. 21–30. తరువాత వచ్చిన నిఘంటువుల్లోకాని (ఉదాహరణకు 'బక్' నిఘంటువు. పూర్వ వ్యాసంలో ఉదాహృత రూపాలున్నాయి చూ. బ్రహ్మానంద 1978-పుట 28), మానసిక భాషా విజ్ఞానంపై వచ్చిన పుస్తకాల్లో కాని (చూ. Psycholinguistics, Salsaporta – (ed) 1966) యాకబ్‌సన్ ప్రామాణికంగా గుర్తింపబడ్డాడు. ఈనాటికి

ఈ అంశంమీద కొన్ని వందల వ్యాసాలు, కొన్ని పదుల పుస్తకాలు ఉన్నాయి. ఈ తెలుగు వ్యాసంలో వాటిని చూపడం కుదరదు. ఇటీవల వచ్చిన వ్యాసానికి చూ. (William Labov and Teresa Labov 'The phonetics of cat and mama', Language, 54-4, pp. 816-852, 1978)

8 తల్లి, తండ్రి రూపాలు కేవలం ద్రావిడ భాషల్లోనే కనిపిస్తాయి. ఇక్కడ బాషాపరిధులు చెప్పడం సాధ్యం. ఇది వ్యావహారిక శబ్దమన్నమాట. ఇక్కడ లింగవిపర్యయం అసాధ్యం.

9 ఓ యమ్మ నీ కుమారుడు - ఇక్కడ పరస్త్రీకి సంబోధన [+గౌరవ వాచకం] ఇలాంటివే అవ్వా / అక్కా / అత్తా మొ. (ఇక్కడ వక్త శ్రోతల మధ్య ఆ సంబంధాలు కూడా ఉండనక్కరలేదు. పెద్దమ్మ (దరిద్ర దేవత, ముగురమ్మల మూలపుటమ్మ), అమ్మవారు (మశూచి) – లలో లక్ష్యార్థాలు గమనించవచ్చు. ఇలాంటిచోట్ల సంస్కృత రూపాలు వాడటం వుంది. అంబన వాంబుజోజ్వల ..., ఇలాంటిదే సరస్వతీ సంబోధనలోని 'తల్లీ నిన్నుదలంచి...' 'తండ్రీ నాకు నను(గ్రహింపగదె వైద్యంబంచు ప్రార్థించినన్ ..' ఇక్కడ కూడా తలి / తండ్రి రూపాలు సందర్భోచిత మాతృ పితృ భావాలే తప్ప—లక్ష్యార్థాలు కావు

10 ఈ ఆవిర్భావ తిరోభావ ప్రక్రియనే Centripetal, centrifugal developments అని పాశ్చాత్య దేశాల్లో సాంప్రదాయికంగా ఒక అభిప్రాయం వుంది. ఇదిమూఢనమ్మకమని కొందరంటారు. కాని ప్రపంచ భాషలనుంచి ఈ అభిప్రాయానికి Statistical proof వుందని యాకబ్‌సన్ తన గ్రంథంలో నిరూపించాడు. (చూ. 1971. P. 26)

11 '...are based on the polarity between the optimal consonant and optimal vowel' (Jakobson, 1971. p. 27)
అందు మొదటిది కంఠం. కడపటిది పెదవి. నోరు తెరిస్తే కంఠంనుంచీ పుట్టేది 'అ'. నోరుమూస్తే పెదవులనుంచి పుట్టేది 'మ' . (శేషశర్మ. జూన్. 1979 పుట 65.)

12 Labov దంపతుల వ్యాసం. పూర్వోదాహృతం. పుట.

13 ఇలా అర్థంచేసుకోవడం వల్లనే—'వాగర్థసంబంధ శాస్త్రానికి (Semantics) శబ్దోత్పత్తికీ లంకె లేదని' (తిరుమల రావు. తె. 1972 పుట. 70) అభిప్రాయపడటం జరుగుతోంది. ఈనాడు మనకు తెలిసి ప్రచారంలో ఉన్న 'Semantics' చాలా అసమగ్రమైంది. ఇప్పుడు నేను రాస్తున్న శబ్దార్థ భావ మీమాంస 'Semisiology'కి సంబంధించింది. (వివరాలకు చూ. Roland Barthes 'Elements of Semiology, 1967.)

14 లెబావ్ దంపతులు శిశుభాషా నియమాల్ని గురించి రాస్తూ 'The arbitrariness of the linguistic sign' అన్న ఒక లక్షణం చెప్పారు (1978. పుట 851) యాదృచ్ఛికతనే అంగీకరించారా అంటే కొన్ని రూపాలు మాత్రం వస్తు / చేష్టలతో నిత్యసంబంధం కల్గి ఉందన్నారు. దానికి సమాధానం భావాన్ని విలక్షణంగా గుర్తించడమే.

అదనం రిఫరెన్సులు

1. Anandavardhana, (9th C.A.D) 'Dhranyaloka'. Pattabhi Rama Sastry (ed), Chowkhambha Sanskrit Series (1940)
2. Barthes, Roland, 'Elements of Semiology', Cape Editions, London (1967)
3. Brahmananda H.S', 'Vyanjana sutramu', Ph.D. thesis submitted to S. V U. P. G. Centre, Anantapur, unpublished (1979)
4. Jakobson, Roman, 'Why mama and Papa' in Studies on Child language and aphasia, Monton (1971) (References to Murdock & Leopold are from this Source)
5. Jesperson, Otto, 'Mamma and Papa - some fundamental problems' in Language, its nature and development and origin (1922), repr. George Allen and Unwin Ltd. London (1964)
6. Hawkes, Terence, Structuralism and Semiotics' New Acceuts, Mathuen & Co. Ltd, London (1977)
7. Kunjunni Raja K., Indian Theories of Meaning' Adyar Library Series, Madras (1963) rep, (1977)
8. Labov, William, and Teresa Labov, 'The Phonetics of Cat and mama', Language 54-4, pp 816-852 (1978)
9. Piaget, Jean, 'The language and thought of the child', Meridian Books, The world Publishing Company, New York (1966)
10. Salsaporta & J.R. Bastian', (ed) 'Psycholinguistics', Holt Rinehart and etc. New York. (1966)

ఆ హూ తి

ఎలనాగా !
ఎన్ని ఉదయాలు సాయంత్రాలుగా అస్తమించాయో
ఎన్ని కెంజిగుళ్ళు భీకర శైశిరం వాతపడి జీర్ణ పత్రాలై రాలిపోయాయో
ఎన్ని సౌందర్యాలు వాడి వత్తలై ధూళిలో కలసిపోయాయో
ఎన్ని మాధుర్యాలు విషాదగీతికలై రోదసిలో నిండిపోయాయో ఎరుగవునీవు
నీ నుదురుతో సరాగాలాడే నల్లని ముంగురులను ముకురంలో దర్శించుకొని
ఇందీవరాలను ఓడించే క్రాల్గన్నుల మిలమిలకు మురిసిపోతున్నావు
నీ పగడాల పెదవులలోంచి తళతళ మెరసే మల్లెమొగ్గల దంతాలను మరీ మరీ చూచుకొని
ఒయ్యారంగా కదిలే నీ వొంటి ఒంపు సొంపులకు పొంగిపోతున్నావు
అయ్యో !

కాలాన్ని అలక్ష్యం చేస్తున్నావు
అవలీలగా నవ్వేస్తున్నావు
ఈకాలం
గుండెలేని నియంత

నీ సౌందర్యంపై ఆసిడ్‌చల్లి కురూపిని చేసేస్తుంది
ఏ శరీర సౌందర్యాన్ని చూచుకొని నీవు గర్విస్తున్నావో
ఆ వొంటిపై నీకు జుగుప్సను సృష్టించి
నీ ఊపిరితిత్తుల్ని కొలిమి తిత్తులుగా మార్చేస్తుంది
అందుకే రాచెలీ !
మాధ్వీకం క్రింద మధువు సేవించి
జీవితాన్ని రసరమ్యమైన ప్రణయ కావ్యంగా
రచించుకుందాముర్
పరవశించి పాడుకుందాముర్ !

భి క్షాం దే హి

వయస్సు వృద్ధాప్యంవైపు పరుగెత్తుతూవుంటే
మనస్సు తారుణ్యాన్ని నెమరువేస్తోంది
మధువు సేవించి మత్తెక్కిన మనస్సు ఉయ్యాల వూగుతూ ఖవ్వాలీ పాడుతూవుంటే
నేడు నిర్దయగా నిన్న తగిలిన గాయాల మచ్చలవైపు వ్రేలెత్తి చూపిస్తోంది
రసం చిప్పిల్లే ప్రణయకావ్యంలో అభిసారికా గమనాన్ని నా కలం విరచిస్తూవుంటే
ఒలికే ప్రతి సిరాచుక్క నా ప్రేమలేఖ తిరిగొచ్చిననాటి స్మృతులను కెలుకుతోంది
వసంత కోకిల గానమాధుర్యం శ్రవః పేయంగా వుందని నేను ఆనందిస్తూవుంటే

భిక్షాందేహి

ఎట్టా ఎదురుగా పాడుపడిన బురుజులోంచి పావురాయి
నా మూలుగుల గతాన్ని కళ్ళముందు చూపిస్తోంది
ఏదో సినిమా పోస్టర్‌వైపుచూస్తూ నేను ఆ బొమ్మతో తాదాత్మ్యం పొందుతూవుంటే
గోడకు సగం పొగచూరిన నా డిగ్రీ సర్టిఫికెట్టు నన్ను అసహ్యంగా చూస్తోంది
ఇక ఏమి ఆలోచించినా లాభంలేదు
ఈ మేధస్సు చుట్టూరా నిన్నటి నీడల పరిభ్రమణం
కొత్త ఆశలు నాలో వెలిగించే
చిత్తరు వొక్కటి నా హృదయం కాన్వాసుపై అందంగా చిత్రించు ప్రభూ !
ఈ జీవితాన్ని సత్యంగా సుందరంగా మార్చగల ఒక్క అనుభూతి భిక్షపెట్టు భగవాన్ !
అప్పుడు అనంత తృప్తితో నేను పరవశిస్తాను
ఆనందసాగరంలో హాయిగా తేలిపోతాను !

తిరునగరి

వెన్నెల్లో విశాఖ

కుమారి దినవహి లక్ష్మీకామేశ్వరి

ఏ సముద్రంమీద కురిసినా
  చేపలమీద వెండిరేకులుగా మారేది
కానీ...వ్యర్థంగా ఈ నగరంమీద కురుస్తోంది, పిచ్చివెన్నెల
వీధుల్లో బీభత్సానికి జడిసి
రాత్రికి ప్రాణం ప్రవాసానికి పారిపోయింది
అప్పుడోటీ అప్పుడోటీ ముసలి రిక్షా
కాళ్ళీడ్చుకు పోతూంది
మార్కెట్ మొగలో ముసలి ఆబోతు అంకెకు
భయపడిన గూర్ఖా విసుక్కొంటున్నాడు
ఆకాశంలో ఏమూలో ఓ తారాజువ్వ
వెలుగును కక్కి చచ్చిపోతూంది
మరేమూలో రావిచెట్టు గుబురుల్లో కాకుల్లో కలవరం
తన అస్తిత్వం నిరూపించుకొందుకు
గుండెమీద అంపాలు కదిలినట్లు నల్లకుక్క ఏడుపు
థియేటర్ గేటుముందు మరిగిపోయిన టీ కమురు వాసన
గేటుమీద ఎడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డు
విశాఖ అందం 'సనెస్సీ' పామ్ బీచ్‌లకే స్వంతం
అవైనా 'శేఠ్ దగాచంద్ మోసం లాల్'కే పరిమితం
ఏడ్చే వీధి దీపాలూ వెకిలినవ్వు ట్రాఫిక్ లైట్లూ
పగలంతా ఎన్ని హత్యలు చేసిందో
ఈ నగరం ఆత్మశాంతి మౌనాన్ని పాటిస్తోందీ రాత్రి
నిద్రరాని బైరాగుల గంజాయి పొగల్తో
ఘూకెత్తి పోతూంది
నేరం చేసినట్టు వెన్నెల్ని ఏవగించు కొంటోంది
చీకటి ముసుగేసుకొంటోంది
మన వూళ్ళో అయితే ... ...
ఈ వెన్నెల్ని నా వేణువులో నింపుకొనే వాణ్ణి
అంచేత నువ్విటు రాకు డియర్
నీ వూహల్లో సజీవంగా వున్న నన్ను
ఈ నగర వల్మీకంలో నిర్జీవంగా చూడలేవు !

మకర తోరణం

శ్రీ సోమసుందర్

నా జన్మస్థలిలో
   ఈ సన్నని ఇరుకు సందుల్లోంచి
మళ్ళీ యిన్నాళ్ళకు కొత్తగా నాపాదాలు
ముందుకు సాగుతూన్నపుడు ...
చేతులెత్తి ఆహ్వానించింది మండువాలోగిలి
నా బాల్యపు మెరుపుల్ని
పసిడి జ్ఞాపకాలుగా మార్చి దాచుకుంది.

నా పసినేస్తం టామీ
అరుగువార కదలకుండా పడుకునిపోయిన ఉదయం
అకస్మాత్తుగా మళ్ళీ జ్ఞాపకం వచ్చింది
నా గమ్యం సుఖాంతం కావలసింది పోయి
దుఃఖాక్రాంత నీరవ నిశాంతంగా
మిగిలింది శూన్యంలో ...

నా పుట్టుకా, నా నెచ్చెలి మరణమూ
ఇదే పాతలోగిట్లో ...
కాని ఈ రెండు సంఘటనలకీ నడుమ
ఎంత వ్యత్యాసం ? !
ఈ రెంటినీ ఒకే నిర్లిప్త వైఖరితో
అందుకున్న ఈ పురామందిరం మాత్రం
ఇప్పటికీ యధాపూర్వంగా నిలచేవుంది –
మా తాత రామయ్యగారి మౌనవ్రతంలా ...

పన్నెండంగుళాల నా శిశువిగ్రహం
ఒరనుంచి అప్పుడే తీసిన కరవాలం
ఆకలితో మెరిసే తళతళల అవతరణం ...
బీభత్స ప్రశాంత శూన్యంతో నిండి
ఆశ నిరాశల రెండు కళ్ళనూ పెరిగి
అదే ఆలాపనగా పాటలు పాడే నా బాల్యం
జాదగాని చేతిలో మెరిసే పాచిక,
ఆశలు వీడదు ...
భయాలు తొలగవు ...
సర్వదా ఆతుర్దా ఫలితార్థంకోసం !

తెల్లని ఒంటిపై నల్లని మచ్చలతో
మెత్తని పట్టుకుచ్చులా మెరిసే నా టామీని
కాలికి తడపకట్టి
పాలికాపు ఈడ్చుకుపోతూంటే –
నేనారోజంతా ఒక్కటే ఏడుపు ...
చివరిసారి టామీ పడుకున్న
అరుగువారకువచ్చి నేనస్తమానూ
అదే ధ్యాసగా కూర్చుంటూంటే
మా బామ్మ అదేపనిగా తిట్లు ...

మా చెల్లి ఎర్రరిబ్బను దొంగిలించి
నేను టామీ మెడకు కట్టినపుడు
ఆనందంతో వెర్రిటామీ
ఎందుకలా కుప్పిగంతులు వేసిందో–
నా ఒళ్ళంతా నాకుతూ
సందడిగా ఎందుకు చిందులు త్రొక్కిందో –
నా బుల్లిమంచం క్రిందనే ఎందుకు నిద్రపోయేదో –
నాకు బాగాతెలుసు;
మా బామ్మకేం తెలుసు ?
ఆవేళ టామీ నా ఒళ్ళంతా నాకుతూంటే –
"ఛీపాడు ! అసయ్యం ! పో స్నానం చేసిరా !"
అంటూ మా బామ్మ ఒక్కటే గావుకేకలు ...

బహుశా నే పుట్టినపుడుకూడా
ఇలాగే మా బామ్మ ఆచారాల ఆర్భాటంతో
మంత్రసానిపై కేకలుపెట్టే ఉంటుంది –
మా అమ్మ నడగాలి !
రక్తం మడుగులో పొర్లుతూ
బయటపడ్డ నన్ను ఎర్రరిబ్బను
అలంకరించుకొన్న టామీ నాకితే ఎగాదిగా
కొత్తగా సంభవించిన అపవిత్రత ఏమిటో
నాన్నగారి నడగాలి !

ఎంత పన్నీట శుభ్రంగా స్నానం చేసినా
నిత్యం మలిన కశ్మలమయ్యే ఈ శరీరానికి
అసలెలా సంభవిస్తుందో పవిత్రత ?
మరి నా సందేహం ఎవరు తీరుస్తారు ?

టామీ పడుకున్న అరుగువార
మరునాటి ఉదయం —
ఊరపిచ్చుక లారు చేరాయి...
దేనినో వెదుక్కుంటూ పిచపిచలాడుతున్నాయి —
పిచ్చిగా రోదిస్తున్నాయి — టామీ కోసమేనా ?

టామీ ఊలుబంతి లాంటి తోక
గాలిలో ఊగుతూ కనిపించకపోతే
మా వాకిలి నాకు శూన్యంగా —
దుఃఖసాగరంలో తెప్పలా — కనిపించింది.

ఇంతలో ఎక్కడ్నించి వచ్చిందో
నల్లని మేఘం మా చూర్లో వ్రేలాడింది.
మా అన్నయ్యలంతా
కాళ్ళూ మేళ్ళూ బుజాలకెత్తుకున్నారు !
కోటేళ్ళని తోలుకుంటూ
పెరిపప్పొ అని ఎద్దుల్ని అదలిస్తూ
పెద్ద మాన్యంలోకి వెళ్ళిపోయారు !

ఇంట్లో నేనొక్కడ్నీ...
నన్ను విడిచి వెళ్ళిన నా నేస్తం టామీ...
శూన్యంలో మిగిలాం
నా బాధ చూసి జాలిపడే మా అమ్మ దిగులు
నట్టింట మోగుతూ వినిపించేది......

టామీ ప్రేమగా నాకుతూన్నప్పటి అనుభవం
ఎప్పుడూ నాకు జ్ఞాపకం...
నా జీవన మధ్యస్థ బిందువు
ఎర్రగా ధగధగ లాడుతూన్న నా హృదయం ..
కాని టామీ లేని శూన్యంలో
అది వెలిసి కుళ్ళిపోయిన సపోటాపండు !

తొలకరి జల్లుల్లో తడిసిన మా అన్నలు
హాయిగా జల్లుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు...
వెచ్చని బువ్వతిని ఆదమరచి నిదరోయారు
నాకు మాత్రం తెల్లని డాక్టరి నీడ —

కదిలేది నిద్దర రెప్పల క్రింది నుంచి;
రెండు పూటలా నా తలవైపుగా
నీడ కదిలితే చాలు, డాక్టరేనన్న భ్రమ ..
నా కాలివైపు గాలి సోకితే
టామీ ఊపిరులేనని భ్రాంతి...
ఇక నాకబోతోందనీ కితకితలు...!

ఊడిపోతూన్న లాగూను ఖాతరుచేయకుండా
స్తంభం పట్టుకొని గిరగిరా తిరుగుతూన్న
ఒకనాటి చైత్రమాసపు మధ్యాహ్నం
—నాకు బాగా జ్ఞాపకం ఉంది;
మా అన్నయ్యలంతా కలసి
పరుపుతో సహా మా అమ్మని
బయటకు తీసుకువచ్చేశారు......

గుడ్డిపూల వసంతం నెన్నుదుట
మళ్ళీ డాక్టరి తెల్లని నీడ—
పెదవి విరిచి సెలవడుగుతూ వెళ్ళిపోయినపుడు
మా ఇల్లంతా గొల్లుమంది !
ఒళ్ళంతా పసుపు రాసుకొని
నొసట చారెడు కుంకుమ పెట్టుకొని
మా అమ్మ అలా అలా దేవుడి దగ్గరకు వెళ్ళిపోయింది...
కడ గది మూరుమూల కూర్చుని
వెక్కివెక్కి ఏడుస్తూ — ''అమ్మా-అమ్మా'' అంటూ...
నాకిపుడు టామీలేదు, అమ్మాలేదు... !

వస్తూ పోతూ నవ్వుతూ డాక్టరి తెల్లని నీడలు
ఎటు చూసినా భయం భయం !
అప్పుడలా వచ్చి చెలిమిచేసిన ఆ యేడుపు మాత్రం
నన్నెంతో కాలం విడువకుండా అంటిపెట్టుకుని
నేస్తంలా లాలిస్తూనే ఉంది...

మా అమ్మకోసం ఎక్కడెక్కడో
ఎంత వెదికినా మళ్ళీ కనిపించనేలేదు...
కనిపించిన ప్రతి గుళ్ళోదేవుణ్ణీ
అడుగుతూనే ఉన్నానా వినిపించుకోలేదు...

అలా వెళ్ళిపోయింది —
మళ్ళీ కనిపించని మామిడిపళ్ళ కాలం ..
తాండ్రల కాలం టామీని తీసుకుపోయింది

నల్లనిమబ్బుల కాలం నాకు
తుని రాజాగారి పెద్దఏనుగును చూపించింది...

ఇన్ని ఏళ్ళూ పూళ్ళూ గడచిన తర్వాత
ఎన్నో తీరాల ఏరుకున్న
నానారకాల కాశీ నత్తగుల్లలూ, గవ్వలూ, శంఖాలూ
అన్నిటినీ ఎక్కడెక్కడో జారవిడుచుకొన్నాక—
దేని అందం ఎలాంటిదో
ఇప్పుడెలా చెప్పను ! ?

నిశ్చయ జ్ఞాపకాల జీవితావరణంలో
నూతిగట్టుపైకి ఒంగి
గొంతెత్తి బిగ్గరగా కేకలు వేసినపుడు
గిగింరాలు తిరుగుతూ వచ్చి
వినిపించినవి నా గొంతు ప్రతిధ్వనులేనా ?
ఏడుపు వెక్కిళ్ళ చివరి నిశ్వాసంతో
మృత్యువు వీడ్కోలు తీసుకోవడం
స్పష్టాస్పష్టంగా కనిపించిందా అప్పుడు ?

మృత్యు స్వరూపాల ప్రదర్శనంతో
పరివేష్టించిన జ్ఞాపకాల మకరతోరణంలో
నా బాల్యం ఒక విగ్రహంగా మారింది !
దేవుడిలా మెరుస్తూ దర్శన మిస్తోంది ! !

సూర్యుణ్ణి పట్టుకొస్తా!

ఖమ్రొద్దీన్

మంచి మూర్తీభవించిన నాలో
మానవత్వం తొణికిసలాడుతుందనుకున్నా !
కానీ నా ఊహను తారుమారుచేస్తూ నాలో
కౄరమృగం సంచరిస్తోంది !
కర్ణ కఠోరంగా ఘర్జిస్తూ నాలో ఆశించని అలజడిని
రేపుతోంది !

తన వికృత రూపంతో
నా గుండె మూలల్లో ముడుచుకు పడుకున్న
కాస్తంత మానవతను జడిపిస్తూ, రాచిరంపాన పెడుతూ
నాలో మృగ తృష్ణను రగులుకొల్పుతోంది !
నా నోట అపశ్రుతులు పలికింప జేస్తోంది !
నన్ను అడ్డదారుల వెంట పయనింప జేస్తోంది !
ఇంక నేను ఏ క్షణంలో
ఏం చేస్తానో ?
ఈ అమాయకపు ప్రజలమీద నిష్కారణంగా
ఏ క్షణాన విరుచుకు పడతావో ?
కళ్ళముందు కదలాడుతున్న
మంచిని, మమతని, మానవతని
ఏ క్షణాన కాలరాస్తానో ?
ఏ క్షణాన అవినీతి ఝెండా ఎగురవేస్తానో ?
తలుచుకుంటే కంపరంగావుంది !
మనసుకు కష్టంగావుంది !
ఉండదూ మరి ? మంచి మూర్తీభవించిన నాలో
మానవత్వం తొణికిసలాడుతుందనుకుంటుంటే
నా ఊహను తారుమారుచేస్తూ నాలో మృగం సంచరిస్తోంది!
కలలోనైనా తలపోశానా యిది సాధ్యమని ?
నో —
పగలంతా చండప్రచండంగా మండిన సూర్యుడు
సాయంత్రమయ్యేసరికి
మరి మండే ఓపికలేక పశ్చిమాద్రిలో తలదాచుకున్నాడు !
ఊరిబయట తుమ్మచెట్ల కొమ్మల్లో పొంచికూర్చున్న చీకటి
మరింక సర్వ స్వతంత్రాలు తనవే అన్నట్టు కొమ్మలు
దిగివస్తూ
పశ్చిమాద్రిలో తలదాచుకున్న సూర్యుణ్ణిచూసి
నల్లగా నవ్వుతోంది; సృష్టిధర్మాన్ని విస్మరించి !
డాఫ్‌షేవ్‌ ! ఇక ఉపేక్షించేది లేదు !
నాలోని మృగాన్ని చెరబట్టి,
తెల్లారేకల్లా సూర్యుణ్ణి పట్టుకొస్తా;
చీకటి అహాన్ని హతమార్చడానికి —
నా కళ్ళలో కాంతులు కుమ్మరించడానికి !

కలగూరగంప

గ్రామనామాల గుర్తింపు విషయంలో ఎదురయ్యే సమస్యలు

గ్రామ నామ పరిశీలనలో నామశాస్త్రవేత్త చాలచోట్ల సంశయాలకీ, సమస్యలకీ లోను కావల్సి వస్తుంది. గ్రామనామ సేకరణలోను, ప్రామాణిక రూపనిర్ణయంలోనూ, గ్రామాల్ని గుర్తించడంలోనూ, వ్యుత్పత్తి నిర్ణయంలోనూ, అనేక సమస్యలున్నాయి కానీ అన్ని సమస్యలకూపోక గ్రామాల్ని గుర్తించడంలో ఎదురయ్యే సమస్యల్ని మాత్రం ఇందులో పరిశీలించేందుకు ప్రయత్నించినాను. ప్రభుత్వంగానీ మరే శాఖలుగానీ ఖచ్చితమైన పూర్తి గ్రామ నామ పట్టికల్ని ఇంతవరకూ తయారు చేయక పోవడంవల్ల గ్రామాల్ని గుర్తించడంలో సమస్య లెదురవుతాయి. తాలూకా, పంచాయతీ సమితి, ఎన్నికల శాఖవారు తయారుచేసిన ఊర్లపేర్ల పట్టికలు క్రమపద్ధతిలోలేవు. వీటిలోని పేర్లను ఒకదానితో ఒకటి సరిపోల్చినపుడు వాటిలోని తప్పులు మనకు కన్పిస్తాయి. కొన్ని పేర్లు మార్పుకు లోనవుతుంటాయి. ప్రాచీన ఆధునిక రూపాలను పోల్చి చూడాలనుకున్నప్పుడు సమస్యలెదురవుతాయి. కిందతెలిపిన తొమ్మిది పద్ధతులలో గ్రామనామాల్ని నిర్ణయిస్తున్నప్పుడు ఇబ్బందులు కలుగుతాయి.

1 శాసనస్థ లేక చారిత్రక గ్రామనామ రూపాల్ని ఇప్పటి రూపాలతో పోల్చి చూసినపుడు,
2. ఒక ఊరిపేరు మరో ఊరికి పేరుగా మార్పు చెందినపుడు,
3. బేచరాకు గ్రామాలైనపుడు,
4. ఊర్లపేర్లు మార్పుకు లోనైనపుడు,
5. కొత్తగా ఊర్లు ఏర్పడినపుడు
6. ఉన్నపేరును మార్చి మరోపేరు పెట్టుకున్నపుడు,
7. తాలూకా, ఫిర్కా, జిల్లాల సరిహద్దులు మారినపుడు,
8. ఒకేపేరుతో (అనేకమైన) చాల ఊర్లున్నపుడు,
9. ప్రధాన, అప్రధాన లేక గ్రామ, మజరా గ్రామాల్ని నిర్ణయించినపుడు.

పైన కనబరచిన విధంగా ఊర్లను గుర్తిస్తున్నపుడు ఎదురయ్యే సమస్యల్ని ఒక్కోదాన్నే వాటి ఉదాహరణలతో పరిశీలిద్దాం.

1. శాసనస్థ లేక చారిత్రక రూపాల్ని ఇప్పటి రూపాలతో పోల్చి చూసినపుడు — చాలా శాసన రూపాలు ఇప్పటి పేరుతో పోల్చితే ఆ రెంటికీ ఎటువంటి సంబంధం కనిపించదు. అటువంటపుడు ఆ రెండు రూపాల్ని రెండు ప్రత్యేకమైన గ్రామాలుగా తీసుకునే ప్రమాదం వుంది. అట్లా కాకపోతే ఆ రూపంతో సామ్యం ఉన్న పేరుగల ఊరుగా గుర్తించడం జరుగుతుంది. పేర్ల రెంటిలోనూ, సామ్యమున్నంతలో ఆ రెండూ ఒకటి కాకపోవచ్చు. సరిహద్దుల్ని బట్టి శాసన లేక చారిత్రక రూపాల్ని ఇప్పటి రూపాలతో పోల్చి చూడాలి. సరిహద్దుల్ని బట్టి ప్రస్తుతం ఉన్న ఊరితో ఆ ప్రాచీన రూపాన్ని గుర్తించవచ్చు.

ఉదా : గుడిమల్లంలో దొరికిన అయిదు బాణ శాసనాల్ని పరిశీలిస్తే అందులో (1) తిరువిప్పిరం బేడు (9శ॥) (2) తిరువిర్పిరంబేడు (10శ॥) (3) విప్పిరంబేడు (11శ॥) (4) విప్రపీఠ (9శ॥) అనే నాలుగు రూపాంతరాలు ఒక పూరికున్నాయి.

కానీ ఈ పేరుగల ఊరు ఏ జిల్లా, తాలూకా, ఫిర్కాలోనూ లేదు. అదీగాక ఇది ఫలానా ఊరికి మరో పేరు అని కూడా ఏ ఊర్ల పేర్ల పట్టికలోనూ లేదు. అయినప్పటికీ శాసన భాషా పరిశోధకులు ఈ 'విప్పిరంబేడు'ను ప్రస్తుతం కాళహస్తి తాలూకాలో ఉండే గుడిమల్లం గా గుర్తించినారు. ఈ గుడిమల్లం అనే పేరు ప్రాచీన రూపాన్ని తోసేసి ఎప్పుడు వాడుకలోకి వచ్చిందో ఇప్పటికి దొరికిన శాసనాల్ని బట్టి చెప్పలేము.

తప్పుగా గుర్తించినవి కూడా వున్నాయి.

ఉదా : ''కోయాతూర్'' అనే ఊరి పేరు 'లడ్డిగం' దగ్గర దొరికిన శాసనాల్లో కనిపించింది. మొట్టమొదట దీన్ని శాసన భాషా పరిశోధకులు 'తమిళనాడు'లోని 'కోయంబత్తూరు'గా గుర్తించినారు. ఈ 'కోయాతూర్'కే 'కోయాట్టూర్', 'కోయాట్టూర్ అనే ఉత్తమ చోళపురం' అని కూడా శాసనాల్లో రూపాంతరాలు ఉన్నాయి. 1906 సం॥లో వచ్చిన ఆర్కియాలజికల్ రిపోర్టులో శాసన భాషా పరిశోధకులు ఈ 'కోయాతూర్'ను ఇప్పటి పుంగనూరు తాలూకాలోని 'లడ్డిగం' గ్రామానికి ఉండిన పేరుగా గుర్తించినారు.

ఈ కోవకు చెందిందే మరో ఉదాహరణ. ''తిరువేంగడం'' పల్లవ, చోళ, విజయనగరరాజుల కాలంలో జయగొండచోళ మండలం లేక తొండమండలంలో ''తిరువేంగడం'' ఒక కొట్టం. అంటే ఒక జిల్లా. పూర్వంనుంచి తిరుమల, తిరుపతి అని ప్రత్యేకమైన పేర్లున్నా రెంటినీ తిరుపతే అనేవారు ప్రజలు. ఎగువ తిరుపతి, దిగువ తిరుపతి అని ఇప్పుడుకూడా జన వ్యవహారంలో ఉంది. కానీ రికార్డుల్లోకి వచ్చేటప్పటికి రెంటి పేర్లూ వేరు. అటువంటప్పుడు, 'తిరువేంగడా'న్ని తిరుమలతో గుర్తించాల్నా? లేక తిరుపతిగా చెప్పుకోవాలా? అనేది సమస్య. చాలామంది తిరుపతిగానే గుర్తించినారు. వ్యుత్పత్తి ప్రకారమైతే 'తిరుమల'గానే చెప్పాలి. కానీ అన్నీ పరిశీలించినతర్వాత, ఆధారాల్ని, అవకాశాల్ని బట్టి తిరుపతిగానే గుర్తించాలి కూడా.

(2) ఒక ఊరిపేరు మరో ఊరికి పేరుగా మారినపుడు దీన్ని ఉదాహరణద్వారా పరిశీలిద్దాం.

ఇప్పటి 'సంగమంగళం' పూర్వం 'చిన్న బొమ్మసముద్రం'గా పిలవబడినట్లూ, ప్రస్తుతం 'గట్టురాళ్ళమిట్ట' పేరుగా ఉన్న ఊరు పూర్వం 'సంగమంగళం' గా వ్యవహారంలో ఉన్నట్లు రికార్డులే ఉన్నాయి. ఇప్పుడు 'చిన్న బొమ్మ సముద్రం' అనే పేరు 'సంగమంగళా'నికి అరమైలు దూరంలో ఉండే హరిజనవాడకు పేరుగా రికార్డులో ఉంది. కానీ వ్యవహారంలో చిన్న బొమ్మ సముద్రం అనే పేరుకు వ్యాప్తి చాలా తక్కువ ఈ హరిజనవాడను చుట్టుపక్కల వాళ్ళందరూ 'సెంటర్‌స్కూల్' అనేపేరుతో వ్యవహరిస్తారు. పాత విషయాలు, రికార్డుల్ల వీటి సందర్భంలో 'సంగమంగళం' అంటే ప్రస్తుత 'సంగమంగళమా'? లేక పూర్వపు 'సంగమంగళమా'? 'గట్టురాళ్ళమిట్ట' పేరు ఎప్పుడు వాడుకలోకి వచ్చింది? 'సంగమంగళం' పేరును ఎందుకు 'చిన్నబొమ్మ స ద్రా'నికి మార్చినారో? ఆ 'చిన్న బొమ్మ సముద్రం' పేరును 'హరిజనవాడ'కు ఎందుకు మార్చినారో? కారణాలు తెలియవు. ఇలాంటి సమయాల్లో స్థలనామ శాస్త్ర పరిశోధకుడు కన్ఫ్యూషన్ (సందిగ్ధత) చెందుతాడు. ఆ చోటుకు వెళ్ళి పరిశీలించకపోతే 'గట్టురాళ్ళమిట్ట' ఏది? సంగమంగళం, చిన్నబొమ్మ సముద్రాలేవి? అని గుర్తించడం కష్టం.

(3) బేచరాకు గ్రామాలు :

ఒకప్పుడు ఉండిన గ్రామాలు, కాలక్రమంలో నశించిపోవచ్చు. అట్లా నశించిన ఊర్లను బేచరాకు గ్రామాలు అంటారు. అట్లా నశించిన గ్రామాల పేరను వేరే కొన్ని ఇండ్ల సముదాయం తమ పేర్లుగా గ్రహించవచ్చు. సాధారణంగా బేచరాకైన గ్రామాల పేర్లు దానికి పక్కన ఉండే మాల, మాదిగ వాడలకి పేర్లవుతాయి. అటువంటప్పుడు ఆ ఊర్ల పేర్లలోని రెండవ అవయవం (పి. ఎన్. సఫిక్స్) జారిపోయి దాని స్థానంలో హరిజనవాడ అనో లేక మాల పల్లె అనో ఏర్పడుతాయి. ఉదా : 'ముల్లంగి వారిపల్లె' అనే ఊరు నాశనం అయ్యేం తర్వాత ఆ పక్కన న్న మాలపల్లెకు 'ముల్లంగి వారి హరిజనవాడ'గా పేరు వచ్చింది. ఇది చంద్రగిరి తాలూకాలోది. పాతరికార్డుల్లో, మాప్‌ల్లో మొదటిపేరు, కొత్తరికార్డుల్లో రెండవ పేరు ఉన్నాయి. ఏది? ఏమి? అని తెలియకుండా ఈ రెంటినీ రెండు ప్రత్యేకమైన గ్రామాలుగా గుర్తించే ప్రమాదం ఉంది ఈ విధంగానే 'కొరివివారి పల్లె' — కొరివివారి మాలపల్లె (బంగారు పాళ్యం తాలూకా). సామాన్యంగా హరిజన వాడలకి ప్రత్యేకమైన పేర్లు ఉండవు. లేవు కూడా. ఏ ఊరికి పక్కన ఉంటే ఆ వూరి హరిజన వాడ అంటారు. ఒక్కోసారి ఆ మాల, మాదిగల్లోని ఉపకులం ద్వారా పేరు రావచ్చు: 'ముద్దల మాలపల్లి' 'ముద్దల' అనేది మాలల్లో ఉపశాఖ (సబ్ క్యాస్ట్).

(4) ఊర్ల పేర్లు మార్పుకు లోనైనపుడు.

వ్యవహారంలో ఉన్న భాషకు మార్పులు సహజం. వ్యవహారంలో భాగమైన ఊరిపేరు కూడా మార్పులకు లోనవుతుంది. ఈ రకంగా మార్పు చెందిన పాత రూపాన్ని రికార్డు చేసినపుడు ఆ రూపాన్ని ప్రస్తుత రూపంతో పోల్చి చూసినపుడు కొన్ని ఇబ్బందులు కలుగుతాయి. ఆ భాషా నిర్మాణాన్నీ అందులో రాగల మార్పుల్నీ గానీ లేక ఏ భాషా ప్రభావం ఆ మార్పుకు కారణమయ్యిందో ఆ భాషా నిర్మాణం గానీ తెలిసిన స్థలనామ పరిశోధకుడైతే ఈ విధమైన సమస్యల్ని ఎదుర్కోవడమంత కష్టమేమీ కాదు.

ఉదా: 'తిరుక్కళత్తి' ఈ రూపం చాలా శాసనాల్లో కనిపిస్తుంది. ఇదేగాక 'తిరుక్కళత్తి అనే ముమ్మడి చోళపురం'; 'ముమ్మడి చోళపురం' అనీ ఎక్కువ చోట్ల కనిపిస్తుంది. దీన్ని 'శ్రీ కాళహస్తి'గా గుర్తించవచ్చు. తమిళ రాజుల పరిపాలనలో 'శ్రీ కాళహస్తి' చాలా కాలం ఉన్న కారణంగా అక్కడ వేయబడి ఉన్న శాసనాలు చాలా వరకు తమిళంలోనే ఉన్నాయి. తమిళ భాషా సంస్కృతి ప్రభావం ఎక్కువగా ఉన్నచోటు కావడం వల్ల ఆ ఊరి పేరు కూడా ఆ ప్రభావానికి గురైంది. భాషా శాస్త్రజ్ఞుడు ఇటువంటి వాటిని సులభంగా సాధించగలడు. ఊర్లను గుర్తించగలడు దానికి చరిత్రకారుల, శాసనభాషా పరిశోధకుల సహాయం కూడా అవసరం. వీటికి మరకొన్ని ఉదాహరణల్ని చూపవచ్చు. 'కల్ కడై' — 'కలకడ'; కల్యాయ్‌కుట్టై — కలవకుంట.

(5) కొత్తగా ఊర్లేర్పడి నపుడు :

సాధారణంగా కొత్తగా ఊరు ఏర్పడినప్పుడు దానికి దగ్గర్లో వుండే ఊరి పేరులోనే దాన్ని మొదట గుర్తిస్తారు; కొత్త పేర్లకు పోకుండా. ఈ రకంగా పేర్లు పెట్టడం నాల్గు రకాలు.

1. వెనుకా ముందూ వెలసిన వూర్లను తెలిపే పాత,కొత్త, విశేషణాలుగా గల పేర్లు పెట్టడం.

ఉదా: ముందు నుంచీ ఉన్న 'చానంబట్ల'కు 'పాత చానంబట్ల' అనీ కొత్తగాదీనికి పక్కనే ఏర్పడ్డ గ్రామానికి 'కొత్త చానంబట్ల' అని పేర్లు (చంద్రగిరి తాలూకాలోవి).

2. పరిమాణాన్నీ, విస్తీర్ణాన్ని బట్టి పెద్ద, చిన్న అనే విశేషణాలుగల పేర్లు పెట్టడం.

ఉదా : పెద్దంజమేడు; చిన్నంజమేడు. (శ్రీ కాళహస్తి తాలూకాలోవి).

3. ఎత్తు పల్లాల్ని బట్టి పేర్లు పెట్టడం 'ఎగువ - దిగువ' అని. ఎగువ మారేడుపల్లి; దిగువ మారేడుపల్లి — బంగారు పాళ్యం తాలూకా.

4. ఆ వూరు ఉన్న దిక్కును బట్టి పేర్లు పెట్టడం. ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర్లు.

ఉదా : ఉత్తర బ్రాహ్మణపల్లె — బంగారుపాళ్యం తాలూకా
దక్షిణ బ్రాహ్మణపల్లె — చిత్తూరు తాలూకా

పైన చెప్పిన నాల్గు రకాలకు నాల్గు జతల ఊర్లు ప్రత్యేకమైనవి చూపినాను. ఈ నాల్గు రకాలుగా ఉన్నపేర్లు ఒక్క ఊరికే ఉన్న ఉదాహరణ ఒకటి.

1. పాత చానంబట్ల — కొత్త చానంబట్ల
2. పెద్ద చానంబట్ల — చిన్న చానంబట్ల
3. ఎగువ చానంబట్ల — దిగువ చానంబట్ల
4. ఉత్తరం చానంబట్ల — దక్షిణం చానంబట్ల

కానీ ఏ నాల్గుపేర్లు ఏ గ్రామానికి చెందినవో మనం గ్రామనామ పట్టికల్నిబట్టి చెప్పలేము. అటువంటప్పుడు ప్రమాణనామ పట్టికను తయారుచెయ్యడం సులభంకాదు అందువల్ల పరిశోధకుడు నేరుగా ఆ ప్రాంతాన్ని సర్వే చెయ్యాలి. ఒక్క సర్వేతోనే అన్ని సమస్యలు తీరిపోవు. అక్కడున్న పెద్దవాళ్ళద్వారా ఆ రెండు ఊర్ల పేర్ల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలి. అపుడు సమస్యలు తీరవచ్చు.

(6) ఉన్నపేరుకు బదులు మరోపేరు పెట్టుకున్నపుడు

ఉదాహరణకి చిత్తూరు తా॥లో 'మరకాలకుప్పం' అనే గ్రామానికి మూడు పేర్లున్నట్లు తెలుస్తుంది. 1. కొత్తమరకాల కుప్పం, 2. కొత్తూరు, 3. నాగేంద్రపురం. కొన్ని రికార్డుల్లో కొత్తమరకాల కుప్పం లేక కొత్తూరు అనీ మరి కొన్నింటిలో 'నాగేంద్రపురం' అనీ పేర్లున్నాయి. వ్యవహారంలో 'కొత్త మరకాల కుప్పం' అని వాడుతారు. ఇటువంటి పేర్లనుబట్టి మూడుగానో లేక రెండుగానో ప్రత్యేకమైన ఊర్లుగా తలచే ఆస్కారం ఉంది. రికార్డు చేసేటప్పుడు ఫలానా అనే ఫలానా గ్రామం (**alias**) అని రాస్తే ఏ సమస్యా ఉండదు. పేర్లు విడివిడిగా ఉంటే విడి విడి గ్రామాలుగా చెప్పుకోవలసివస్తుంది.

(7) సరిహద్దులు మారినపుడు

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినపుడు జిల్లా, తాలూకా, రాష్ట్రాల సరిహద్దుల్లో మార్పులు జరిగినాయి. అపుడు కొన్ని గ్రామాలు ఒక తాలూకా, ఫిర్కానుంచి మరో తాలూకా, ఫిర్కాకు మార్చబడినాయి. ఏ తాలూకానుండి ఏయే గ్రామాలు ఏ తాలూకాలో చేరాయి అని గ్రామనామ శాస్త్రవేత్తలు తెలుసుకోవాలి. లేకుంటే పాత రికార్డుల్ని కొత్త రికార్డులతో పోల్చే సమయంలో కొన్ని అనుమానాలు కల్గుతాయ్.

ఉదా: తిరుత్తణి మొదట చిత్తూరు జిల్లాలో ఉన్నా తర్వాత కొన్ని గ్రామాలతో చేర్చి తిరుత్తణి తాలూకాగా చెంగల్పట్టు జిల్లాలో కలిపినారు. అదే విధంగా చెంగల్పట్టు జిల్లాలోని పొన్నేరు తాలూకా నుండి కొన్ని గ్రామాల్ని తీసి 'సత్యవేడు'కు కలిపి, సత్యవేడు తాలూకాగా చిత్తూరు జిల్లాలో కలుపబడింది. ఈ మార్పులూ చేర్పుల్లో ఏయే గ్రామా లెటు వెళ్ళాయో తెలిస్తే పాత కొత్త రూపాల్ని సరిపోల్చి చూడవచ్చు. లేకపోతే సరిపోల్చడం కష్టమవుతుంది. అనుమానాలు బయల్దేరుతాయ్.

(8) ఒకే పేరు చాలా ఊర్లకుండటం వల్ల గుర్తించడం సులభం కాదు.

1915లో 1933లో ప్రచురింపబడిన గ్రామనామ పట్టికలు అక్షర క్రమంలో తాలూకా వారీగా తయారు చేసినవి. ఒకే తాలూకాలో ఒకే పేరుతో ఉండే గ్రామాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటికి మాత్రం నంబర్లున్నా మిగిలిన గ్రామాలకు నంబర్లు లేకపోవడం వల్ల ఏది ఇనామతి గ్రామమో? ఏది జమీందారీయో, గవర్నమెంటో తెలుసుకోవడానికి వీలుపడదు. ఇటువంటప్పుడు సరిపోల్చడానికి వీలుపడదు. పైగా ఈ సందిగ్ధతవల్ల ఆ పేర్లకు వ్యుత్పత్తి చెప్పడం కూడా కష్టమవుతుంది.

(9) గ్రామ మజరా లేక ప్రధాన, అప్రధాన గ్రామాల్ని నామ పట్టికల్లో సరిగా నిర్ణయించక పోయినపుడు కూడాసమస్యే.

ప్రభుత్వం తాలూకా వారీగా, అక్షరక్రమంలో ప్రచురించిన గ్రామనామ పట్టికల్లో ఏది ప్రధాన గ్రామమో, ఏది మజరా గ్రామమో, తెలుపబడలేదు. కొన్ని నామ పట్టికల్లో, కొన్ని మజరా గ్రామాలుండవు. దీనికి కారణం పరిపాలనలో చిన్న యూనిట్ ప్రధాన గ్రామం అయినందువల్ల. ఇకపోతే ఒకగ్రామనామపట్టికలో ఒక గ్రామం కింద మజరాలుగా ఉన్న గ్రామాలు మరో పట్టికలో మరో గ్రామానికి మజరా గ్రామాలుగా కనిపిస్తాయి. అటువంటపుడు ప్రమాణ గ్రామనామ పట్టికను తయారు చెయ్యడం అంత సులభం కాదు. ఉదా: బంగారు పాళ్యం తాలూకాలో 'కూర్మాయపల్లె' అనే రెవెన్యూ గ్రామానికి ఆ తాలూకా 'ఏ' రిజిష్టరు ప్రకారం ఐదు మజరా గ్రామాలున్నాయ్. 1. కూర్మాయిపల్లె; 2. కుమ్మరపల్లి; 3. రోళ్ళవారిపల్లె; 4. గుర్రాల మిట్ట; 5. చల్లగుండ్లపల్లి — గుర్తింపులేని వీటి హరిజన వాడలు. కానీ సమితి పట్టికలో గుర్రాలమిట్ట; చల్లగుండ్లపల్లెలు వాటికి దగ్గర్లో ఉన్న రెవెన్యూ గ్రామం 'బుడితిరెడ్డిపల్లె'కు మజరాలుగా ఉన్నాయి. గ్రామనామ వ్యుత్పత్తి నిఘంటువు తయారు చెయ్యడంలో ప్రమాణ గ్రామనామ పట్టిక అవసరం. అది లేకుంటే నిఘంటువు అస్పష్టంగా, అస్తవ్యస్తంగా తయారవుతుంది.

గ్రామాల్ని గుర్తించడంలో ఎదురయ్యే సమస్యలు కొన్నింటిని మాత్రమే ఇక్కడ పరిశీలించడం జరిగింది. గ్రామనామపరిశోధనకు ముడిసరుకు ఊర్లూ, పేర్లూ కాబట్టి అందులోనే తప్పులు చేస్తే అది శాస్త్రీయమైన పరిశీలన అనిపించుకోదు ఈ రకమైన సమస్యాపూరణకుగాను చరిత్రకారులు, పురావస్తుశాస్త్ర పరిశోధకులు, భాషాశాస్త్రజ్ఞులు కలసి పరిశీలనలు జరపాలి. వీళ్ళ సహాయంతో ప్రభుత్వం శుద్ధమైన గ్రామనామ పట్టికల్ని ప్రధాన, అప్రధాన గ్రామ భేదాలతో ప్రాంతాలవారీగా ప్రచురిస్తే ఈ గ్రామ నామాల గుర్తింపు కార్యంలో ఎదురయ్యే సమస్యలు చాలావరకు తగ్గుతాయి.'

ఈ వ్యాసం తయారుచెయ్యడంలో తగు సూచనలిచ్చిన మా గురువులు కేతు విశ్వనాథరెడ్డిగారికి నా కృతజ్ఞతలు.

References

1. Epigraphia Indica, Vol. No. XXII. Five Bana Inscriptions from Gudimallam Ps. 220-240 by V. Venkayya, M.A.
2. Laddigam (A later Chola Temple) by B. Venkataramanan.
3. Bombay Gazetter, Vol. I Part II, P. 496.
4. Annual Report on Indian Epigraphy for the year 1906. P. 61 ff.
5. A Study of Telugu place names (based on inscriptions upto 13 th century) unpublished Ph.D. Thesis of S. S. Ramachandramoorthy.
6. Chittoor Taluk Map-1956, scale inch –1 mile.
7. Bangarupalem Taluk 'A' Register.
8. Toposheet 57 O/2.
9. Chandragiri Taluk 'A' Register.
10. List of Villages in Chandragiri Panchayat Samithi.
11. Annual Reports on Indian Epigraphy for the years 1903, 1912 and 1922.

శ్రీ డి. చెంగారెడ్డి.

ఘటకర్పర కులకమ్

విస్తార సంస్కృతీ సారస్వతీ మహాసముద్రములో విశిష్ట కావ్యరత్నము ''ఘటకర్పర కులకమ్''. శ్రీమత్ అభినవగుప్త పాదాచార్యుని (960–1050) 'వివృతి' వ్యాఖ్య ఘటకర్పర కులకమ్ నకు మరింత ఖ్యాతిని చేకూర్చినది.

ఇఱువదిరెండు శ్లోకముల యమకబంధుర నిసర్గమహా కావ్యము ఇది. కాని కొన్ని కావ్యములకు కర్తను గుఱించి, లేక రచనా కాలమును గుఱించి ఇంకను వైశిష్ట్యమును గుఱించి చిక్కులున్నప్పటికి—ఘటకర్పర కులకము నకు ఏ కావ్యమునకు లేని సమస్యలు ఉండుటయే దీని ప్రత్యేకత.

మొదటిది కావ్యనామము. రెండవది కర్తృత్వము. మూడవది శ్లోకసంఖ్య. నాల్గవది శ్లోకముల నిర్ణీత స్థానము. ఐదవది గ్రథనశిల్పము. ఆఱవది కావ్యాన్తర్గత వ్యక్తి లేక వ్యక్తుల భాషణము. ఏడవది రచనా కాలము. పరిశోధనా పట్ట వ్యాసము(Ph.D.) నకు సమృద్ధిగ లభించు వస్తువు— ''ఘటకర్పర కులకము.''

ఇది నాలుగు విధములగు నామములతో పేర్కొనబడు చున్నది. 1. ఘటకర్పర కులకమ్ 2. ఘటకర్పర కలాపమ్ 3. ఘటకర్పరమ్. 4. ఘట కర్పరకావ్యమ్.

ఘటకర్పర కులకమ్ అని శ్రీమదభినవ గుప్తాచార్యులు తమ 'వివృతి' వ్యాఖ్యలో స్పష్టపఱచినారు. వివృతి పుష్పిక ఇది ''సమాప్తేయం ఘటకర్పరకులక వివృతిః కృతిః మహామాహేశ్వర రాజానక అభినవగుప్త పాదానాం.''

రెండవది దివాకరకృత వ్యాఖ్యారమ్భములో వాడబడినది. అది ఇది ''ఘటకర్పరేణ ఘటితం కవినా కలా పకావ్యం యద్ యమకైః। తస్య మయా ఽర్థ వివరణం కరణీయం కారణం ధియః సుధియాం॥''

మూడవపేరు శక. 1510లో వ్యాఖ్య పూర్తిచేయబడినట్లు చెప్పబడిన శ్రీ గోవింద జ్యోతిర్విదుని శ్లోకములో ఉటంకింపబడినది. చూడు క్రింది పద్యము.

ఘటకర్పర పానీయ
వాహనాద్ ఘటకర్పరం।
ఇది నామ్నాశ్రుతం తస్మాద్
యోజనం తస్య దుర్ఘటమ్ ॥

కర్తపేరు తనకు తెలియదని కూడ స్పష్టపరచినాడు.

నాల్గవనామము కాలము విస్పష్టము కాని శఙ్కర ప్రణీత వ్యాఖ్యాన పుష్పికలో చెప్పబడింది. కర్త కాళిదాసుడు అని కూడ పేర్కొనుట గమనార్హము. పుష్పిక ఇది ''ఇతి శ్రీ కాళిదాసకృతే ఘటకర్పర కావ్యేటిప్పణం సమాప్తి మగమత్ ।''

ఇట్టి నిసర్గ లఘుకావ్యమునకు పది వ్యాఖ్యానములు ఇప్పటి వఱకు బైటపడినవి. ఎన్నియో కాలగర్భమున అణగిపోయి ఉండ నగును. కమలాకరభట్ట, రమాపతి మిశ్ర, తారాచన్ద్ర, గోవిన్ద భట్ట, మున్నగువారు ఇతర వ్యాఖ్యాతలు.

శ్రీమత్ అభినవగుప్త పాదాచార్యుని మతమున 'ఘటకర్పర కలకము' అనియే సారస్వత ప్రపంచమున దీనికి ఎడుక హెచ్చు. ఇచట 'కులకము' అనగా ఐదు లేక ఎక్కువపద్యముల గుంపు అని కాదు కులకమనగా కవితాస్ఫూర్తి సాహిత్య మన్దిరము అని 'కుల' అను దానికి కన్ ప్రత్యయము చేర్చిన (పాణిని 5–3–96) కులకము (గృహం) వచ్చును. అంటే కుటుంబజీవిత కల్పనా వస్తువు గల కావ్యము' అని అర్థము వచ్చునట్టిది 'ఘ ట క ర్ప ర కులకమ్.'

ఇది నృత్తకావ్య సంబంధి. ఈనృత్తకావ్యములో 'డోంబికా' 'భాణక', 'ప్రస్థాన', 'భాణకా', 'షిడ్గక', 'ప్రేరణ', 'రామాక్రీడ', 'రాసక', 'హల్లీసక',— అని వివిధ భేదములున్నవి. చిరన్తకాలములో ఎన్నియో రచనలు ఇట్టివి సంస్కృతముననే గాక, ప్రాకృతములలో గూడ ఉండుట పరిశోధకులకు తెలియునుగదా! అపభ్రంశములోని అబ్దుల్‌రహ్మాన్ ప్రణీత 'సందేశ రాసకమ్' ఇట్టిదే. నృత్త—నాట్యములకు భేదముగలదు. నాట్యమునకు ప్రాధాన్యత నృత్తములో కాంచనగును. రసమునకు అత్యంత విలువగలది 'నాట్యము'లో.

కాన 'ఘటకర్పరకులకము' కావ్యమే కాని కుమారసమ్భవ, శిశుపాలవధ, నైషధమువంటి కావ్యముకాదు ధ్వనికి పరమ ఉదాహరణీయమైన రసనిర్భరమగు 'ఘటకర్పర కులకము' నందు నృత్య, గీత, నాట్యముల త్రివేణి సంగమమొంది భాసించు ఉత్కృష్ట లఘుమహాకావ్యము.

ఉపజీవ్య గ్రంథములు

1. ఘటకర్పర కులకమ్
(వివృతి సమేతం)
శ్రీనగరం – 1945

2. అభినవగుప్త – జీవితము – రచనలు.
కాంతిచంద్ర పాండే
వారణాసి–1963.

3. సన్దేశ రాసకమ్
సం. ఆచార్య జినవిజయముని
బొంబాయి–1945.

4. సాహిత్య దర్పణమ్
(వేదం వేంకటరాయశాస్త్రి తెనుగుచేత)
మద్రాసు – 1938.

శ్రీ ఇప్పగుంట సాయిబాబా

గురజాడ విదూషకుడా ?

ప్రజాకవి అర్థంలేని పదం (భారతి, జూలై) అంటూనే డాక్టర్ మురళీధర్‌గారు, గురజాడ ప్రజాకవి ఎట్లు కాడో నిరూపించడానికి చాలా త్రిప్పలు పడ్డారు. ఎందుకైనా మంచిదని, విశ్వనాథను తీసుకవచ్చినారు అక్కడికి గురజాడ, విశ్వనాథలు ప్రతిద్వంద్వులైనట్లు ఒకడు గొప్ప కవే కావచ్చు. అయితే వాని కవిత్వం ప్రజాకవిత్వం కాకపోవచ్చు శ్రీనాథుడు "నైషధం"లో కవీనాం కవి. "పలనాటి వీరచరిత్ర"లో ప్రజాకవి. "రామాయణ కల్పవృక్షం" ప్రజాకవిత్వం కాదు. "మా బాబు" ప్రజాసాహిత్యం. రెండూ విశ్వనాథ వ్రాసినవే. ఏ ఆలంకారిక కొలబద్దతో కొలిస్తే కూడ, మొత్తానికి గురజాడ ప్రజాకవి అయినట్లు విశ్వనాథ కాజాలడు. ఇది వారి మాన్యతా న్యూనతలను తూచడం కాదు. వారి రచనలలోని సెన్స్ ఎండ్ సెన్సిబిలిటీ మరియు సింపతీ ఎండ్ ఎంపతీల పరిగణించి వ్రాస్తున్న మాట యిది

గురజాడగురించి ఏమైన చెడ్డది అందామని డా. మురళీధర్‌గారు "అసలు అతన్ని (అంటే గురజాడను) జమీందారుల ఆస్థాన విదూషకుడనడం సమంజసమేమో !" అంటూ ఆశ్చర్యార్థక సంకేతంతో సందేహం ప్రకటించే వాక్యం వ్రాసినారు. ఆస్థాన విదూషక పదవి నీచమయింది కాదు కానీ, గురజాడకు "అతను" అనే ఏకవచనాన్నీ, తర్వాతి వాక్యంలోని విశ్వనాథకు కీ.శే.తో సహా "తమ" అనే బహువచనాన్నీ, వాడడం డా. మురళీధర్‌గారి అనాగరక మనస్తత్వాన్ని వెల్లడిస్తుంది ఏకవచన ప్రయోగం నాకేమీ అభ్యంతరం లేదు కానీ పంక్తి భేదం పాపం అంటాను డా. మురళీధర్‌గారంతగా పొగడిన విశ్వనాథ 'ప్రాచీన భారతీయ సంస్కృతే" ఇట్టి దుర్విచక్షణతను క్షమింపదని నా భావం. సభాపర్వంలో ధర్మజ రాజసూయ యాగ సందర్భంలో కనబడిన వారినందరినీ తూలనాడే శిశుపాలుడు కూడా శ్రీకృష్ణునికి "ఈతని" అనే ఏకవచనం వాడుతాడు. (చూ. ఈతని వృద్ధని యెఱిఁగి పూజించితే). ఇది విపరీత బుద్ధి అయిన శిశుపాలుని వారసత్వం. దీన్ని చర్చించడం చాలించి, ఇప్పుడు గురజాడ విదూషకుడా అనే అంశం చర్చిస్తాను.

విదూషక పదానికి రెండు విధాలుగా అర్థం చెప్పవచ్చును. ఒకటి, విదుషత్వం (అంటే పాండిత్యం లేక జ్ఞానం) కలవాడు. రెండు బాగా తిట్టువాడు (వి, దూష) అంటే నిర్భయంగా అందరినీ ఎద్దేవా చేసేవాడు. ఈ రెండింటికీ విదూషకుని మూడవ లక్షణం చేర్చండి అది, నవ్వించగల శక్తి. మన విదూషకుణ్ణి ఇంగ్లీషులో "Fool" అంటారు. "Jester" (హాస్యగాడు) అని కూడా అంటారు ఫూల్ లక్షణ వివరణ ఇట్లా ఉంటుంది.

"Fool or Jester, a comic entertainer whose madness or imbecility, real or pretended made him a source of amusement and gave him a licence to abuse and poke fun at even the most exalted of his patrons."

(Encyclopaedia Brittanica)

చరిత్రలోనూ, జనశ్రుతి ద్వారానూ ప్రసిద్ధులైన విదూషకులు, నసీరుద్దీన్, వీరబలుడు, తెనాలి రాముడు వీరు వరుసలో తైమూరు, అక్బరు, శ్రీకృష్ణదేవరాయల కాలంవారు. ఆయా రాజులతో సన్నిహిత సంబంధం కలవారు కూడా. ఈ ముగ్గురు పరిపాలకులు బలిచక్రవర్తి చెప్పిన "కారే రాజులు" వలె మన్ను కొట్టుకొని పోయినారు. షెల్లీ కవి "Ozymandias" అనె కావ్యంలోని రాజశిల్పం వలె శిథిలమై పోయినారు. కాని వారి విదూషకుల పేరుతో చెలామణిలో ఉండే కథలు, గాథలు, హాస్యోక్తులు ఆటలాడు కొనే పిల్లవాళ్లనీ, మూలలో కుంపటి కాల్చుకొనే ముసలివాళ్లనీ, సర్వులనూ ఆకర్షించి ఉల్లాస పరుస్తున్నవి. మానవునికిగల ప్రత్యేకత నవ్వు("Only men know how to laugh"–Rabelais) అటువంటి నవ్వును పెంపొందించే వారిని విదూషకులనండి. గురజాడ ఆదృష్టిలో విదూషకుడు కావచ్చు. నవ్వించేవాడే కాక, నవ్వేటప్పుడు మనలచే ఆలోచింప చేస్తాడు గురజాడ, బెర్నార్డుషా వలె.

ఒక విధమైన రచనలు చేసిన వారికి, వారి రచనలలోని లక్షణాలుంటాయని అమాయకులనుకోవచ్చును. వీర రసగ్రంథాలు వ్రాసిన ఆసామి సినీ హీరో మాదిరి ఉంటాడనీ, శృంగార రసం

చిప్పిల్లు చేసిన మనిషికి సుఖరోగాలుండకపోవనీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని సమర్థించిన రచయిత విశృంఖలుడనీ అనుకోవడం కద్దు. శాఫో, డి. హెచ్. లారెన్సు, జోలా, చలం ఇటువంటి అపప్రథలకు గురియ్యారు. "ఆటవెలది" ఛందమును మరగిన వేమన, ఆటవెలదుల ఛందమునకు మరగిన వాడని ఆయనపై అభాండం వేసినాము. శ్రీనాథుని గతి ఇంతే ప్రచండ వీరచరిత్రం వ్రాసిన గడియారం శేషశాస్త్రి సినీ హీరో మాదిరి ఉండడం లేదు ఇంకొక రివాజు కూడా వుంది. రచయితకుండే లక్షణాలూ, స్వభావాలూ రచనలో ప్రతిబింబించి వుంటాయనుకోవడం. ఉదాహరణకు, తెనాలి రామకృష్ణుడు హాస్యగాడని జనశ్రుతి ఉంది. అందుచేత ఆయన వ్రాసిన పాండురంగ మహాత్మ్యంలో హాస్యం ఉందని పెద్ద పెద్ద పండితులే అపోహ పడినారు. నీరదచౌదరి కూడ ఇటువంటి అపోహల కాహుతి అయినాడు. హాస్యరస ప్రధాన రచనలు చేసిన రచయితనే హాస్యగాడను కోవడంలో వింతేముంది! అలాగున అనుకుంటేనే ఒక్కొక్కప్పుడు మనస్సుకు తృప్తి వస్తుంది. రేబిలే, మోలియర్, డాడెట్, ఓల్టేరు, సెర్వాంటెజ్, స్విఫ్టు, గోగోలు, మార్క్ ట్వైను, లూయీ కెరోలు వంటి పాశ్చాత్య హాస్య రచయితలూ, తెలుగులో పానుగంటి, చిలకమర్తి, మల్లాది అవధాని, మొక్కపాటి, (వీరేశలింగం అంటే డా. మురళీధర్ గారికి అలెర్జీ కాబట్టి, ఆయన్ను మినహాయించినాను), కన్నడంలో టి. పి. కైలాసం (శబ్దసామ్యం బట్టి, దేవానాం ప్రియులు కొందరితన్ని "టిపికల్ ఆస్" అంటే "అచ్చమైన గాడిద" అనేవారు కూడా), బీ. చి, అరవంలో కో. రామస్వామి మున్నగువారు నిజ జీవితాల్లో గంభీర పురుషులు. ప్రసిద్ధ హాస్యనటులైన చార్లీచాప్లిను, అలనాటి బాంబే టాకీసు వారి హాస్య నటుడు, వి. హెచ్. దేశాయి, మన రేలంగి దైనందిన జీవితంలో మన వలెనే ఉండేవారు. గురజాడను విదూషకుడని ఏదో సాధించినా మనుకొనేవారికి ఒకటి గుర్తుకు తెస్తున్నాను. గురజాడ సమకాలికుడై, అదే మనోధర్మం కలిగి, వ్యంగ్య, హాస్య నాటకాలచే సంఘం గబ్బు కడిగిన బెర్నార్డ్ షాకు "విశ్వ విదూషకుడు" (వరల్డ్స్ జెస్టర్) అనే అడ్డ పేరుండేది.

సాధారణ విదూషకులకూ, షా గురజాడల వంటి విదూషకులకూ ముఖ్య తేడా వుంది. సాధారణ విదూషకుల వేష భాషల చూచి లోకులు నవ్వుతూంటారు. అసాధారణ విదూషకులు లోకం పోకడల చూచి నవ్వుకొంటూంటారు. లోకుల, స్వార్థాన్నీ, క్రౌర్యాన్నీ, అవివేకాన్నీ, అత్యాశనీ తమ రచనలనే వక్రతల దర్పణంలో గ్రోటెస్క్‌గా ప్రతిబింబింపజేసి, అవి చూచి లోకులు నవ్వుతూండగా, ఆ లోకుల ఆత్మవంచన చూచి షా, గురజాడలు నవ్వుకొంటారు. పురందరదాసు చెప్పినట్లు :

నగవువచ్చును, నాకు నగవువచ్చును
జగములోని మనుజులు చేయు భేషజములు చూచి,
పతిసేవ సేయక, పరపతి గూడి, మజ్జనములాడి
వ్రతములను సేయు పడతులను జూచి
పర సతుల మచ్చిక చేసి, యరుసమున వారిని బొంది
పారు నీట మునిగి, జప పారాయణము చేయువారి జూచి
కామ క్రోధముల మనసుంచి, తామసమందు మగ్నులయి
స్వామి పురందర విఠలుని స్మరణ చేయువారి జూచి
నగవువచ్చును, నాకు ....

(కన్నడ మూలానికి నా అనువాదం)

బెర్నార్డు షా గురించి సీన్ ఓకేసీ ఇలా అంటాడు :

A man who laughed in pain of body and mind a man whose loudest laugh was shot through with seriousness, though some called him a jester – and he could and did jest well – though when he jests, he is clad not in the formal motley of the fool but in the brilliant tabard woven by the Holy Ghost Himself.

ఈ వాక్యాలు గురజాడకూ సరిపోతాయి.

విదూషకులు నిర్భయులు. అందరినీ ఎద్దేవా చేస్తారు. సత్యం, ధర్మం కోసం ఏమయినా అంటారు. ఏమయినా చేస్తారు, అవి అంటూనే, అవి చేస్తూనే నవ్వు తెప్పిస్తూ ఉంటారు. నవ్వుతుంటారు. ఇంతకు ముందు నే చెప్పిన నసీరుద్దీను, వీరబలుడు. తెనాలి రాముడు ఇట్టివారు. నియంతలు ఎవరికీ భయపడరు విదూషకులకు భయపడతారు. తన్నభాసు పాల్జేసిన చార్లీచాప్లిన్ అంటే హిట్లరుకు హడల్.

ఇప్పుడు సాహిత్యంలో వచ్చే విదూషకులను తీసికొందాము. అభిజ్ఞాన శాకుంతలములోని విదూషకుడందరినీ తీసివేస్తూ మాట్లాడుతాడు. బూతులతో సంబోధిస్తాడు. సేనాపతిని కూడా "గచ్ఛ దాస్యాః పుత్ర" (పో లంజకొడకా) అంటాడు. సంస్కృత నాటకాలలో ఇటువంటి వాళ్లు విదూషకులు వస్తారు. షేక్సుపియరు ఫూలులు ఇంతకన్నా ఉత్తమ శ్రేణివాళ్లు.

"లియరు రాజు" (కింగ్ లియర్)లోని ఫూలు (వీనికి పేరు లేదు) "ద్వాదశ రాత్రి" (ట్వెల్త్ నైట్)లోని ఫెస్టె, "నీ చిత్తం వచ్చినట్లు" (యాజ్ యు లైక్ ఇట్)లోని టచ్ స్టోన్ మఱపురాని విదూషకులు.

విదూషక పాత్రలు కాక, కవులు సృష్టించిన గొప్ప హాస్య పాత్రలు : నక్షత్రకుడు, దోన్‌కియోతే, పిక్‌విక్, గర్గాంట్వా, ఫాల్స్ టాఫ్, ముంఛాసెన్, జంఘాలశాస్త్రి. వీరంతా "లార్జర్ దాన్ లైఫ్ కారక్టర్స్"గా కనపడతారు.

ఇట్లు చరిత్రలోని విదూషకులు, హాస్య రచనలు, చేసిన రచయితలు, వారు సృష్టించిన విదూషక, హాస్య పాత్రలు, హాస్యాన్ని పుణికి పుచ్చుకొన్నచారిత్రక వ్యక్తులు ఇంత గొప్పవారుగా ఉన్నప్పుడు, గురజాడను విదూషకుడని డా. మురళీధర్ గారు

సాధించిన పరమార్థమేమి ? గురజాడను దెబ్బకొట్టేందుకే అయితే వారి దూషణాయుధం ఇప్పుడు ''బూమెరాంగ్'' కావడం లేదా ! కడుపుబ్బరం తీర్చుకొనేందుకే అయితే, ''వాము'' అనే పదార్థం అంగట్లో దొరుకుతుందికదా !

ఇదంతా డా. మురళీధర్‌గారి ఆలోచనా రాహిత్యం వల్లా, అవగాహనాలోపం వల్లా జరిగినట్టిది. ప్రజాకవి పదం అర్థంలేనిదని అంటూ శీర్షిక పెట్టుకొని, గురజాడ ప్రజాకవి ఎట్లు కాడో నిరూపించడానికి చేసే యత్నం గురించి మొదటనే సూచించినాను, ఇంకొక మచ్చు చూపిస్తాను : ''ప్రజలను ఆనాడు ముఖ్యంగా బాధించింది బ్రిటిష్ పాలన కన్యాశుల్కం కాదు'' అనేది వారి సిద్ధాంతం. నేనడుగుతాను. కన్యాశుల్క దురాచారం బ్రిటిష్ వాళ్ల కంటె ముందుండిందా ? అప్పుడే వచ్చిందా ? వేలాది బ్రాహ్మణ కుటుంబాలు, ఇతర వర్ణాల వారి కుటుంబాలు బాధపడుచుండింది ఎచటనో కలకత్తాలోని బ్రిటిష్ పాలన వల్లనా, హిందూ సంఘానికి శల్యానికి పట్టిన కన్యాశుల్క రోగం వల్లనా ? బ్రిటిష్ పాలన వచ్చింది, పోయింది బాల్య వివాహాలు, కన్యాశుల్క పద్ధతి (ఇతర వర్ణాలలోనైనా) ఉన్నాయే ? నేడు మనం బాధ పడుచుండేది వరదక్షిణ దురాచారం చేతనా ? ఢిల్లీలోని ప్రజా ప్రభుత్వం చేతనా ? అన్ని కడగండ్లకు ప్రభుత్వమే బాధ్యం అని చేతులు కట్టుకొని కూర్చొనుట విజ్ఞతా ? ఏ దురాచారం వున్నా దాన్ని బాపేందుకు తత్కాలీన ప్రభుత్వం శాసనాలు చేయవలె. ఆ దురాచారాన్ని నివారించేందుకు ప్రయత్నించే ప్రగతిశీల పౌరులకు ప్రభుత్వం దోహదమీవలెను. రామమోహనరాయలకు బెంటింకు, కందుకూరికి మద్రాసు ప్రభుత్వమూ, గురజాడకు విజయనగరం మహారాజా అట్టి సహాయం చేసినారు. ఎవరికి దురదైతే వారే గోకికొనవలెననేది స్వయంసంపూర్ణతకు ప్రాథమిక సూత్రం. ఎవరి మతానికీ, సంఘానికీ వాటిల్లిన దురాచారాల్నీ, పీడల్నీ ఆయా మతాలవారే, సంఘంవారే బాపుకొనేందుకు నడుం కట్టవలె. ప్రభుత్వాలేంజేస్తాయి ? ఒక ప్రభుత్వమే పోవలెననేది ఒక రకమైన ఉద్యమం. ప్రభుత్వం చేత సాధ్యమైనంతవరకూ మంచి పనులు చేయించడం ఒకరకమైన ఎత్తు. గురజాడ కన్యాశుల్కం వ్రాసేనాటికి భారత జాతీయ కాంగ్రెసే తీర్మానాలు చేయడం, మహజర్లు సమర్పించే మితవాద దశలో వుండేది. మధ్యమ తరగతికి చెందినవాడు, సంస్కార హృదయుడు, ముఖ్యంగా కవి అయిన గురజాడ జాతి విముక్తికేం చేయవలెనో అదే చేసినాడు. సంస్కారం, ముందుచూపు, ఆధునికత అలవర్చే రచనలు చేసినాడు. జాతీయగీతం వ్రాసినాడు. సహజ భాష వాడినాడు. (సహజ భాష, పాత్రోచిత భాషకాదు) వాళ్లనాటి రష్యా జాగరణకు పుష్కిన్, టాల్‌స్టాయి చేసిన పనే ఆంధ్రులకు గురజాడ చేసినాడు. చరిత్రగతి, గతితర్కం అర్థం చేసుకోకుండా డా. మురళీధర్‌గారు వ్రాసినారు. గురజాడను ''విదూషకు''డన్నారు. గురజాడలో నవ్వు తెప్పించే వాలకాలు లేవే! గురజాడయొక్క ''ప్రొఫయిల్'' ఫోటోగ్రాఫ్‌లో ఉండే గాంభీర్య సౌందర్యాలుచూడండి. అది విదూషకుని పోలుతుందా ? ఆయన హాస్యరచనలు చేసినారనా?

గురజాడ రచనల్లో ఒక విధంగాచూస్తే హాస్యం ఉంది. వేరొక దృక్కోణంతో చూస్తే హాస్యం లేదు. 'కన్యాశుల్కం' లో హాస్యం లేదనే నేను వాదించినాను (మా. నా ''కన్యాశుల్క నాటక కళ''). సైకో అనాలిసిస్ ప్రకారం కవుల నైజాన్నీ, వారి రచనల్నీ పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు బయటపడతాయి. ఉదాహరణ లిస్తాను. రోగిష్టి వుండి, ఎప్పుడూ మంచం పట్టివుండే రాబర్టు లూయీ స్టీవెన్సను, కుస్తీలు, సముద్రయానం, యుద్ధాలు వున్న ఇతి వృత్తాల్నే తీసికొని వ్రాసినాడు. ''కృష్ణపక్షం'' రోజులలో దేవులపల్లి ఎంతో ఉత్సాహం ఉల్లాసంగల వ్యక్తి అయినా, అందలి కవిత్వం నిర్వేదపూరితంగా ఉంటుంది. చెడుగుణాల రాక్షసుడుగా అభాండం వేయబడ్డ ఆస్కారు వైల్డు రచనలు హృదయాన్ని విశాలం చేసేటట్లున్నాయి. తాను మాట్లాడేది తనకే వినబడనంత వినుకలి లోపం వుండే బీతోవను ఉత్తమోత్తమ పాశ్చాత్య సంగీతస్రష్ట. జీవితంలో విషాద భరితులుగా వుండి, అట్టి రచనలే చేసినవారిలో ఫ్రెంచికవి బాదిలేర్, ఆధునిక తెలుగుకవి బసవరాజు అప్పారావు. ఈ దృక్కోణంతో చూస్తే గంభీరవ్యక్తి అయినగురజాడ తేలిక హాస్య రచనలు చేసినాడని ఒక నిగమనం, హాస్యకారుడు గురజాడ హాస్య రచనలు చేసినాడని ఇంకొక నిగమనం తేల్తాయి. ''పూర్ణమ్మకథ'', ''లవణరాజుకల''లను ఎట్లు విశ్లేషిస్తారు డా. మురళీధర్‌గారు ? గురజాడ రచనల్లో (ముఖ్యంగా ''కన్యాశుల్కం''లో) హాస్యం వుందనే ఒప్పుకొందాము. హాస్య రచన చేసినవాణ్ణి విదూషకుడనడం సాహిత్య లాక్షణిక దృష్టియా ? డికెన్సుగతి ఏం కావలె ? హాస్య రచనలు చేసినవానిని విదూషకుడనడం, శృంగార రచనలు చేసినవారిని (ప్రబంధకవులు, షేక్సుపియరు, విశ్వనాథ మొ.) స్త్రీలోలురనడం, వీరరస రచనలు చేసినవారిని (భవభూతి,వాల్టర్‌స్కాటు,గడియారం వేంకట శేషశాస్త్రి మొ) కొట్లాటఖోరులనడం, విప్లవ రచనలు చేసినవారిని (గోర్కి, శ్రీశ్రీ మొ.) రౌడీలనడం, బాలసాహిత్యం వ్రాసినవారిని (వాల్టర్ డీలామేర్, టాగూరు, చింతాదీక్షితులు) గిడసబుద్ధులనడం వంటిదే అవుతుంది

గురజాడ విదూషకుడే అని మాటవరుసకు ఒప్పుకుందాం. మానవ జీవితంలో హాస్య సాహిత్యానికి గల స్థానం నిరూపించే ఉదంతం వ్రాసి ముగిస్తాను. ప్లేటో (గ్రీకు దార్శనికుడు, మన వ్యాస, కపిలుల శ్రేణికి చెందుతాడు) ''ప్రజాసత్తాక రాజ్యము'' అనే గ్రంథంలో తాను కలలుగన్న ఆదర్శ రాజ్యంలో కవులుండరాదని శాసించినాడు. హోమరు ఇలియడ్‌ను (ఇది మన రామాయణం లాంటిది), ఇస్కైలస్, సాఫోక్లిస్, యురిపిడిస్‌ల త్రాసదములను (వీనిని మించిన రూపకాలు ఇంతవరకు రచింపబడలేదు ప్రపంచంలో) బహిష్కరించినాడు. అవి అవినీతినీ, కామ క్రోధాది ఆవేశాలనూ ప్రేరేపిస్తాయని వాటిని నిష్కాసితం చేసినాడు. కానీ, అరిస్టోఫేనెస్ అనే ప్రహసనకర్త (ఇప్పటివరకు మనకున్న ఉత్తమోత్తమ హాస్య నాటక కర్త) రచనలుండనీయండి అన్నాడు. ఆ 'వృద్ధధూర్తు'' మనస్సును ఉల్లాసపరుస్తాడు అని అప్యాయంగా నిందాస్తుతి చేస్తాడు. ఇది ప్లేటో మెహర్బానీ ఏమీకాదు స్మండీ! ఇతర

జంతువులనుండి మానవుణ్ణి వేఱు చేయడమేకాక ఒక మెట్టు పైనుంచే హాస్యాన్ని ఎవరు బహిష్కరించగలరు కనుక! బహిష్కరించలేదు ప్లేటో.

ఇదంతా చదివింతర్వాతకూడా గురజాడను ఆలాగుననే అనాలనిపిస్తే, విదూషకుడేంఖర్మ (రావణుని కొక్కిరించి, వాని వాళ్లనుతన్ని, వానికొంపను తగలేసి వచ్చిన కోతిని మహాకపి అన్నట్లు), ''మహా విదూషకు''డని అనండి అంటాను.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు.

నమస్తే సార్ !!

భారతి 1980 జనవరి కలగూరగంపలో శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారి 'పుల్లిచెర్ల వారికి పునరాహ్వానం' చదివాను. బలిజేపల్లి వారి సత్య హరిశ్చంద్ర ఎన్నోచోట్ల ఎన్నోసార్లు ప్రదర్శింపబడుతోందనే విషయం తమకు తెలీదని మళ్లీ వారు వ్రాశారు ఆ నాటకం ప్రదర్శింపబడుతోందనడం అతిశయోక్తిలాగా వారు భావించడం విచారకరం. ఆ నాటక ప్రదర్శన ప్రదేశాలూ, సమయాలూ మొత్తం వ్రాస్తే ఒక 'భారతి' ప్రత్యేకసంచిక వేయవలసివస్తుంది. కనుక '79 డిసెంబరు 15వ తేదీనుండి '80 జనవరి 15వ తేదీ వరకు ఒక్క గుంటూరు సమీప ప్రాంతాల్లో ఎక్కడ ఎప్పుడు ప్రదర్శింపబడిందో వ్రాస్తాను.

డిసెంబరు 17 — గుంటూరు
'' 28 మంగళగిరి

జనవరి 9 — తెనాలి
'' 12 — ప్రత్తిపాడు
'' 13 — గుంటూరు

ఇప్పుడు హరిశ్చంద్ర పాత్రలో రాణిస్తున్న యువ నటుడు శ్రీ డి వి సుబ్బారావు (వేటపాలెం) హరిశ్చంద్ర నాటకాన్ని వరుసగా ప్రదర్శిస్తున్నందున తీరిక లేకుండా ఉన్నారు. శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారు సుబ్బారావుగారి నడిగితే తీరిక చేసుకొని పూర్తి వివరాలు తెలియజేయగలరు భారతిలో పుటలు సద్వినియోగమవుతాయి.

బలిజేపల్లి వారి హరిశ్చంద్ర నాటకాన్ని జనం టికెట్టు పెట్టుకొని చూస్తున్నారు. మాన్యులూ సామాన్యులూ అంతా ప్రశంసిస్తున్నారు. ఇప్పుడు అసంఖ్యాక ప్రదర్శనల నందుతున్న గొప్ప నాటకం హరిశ్చంద్ర అనడంలో శ్రీ సర్దేశాయి వారికి సందేహం అవసరం లేదు ముప్ఫయి రోజుల్లో హరిశ్చంద్ర ప్రదర్శనను గూర్చి, గుంటూరు ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకొని నాకు తెలిసిన కొద్ది వివరాలిచ్చాను. ముప్ఫయ్యేళ్లలో కన్యాశుల్కం మొత్తం ఆంధ్రదేశంలో ఎన్ని ప్రదర్శనల నందిందో ఒక ప్రత్యేక వ్యాసం వ్రాయమని శ్రీ సర్దేశాయి వారిని నేను ''పునరాహ్వానించ''ను. ఎందుకంటే కన్యాశుల్కం ప్రదర్శనలో ఎంత విజయవంత మవుతుందో అందరికీ తెలుసుగనక !

అయినా ఆశ్చర్యం ! అబ్బూరి వరప్రసాదరావు, డి వి. సుబ్బారావు (సీనియర్), అద్దంకి శ్రీరామమూర్తి, మల్లాది సూర్యనారాయణ మొదలైన మహానటులు హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించిన సంగతి శ్రీ సర్దేశాయి వారికి తెలియదు. డి. వి. సుబ్బారావు, బందారు రామారావు, జ్యోతి ఆంజనేయులు, గుంటుపల్లి ఆంజనేయులుచౌదరి, పొన్నాల రామారెడ్డి ఇంకా ఎందరో ఈనాటి నటులు ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాల్లో హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్న సంగతి శ్రీ తిరుమలరావుగారికి తెలియదు. పీసపాటి నరసింహమూర్తి, షణ్ముఖి ఆంజనేయరాజు, జైరాజ్‌వంటి ప్రసిద్ధ నటులు నక్షత్రక పాత్రకు ప్రసిద్ధులనీ తెలియదా? గూడూరి సావిత్రీదేవి, విజయరాజు, రేబాలరమణ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, జూనియర్ భానుమతి మొదలైనవారు చంద్రమతి పాత్రలో రాణిస్తున్న సంగతీ తెలియదా ? వీరంతా నటించేది బలిజేపల్లి వారి హరిశ్చంద్రలోనే !

దీన్నిబట్టి శ్రీ సర్దేశాయివారికి దేశంలో ఏం జరుగుతూందో తెలుసా అని కొందరికైనా అనుమానం రావచ్చు. ప్రజలు ఏం చేస్తున్నారో, ఏం చూస్తున్నారో శ్రీ తిరుమలరావుగారి వంటి గురజాడ అభిమానులకు తెలియదేమో అని నా వంటి వారికి సందేహం కలగడం సహజం. ''సర్దేశాయి తిరుమలరావుగారు ఎన్నో విదేశీ రచనల ప్రసక్తి తీసుకువచ్చారు. చాలా మంచిపని చేశారు ! ఆయన దృష్టి ఎంత విశాలమయినదో మరొకసారి తెలిసింది'' అని 'సూరి'గారు జనవరి '80 భారతి లేఖలులో వ్రాశారు. ఈ మాటలతో అంతా ఏకీభవిస్తారు. అలాగే తిరుమలరావుగారి విశాల దృష్టిని కొద్దిగా మన తెలుగు సమాజంమీద 'గూడా ప్రసరింపచేస్తే అంతా సంతోషిస్తారు. అలా జరిగిననాడు బలిజేపల్లి వారి హరిశ్చంద్ర నాటకం ప్రదర్శింపబడుతోందనే సంగతి శ్రీ సర్దేశాయి వారికి పెద్ద విషయంగా కనబడదు.

ఇంత చిన్న విషయం కూడా తెలీకుండా పెద్ద పెద్ద విషయాలను గూర్చి వ్రాయ ప్రయత్నించే పెద్దలకు నమస్కారం పెట్టి ఊరకుండటమే మంచిదని నా వంటి వారు భావించటంలో పెద్ద తప్పు లేదనుకుంటా !

ఇక బురద-పంది-బూడిద — సెంటు అంటూ వారు ఏమేమో వ్రాశారు. ఎవరూ ఆ వాక్యాలను గురించి పట్టించుకోరు.

నన్ను తప్పులు పట్టినా, కించపరిచినా ఫరవాలేదు. వయస్సులో వారికంటే చిన్నవాణ్ణి. తప్పులేదు. కానీ స్వోత్కర్షలు చేసుకోవడం మంచిది కాదని విజ్ఞులు చెబుతుంటారు.

''నేను పెంపర కోల్పోక అనంతంగా వాదించగలను. విమర్శలో దాక్షిణ్యం లేనివాణ్ణి. నా ''కన్యాశుల్క నాటక కళ''లో ''గురజాడనే వివిధ దృక్కోణాల ద్వారా విమర్శించినాను...'' లాంటి

వాక్యాలు శ్రీ సర్దేశాయివారి ప్రతిపాత్రలో ఉంటాయని అందరికీ తెలిసిపోయింది. ఇటువంటి పెద్దలకు 'దణ్ణం' పెట్టి పక్కకు పోదలిస్తే — ఏదీ వారు పోనిస్తేనా ? పునరాహ్వానమాయె !

విశ్వనాథను గురించి వారు వ్రాసిన దానికి సరియైన సమాధానం అదే సంచికలో డా. మురళీధర్‌గారు వ్రాశారు. అయినా, పెద్దలు నన్ను ఆహ్వానించి విశ్వనాథను గురించి వ్రాయమన్నప్పుడు తిరస్కరిస్తే బావుండదు. పైగా అప్పుడే వారు **'చూస్తాను'** అని యుద్ధానికి సిద్ధమవుతున్నారు **గూడా** ! వారి ఆశీర్వాదమూ, పరమేశ్వర కటాక్ష**మూ** ఉం**టే** అలాగే వ్రాస్తా ! నమస్తే సార్ !!

శ్రీ పులిచెర సాంబశివరావు

శాతవాహనుల శాసనములు విమర్శ - పరామర్శ

భారతి, 1979 ఆగస్టు సంచికలో ప్రకటితమైన "శాతవాహనుల శాసనములు" అను నా వ్యాసముమీద భారతి, 1980 జనవరి సంచికలోని కలగూరగంపయందు ప్రచురితమైన శ్రీ జి. జవహరులాలుగారి విమర్శకూడ పరామర్శ యోగ్యము.

"ఇక నాగనిక నానాఘాట్ శాసనము—ఇది బహువాద బంధురమైన విషయము. అందుకు హేతువు శాసనమున అనేకపంక్తులు శిథిలమగుట." అని నా వ్యాసమునందు స్పష్టముగ కలదు. (పుట 10) అయినను జవహరులాలుగారు అదే విషయమునకు ఒక పరిచ్ఛేదమును వెచ్చించుట అనావశ్యకము.

నేను "నానాఘాట్ శాసనంపై వెలుబుచ్చిన విషయాలు క్రొత్తవి మాత్రం కావు. అవి ఎవరో ఒకరు సూచించినవే" అని జవహరులాలు రు, అవి ఎవరు ఎక్కడ సూచించినదియు తెలుపకుండ తెగనాడుట "మృషాదోష గుణాధిరోపణము."

డాక్టర్ పరమేశ్వరలాలు గుప్తాగారి వ్యాసం నేను "చూడవలసింది" అని. "చూచినట్లు చెప్పలేదు" అని జవహరులాలుగారు పొందుపఱిచిన "డా. గుప్తాగారు వ్యక్తపరచిన విషయాలు" అయిదును నా వ్యాసమునందు పరాస్తములు. ప్రధ్వస్తములు. అయినను జవహరులాలుగారు అవే విషయములను పునరుద్ధరించుట ఆశ్చర్యజనకము.

1975 వ సంవత్సరమున డాక్టర్ పరమేశ్వరలాలుగుప్తాగారు ప్రతిపాదించిన విలక్షణ సిద్ధాంతము, డాక్టర్ వాసుదేవ్ విష్ణు మిరాషీగారు ప్రతిపాదించిన స్వలక్షణ సిద్ధాంతము చూచి,

నా ''ఉద్దేశ్యాన్ని వ్యక్తపరచితే బాగుంటుంది'' అని జవహరులాలు గారి ''నమ్మిక.'' ఆ రెండు వ్యాసములను పరామర్శించిన పుటల దండుగ వినా ప్రయోజనము శూన్యము. జవహరులాలుగారు పొందు పఱచిన ''డా. గుప్తాగారు వ్యక్తపరచిన విషయాలు'' అయిదును పరిశీలించిన ఆశించిన ప్రయోజనము సిద్ధించును.

1. ''నానాఘాట్ శాసనంలో రాణి పేరు తెలుపలేదు, ఆమె 'అంగెయ' కులానికి చెందినది. కాని శాతవాహనుల రాణి మాత్రం కాదు.''

ఇందు ''నానాఘాట్ శాసనమునందు రాణి పేరు తెలుప లేదు'' అనుట డా. పరమేశ్వరలాలుగారు ప్రతిపాదించిన క్రొత్త విషయము కాదు. డా. బూ(హ)లరుగారు ప్రతిపాదించిన ప్రాత వడ్డ ప్రాత విషయము. ఈ విషయము నా వ్యాసమునందు కలదు. (పుట 12) నానాఘాట్ శాసనములోని ''నాగవరదాయిని'' అను నామధేయము డా. బూలర్ గారికి అర్థముకాలేదు. నాగవరదాయిని అనగా నాగనిక. ఈ విషయముకూడ నా వ్యాసమునందు కలదు. (పుట 12) కనుక ''నానాఘాట్ శాసనంలో రాణి పేరు తెలుప లేదు'' అను పరమేశ్వరలాలుగారి అనుసరణము, జవహరులాలుగారి ఉద్ధరణము పాడిన పాటలే.

నానాఘాట్ శాసనములోని రాణి ''అంగెయ కులానికి చెందినది. కాని శాతవాహనుల రాణి మాత్రం కాదు'' అను పరమేశ్వరలాలుగారి అభిప్రాయము ప్రామాదికము. అట్లు 1975వ సంవత్సరమున పరమేశ్వరలాలుగారు అపోహపడుట అవకాశమే కాని, 1979వ సంవత్సరమున జవహరులాలుగారు భ్రమపడుట నిరవ కాశము. శ్రీ పి. జె. చెమ్మల్‌గుండ్‌గారు ఇటీవల ప్రకటించిన నాగనికా శ్రీశాతకర్ణుల వెండి నాణెము తన్నిమిత్తము. ఈ విష యము నా వ్యాసమునందు కలదు. (పుట 8) అయినను జవహరు లాలుగారు కాలదోషము పట్టిన పరమేశ్వరలాలుగారి వ్యాసమును పట్టుకొని ప్రేలాడుట ప్రమాదకరము.

2. ''ఆమె మహారథికి భార్య. అతని పేరు 'శ్రీ'తో ముగుస్తుంది.''

ఇది మరింత విడ్డూరము. నానాఘాట్ శాసనమునందు నాగవరదాయిని గురించి ''మా... (బా)లాయ మహారథినొ అంగియ కులవధనస = మా...బాలయా మహారథినః అఙ్గిక కులవర్ధనస్య'' అని కలదు. అనగా ఆమె అంగిక కులవర్ధనుడైన మహారథియొక్క బాల అని మాత్రమే అర్థము. బాల అనగా భార్య అను అర్థము రాదు. డాక్టర్ దినేశ్ చంద్ర సర్కార్‌గారు చెప్పినట్లు కన్య అని మాత్రమే అర్థము వచ్చును. అనగా నాగవరదాయిని = నాగనిక మహారథి తనయ అనియే తాత్పర్యము. ఇది యెల్ల నా వ్యాసము నందు కలదు. (పుటలు 12, 13) ఇక మహారథి పేరు శ్రీతో ముగియుననుట ఊహామాత్ర సాధకము. ఉపరి, బాధకము. ప్రతిమా శాసనములందు మహారథి పేరు ''మహారథి త్రనకయిరో = మహారథీ స(త్రా)ణకవీరః (కార్యః)'' అనియే కలదు. ఇదికూడా నా వ్యాసమునందు కలదు. (పుటలు 7, 8) అంతేకాదు. ''ప్రతిమా శాసనముల లిపి స్వరూపము, నానాఘాట్ శాసనము లిపి స్వరూపము ఒకటే'' అను విషయముకూడ నా వ్యాసమునందు కలదు. (పుట 10) కనుక నానాఘాట్ శాసనము ఇక్ష్వాకుల కాలము నాటిది కాదని కరతలామలకము. అంతేకాదు. నాగనికాశ్రీ శాత కర్ణుల వెండి నాణెము కువ్యాఖ్యా విషమూర్ఛితమైన నానాఘాట్ శాసనమునకు సంజీవ నౌషధము.

3. ''ఆమె దక్షిణా పథానికి చెందిన గొప్పరాజు కూతురు''

దక్షిణా పథమునకు చెందిన గొప్పరాజులు ఆ కాలమున శాతవాహన రాజులు మాత్రమే. నానాఘాట్ శాసనముతో పాటు రుద్రదాముని జునాగడ్ శాసనమును ఇందుకు నిర్ధారక సాధ నము. అశ్వమేధయాగ సంబంధి రజతనాణక ప్రమాణమును బట్టి నాగనికా శ్రీశాతకర్ణులు రాజదంపతులు. కనుక పరమేశ్వరలాలు గారు వ్యక్త పఱచినను, జవహరులాలుగారు భుక్త పఱచినను నానాఘాట్ శాసనములోని నాగవరదాయిని అనగా నాగనిక దక్షిణా పథమునకు చెందిన గొప్పరాజు కూతురు ఎంత మాత్రమును కాదు. నిస్సంశయముగ భార్యయే. ఇది నిర్వివాదము. నిర్ధారకము.

4. ''ఆమె 'వేదిశ్రీ'కి 'సతిశ్రీ'కి తల్లి''

ఇందు ''సతిశ్రీ'' అపశబ్దము. ''శక్తిశ్రీ'' సుశబ్దము. సుసంగత శబ్దము. నానాఘాట్ శాసనములోని ''సతిసిరి''శబ్దము, ప్రతిమా శాసనములలోని ''హకుసిరి'' శబ్దము ప్రాకృతరూపములు. శక్తిశ్రీ శబ్దము తదుభయకుశలమైన సంస్కృత రూపము. కనుక నాగనిక వేదిశ్రీకి శక్తిశ్రీకి తల్లి ఇది యెల్ల నా వ్యాసమునందు కలదు. (పుట 10) అయినను, జవహరులాలుగారు ''సతిశ్రీ'' అను సంకర శబ్దమును ఆశ్రయించుట సంస్కృత ప్రాకృత భాషా నభిజ్ఞతకు నిదర్శనము.

5. ''శాసన కాలానికి వేదిశ్రీ రాజ్యం చేయుచున్నాడు''

ఇది కూడ డా. పరమేశ్వరలాలు గుప్తాగారు ప్రతిపాదించిన క్రొత్త విషయము కాదు. శాసన కాలమున వేదిశ్రీ రాజప్రతినిధి అని డా. బూలరుగారు ప్రతిపాదించిన ప్రాతవిషయమునకు రూపాం తరము. ''నానాఘాట్ శాసన కాలమునకు వేదిశ్రీ మరణించెనని ప్రకరణమును బట్టి ప్రతీయమానము.'' అని నా వ్యాసమునందు కలదు. (పుట 15) అది కూడ ''క్రొత్త విషయముకాదు. ఎవరో ఒకరు సూచించినదే'' అని జవహరులాలుగారు అందురేమో! నిరూ పణములేని ఆపాదనము నిర్దుష్టము కాదు.

ఇంతకు, అధికభాగము శిథిలమైనను నానాఘాట్ శాసనము నకు డాక్టర్ దినేశ్‌చంద్ర సర్కార్‌గారు సంఘటించిన ఛాయా చిత్రము కలదు. ప్రతిమా శాసనముల ఛాయాచిత్రములును కలవు. అవి చతురక్షర సంయోగము చేసిన వాని లిపి స్వరూపమును బట్టి అవి సమకాలిక శాసనములని స్వయం వ్యక్తమగును. ఆ కాలము క్రీస్తు పూర్వము ప్రథమ శతాబ్ది ఉత్తరార్ధమని ఆర్. పి. చంద

గారి నిర్ణయము. ప్రతిమా శాసనములందు నాగనికా శ్రీశాతకర్ణుల జంట నామములు కలవు. నానాఘాట్ శాసనమునందు నాగవర దాయిని అను నామము కలదు. నాగవరదాయిని పేరులోని వరదాయిని గౌరవ వాచకము. నాగనిక పేరులోని అనిక స్త్రీ వాచకము. నాగనికా శ్రీశాతకర్ణులు సుమారు పాతిక యజ్ఞములు చేసినట్లు నానాఘాట్ శాసన పరమార్థము. అందు అశ్వమేధయాగములు కలవు. నాగనికా శ్రీశాతకర్ణుల అశ్వమేధయాగ సంబంధమైన వెండి నాణెము కలదు. అయినను, క్రీస్తుపూర్వము ప్రథమ శతాబ్ది ఉత్తరార్ధమునకు—లేదా—క్రీస్తుశకము ప్రథమ శతాబ్ది పూర్వార్ధము వకు చెందు నానాఘాట్ శాసనమును, క్రీస్తుశకము మూడవ శతాబ్దికి చెందిన ఇక్ష్వాకుల కాలమునకు డాక్టర్ పరమేశ్వరలాలుగుప్తాగారు తీసికొనిపోవుట వారెంత ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులైనను ప్రామాదికము. అట్టి విలక్షణ సిద్ధాంతమును "ఆలోచించి నిర్ధారించ వలసినదేగాని ఊరికనే ప్రక్కకు నెట్టవలసినది మాత్రం గాదు" అని డాక్టర్ జి. జవహరులాలుగారు వెనుక వేసికొని వచ్చుట వీరెంత విశుద్ధ చరిత్ర పరిశోధకులైనను విపరీతము.

డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి

ఇకచాలు పిడి వాదం

'మల్లీ ఓ. వి.' గారు వివేచనా రహిత సాహసోపేత ప్రప్రతి విమర్శ సాగించారు. మంచిదే!

నేను నా ప్రథమ వ్యాసం (ఆగస్టు భారతి)లో రెండు విషయాలు ప్రస్తావించాను· ఒకటి—పండితుడు ద్వైతియా ? అన్నది. ద్వైత విశిష్టాద్వైతాలకు కల భేదాలను పేర్కొంటూ పండితుడు శివాద్వైతి యని వ్రాశాను. ఇది శాస్త్రీయం. ఇందుకు శంకరశాస్త్రిగారే రావాలి అంటూ శ్రీ ఓ. వి. గారు దీని కంత ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఇక రెండవ విషయం ప్రస్తుత వాద వివాదాలకు ఆకరమైంది శ్రీ నిడుదవోలువారి రెండు రకాల వ్రాతలు. వీటినిగూర్చే పట్టు వదలని విక్రమార్కుడిలాగా పట్టుకు వ్రేలాడుతున్నారు ఓ. వి· గారు. వారి బండవాదనకు మొండిజవాబు ఇవ్వక తప్పలేదు.

నిడుదవోలువారి ఎడిషన్ పీఠిక 84 నుండి 88వరకు శ్రీ లక్ష్మణరావుగారి వ్రాత అంటారు శ్రీ ఓ. వి., నిడుదవోలు వారిది అంటాను నేను. సపోర్టుగా 84 నుండి ఒక వాక్యం, 88 నుండి ఒక వాక్యం ఉదహరించారు. కాని అవి వారికి వంతపాడడం లేదు. రోడ్డుప్రక్క మురికి గుంటల్లోంచి నాలుగక్షరాలు వెతుక్కొని నేనూవిమర్శకుడినేననిబయలుదేరితే అంతుబట్టదువిషయం. పండితుడెవరికైనా పై పుటల్లోనిది శ్రీ వేంకటరావుగారిదేనన్న అభిప్రాయం కలుగుతుంది. కారణం అది తాము యథాతథంగా శ్రీ లక్ష్మణరావుగారినుండి సంగ్రహిస్తున్నామని చెప్పకోలేదు. "తొలి ముద్రణమున మత సంప్రదాయములు వాని విమర్శ యిటయిచ్చుచున్నాను" అనగా శ్రీ ల. రా. గారు వివరించిన సంప్రదాయములు వానిపై తమ విమర్శ అనే అర్థం, ఇది కాకపోతే "పరిష్కర్తలకా సంప్రదాయములు తెలియకపోవుటచేత—నందును గొన్ని పొరపాటులు దొరలినవి-ఒకప్పుడట్లున్నను నా గ్రంథము పునర్ముద్రితము లైనపుడు వానిని సరిచేయుట తరువాతి వారు చేయదగిన పని యగుటచేత" అన్న శ్రీ వేంకటరావుగారి వాక్యాలకు అర్థమే పొసగదు. శ్రీ నిడుదవోలువారి వ్రాతలు వ్యర్థములంటే పేచీయేలేదు. ఇక 88వ పుటలో "పై శివతత్త్వసార పీఠికలోని యంశములే" అనడం కూడా ఇలాంటిదే! ఇక్కడ ఒక్క విషయం గమనించాలి· శ్రీ ల. రా. గారి వాక్యాలను ఎత్తి చూపవలసివస్తే శ్రీ వేం రా. గారు ఉద్ధరణ చిహ్నాలను వాడుతారు. చూడండి. పై 88వ పేజీరెండవపేరా ఇలాప్రారంభించారు. "పై మత సంప్రదాయములు-అను శీర్షికలో—'లింగధారణమునుగూర్చి యీగ్రంథము నందెచ్చటను చెప్పబడి యుండలేదు' అన్న వాక్యము తన్మతాను యాయుల విమర్శనమునకు పాత్రమైనది." ఇందులో 'లింగధారణము'నుండి 'చెప్పబడి యుండలేదు' అన్నంతవరకు శ్రీ వేంకటరావుగారు ఉద్ధరణ చిహ్నాలమధ్య ఎత్తివ్రాశారు. అనగా ఇదితప్ప తక్కినది వారి స్వంతమనే కదా! నేను నా మొదటి వ్యాసంలో పేర్కొన్న విషయాలకెక్కడా ఇలాంటి చిహ్నాలు లేవు. కాబట్టి అవి శ్రీ నిడుదవోలు· వారివేనని నా అభిమతం. మరో ఋజువు కావాలా ? శ్రీ ఓ. వి. గారికి కేవలం నాలుగు పుటలకు ముందు అంటే జనవరి భారతి కలగూరగంప 63 వ పుట తిరగేసి చూడండి. 'మల్లికార్జున పండితుడు — బ్రాహ్మ్యంబుతో పొత్తు' అనే వ్యాసంలో శివశ్రీ రేకళిగ మఠము వీరయ్యగారు శి. సా. పీఠిక 85 వ పేజీలోని విషయం శ్రీ నిడుదవోలు వారిదేనన్నారు. ఈ 85 వ పేజీ పై 84—88ల మధ్యదేకదా! ఇంతేకాదు శి. సా. పీఠికను శివజ్యోతి వ్యాసాన్ని బేరీజు వేసి శ్రీ వీరయ్యగారు "ఆ రెండు సందర్భములలో వారు వ్రాసిన తీరులు ఒకటితో ఒకటి సరిపోక పోవుటయేకాక భిన్నముగా నున్నవి" అంటున్నారు. సందర్భం వేరైనా నేను చెప్పింది సరిగ్గా ఇదే! ఇప్పటికైనా తెలిసిందా ? పండితులైనవారూ, ప్రామాణికులైనవారూ ఒకేలాగా ఆలోచిస్తారని.

అసలు విషయమేమంటే గ్రహపాటుననో, పొరపాటుననో రెండు చోట్ల రెండురకాలుగా వ్రాశారు శ్రీ నిడుదవోలువారు. వారిని, వారి వ్రాతల్ని సమర్థించాలని వకాలత్ పుచ్చుకొన్నారు శ్రీ ఓ. వి. గారు. కాని సాధ్యం కాక ఒడ్డున పడ్డ చేపలా గిలగిలలాడుతున్నారు.

క్రొత్తగా శైవమత ప్రకాశికలను పట్టుకొచ్చారు· అవి ప్రస్తుతం నా వద్ద లేవు. వాటిల్లో శివయోగులు ఏమి వ్రాశారో ఎందుకు వ్రాశారో నాకు తెలియదు. తెలియని దాన్ని గూర్చి చర్చించడం నా అలవాటు కాదు.

శ్రీ లక్ష్మణరావుగారికి తెలియదని శ్రీ వేంకటరావుగారూ, వారికి తెలియదనినేమూ నిర్ణయించాము. ఇక ఇప్పుడు శ్రీ నాగలింగ

శాస్త్రిగారికి తెలియదని శ్రీ ఓ. వి. చెబుతున్నారు. మరింతకూ తెలిసిన వారెవరు ? శ్రీ ఓ. వి. గారేనా ? హతోస్మి !

క్రమంగా ఈ చర్చ విమర్శ ప్రధానం కాకుండా దూషణ ప్రధానంగా రూపు దిద్దుకొంటున్నది. ఇది మాకు గౌరవకారీకాదు. పాఠకులకు ప్రయోజనకారీ కాదు. ఇప్పటికే ఇది విజ్ఞులకు విసువు పుట్టించినా ఆశ్చర్య పడనక్కరలేదు. కాబట్టి ఇక మీద శ్రీ ఓ.వి. పిడి వాదం వదలి ఆలోచనీయాంశం ఏదైనా చర్చిస్తే తప్ప ఏక పక్షంగా ముగింపు పలుకుతున్నాను. కారణం, వారెంత వ్రాసినా తమ పేరెలాగూ చెప్పుకోలేరు. కనీసం ప్రతికక్షి పేరైనా జ్ఞాపకం పెట్టుకోలేరు.

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

అనంతామాత్యుని యతుల సంఖ్య ఒక పరిశీలన

'భీమన పది చెప్పె ననం
తామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువది నా
ల్గామీఁదఁ గొందఱు కవి
గ్రామణు లిరువదియు నేడు గావించి రొగిన్'

[అప్ప – 3–7]

అని అప్పకవి పేర్కొన్ననాటినుండి అనంతుని ఛందస్సు (ఛందో దర్పణము)లోని యతులసంఖ్య 24 అనీ లెక్కింపబడుతూ వస్తూంది. కాని, యతి ప్రకరణ ప్రారంభంలో అనంతుడే స్వయంగా ఇచ్చిన యతుల సంఖ్య 14 మాత్రమే అవుతుంది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడంలో వ్యాఖ్యాతలు బహుధా ప్రయత్నించి, చివరకు ఇక్కడేదో పద్యం లోపించి ఉండాలని అభిప్రాయ పడ్డారు. వారిలో

(1) శ్రీ భాష్యం వేంకటనరసింహ భాష్య కారాచార్యులుగారు — "మకారయతి, నిత్యయతి, ఎక్కటియతి అనువానిం గూర్చి వివరించిన పద్య మీ పద్యమునకుఁ బూర్వ భాగమున లుప్తమై యుండును·" అని 'తత్వబోధిని'లో వ్రాశారు.

(2) శ్రీ రావూరి దొరసామిశర్మగారు —

"అనంతుఁ డిరువదినాల్గు యతులు చెప్పెనని గ్రంథమును బరిశీలింపగా తెలియుచున్నది. 'భీమన పదిచెప్పె ననంతామాత్యుఁడు చేసె వెనుక యతు లిరువది నాల్గ' అని యప్పకవియుఁ జెప్పి యున్నాఁడు. కాని యతి భేదములఁ బేర్కొను పద్యములందు (78, 79, 80) నిర్వదినాల్గు యతులు చెప్పబడవు పద్యము లేవేని లోపించెనేమో" అని 'సమీక్ష'లో వ్రాయుచు 'అధస్సూచిక'లో

"ఈ కూర్పులో యతి భేదము లిర్వది నాల్గు సంఖ్యలతో నాచేఁ జూపఁబడినవి. పూ. ము. లో నిది లేదు" అని పేర్కొన్నారు.

ఇలా పద్యాలు లోపించిన వేమో అని భావించడానికి కారణం అప్పకవి చెప్పిన సంఖ్య అక్కడ లేకపోవడమే గాని, అనంతుడు చెప్పింది లేక పోవడం కాదు. అనంతుడా సంఖ్యను చెప్పనే లేదు, వరుసగా పధ్నాలుగు యతులపేర్లు పేర్కొనడం మాత్రమే చేశాడు. అప్పకవి '24' అని సంఖ్యను చెప్పడం, దాన్నిబట్టి శ్రీ రావూరి వారు విభజించడం జరిగిందన్నమాట !

ఇది యిల్లా గతాను గతికమైంది.

సావధానంగా పరిశీలిస్తే అనంతుడు విషయసూచికగా చెప్పిన యతులసంఖ్యకూ, తర్వాత అతడు వివరించిన యతుల సంఖ్యకూ పొత్తు కుదిరేటట్లు కనిపిస్తూంది. 'విషయసూచిక'గా ఇచ్చిన పద్యాలు ఇలా వున్నాయి.

(1) స్వరయతులు వర్గయతులును
సరసయతుల్ ప్రకటమైన సంయుక్త యతుల్
పొరిఁ బ్రత్యేక యతులు ననఁ
బరగును యతిపంచకంబు పంకజనాభా !

(2) స్వరయతులు ప్రాదికాకు
స్వర నిత్యసమాసయతులు, వర్గయతులు ని
ద్దరఁ బోలికవడి, సంయుత
విరతి యనుస్వార యతులు వెలయు ముకుందా !

(3) ప్రభు నామాంత విరతి యన
విభాగవిరమణము భిన్న విశ్రమమును గౌ
స్తుభ ధర ! వికల్పయతి యన
న భేద విరమణ మనంగ నైదుతెఱంగుల్.

ఈ మూడు పద్యాలనుబట్టి యతులను క్రిందివిధంగా గణించవచ్చు.

I.	స్వరయతులు	: (1) స్వరయతులు (2) ప్రాది యతులు (3) కాకుస్వర యతులు (4) నిత్యసమాస యతులు
II.	వర్గయతులు	: (5) వర్గయతులు (6) పోలికవడి
III.	సరసయతులు	: (7) సరసయతులు
IV.	సంయుక్తయతులు	: (8) సంయుక్తయతులు (9) అనుస్వార యతులు
V.	ప్రత్యేకయతులు	: (10) ప్రభునామాంతయతి (11) విభాగయతి (12) భిన్నయతి (13) వికల్పయతి (14) అభేదయతి

ఇలా ప్రధానంగా ఐదువిధాలుగా ఉన్న యతులను మొత్తం మీద పధ్నాలుగు భేదాలుగా అనంతుడు పేర్కొన్నాడు.

ఇక ప్రస్తుతం అనంతుని ఛందస్సులో ఈ పధ్నాలుగు కాక, మరో పదియతులపేర్లు అధికంగా కనిపిస్తూ వున్నాయి. వాటినలా

విభజించాలనీ, ఆపేర్లు పెట్టాలనీ అనంతుడుద్దేశించినట్లు కనిపించదు. ఆ పదియతులివి :

(1) గూఢస్వరయతి (2) ఋకారస్వరూప యతి (3) రీ విరమము (4) ఌకారవిరతి (5) నిత్యయతి (6)తద్భవ వ్యాజయతి (7) రేఫయుతయతి (8) మకారయతి (9) ఎక్కటియతి (10) యుక్తవికల్పయతి.

ఇవి యేయే యతుల్లో అంతర్భవిస్తాయని అనంతుడు భావించాడో పరిశీలిద్దాం !

(1) గూఢ స్వరయతి :— ''స్వరము తుదనుండి లుప్త
విసర్గకోత్వమైన స్వర,
విరామంబుదాసోऽహమనగ...''

ఈ పద్యంలో 'గూఢ స్వరయతి' అనే మాటే పేర్కొనబడలేదు. కాబట్టి ఈ పేరు ప్రక్షిప్త మన్నది స్పష్టమే! అనంతునిదృష్టిలో అచ్చులకు సంబంధించిన యతులన్నీ స్వరయతులే ! అందువల్లనే ప్రత్యేకించి పేర్లు పెట్టలేదు. తరువాతి యతుల్లో కూడ ఈ పద్ధతిని గుర్తించవచ్చు.

(2) ఋకార స్వరూప యతి :— అనంతుడు దీనికి ప్రత్యేకించి లక్షణం చెప్పలేదు. 'క్షితి ఋకార స్వరూప యతులు పఱగు' అని మాత్రం చెప్పి, వెంటనే ఉదాహరణ లిచ్చినాడు. 'ఋకారానికి సంబంధించిన యతులు' అని మాత్రమే పై సమాసానికి అర్థం అన్వయిస్తోంది. ఎందుకంటే, ఇందులో కేవలం ఋకారానికి మాత్రమే గాక, వ్రటువకు వ్రటువతో యతి చెల్లించడం కూడా చెప్పబడివుంది. అది 'ఋత్వసామ్యయతి' ఔతుందిగానీ 'ఋకార స్వరూప యతి' కాదుగదా ! కాబట్టి ఈ పేరు కూడా ఇతరులు కల్పించిందే.

(3) రీ విరమము :— ఇక్కడ కొన్ని ప్రతులలో 'విరమము' అని మాత్రమే ఉండడం గమనింపదగ్గ విశేషం ''విలస దృకారమునకు వ్రటిలు రీ విరమంబు'' అని లక్షణం చెప్పబడింది. అంటే, 'ఋకారానికి రీతో యతి వర్తిస్తుంది' అని అర్థం. కనుక ఇక్కడ కూడా ప్రత్యేకించి పేరు పెట్టినట్టు లేదు.

(4) ఌకార విరతి : ''ఘన లకారంబ యగును ఌకార విరతి'' అని వున్నదాన్ని బట్టి దీనికీ పేరు పెట్టినారు. కాని ''ఌకారముతోడి యతి 'ళ' కారమే యగును'' అని దీని అర్థం. కనుక ఇది కూడ ప్రత్యేక నామం కలిగింది కాదు.

పైని పేర్కొన్న నాలుగు యతులూ వాటి స్వభావాన్ని బట్టి 'స్వరయతులు' అనే పిలువబడాలని అనంతుఁడుద్దేశించినట్లు భాసిస్తూ వుంది కనుక శ్రీ రావూరివారు చేసిన ఈ విభాగం నిరాధారమైనదే !

(5) నిత్యయతి :— ''ఏనియను పదంబుతో నాది పద మంది
సంధి నిత్యయతుల జరగుచుండు
ఎట్టి క్రూర కర్ముడేని సద్గతి నొందు
నిన్ను నాత్మఁ దలఁచెనేని కృష్ణ''

ఇందులో నిత్య సమాస యతిలో చెల్లినట్లుగానే, అచ్చుకుగానీ హల్లుకు గానీ యతి చెల్లుతుంది. అనంతుఁడీ నిత్య సమాస యతులలో నారాయణ రసాయనాది శబ్దాలనే కాక, 'ఉక్కఱ, ఏపఱ' ఇత్యాది దేశ్య శబ్దాలను కూడా ఉదాహరించినాడు. ఈ రెండవ విభాగాన్నే అప్పకవి 'దేశ్య నిత్య సమాసయతులు' అనే పేరుతో వేరుగా పేర్కొన్నాడు. అయితే అనంతునికి ఆ ఉద్దేశ్యం ఉన్నట్లు లేదు. 'ఉక్కఱ, ఏపఱ'ల వలెనే, 'కర్ముడేని, తలచెనేని' మున్నగు వాటిని కూడా నిత్య సమాస యతుల గానే వివరించినాడు

ఈ అభిప్రాయానికి మఱొక్క ఆధారంకూడా వుంది. 'ఉక్కఱ—ఏపఱ'లను చెప్పిన పద్యానికీ, 'కర్మడేని—తలచెనేని' అనే వాటిని చెప్పిన పద్యానికీ నడుమ ''అట్లు మఱియును'' అనే చిన్న వచనం కనిపిస్తుంది. ఈ వచనాన్నిబట్టి, కర్మడేని ఇత్యాదులు ఉక్కఱవంటివే అని అనంతుడుద్దేశించినట్లు స్పష్టమౌతోంది.

దీన్ని గమనింపక 24 యతులను సరిపెట్టడంకోసం, ఇందులో 'సంధి నిత్యయతుల' అని ఉన్నదాన్నిబట్టి శ్రీ రావూరి వారు దీన్ని ఒక యతి భేదంగా గణించి ''నిత్యయతి'' అని పేరు పెట్టారు. కాని అనంతుడు 'నిత్య సమాసాక్షర సంధులు' అనీ, 'నిత్యసమాసయతులు' అనీ, నిత్య సమాసోక్తి' అనీ ఛందోऽనుగుణంగా వాడినాడు. అలాగే ఇక్కడ 'నిత్యయతుల' అనే పదం వాడబడింది. కనుక ఇది నిత్యసమాస యతులలోనిదే అన్నది అనంతుని ఆశయంగా కనిపిస్తున్నది.

(6) తద్భవవ్యాజయతి :— దీన్ని 'తద్భవవ్యాజయతి' అని అనంతుడు వాచ్యంగా చెప్పలేదు. పరిశీలిస్తే, ఇది జ్ఞ అనే సంయుక్తాక్షరానికి సంబంధించిన యతి గనుక తత్పూర్వమే పేర్కొనబడి వున్న సంయుక్తయతిలో ఇది అంతర్భవిస్తుంది అనడం సముచితం గదా !

(7) రేఫయుతయతి :— దీన్నిగూర్చి శ్రీ గిడుగు సీతాపతి గారు తమ ఉపోద్ఘాతంలో "ఈ యతిభేదము ననంతు డెందుకు చెప్పినాడో తెలియదు..... ఇదియొక యతిభేదముగాఁ జెప్పియుండడని నా యభిప్రాయము" అని వ్రాసినారు. అనంతునికి ఒక అలవాటున్నది. ఎక్కడైనా సందేహాస్పద విషయం ఉంటే దాన్ని వివరించడం. సంయుతప్రాసను వివరిస్తూ —

"తెలుగునందు లేదు లలిఁగ్రింది సుడి గ్రుచ్చెఁ
గ్రుమ్మె నాఁగ రేఫ కొమ్ముగాని
ప్రాసమైత్రి చొరదు దా సంయుత ప్రాస
మగును రేఫ యుతము ననుసరించి." (58)

అని వ్రాసినాడు. అలాగే ఇదికూడా సంయుక్తయతికి సంబంధించిన వివరణమేగాని ప్రత్యేక యతిభేదం కాదు.

(8) మకారయతి :- 'యరలవలు శషసహలును నాదిబిందు
యుతములై మకార విరామయుక్తిఁదనరు'

అని లక్షణం. అంటే 'యరలవ శషసహ' అనేవి పూర్ణబిందు పూర్వకాలైతే మకారంతో యతి పొందుతాయి అని అర్థం. ఈ పద్యం కంటె ముందు అనుస్వారయతి పేర్కొనబడింది. అందులో 'పూర్ణబిందు పూర్వకాలైన వర్గాక్షరాలు వాని పంచమాక్షరాలతో యతి పొందుతాయి' అని వుంది. ఈ రెండింటిలోను పూర్ణబిందు పూర్వకత్వమే ప్రధాన లక్షణం గనుక 'అనుస్వారయతులు' అనే దానిలోనే దీన్నికూడ చేర్చడం సమంజసం గదా !

(9) ఎక్కటియతి :— 'రమఅవ' అనేవి దేనికదేగాని తన్మిశ్రితవర్ణాలు కేవల హల్లులలో లేవని చెప్పడమే దీని ప్రయోజనం కనుక యిది ప్రత్యేక యతిభేదం కాదన్నది అందఱెఱిఁగిందే ! "ఎక్కటి యతినిగూడ ప్రత్యేక యతిభేదముగాఁ బరిగణింపనక్కర లేదు" అని తత్వబోధిని. (పుట—49)

(10) యుక్త వికల్పయతి :— శ్రీ రావూరివారు అనంతుని ఛందస్సు సమీక్షలో "అనంతుడు (జగత్ + హిత) జగద్ధితాది (అంత్యోష్మ) సంధులందలి యతికి వికల్పయతి యనియు, (దిక్ + మహిత) దిఙ్మహితాది సంధులందలి యతికి యుక్త వికల్ప యతి యనియు నామకరణము గావించె" (పు. 82—83) అని వ్రాసినారు. కాని అనంతుడు 'యుక్త' శబ్దమును వాడనేలేదు.

"నలిఁగకార హల్లితరాను నాసికాఖ్యఁ
గదిసి తత్పంచకముగా వికల్ప విరతి".

అని మాత్రమే గ్రంథంలో వుంది. 'యుక్త వికల్పయతి' యని యుక్తశబ్దముతోఁగూర్చి యీ పద్యమునకు మీదిభాగమున నెట్లు నామధేయము లిఖింపబడెనో తెలియకున్నది... ఈ రెండును నొక్క భేదముగాఁ దలంచుటయే యుచితము. ఆళ (24) సంఖ్యాపూర్తికి దీని నెవ్వరో విడగొట్టియుందురు" (పుట 115) అని తత్వబోధినిలో విమర్శింపబడింది. కాబట్టి దీన్ని వికల్పయతిలో భాగంగా భావించక తప్పదు.

ఇలా ఈ పది యతులూ అనంతుడు పేర్కొన్న 14 యతులలో అంతర్భవిస్తున్నాయి. కనుక అతని యతుల సంఖ్య పద్నాలుగే అవవలసి వుంది. కాని, అప్పకవి చెప్పిన సంఖ్యనుబట్టి, శ్రీ గిడుగు సీతాపతిగారు, శ్రీ రావూరివారు, శ్రీ భాష్యంవారు 24 యతులకు సరిపుచ్చడమే చేసినారు గాని, సహేతుకంగా విభాగం చేసినట్లు కనబడదు. వీరందరికీ మూలాధారమైన అప్పకవి పద్యం అసలు పాఠం అదేనా అని సందేహం కలుగుతూ వుంది. ఇలా పాఠాంతరం ఉండవచ్చునేమో !

"భీమన పది చెప్పె ననం
తామాత్యుడు చేసె వెనుక యతు లొక పదు నాల్గామీద"

అని. ఈ పాఠం నా ఊహ మాత్రమే ! కనుక ఇది కాదనుకుంటే, అప్పకవి చెప్పిన సంఖ్యే తప్పనవలసి వుంటుంది. అలాకొన్ని అంశాలలో పొరబడడం అప్పకవిలో ఇంతకుముందే గమనించి వున్నారు వ్యాఖ్యాతలు. కనుక ఈ విషయంలో అప్పకవి పద్యం ప్రామాణికం కాదు. కాబట్టి దాని ప్రకారం చేయబడ్డ యతి భేదాలు నిరాధారమైనవయ్యాయి. వ్యాఖ్యాతల నిలా ముప్పు తిప్పలు పెట్టిన అప్పకవి మాటను ఇకనైనా త్రోసిరాజని, అనంతుని హృదయాన్ని గ్రహించి, అతడు పేర్కొన్నట్లు యతి భేదాలు 'పద్నాలుగే' అని గ్రహిద్దాము.

విద్వాన్ వింజమూరి విశ్వనాథమయ్య

లేఖలు

వ్యాసుడు — గ్రంథ చౌర్యమా ! యన్న శీర్షిక అక్టోబరు 'భారతి' లో శ్రీ పెద్దాడ నారాయణశాస్త్రిగారు వ్రాసినదియు, దానిపై డిశంబరు పత్రిక కలగూర గంపలో శ్రీ దేశపతి గోపాలకృష్ణగారు వ్రాసిన కొన్ని విషయములను జూచి, నాకు దోచిన విషయమును వ్రాయుచున్నాను.

1 వ్యాసుడు—గ్రంథచౌర్యమా! అని శాస్త్రిగారు వ్రాసిన వ్యాస సారాంశము గ్రంథచౌర్యము కాదనియు, అట్లు భావించుట తగదనియును దెల్పుటకేయని తోచును.

2 "సారూప్య వైరూప్యములతో రామాయణము ననుకరించి వ్యాసుండు మించెనేగాని మఱియొండు గాదు. నలోపాఖ్యాన రచనా కాలమున వ్యాసుండు వాల్మీకమును స్మరించెనో లేక యనుకరణము చేయనెంచెనో కాక వాల్మీకి కవితా శిల్పమును దనలో నిముడ్చుకొనెనేమో!—వాల్మీకిపై యాదరమున శ్లోకములను, భావములను, పాత్ర చిత్రీకరణమును, తద్రచనా పటిష్ఠతను విడువక సంతరించుకొనెనేమో!" అను శాస్త్రిగారి రచన దురూహ్యమైనది.

3 నలుని చరిత్రము చదువు పాఠకులకు నీ వ్యాసము చదివినది మొదలు రామాయణము గూడ గోచరించుచుండును.

4 అచిర కాలములో జెప్పబోవు రామోపాఖ్యానముకన్న ముందు గనే నలోపాఖ్యానములో రామాయణమును వ్యాసుడు ధ్వనింప జేసినట్లు నూతనముగ గృషిసల్పి తెలిపిన శ్రీ శాస్త్రి గారికి ధన్యవాదములు.

5 వ్యాసములో వ్యాసుని గూర్చి వ్రాయుచు వ్యాసులు అనేకు లనియు వ్యాస యన్నది యధికారమను దెల్పునదనియును దెల్పుట శాస్త్రిగారి బహుపురాణ ద్రష్టృతను దెల్పు చున్నది. వ్యాసులనుగూర్చి దేవీ పురాణాదులయందు స్పష్టీక రింపఁబడియున్నది. యని చూచుకో ప్రార్థన.

శ్రీ కందుకూరి శ్రీరామచంద్రమూర్తి

"22–9–'79న జరిగిన ఒక యూనివర్సిటీ సంస్కృత లెక్చరర్ పోస్టు ఇంటర్వ్యూలో సంస్కృత వ్యతిరేక క్రియ లేర్పడు టకు పాణినీయమునందలి సూత్రములేవి? అని నన్ను ఇంటర్వ్యూ కమిటీలోని ఒక ప్రొఫెసర్‌గారు ప్రశ్నించిరి" అని శ్రీ ఆచంట వేంకటసీతారామమూర్తిగారు 1980 జనవరి 'భారతి' ముఖమున వ్రాసిన లేఖ చూచి ఆ విషయమై తోచిన మాటను వ్రాయు చున్నాను.

వ్యతిరేక క్రియలు అనుమాట తెలుగు వ్యాకరణమున చిన్నయ సూరి వాడెనే కాని సంస్కృత వ్యాకరణమున ఈ అర్థములో ఆ పదపు ప్రయోగము విచారణీయము. ఆ అడిగిన ప్రొఫెసరుగారు బహుశః ఆంగ్లములో "Sanskrit prohibitive verbs" (శాన్స్క్రిట్ ప్రొహిబిటివ్ వెర్బ్స్) అని యుందురు. సంస్కృత ములో వాటిని ప్రతిషేధార్థక క్రియారూపములు అందురు. అవి ఏర్పడుటకు సంబంధించిన సూత్రములు.

1. మాఙి లుఙ్ (3 3 175) :—మాఙి ఉపపదే ధాతోః లుఙ్ ప్రత్యయో భవతి. సర్వలకారాణామపవాదః మాకార్షీత్. మాహార్షీత్ అని కాశికావృత్తి. (మా భవాన్‌భూత్—అని సిద్ధాన్త కౌముద్యుదాహరణము)

మాఙ్ ప్రయోగింపబడినపుడు ప్రతిషేధార్థమున కూడ లుఙ్ లకారమే వచ్చును.

[మహాకవి ప్రయోగములు :— 1. మా ద్రాక్షం క్షీణపుణ్యాన్ క్షణమపి భవతో భక్తిహీనాన్ పదాబ్జే (ముకుందమాల) 2. మాగమః కాతరత్వమ్ [మేఘసందేశము]. 3. మాభూదేవం క్షణమపిచతే విద్యుతా విప్రయోగః (మేఘసందేశము—ఉత్తరమేఘము 55 శ్లో.) 4. మాకౌలీనా దసితనయనే మయ్య విశ్వాసినీభూః (ఉత్తర మేఘము 52 శ్లో.) 5. మాగా ఇత్యుపరుద్ధయా యద పిసా సాసూయ ముక్తాసఖీ (శాకుంతలము—ద్వితీయాంకము—2వ శ్లోకము) మొదలగునవి.]

2. స్మోత్తరే లఙ్ చ (3–3–176) : స్మశబ్దోత్తరే మాఙి ఉపపదే ధాతోః లఙ్ ప్రత్యయో భవతి చకారా ల్లుఙ్ చ. మాస్మకరోత్. మాస్మకార్షీత్. మాస్మహరత్. మాస్మహార్షీత్ అని కాశికావృత్తి. (మాస్మభవత్-భూద్వా-అని సిద్ధాన్త కౌముద్యుదా హరణము; మాస్మభవన్. మాస్మభావన్—అనునది బాలమనోరమా వ్యాఖ్యానమునందలి ఉదాహరణము.) "స్మ" తనకు పరమందుగల మాఙ్ ప్రయోగింపఁబడినపుడు ఈ ప్రతిషేధార్థమున "లఙ్"కూడ వచ్చును. అనగా ఇచట లుఙ్, లఙ్‌లు రెండును సమంజసములే.

[మహాకవి ప్రయోగములు :— 1. సౌధోత్సంగ ప్రణయ విముఖో మాస్మభూ రుజ్జయిన్యాః (మేఘసందేశే — ప్రథమసర్గే— అష్టావింశతి 28 శ్లోకః) 2. భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మప్రతీపంగమః (శాకుంతలమ్— నాలుగవ అంకము 18వ శ్లోకము) మొదలగునవి.] ఈ లుఙ్, లఙ్‌లలో రావలసిన అడా గమును "నమాఙ్ యోగే" (6–4–74) అను సూత్రముచే మాఙ్-లేదా—మాఙ్ + స్మ—ప్రయోగింపబడినపుడు రాదు. ఈ విధ ముగా నాకు తెలిసినంతవరకు సంస్కృతమున ప్రతిషేధార్థక క్రియారూపము లేర్పడుటకు పాణినీయమునందలి సూత్రములు ఇవి.

ఒకవేళ ఆ అడిగిన ప్రొఫెసరుగారు వ్యతిరేకక్రియలు అను తెలుగు పదముతోనే ప్రశ్నించియుండినచో అట్లడుగుటలో వారి అభిప్రాయమేమో విచారణీయము.

విద్వాన్ టి. రామకోటీశ్వరరావు

జవాబు

జనవరి 1980 'భారతి'లో ఆచార్య తల్లోజు లేఖ చదివి ఈ లేఖ వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. 'భారతి'లో వెలువడు తున్న వచన కవితలకు అర్థం తెలియడం లేదట వారికి. సరే, వారి వాదన నిజమనుకోవడానికి కొన్ని గజిబిజిగా వున్నాయనుకొందము. కాని ప్రచురింపబడే వచన కవితలన్నీ వారికి అర్థరహితంగాతోస్తున్న వంటే తల్లోజు ఆచార్యత్వానికి నమస్కారం పెట్టవలసిందేసుమీ! వేటూరి వారు యక్షగానాలను గూర్చి అన్నట్టు 'వాని (వచన కవి తల) రుచిని గుర్తింప గల్గుటకు గూడ నొక యనుభావ విశేష ముండవలెను.' తల్లోజువారూ! 'భారతి' పాతసంచికలను తిరుగ వేయండి. వచనకవితలను సావధానంగా చదవండి. 'అర్థంలేని చదువు వ్యర్థం!' అని మీరుదహరించిన మాట నిలిచేదేనా ఆలోచిం చండి. కవితలు నాలుగు పంక్తులలో ఉన్నా, ఎనిమిది పంక్తులలో ఉన్నా నిడివి ప్రమాణం కాదుకదా! 'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అని కదా కవితా మర్మజ్ఞులు.

'మాటకు ప్రాణము సత్యము.'

శ్రీ లింగంపల్లి రామచంద్ర

గ్రంథ విమర్శలు

నాటక సమీక్ష

[రచన: కప్పగంతుల మల్లికార్జునరావు. క్రౌన్ సైజు—6+184 పుటలు, వెల: పదిరూపాయలు. ప్రచురణ: క. గా. కా. కౌ. ప్రచురణలు, రాజమండ్రి—3. డిస్ట్రిబ్యూటర్లు: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ—2; లతా ఎంటర్ ప్రైజెస్, రాజమండ్రి—1.]

తెలుగు దేశంలో నేటి నాటక కళ తీరుతెన్నులను గూర్చి అప్పుడప్పుడూ వివిధ సంస్థల సంచికలలో శ్రీ కప్పగంతుల మల్లికార్జునరావు వ్రాసిన వ్యాసాల సంకలనమే 'నాటక సమీక్ష' అనే గ్రంథం.

మన పత్రికల్లో నాటక కళకు సరియైనస్థానం ఇవ్వడం లేదని ఈ గ్రంథ రచయిత పేర్కొన్నారు. ''పత్రికలనుంచి కథలు, నవలలకు లభిస్తున్న ఆదరాభిమానాలు నాటకాలకే లభించటంలేదు. ఇక నాటక రంగాన్ని గురించి వ్రాసిన వ్యాసాలమాట చెప్పేదేముంది? నాటక సంస్థలు ప్రచురించే ప్రత్యేక సంచికలే శరణ్యం'' అని రచయిత ''తెరవెనుక''లో వ్రాసినది ప్రత్యక్షర సత్యం. నాటక రచయితగా, నాటక సంస్థ నిర్వాహకుడిగా, మాజీ నటుడిగా, నాటక కళాభిమానిగా శ్రీ కప్పగంతుల తమకున్న అనుభవాన్ని పురస్కరించుకొని ఈ వ్యాసాలు వ్రాసారు. ఈ వ్యాసాల్లో ఆయన ఆధునిక నాటక రంగంపట్ల కొందరు వ్యక్తంచేసే ధోరణులను నిశితంగా విమర్శించారు. శ్రీ యం. ఆర్. అప్పారావును 'ఆధునిక తెలుగు నాటకరంగం'గా భావించి ఆయనకే ఈ పుస్తకాన్ని అంకితంచేశారు. ఇందులో వరుసగా తెలుగు నాటకరంగం — ఒక సమీక్ష: సూచనలు, నడుస్తున్న దశాబ్దంలో తెలుగు నాటకరంగం, నాటక విమర్శ—తీరుతెన్నులు, నాటకాల్లో నీతి—అవినీతి, ఎలాంటి నాటకాలు మాకు కావాలి, నాటకాలు ఎలా చూడాలి?, ఆధునిక నాటకం — సినిమా, తెలుగు నాటకరంగం-ఒంగోలు జిల్లాసేవ, నాటకపోటీలు-మంచి చెడ్డలు, పోటీ నాటకాలు, నాటక పోటీలు-జడ్జిమెంటు విధానం, నాటకాలు (అ)వాస్తవికత, శ్రీ వెంకటేశ్వరరావు, తెలుగు నాటక రంగంలో కొన్ని తరంగాలు—స్థూలపరిశీలన, నిత్య చైతన్య నాటక మూర్తి రావి వెంకటచెలం, కప్పగంతుల మల్లికార్జునరావు నైట్ కృతజ్ఞతల షీట్, చివరిపేజీ అనే శీర్షికలున్నాయి.

తెలుగు నాటకరంగం-ఒక సమీక్ష సూచనలు అనే వ్యాసం 25 పేజీలు ఉన్నది. ఇందులో అనేక విషయాలను స్పృశించారు. ఆధునిక నాటక రంగాన్ని తక్కువ అంచనా వేసే ముసలాళ్లను ఈసడించుకోవడమేగాక, తగినవిధంగా సమాధానం గూడా చెప్పారు. మాట్లాడితే తమిళ, మరాఠీ నాటక రంగాలను గూర్చి చెబుతూ వాళ్లకు నాటక కళ పెద్దగా తెలీదని ఊరికే బడాయిమాటలు చెప్పడానికే అలా ఉపన్యాసాలు దంచుతుంటారని రచయిత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తెలుగు నాటక కళాకారులకు సహాయం చెయ్యవలసిన విధానాలు గూడా ఇందులో సూచింపబడ్డాయి. ఈ వ్యాసంలో ఉన్న కొన్ని విషయాలనే ఆ తరువాత వ్యాసాల్లో గూడా వేరే పదాలతో చెప్పారు. ''వ్యాసంలోని అంశాలు ఆయా కాలాలలో నా దృక్పథానికి నిదర్శనాలు. ఆ కారణంచేతే, కొన్ని సందర్భాల్లో పునరుక్తి దోషం కన్పించినా, ఎడిటింగ్ చేయకుండా యథాతథంగానే ప్రచురించటం జరిగింది. సామాన్య పాఠకులకు యిందువల్ల అసౌకర్యం కలిగితే మన్నించ ప్రార్థన. విమర్శకులు ఈ దృష్టితో పరిశీలిస్తారని ఆశ!'' అని 'తెరవెనుక'లో రచయిత చెప్పారు కాబట్టి 'ఇలా ఎందుకు వ్రాశారు?' అనే ప్రశ్న విమర్శకులకు కలగకూడదు. కానీ రచయిత తమ పుస్తకాన్ని సామాన్య పాఠకులను గూడా దృష్టిలో పెట్టుకొని ఎడిట్ చేసివుంటే ఎక్కువమందికి ఈ పుస్తకం నచ్చి వుండేదనడంలో సందేహంలేదు.

ఆధునిక నాటకరంగం అనే వ్యాసంలో రచయిత ప్రజల దృక్పథంలో, రచనా విధానంలో, అభిరుచుల్లో వచ్చిన మార్పులను గూర్చి చెబుతూ అయిదు అంకాల పదిరంగాల నాటకాలను ఆధునిక ప్రేక్షకుడు భరించలేడని అభిప్రాయపడుతున్నారు. ఇది పూర్తిగా అబద్ధంకాదు పట్టణాల్లో కొన్ని వృత్తులు చేస్తున్నవారూ, విద్యార్థుల్లో ఎక్కువమందీ గంటకుమించి కూర్చోలేకపోతున్నారు. పల్లెల్లోనూ పట్టణాల్లోనూ గూడా పౌరాణిక నాటకాలనూ కొన్ని సాంఘిక నాటకాలనూ టిక్కెట్టు కొనివచ్చి కూర్చొని తెల్లవారిన దాకా చూచి తృప్తితో తిరిగిపోయే ప్రేక్షకుల సంఖ్యే ఎక్కువని ఎందరికో తెలుసు. ప్రాచీన కాలానికీ, నేటికీ మానసిక ధర్మంలో మార్పులేదని రచయిత గుర్తిస్తూ ''ఆనాటి రాముడు అపవాదులను విని సీతను అడవుల్లో వదిలేస్తే, ఈనాటి రామారావు సీతాకుమారిని అనుమానించి కోర్టులకెక్కుతున్నాడు. విడాకులిస్తున్నాడ''అని నాటక రచయితగా తమ సామాజిక పరిశీలనాశక్తిని వ్యక్తపరిచారు.

నడుస్తున్న దశాబ్దంలో తెలుగు నాటకరంగం అనేవ్యాసంలో రచయిత ధైర్యంగా వ్రాసిన వాక్యాలు గమనార్హంగా ఉన్నాయి. ''తెలుగు నాటకరంగం పురోగమించటం లేదని, అందుకు మార్గాలాలోచించాలని చాలామంది పెద్దలు అంటూ ఉండటం మనం తరచూ వింటున్నాం. వీరి దృష్టిలో గతించినకాలం చాలా గొప్పది. అందుకే వీరు గురజాడవారి కాలాన్నే పట్టుకుకూర్చున్నారు. గురజాడ వారి కన్యాశుల్కం తర్వాత మరో మంచి నాటకం రాలేదనేది ఈ తత్వం గలవారే. గురజాడవారు మహాకవే. అయితే వారి ప్రతిభను ఉగ్గడించటానికి ఈనాటి నాటకరంగ ప్రగతిని గుర్తించకపోవటం మాత్రం సరైన పద్ధతి కాదు.''

నాటక విమర్శ — తీరుతెన్నులు అనే వ్యాసంలో రచయిత ముసలాళ్లమీదా చాదస్తపు విమర్శకుల మీదా విరుచుకు పడ్డారు.

''ఇంగ్లీషు నాటకాలే నాటకాలు — ఇంకా కావాలంటే అరవంలో ఉన్నాయి అనువాదం చేసుకుందాం .. మరీ అంతగా కావాలంటే గతించిన గురజాడవే నాటకాలు — అనేటటువంటి ఒకానొక అస్తవ్యస్తమైన మనస్థితిని చేజేతులా సృష్టించుకొన్నవారు'' అని వారి దుమ్ము దులిపారు. ''...ఇన్ని పత్రికల్లోనూ నాటకరంగానికి కనీసం వొక్క పేజీని ప్రత్యేకించిన వొక పత్రిక వుందా ?'' అని మాట ప్రప్న వేశారు ఈ బాధను రచయిత తరువాత వ్యాసంలో గూడా వెల్లడించారు.

ఈ వ్యాసాల రచయితలో ఆవేశం ఎక్కువగా కనబడుతోంది. ఎలాంటి నాటకాలు మాకు కావాలి ? అనే వ్యాసం చివర వ్రాసిన నినాదాల లాంటి వాక్యాలే ఇందుకు నిదర్శనం —

''రచయితను ఆశాసించే అధికారం ప్రేక్షకులకే వుంది
పోటీల్లో జడ్జిలకు ఆ మీ అధికారాన్ని యివ్వకండి
నాటక రంగాన్ని వెనక్కి తీసికెళ్లకండి
నాటకరంగంలో కూడా కేపిటలిస్టులను తయారుచేయకండి
ఏది మంచి నాటకమో చెప్పండి — ఎలుగెత్తి !
అందుకు అందరికీ రచయితగా నా స్వాగతం''

నాటకాలు ఎలా చూడాలో ఒక వ్యాసంలో సంక్షిప్తంగా చెప్పడానికి ప్రయత్నించారు రచయిత. ఆధునిక నాటకానికీ — సినిమాకీ ఉన్నభేద సాదృశ్యాలను వివరించారు. తెలుగు నాటక రంగానికి సంబంధించిన ఇతర అంశాలనూ, ఇద్దరు వ్యక్తుల సేవలనూ ఇతర వ్యాసాలలో అభివర్ణించారు.

తనకు జరిగిన సన్మానానికి చెప్పిన కృతజ్ఞతల షీట్‌నుగూడా రచయిత ఈపుస్తకంలో వేసుకోవడానికి వెనుదీయలేదు 'చివరి పేచి' ఈ పుస్తక స్థాయిని దిగజార్చిందనడంలో ఎవరికీ సందేహం రాదు

అనేక వ్యాసాల్లో ఆధునిక నాటకాల స్థాయినిగూర్చి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించిన రచయిత అభినందనీయులు.

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

కాలవాహిని

[డాక్టర్ — బెజవాడ గోపాలరెడ్డి; డెమ్మి — 96 పేజీలు; వెల — ఆరు వందల పైసలు; ప్రతులకు — ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, బొగ్గులగుంట, హైదరాబాదు - 500 001]

(పాత వెంకటగిరి సంస్థాన ఉద్యోగిని జీతమెంత? అంటే— అన్నదమ్ములకు ఆరు నెలలకు ఆరు రూపాయలు అనేవాడు; అట్లున్నది ఆరువందల పైసాల ధర.)

Gopala Reddi is essencially a Literary man, but strayed into Politics — అని, ఒక విజ్ఞుడు, ఈ చదువుల డాక్టర్ రెడ్డి తత్వాన్ని తూచి మదింపువేసినాడు. ఈ అదృష్టశాలిని — భాగ్యలక్ష్మి పురుడు బోసి ఒడిలో పెంచినది; సాహిత్యలక్ష్మి మాటలు నేర్పి రాజ్యలక్ష్మిని అప్పగించినది; ఆమే ఈయనను కీర్తిలక్ష్మి కిచ్చి పెండ్లిచేసినది; కళాలక్ష్మి ఈయన మూర్తిని కేసేసినది. రాజమందిరాలలో నివసించినా, అందు ఆతిథ్యం పొందుతుండినా మిత్రులను మరువని మార్దవ మనస్కుడు. ఏదీ అంతగా పట్టించుకోని శాంతి ప్రియుడు. ఈయన మనసు ద్వేషింపలేక పోయినా, ఒక్కొక్కప్పుడు బెట్టు మాటలతో మిత్రులలో ఒప్పమి పుట్టించి, సర్దుకోగలిగినవాడు.

గోపాలరెడ్డి 1927 లో రవీంద్రుని శాంతినికేతనం వదలగానే స్వాతంత్ర్య సమరంలో దూకినాడు—మంత్రి అయినాడు— కాంగ్రెసు నాయకుడైనాడు—రాజపాలుడైనాడు. తెంపులు తెంపులుగా ఎన్నాళ్ళు రాజ్యపదవులలో ఉండినాడో, ఎచ్చుతక్కువ అంతకాలమే చెరసాలలో ఉండినాడు. ఆ ప్రేసల్లె గోపాలునికి జెయిలు జన్మస్థానమైతే ఈ గోపాలుని చెరసాల చదువుల బడి అయినది; ఇక్కడనే ఈయన విద్యకు పెంపుడు పాది అల్లుడు పందిలి అమరినవి; ఈయనకు వచ్చిన చదువంతా అక్కడనే— బయట ఈ వ్యాసంగానికి తీరిక ఓపిక ఎసిలిక దొరకకపోయినవి. ఈ చదువరిని వ్రాతకాడు చేసినది కారాగార కటకటాల గదులే. డాక్టరేట్ బిరుద మిప్పించినది ఈ కృషే.

శాంతినికేతన్‌లో బెంగాలి బాగా, గుజరాతి కొద్దిగా(గాంధీజీ గుజరాతీ గద్యరచనను గూర్చి ఈయన ఇంగ్లీషు త్రివేణిలో పెద్ద వ్యాసం ప్రచురించగా, నేను దానిని తెనుగుచేసి 1929 లో సమదర్శిని పత్రికలో ప్రకటించినా) లక్నోనో ఉరుదు ఒక మోస్తరుగా అభ్యసించి, ప్రత్యేకంగా ఇంగ్లీషు భాషాజ్ఞాన పరిమితులను బాగా పెంచుకొన్నాడు రాణించ గలిగిన వక్త అయినాడు. ఇరవై ఏండ్ల ప్రాయంలో, బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో వేదాల రంగాచార్యులు, పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రులు చెప్పిన మాత్రమే తెనుగు అబ్బినది; దానిని పెంచుకోను వీలులేకపోయినది; అందువల్ల ప్రబంధ వాఙ్మయం జోలికి పోలేకపోయినాడు ఈ కారణంవల్ల ఈయనకు తెనుగులో మంచి అస్తిభారం కుదురలేదు. దేశాలు తిరుగుతుండంవల్ల జాను తెనుగు నుడికారం ఈయన చెవిని బడటం తగ్గినది. ఈ గ్రంధ విన్నపంలో ఈయనే ''తెలుగు సాహిత్య మర్యాదలు నాకు బాగా తెలియవు''అని నిజంచెప్పుకొన్నాడు. అబ్బిన సంస్కృత పదజాలం బెంగాలీ సంప్రదాయానిది అయినందు చేత తిక్కన సోమయాజి చెప్పినట్లుగా జాత్యం కాకపోయినది — ఆంధ్ర సాహిత్య సంప్రదాయాలకు భిన్న ప్రయోగాలు దూరినవి; అంటే—ఆ భాష తెనుగుకు అక్లమటైజ్ కాలేదన్నమాట. దీనికి దోడు ఈయన చుట్టూ చేరిన పండితులు తప్పలెత్తి చూపను జంకినారు; మరికొందరు ఉపేక్షించినారు; ఇంక కొందరు బయట విమర్శించినారు. ఇన్ని భాషలవల్ల ఈ పాండిత్య గరిమ పలుచనై పరచుకొన్నదేగాని పాడుకాలేదు. (Defuse అయినదిగాని Dissipate కాలేదు).

ఈయన రాజకీయ ఖ్యాతి తరుగవచ్చునుగాని సాహిత్య కీర్తి మాత్రం శాశ్వతంగా దీపించగలదు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ పుట్టినది మొదలు నేటివరకు — 25 ఏండ్లు ఆమోదంతో అధ్యక్షుడై, ఆ విజయ రాఘవునివలె విజయభవనంలో ''శారదా ధ్వజం'' నెలకొల్పి, హైదరాబాదు కళాభవనంలో, కృష్ణరాయల భువనవిజయంగా ఆంధ్రసారస్వతలోకంపై ఏలుబడి సాగించినాడు. ఇది అరుదైన అదృష్టం. (అకాడమీ పాలన విషయంలో చివరి ఘట్టంలో ఒక పొరపాటు: అకాడమీ జన్మాదిగా సఖుడై సచివుడై యుండిన వివిధ కళాకుశలుడు రాజకీయ చతురుడు సుమస్కుడు— దేవులపల్లి రామానుజరావును ఈ అదనున కార్యదర్శి పదవిలో నిలుపుకొని ఉండవలసినది.)

డాక్టర్ రెడ్డి మొదట రవీంద్రుని కృతుల అనువాదం చేసినాడు. ఇందు తెనుగు దనము తెనుగువాక్య నిర్మాణపద్ధతి నడక తగ్గినవి; విమర్శకులు ఈ విషయాలను తీవ్రంగా విమర్శించినారు. కొందరు సమీక్షంలో ఇచ్చకాలాడి పరోక్షంలో ఎగతాళి చేసినారు. కాని, ఈ రచనలలో ఈ లోపాలున్నా కావ్యభక్కీలో వ్యవ్యరీతులలో అందంగానే ఉన్నవి. దేవులపల్లి రామానుజరావు అన్నట్లు .— బెంగాల్ నుండి చేసిన అనువాదాలు కాబట్టి రాగూరు వాడిన పద గౌరవము విన్యాసము తెలుగులోనికి రెడ్డిదించగలిగి భాషకు ఒక నూతన వాక్య నిర్మాణ పద్ధతిని పదబంధ మాధుర్యాన్ని చేకూర్చి పెట్టినారు.

ఇక ఈ కాలవాహిని—

సొంత రచన కాబట్టి, అనువాదకట్టుబాట్లు అడ్డంకులు లేనందున, గిడుగు రామమూర్తి అన్నట్లు - కృతకభాష— Manufactured Diction- కాకుండా, భావమైభవానికి తగిన సహజభాష విస్పష్టత, నడకలో అందము కుదిరినవి. ఊహలు ఉత్ప్రేక్షలు కల్పన పరిణతాలై మధుర మనోజ్ఞమైన శయ్యలో పడినవి. తెనుగు సంస్కృత పదాలకు ఒక కలికితనము చేకూరి భావాలకు కొత్త దుస్తులు తొడిగి ముస్తాబు చేస్తున్నది.ఇంక కొంత కావ్యానుశీలనం :—

తాజ్‌మహల్ (తాజ్—కిరీటం)—కొత్త భావాలతో దానికి తగిన నవ్యమైఖరి భాషలో ఉన్నది. దాని చలువర్యాతి తెలుపుదనాన్ని ''పూర్ణచంద్ర హాసరేఖ''గా, ''కూతలు పండించిన అందాలపంట'' గా చెప్పి (మరికొందరివలె కూతల చెమట కన్నీళ్లు అనలేదు)— ''మథిత సాగరంలో పుట్టిన ఊర్వశివలె సంకుభిత భాష్ప సాగరంలో పుట్టినది'' ఈ తాజ్ ఆనడంలో ఆదంపతులస్వచ్ఛ ప్రణయ గాథ ఇందు ప్రతిబింబిస్తున్నది. ఇది ''మరపు చీకటి కెరటాలపై తేలియాడు అందాల వెండిపడవ''— ''జలభారముచే నత మేఘము రీతి''.

''కాలము'' ''నిన్నలు'' వివిధ గతులలో స్థాయిలలో కాల వాహిని వర్ణన. ''నేడు''ముక్తకాలలో భావవిలాసము, భాషావికాసము, తేజోవంతాలుగా ఉన్నవి; ఇందలి 37 గాథలలో చాలా గురుతరాలు. ''జన్మదినానికన్న మరణదినం, పరాభవదినానికిదీర్ఘాయుస్సు'' అట; ఎంతసొంపుగా నిజంచెప్పినాడు ! రాజకీయాలు ఒంటిలో ఊరి ఉన్నవి కాబట్టి ఓటింగు విధానాన్ని మర్యాదగా విమర్శించినాడు.

వాళ్లఊరి (బుచ్చి) వల్లకాటిలోఉన్న రాగిచెట్టు తాను చూచిన దహన ఖనన సంస్కారాలను కొత్తరీతులలో తల పోస్తున్నది. నెల్లూరులో తమ ఆవాస ద్వారపు ఇరుకడలఉన్న వకుళ వృక్ష ద్వంద్వానికి (అరవై ఏండ్లుగా నేనూ వీటిని చూస్తున్నా) మానవ గుణమారోపించి ఆధ్యాత్మిక వాసనలు (ఈయన మతం మూఢ మన్నా) వెదజల్లిస్తున్నాడు. ''మూగకోయిల''లో, అని ఋతుగతిని అనుసరించి కులాయాలను మార్చేవని (స్వాతికొలగ ఆరేటిబాతు చిలువలవలె) శాస్త్రీయ విషయాన్ని బయట పెట్టుతున్నారు. ఈ సత్యాన్ని గుర్తించినవారు మనలో చాలతక్కువ. అందువల్ల మూగ అనకుండా ఎగిరిపోయినవంటే బాగుండేది. ''మే స్మృతులు'' స్వకీయ చరితా ఘట్టాల కవితా స్వరూపం రేడియో పలుకకున్నా అది ఉన్నగది నిశ్శబ్దికాదు— ప్రపంచదేశాలు ప్రసారం చేసిన అసంఖ్యాక భిన్నధ్వలు మూగలై అందు నిండి ఉన్నవి—అన్నది సైన్సుకు చక్కటి వివరణం; ఎండిన సంగతినైనా చెప్పడంలోనేగదా కవిత్వం ఉండేది !

పుస్తకమంతా కమ్మగా చదువదగి ఉన్నది.

కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి

పు ష్ప వృ ష్టి

[సప్రయోగ తెలుగు- ఇంగ్లీషు డిక్షనరీ దుర్గానంద్, కొంత మంది సమర్థులైన పండితులు. వెల : రు. 8-00, ప్రతులకు : డ్రీమ్సు కాలనీ, నరశింహరావుపేట, ఏలూరు. ఏ. పి.]

'చరాచర సమస్త సృష్టినీ అక్షరాలలో చూడటం భాష అనీ అకారాదిక్రమంలో చూడటం డిక్షనరీ' అనీ శ్రీ దుర్గానంద్ నిఘంటువు అనే శబ్దాన్ని నిర్వచించారు. ఈ నిఘంటువులో అకారాది క్రమంలో తెలుగు శబ్దాలకు సమానార్థకాలైన ఆంగ్ల శబ్దా లివ్వబడ్డాయి. దరిదాపుగా ఎనిమిదివేల శబ్దాలకు ఈవిధంగా 'తెలుగు—ఇంగ్లీషు' నిఘంటువు తయారు చేయబడింది. ప్రౌఢులాంటి మేధావులు ఇలాంటి నిఘంటువుల్ని సాధికారింగా, సప్రమాణంగా తయారు చేయగా మళ్ళీ ఇలాంటి నిఘంటువుల్ని వేరే ప్రచురించవలసిన అవసరం ఏముందని కొంతమంది ప్రశ్నించవచ్చు. నన్నయగారు కవిత్వం రాశాక ఇతరులు కవిత్వం రాయడం దేనికి అంటే సమాధానం ఏమిస్తామో పై ప్రశ్నకుకూడా అదేసమాధానం. ఈ నిఘంటువు విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. నిఘంటువును నిర్మించిన శ్రీ దుర్గానంద్, తదితర పండితుల శ్రమ అభినందనీయమైనది.

ాషలో ప్రాథమిక విద్య

...ట్లూరి పురుషోత్తం. వెల: సాదా ప్రతి: రు 4-00; ౦. 7-50. ప్రతులకు: 1) అట్లూరి పురు ...దల, విజయవాడ-520005; 2) విశాలాంధ్ర ..., విజయవాడ-520002; 3) ప్రజాశక్తి బుక్ ...వాడ-520002; 4) నవోదయ పబ్లిషర్సు, ...20002].

...ద్యావిధానం ఒక సమస్యగా తయారుకాగా బోధనా ...ాష అధికతర ప్రయోజనం గలది అనే సమస్య మరింత ... తయారయింది. ఈ సమస్యకు ప్రాథమిక విద్యవరకూ ...షలోనే విద్యాబోధన జరగాలని పురుషోత్తంగారు ...ంథంద్వారా సమాధానం ఇస్తున్నారు.

పబ్లిక్ స్కూల్స్, కాన్వెంటులు, కిండర్ గార్టెన్‌లు మొద ...పేర్లతో ఈనాడు పాఠశాలలు వీధి వీధికి పుడుతున్నాయి ...్ మీడియం అనేది ప్రాథమిక విద్యలోనే హిప్పీ నాగరికతలాగా ...షనయిపోయింది. పిల్లవాడికి చదువు వస్తున్నదా? లేదా? ...ని, వాడి గ్రహణశక్తి ఏమవుతోందని గాని ఆలోచించే తల్లి ...లకం బెవాడు ఇంటికొచ్చి మమ్మీ, డాడీ అనంగానే ఆ రెండు ...కే మురిసిపోయే తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ఉన్నారు. ...జు ఎక్కువ అయినకొద్దీ ఖరీదైన చదువు వస్తుందని విశ్వ ...యక తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో ఉండటం మరీ ...కరమైన విషయం.

ప్రాథమికవిద్యా లక్ష్యాలను పురుషోత్తంగారు చక్కగా వివ ...రు. ప్రజాస్వామ్య పటిష్టతకు ప్రాథమిక విద్యలో మాతృ ... బోధన ఎంత అవసరమో సప్రమాణంగా విశ్లేషించారు. ...క విద్యాపరంగా గత మహానుభావుల, మహోపాధ్యాయుల అభి ...ాలను వారి వాదనకు సాక్షీభూతంగా నిలిపారు. ప్రాథమిక ...నే ఆంగ్లభాషా వ్యామోహం పిల్లలను ఏవిధంగా భ్రష్ట ...స్తున్నదో ఈ గ్రంథంలో చూపించారు. 'పరభాషలో ప్రాథ ... విద్యను మనం కొనసాగనిచ్చినంతకాలం మట్టిలో మాణిక్యాలు ...ట్టిలోనే ఉంటాయి' అంటున్న రచయిత అభిప్రాయం నూటికి ...రుపాళ్ళు యథార్థం.

మార్పును ప్రతిఘటించడం, కొత్తను నిరశించడం ...నా ధ్యేయం కాదు. కొత్తదనం, మార్పు సమాజ పరిణామంలో మంచిని చేకూరిస్తే మనం వాటికి స్వాగతం పలకవచ్చు. విద్య పేరుతో ఈనాడు జరుగుతున్న ప్రయోగాలు విద్యార్థుల్ని ఎటు తీసుకుపోతున్నాయో మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. తెలుగు భాషను మాట్లాడటమే న్యూనతగా, తెలుగు మీడియంలో చదవడమే అవమానంగా భావించే ఈ తెలుగు జాతికి బానిస భావాలే ప్రగతి పథ నిర్దేశకాలుగా కనబడటంలో దోషంలేదు అట్లూరి పురుషోత్తంగారి ఆలోచనా ధోరణి వాస్తవమైనది. ఎంచేతంటే—క్రితం తరంవాళ్ళు తెలుగులోనే ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఈనాడు ప్రాథమిక విద్యను కూడా ఇంగ్లీషు మీడియంలోనే అభ్యసిస్తున్న విద్యార్థులు ఆ తరంకంటె మేధావులుగా తయారు కావడం లేదనేది సుస్పష్టమైన విషయం. అట్లూరు పురుషోత్తంగారు ఊకదంపుడు వ్యాసాలుగా కాక వారి అభిప్రాయాలకు ప్రామాణికమైన ఆధారాలు ఈ గ్రంథంలో చూపించారు. సామాజిక విలువల్లో పురోగమిస్తున్నా మనకొనే మనం విద్యాపరంగా ఇంకా, ఇంకా వెనక్కుపోవడం క్షంతవ్యంకాదు గదా! విద్యమీద ఏమాత్రం అభిమానం ఉన్నవాళ్ళయినా చదవతగ్గ గ్రంథం ఇది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

కాళిదాస కవిత

[రచయిత డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం. వెల: పది రూపాయలు ప్రతులకు: శ్రీ గిరిజా ప్రచురణలు, విద్యాలంకార్. బి-31, శ్రీనివాసనగర్ కాలనీ, గుంటూరు-6, ఆంధ్రప్రదేశ్.]

డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తంగారు ఇంతకు మునుపు వెలవరించిన గ్రంథానికిది మలి ముద్రణ. ఈ గ్రంథంలో వీరు కాళిదాస కవితమీద తాము రచించిన మరికొన్ని వ్యాసాలు కూడా చేర్చారు.

వ్యాస వాల్మీకి కాళిదాసులు సంస్కృత కవితకు త్రిమూర్తుల వంటివారు. కాళిదాస కవిత మీద వ్యాస వాల్మీకుల మహాకవితమీద ఇంతకు మునుపు కూలం కషాలలో విమర్శన లెన్నో వెలువడ్డాయి. శ్రీ అరవిందులు, రవీంద్రుడు, ద్విజేంద్రలాల్‌రాయి—కాళిదాస కవిత మీద మరి తిరుగులేని విమర్శనలు కొన్ని వెలువరించారు. ఈ విమర్శనలన్ని పరిశీలించిన వారికి ఇక కాళిదాస కవితమీద వేరే విమర్శన కెక్కడ అవకాశమేలేదని అనిపిస్తుంది అయినా గ్రంథకర్త కాళిదాస రవీంద్రులమీద, కుమార సంభవ కావ్యంమీద ప్రత్యేకించి తమ స్వంత విమర్శన కూడా వెలువరించారు.

వీరి రచనలో కొంత కొత్త దృక్పథంకూడా కనిపిస్తుంది. ఇదికూడా పాఠకులు పరిశీలించదగినది. మన ప్రాచీన సంస్కృత కావ్యాలమీద ఆదరం పెరుగుతున్న ఈ రోజులలో నవీనదృక్పథంతో విమర్శ చాలా అవసరం. ఇందుచేత గ్రంథకర్త దృక్పథంకూడా తప్పక పరిశీలించదగినదే.

కాళిదాస మహాకవి రచనలంతా వేర్వేరు పాత్రల పాత్రోస్మిల వాదులమీద ఇంకా కూలంకష సమగ్ర సమీక్షలు వెలువడలేదు.

ఈ గ్రంథంలో వీరు చాలావరకు అరవింద రవీంద్రుల రచనల భావానువాదాలే వెలువరించారు. ఇందుచేత కాళిదాస రచనలన్నింటిని సమగ్రంగా అవగాహన చేసుకోదలచినవారికి ఈ పుస్తకం చాలా సహాయకారి కాగలదు. ఇదేవిధంగా సంస్కృత వాణిలోని ఇతర మహాకవులమీదకూడా ఇటువంటి గ్రంధాల ఆవశ్యకత చాలా ఉన్నది.

శ్రీ పి. గణపతిశాస్త్రి.

గ్రంథస్వీకారాలు

* శుక్తిమతి (పద్య సంపుటి), రచయిత : శ్రీ మలసాని చంద్రశేఖరరెడ్డి, పేజీలు : 64, వెల : రు. 4/–, ప్రతులకు : రచయిత, అరవీడ, రాయచోటితాలూకా, కడపజిల్లా.

* సాహితీ సుధాలహరి (సాహితీ విమర్శలు, వ్యాసాలు), రచన : భాషా ప్రవీణ గుత్తికొండ సీతారామయ్య, పేజీలు : 78, వెల : రు. 5/–, ప్రతులకు : రచయిత, (రిటైర్డు సీనియర్ తెలుగు పండిట్), కొల్లూరు, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా.

* శ్రీ రామానందలహరి (పద్య సంపుటి), గ్రంధకర్త : శ్రీ సదాశివుని కృష్ణచంద్ర, పేజీలు : 46, వెల : రు. 2/–, ప్రతులకు : రచయిత, కేర్ యస్. లక్ష్మీకాంతం, కెనాల్ వీధి, బరంపురం-760001. గంజాంజిల్లా, ఒరిస్సా

* సంగమేశ్వర విలాసము అను కూడలి క్షేత్ర మహాత్మ్యము (పద్య సంపుటి) కృతికర్త : శ్రీ కృష్ణ భాగవతార్య, పేజీలు : 256, ప్రతులకు : రచయిత, గూడలి, వయా గూడూరు, నెల్లూరు జిల్లా.

* విఘ్నరాజ శతకము, కృతికర్త : శ్రీ కోసంగి సిద్దేశ్వర ప్రసాద్, పేజీలు : 40, వెల : రు. 1-50 పై. ప్రతులకు : శ్రీ కోసంగి శివగురు సిద్దేంద్రం, మెయిన్ బజారు, రైల్వేకోడూరు, కడప జిల్లా.

* ప్రజారాజ్యం (బీడీ కార్మికుల ప్రత్యేక సంచిక) ఎడిటర్ : శ్రీ ఏ ఎస్. పొశెట్టి. పేజీలు: 36. వెల : ఒకరూపాయి. వివరాలకు : ప్రజారాజ్యం, జాతీయ వారప నిజామాబాద్.

* నాట్యకళ (ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక బాద్, హైదరాబాద్–500004–వా కోత్సవ ప్రత్యేక సంచిక 1958-79 నృత్య, నాటక, జానపద కళలకు సం... అకాడమీ పూర్వ, ప్రస్తుత కార్యక్రమాలక నివేదికలు, ఛాయా చిత్రాలు ఉన్నాయి ... సభ్యుల, అకాడమీ బిరుదాంకితుల పరి యిందులో వున్నాయి.

* ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం (రాష్ట్ర ప్రత్యేక సంచిక) ఇందులో ఈ సంఘం ప్రమేయం ... వర్ణాంతర వివాహాల వివరాలు, ఫోటోలు మొ... వున్నాయి. పేజీలు 74, వెల : రూ. 3/– వివ ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం, ఇం 7–1–617/ ఏ/2, అమీర్‌పేట, హైదరా 500016.

* ప్రతిజ్ఞాశాలి (మెహెస్తా చరిత్ర). రచన : శ్రీ ప్రకాశం, పేజీలు 80, వెల : రు. 5/– ప్రాప్తి రచయిత, రిటైర్డు తహసిల్దారు, కోబాల్త గుంటూరు–522002.


* తెలుగుబిడ్డ (హితశతకము) రచయిత శ్రీ కో మోహనరావు. పేజీలు : 27. వెల : రూ. 2– లకు : రచయిత, చెరువు మాధవరం (పి.ఓ.) 5(ఖమ్మం జిల్లా.

* విజయసంకేతం (సినీదర్శకుడు శ్రీ దాసరి నారాయ గరిపై పద్యాలు) రచయిత : శ్రీ బొర్రా పాం శాస్త్రి, పేజీలు : 8. వివరాలకు : రచయిత, డోర్ 23–15–83, జి. యస్ రాజు రోడ్, వాటర్ ఎదురుగ, సత్యనారాయణపురం, విజయవాడ–520(

* భక్తిశ్రీ (భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సంస్తుతి) యిత : శ్రీ సంకు సత్యనారాయణ. పేజీలు : వెల : రు 1–50 పై. ప్రతులకు : రచయిత, సీనిం క్లర్క్, డి. పి. ఒ. కార్యాలయము, ఆద్రా, పురులియా జిల (యస్. ఇ. రైల్వే)

* కలి నివారణము (వ్రతవిధాన నలచరిత్రము) గ్రంధకర్త శ్రీ ఆల్వకొండ కృష్ణమూర్తి శర్మ, పేజీలు; 154, వెల: రూ 8/– ప్రతులకు : గ్రంధకర్త, గాయత్రి మంత్ర నిలయము, 32/90, బ్రాహ్మణవీధి, రాయచోటి, కడప జిల్లా.

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.


"సాంప్రదాయ సిద్ధమయిన
భారతీయ ఔషధాలకి
ప్రత్యేకమయిన శక్తివుంది.
ఉదాహరణకి,
అమృతాంజన్."
AMRUTANJAN
Pain Balm
ప్రకృతిలో లభించే అత్యంత
శక్తివంతమయిన పది మూల
ఔషధాలతో అమృతాంజన్ తయారు
చేయబడుతోంది. అంటే అమృతాంజన్
చాలా శక్తివంతమయినది
అందుచేత అమృతాంజన్
తలనొప్పులకు, జలుబులకు,
వంటినొప్పులకు, బెణుకులకు
శీఘ్రంగానూ, నిశ్చయంగానూ
ఉపశమనం కలిగిస్తుంది
అంతేకాదు అమృతాంజన్
సురక్షితమయిన బాధా నివారిణి
అమృతాంజన్ :
80 సంవత్సరాలకు పైబడిన
నమ్మకమైన దివ్య
ఔషధము
AM-2148
అమృతాంజన్
తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు